# శ్రీ వేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక

ఏప్రిల్
2025

వెల: రూ.
25/-






గజ వాహనం



హనుమంత వాహనం



సింహ వాహనం



చిన్నశేష వాహనం



అశ్వ వాహనం



హంస వాహనం

# శ్రీవేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక

**సంపుటి:** 18 **సంచిక:** 4

సలహాదారులు, స్ఫూర్తిదాత,
కర్త, కర్మ, క్రియ మా ప్రభు
తిరుమల శ్రీ వేంకటేశ్వరుడు

ప్రధాన సంపాదకులు:
**పుల్లగూర్ల సాయిరెడ్డి**
(గోవిందదాసు)

గౌరవ సంపాదకులు:
**డా॥ టి. గౌరీశంకర్**

ఫొటోగ్రాఫర్: **పత్తి సుబ్రమణ్యం,**
శ్రీనివాస మంగాపురం

డి.టి.పి & డిజైన్:
సాయినాథ్, రమేష్

**Email:**
srivenkatesham@gmail.com
namo_venkateshaya@yahoo.com
**Website:** www.srivenkatesham.org
**E-Magazine:** www.readwhere.com
Phone: **040–27175050**
Cell: **9348212354**


**లోపలి పేజీల్లో**


| | |
|---|---|
| శ్రీ వేంకటేశ్వర స్తుతి | 4 |
| ముక్తిమార్గం | 5 |
| భక్తిముక్తిప్రదం-<br>శ్రీరామ నామాత్మక మంత్రం | 6 |
| తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశానిర్దేశం | 9 |
| సమతామూర్తి భగవద్రామానుజస్య.. | 22 |
| ఉపమన్యు మహర్షి | 27 |
| తిరుప్పావై | 28 |
| రామాయణ రత్నాకరం | 36 |
| బ్రహ్మజ్ఞాన సంపన్నుడు..<br>వీరాధివీరుడు.. పరశురాముడు | 40 |
| ముకుందమాల | 43 |
| శ్రీ వేంకటాచల మాహాత్మ్యం | 46 |
| శ్రీకృష్ణ తత్త్వం | 52 |
| తిరుమల సర్వస్వం | 55 |
| శ్రీరామనవమి | 59 |
| శ్రీసీతారాముల కళ్యాణ అక్షతలు | 61 |
| త్రివేణీ సంగమంలో సరస్వతీ నది | 63 |
| రాశి ఫలితములు | 65 |
| మీ విజ్ఞానం | 66 |


## భక్తుల ఉద్ధరణే 'శ్రీవేంకటేశం' లక్ష్యం


శ్రీవేంకటేశం పాఠకులకు శ్రీ విశ్వావసు నామ సంవత్సర శుభాకాంక్షలు. ఈ నూతన సంవత్సరంలో స్వామివారి కృపా విశేషాల చేత మనమందరం సుఖ సంతోషాలతో జీవించాలని, ఆధ్యాత్మికంగా అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నాము.

శ్రీవేంకటేశం మాసపత్రికకు కూడా ఇది పుట్టినరోజు కావడం విశేషం. నేటికి 18 సంవత్సరాలు పూర్తి చేసుకుని 19వ సంవత్సరం లోనికి శ్రీవేంకటేశ్వరుని కృపతో అడుగిడింది. ఈ పత్రికను మేము నడిపిస్తున్నట్లు కనిపించినప్పటికీ, దీనికి కర్త, కర్మ, క్రియ తిరుమల శ్రీవేంకటేశ్వరుడే. ఆయన ఆజ్ఞచే 2007 సంవత్సరంలో 'నమో వేంకటేశాయ'గా ప్రారంభించి 2008 సంవత్సరం జనవరి నుండి 'శ్రీవేంకటేశం'గా పేరు మార్చి ప్రచురిస్తున్నాము. ఈ పత్రిక ద్వారా భక్తులు తరించాలన్నదే స్వామివారి ప్రధాన లక్ష్యం. ఈ పత్రికను స్థాపించుటకు స్వామివారు మాకు ఎన్నో లీలలను ప్రసాదించారు. వాటిని గత కొంత కాలం నుండి ఈ మాసపత్రికలో స్వామివారి "దిశా నిర్దేశం"గా ప్రచురిస్తున్నాము. ఏ ఆశయం సిద్ధించుట కోసం స్వామివారు ఈ సేవను ప్రసాదించారో దానిని త్వరగా ప్రసాదించి ఆశీర్వదించమని తిరుమల శ్రీవేంకటేశ్వరుణ్ణి ప్రార్థిస్తున్నాము. పని చేయుటే మానవుల వంతు, ఫలితం భగవంతుని చేతిలోనే ఉంటుంది, ఆయనే ప్రసాదించాలి. ఫలితం ఆశించకుండా, భగవంతుని పనిగా భావించి చేయుట మన వంతు. అప్పడే కర్మ అంటదని చెప్తారు. మానవునిగా జన్మించిన మనిషి జీవనోపాధి గురించి కొందరు, ఆసక్తి ఉండి కొందరు, ఏదో సాధించాలనే తాపత్రయంతో మరికొందరు రకరకాల రంగాలలో చదివి గొప్పవారిగా పేరు ప్రఖ్యాతులు పొంది గర్వపడుచుందురు. కాని అది తప్పు. వారిని నిమిత్త మాత్రులుగా చేసుకుని భగవంతుడు ఆయా రంగాలను అభివృద్ధి చేశాడు. ఆ విషయం గ్రహించినవాడు జ్ఞాని. ఈ సృష్టిలోని అన్ని రంగాలను భగవంతుడు ఈ విధంగా వృద్ధి చేస్తున్నాడు. లోకంలో ఎన్నో రంగాలు, ఎన్నో విద్యలు ఉన్నాయి. అందులో ఏ విద్య ఉత్తమము? ఏ విద్య చదివితే మరో విద్య అవసరం లేదు? అంటే... అది భగవంతుని గురించిన విద్యే! భగవంతుని గురించి తెలిసినవాడు లోకంలో సమస్త విద్యలలో ఆరితేరిన వాడిగా వర్థిల్లగలడు. అతడే భగవంతుడు ప్రసాదించిన జీవితమును సార్థకము చేసుకున్నవాడగును. భగవంతునికి ప్రియునిగా మనగలడు. కాని దీనిని ఎలా సాధించాలి? అచంచలమైన భక్తితో, అరిషడ్వర్గాలను త్యజించి, గోవిందుని ఆశ్రయించినవారు దుఃఖమయమైన సంసార సాగరాన్ని సంతోషంగా దాటివేస్తారని భాగవతం చెబుతోంది. పాపాలను నశింపచేసే పాదపద్మాలు కలిగిన హరిని సేవించేవారు కష్టాలకు భయపడరు. భగవంతుడు తమతోనే ఉన్నాడన్న నమ్మకంతో విపత్కర పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కొంటారు. జ్ఞానబలంతో మనస్సును మంచి ఆలోచనలతో నింపుకుంటారు. అసహాయులను ఆదుకుంటూ హరినామ స్మరణలో పునీతులవుతారు. భగవంతుడు ప్రసాదించిన అశాశ్వతమైన మానవజన్మను సార్థకం చేసుకుంటారు. మరి ఈ అచంచల భక్తిని సాధించుట, అరిషడ్వర్గాలను త్యజించుట అంత సులువైన విషయం కాదు. ఇది సాధన ద్వారా మాత్రమే సాధ్యపడుతుంది. మానవుడు సద్గ్రంథ పఠనంతో పాటు తనకు ఎదురైన ప్రతి సమస్యను భగవంతుడు తన గురించి ప్రత్యేకంగా ప్రసాదించాడని, విశ్లేషణాత్మకంగా పరిశీలిస్తూ, అందులో భగవంతుని లీలను, ఆయన ఆశయమును గుర్తించి నడుచుకోవాలి. లోకంలో భగవంతుడు తప్ప అన్నీ నశించేవే కాబట్టి అన్నింటిపైన వ్యామోహమును త్యజించాలి. అప్పడే భగవంతునిపై స్థిరమైన ప్రేమ కలుగుతుంది. దీనినే అచంచల భక్తి అంటారు. తిరుమల శ్రీవేంకటేశ్వరుడు ప్రతి మానవుడు సన్మార్గములో పయనించి జీవితమును సార్థకము చేసుకొనుటకు ఈ 'శ్రీవేంకటేశం' అనే మాసపత్రికను నడిపిస్తున్నాడు. ఆయన ఆశయ సాధన కొరకు అచంచల భక్తిని సాధించుటతో పాటు అరిషడ్వర్గాలైన వికారాలను తొలగించుకుని జీవిద్దాం.

నమో వేంకటేశాయ
వినా వేంకటేశం న నాథో న నాథః ।
సదా వేంకటేశం స్మరామి స్మరామి ॥

శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు
**పుల్లగూర్ల సాయిరెడ్డి** (గోవిందదాసు)


Editor, Publisher, Printer and owned by **Pullagurla Sai Reddy**. Published at: H.No.1-1-53, Street No:1, Habsiguda, Hyderabad-500007. Printed at: Sai Tirumala Printers, H.No:1-8-556/2, Chikkadpally, Hyderabad-500020. **Editor: Pullagurla Saireddy:** Cell : **93482 12354**, Ph:040-27175050; E.mails: **srivenkatesham@gmail.com**, namo_venkateshaya@yahoo.com



# శ్రీ వేంకటేశ్వర స్తుతి

– డా|| కె.వి. రాఘవాచార్యులు

శ్లో|| వినా వేంకటేశం న నాథో న నాథః
సదా వేంకటేశం స్మరామి స్మరామి
హరే వేంకటేశం ప్రసీద! ప్రసీద!
ప్రియం వేంకటేశ! ప్రయచ్ఛ ప్రయచ్ఛ

తాత్పర్యం – వేంకటేశా! నాకు నీవు తప్ప వేరొక నాథుడు లేడు. నిన్నే ఎల్లప్పుడూ స్మరిస్తూ ఉంటాను. శ్రీహరియైన వేంకటేశా! నన్ను అనుగ్రహింపుము. నేను కోరిన వరములను ప్రసాదించుము.

శ్లో|| అహం దూరతస్తే పదాంభోజ యుగ్మ
ప్రణామేచ్ఛయాఽగత్య సేవాం కరోమి
సకృత్సేవయా నిత్య సేవా ఫలం త్వం
ప్రయచ్ఛప్రయచ్ఛ ప్రభో వేంకటేశ!

తాత్పర్యం – ఓ వేంకటేశా! నీ పాదపద్మములకు నమస్కరించు కోరికతో చాల దూరము నుండి వచ్చి నిన్ను సేవించుచున్నాను. ఈ ఒక్కసారి సేవించుట చేతనే ప్రతిదినము నిన్ను సేవించిన గల్గు ఫలమును అనుగ్రహింపుము.


## చందా వివరాలు
(రూ.లలో)

| | |
|---|---|
| ☐ 2 సం|| | 500-00 |
| ☐ 4 సం|| | 1,000-00 |
| ☐ జీవిత చందా | 5,000-00 |
| ☐ పోషకులు | 10,000-00 |
| ☐ రాజపోషకులు | 50,000-00 |

**9348212354**
నంబర్‌కు పేటీఎం / ఫోన్‌పే / గూగుల్ పే ద్వారా జమచేసి మీ చిరునామాతోపాటు మాకు తెలపండి.
లేదా
శ్రీ వేంకటేశం పేరుపైన ఎం.ఓ / డి.డి. / క్రాస్డ్ చెక్‌ను
లేదా
**Srivenkatesham**
A/c no. S.B. 11002191002593
(Ifsc Code: PUNB0110010)
Punjab National Bank,
Habsiguda, Hyderabadలో
చేరునట్లు, ఆన్‌లైన్ ద్వారా కాని చెల్లించి మాకు తెలియజేయండి.

పూర్తి పేరు: ____________________
____________________
చిరునామా: ____________________
____________________
____________________
____________________
____________________
పిన్‌కోడ్: ____________________
చందా వివరాలు: ____________________

మా చిరునామా:
శ్రీ వేంకటేశం, ఆధ్యాత్మిక మాసపత్రిక
ఇం.నెం. 1-1-53, వీధి నెం. 1,
హబ్సిగూడ, హైదరాబాద్-500 007.
ఫోన్: 040-27175050
సెల్: 9348212354
Email: srivenkatesham@gmail.com

చందాదారులకు
స్వామివారి పవిత్ర పాదాలు
(10"x8") **ఉచితం**



# ముక్తిమార్గము


భావానువాదం:
శ్రీమాన్ సముద్రాల లక్ష్మణయ్య




## ముఖారి

సిరి దొలంకెడి పగలు - చీఁకటా యితఁడేమి
యిరవు దొలిసెయుఁ దెలియ - నియ్యఁ డటుగాన ||పల్లవి||

1. తలపోయ హరినీల - దర్పణంబో యితఁడు
వెలుఁగు చున్నాఁడు బహు - విభవముల తోడ,
కలగుణం బటు వలెనె - కాఁబోలు లోకంబు
గలదెల్ల వెలిలోనఁ - కనిపించుఁ గాన ||సిరి||

2. మేరమీఱిన నీల - మేఘమో యితఁడేమి
భూరి సంపదలతోఁ - బొలయుచున్నాఁడు,
కారుణ్యనిధి యట్లు - కాఁబోలు ప్రాణులకు
కోరికలు దలఁపులోఁ - గురియు నటు గాన ||సిరి||

3. తనివోని ఆకాశ - తత్త్వమో యితఁడేమి
అనఘుఁడీ తిరువేంక - టాద్రి వల్లభుఁడు,
ఘనమూర్తి అటు వలెనె - కాఁబోలు సకలంబు
తనయందె యణఁగి యు - ద్భవమందుఁ గాన ||సిరి||



**భావము:**

సిరులు దొనకుచున్న ఇతడు పగటిపూటనే ఉండు చీకటియా యేమి? ఎందుకనగా తానున్న స్థానము, లేదా తన స్వరూపము స్పష్టముగా నున్ననూ చూచువారికి తెలియనీయక మఱుగు పరచుచున్నాడు. పగటి చీకటి వెలుగులో కూడా కన్నులు కానరాకుండా చేయును. అట్లే ఈ దేవుడు సర్వత్రా బాహాటముగా వ్యాపించియుండియు చూచువారికి కనిపించకయే యున్నాడు.

ఇతడింద్ర నీలమణితో చేసిన అద్దమా? ఆలోచించుకొలది అనేక వైభవములతో వెలిగిపోవుచున్నాడే! ఇతనిలో ఉన్న గుణమట్టిదే కాబోలు! ప్రపంచము అద్దమునందును వెలుపలను కనిపించునట్లు, ఇతని లోపలను, వెలుపలను గోచరించుచున్నది గదా!

ఇతడు హద్దుమీరి అంతట క్రమ్ముకొన్న నీలమేఘమా ఏమి? అనేక సంపదలతో జగమంతటా వ్యాపించి విలసిల్లుచున్నాడే! దయానిధియైన ఈతడు నీల మేఘమే కాబోలు! ఎందుకనగా ప్రాణుల తలపున కోరిన కోరికలనెల్ల కురియుచున్నాడు గదా!

పాపరహితుడైన ఈ శ్రీవేంకటగిరి నాథుడు ఎంతగా చూచినను తృప్తి చేకూర్చని ఆకాశ తత్త్వమా ఏమి? ఈ మహామూర్తి అట్టివాడే కాబోలు! ఏలన చరాచరాత్మకమైన ఈ విశ్వమంతయు ఆకసమునందే లయించి మరల అందే జనించునట్లు పరబ్రహ్మమునందే లీనమై తిరిగి ఇతనియందే లయించి పుట్టుచున్నది గదా!

# భక్తిముక్తిప్రదం
# శ్రీరామ నామాత్మక మంత్రం

: చిల్లర సీతారామారావు

శ్లో॥ "రామనామాత్మకం మంత్రం యః కీర్తయేన్నరః
సర్వరోగ వినిర్ముక్తో ముక్తి మాప్నోతి దుర్లభమ్"

'రామ' అను మంత్రమును నిత్యము కీర్తించువాడు, సమస్త రోగముల నుండి విముక్తుడగుటయే కాక అత్యంత దుర్లభమైన ముక్తిని పొందగలడు. శ్రీరామ నామము ఆర్తులకు జీవితము ప్రసాదిస్తుంది. పీడితులకు ధైర్యమునిస్తుంది. భక్తులను సంరక్షిస్తుంది. భక్తి శ్రద్ధలతో రామనామమును జపించినవారికి మోక్షమును ప్రసాదిస్తుంది. శ్రీరాముని కన్నా శ్రీరాముని నామము అత్యంత మహిమాన్వితమైనది. రామనామ మహాత్మ్యమును వివరిస్తూ శివుడు పార్వతితో ఇలా అంటాడు.




శ్లో ॥ "కోటి తీర్థాని దానాని, కోటి యోగ వ్రతాని చ
కోటి యజ్ఞ జపాచ్చైవ తపసః కోటి కోటయః
కోటి జ్ఞానైశ్చ విజ్ఞానైః కోటి జ్ఞాన సమాధిభిః
సత్యం వదామి తుల్యాని రామనామ్నాన తాన్యమే"

ఓ పార్వతీ నేను సత్యమును చెపుతున్నాను వినుము. కోటి తీర్థములను సేవించిననూ, దానములు చేసిననూ, యాగములు చేసిననూ, వ్రతములాచరించిననూ, కోటి యోగములు చేసిననూ, కోట్ల తపస్సులు చేసిననూ, కోటి జ్ఞాన విజ్ఞానములు కలిగి యున్ననూ, కోట్ల కొలది ధ్యాన సమాధులు చెందినను అవి ఏమీ రామనామముతో సమానము కావు.

శ్లో ॥ "మాంగల్యం సర్వపాపఘ్నమాయుష్య మఖిలేష్టదమ్
భక్తిముక్తిప్రదం పుణ్యం రామనామ్నస్తు కీర్తనమ్"

శ్రీరామనామ కీర్తనము మంగళప్రదమైనది. పూర్ణఫల మొసంగునది. పుణ్యమైనది. కోరిన కోర్కెలను నెరవేర్చునది. భుక్తి ముక్తులను ప్రసాదించునది. సర్వపాపములను నశింపచేయునది.

'రామ' అను పదము అర్థవంతమైనది. జీవము గలది. 'రామనామ జపాదేవ ముక్తిర్భవతి' రామనామమును జపించుట వలన ముక్తి లభిస్తుంది. సమస్త పాపములు హరించిపోయి మనస్సుకు శాంతి కలుగుతుంది. రామనామము మహామంత్రము. భవసాగరము నుండి తరింపచేయు శక్తిగల మహామంత్రము. రామశబ్దము మహిమాన్వితమైనది. 'రా శబ్దోచ్చార మాత్రేణ బహిర్నిర్యాంతి పాతకాః'. 'రా' అను శబ్దమును ఉచ్చరించగానే పాతకములన్నీ బయటికి పోతాయి.

'రా' అను అక్షరము అగ్ని బీజము. ఆ అక్షరము పాపములను తగులబెట్టి బయటికి పంపించివేస్తుంది. ''పునః ప్రవేశ భిత్యాచ మకారస్తు కవాటవత్'' పాపములు తిరిగి లోనికి ప్రవేశించకుండా 'మ' అను అక్షరము కవాటము వలె పని చేస్తుంది.

యుగ యుగాలు గడిచిపోయినప్పటికీ నశించని మధురాతి మధురమైన నామము శ్రీరామ నామము. ఉచ్చరించుటకు అతి సులువైన నామము. ఈ నామములో ద్విత్వాక్షరములు లేవు. రామనామమును జపించి అగస్త్యుడు రుద్రత్వమును, కశ్యపుడు బ్రహ్మత్వమును, విశ్వామిత్రుడు ఇంద్రత్వమును, పొందినారు. కార్తికేయుడు, మనువు, ఇంద్రుడు, సూర్యుడు, పర్వత మహర్షి, నారదుడు, వాలఖిల్యులు మున్నగు మహామునులు దేవత్వమును పొందినారు. శివుడు కాశీ యందు మరణించు వారి యందరకు బ్రహ్మ స్వరూపము, తారక మంత్రము అయిన రామనామ మంత్రము ఉపదేశిస్తున్నాడని శాస్త్రోక్తి. వినినంత మాత్రముననే స్వర్గమును ప్రాప్తింపచేయు రామనామ మంత్రమును నిత్యము స్మరించుకోవడం శ్రేయోదాయకం.

**శ్లో ॥ "శ్రీరామమంత్ర రాజస్య సమ్యగర్థోఽయముచ్యతే**
**నారాయణాష్టాక్షరేచ శివపంచాక్షరే తథా**
**సార్థకార్ణ ద్వయం రామో రమంతే యత్ర యోగినః**

శ్రీరామ మంత్రరాజము యొక్క మహా అర్థము వివరింప బడుచున్నది. నారాయణాష్టాక్షరి లోను, శివపంచాక్షరిలోను గల సార్థకములగు అక్షరములను దీసుకొనిన రామ అను పదము ఏర్పడుతున్నది. యోగులందరూ దానిలో రమించుచున్నారు. రెండు మహామంత్రములున్నాయి. మొదటిది నారాయణుడి 'ఓం నమో నారాయణాయ' అను మంత్రము, రెండవది పరమేశ్వరుడి ఓం నమశ్శివాయ అను మంత్రము. 'ఓం నమో నారాయణాయ' అను మంత్రము నుండి 'రా' అను అక్షరమును, 'ఓం నమశ్శివాయ' అను మంత్రము నుండి 'మ' అను అక్షరమును తీసుకున్నచో ఆ రెండక్షరములు కలిపి 'రామ' అను శబ్దము ఏర్పడునని శాస్త్రములు తెలియచేయుచున్నాయి. అనగా నారాయణ మంత్రమునకు 'రా' అను అక్షరము ప్రాణము. ఆ అక్షరము లోపించినప్పుడు న+అయణాయ అనగా శుభకరము కాదు అన్న అర్థము స్ఫురిస్తుంది. పరమేశ్వరుని మంత్రమునందు 'మ' అక్షరము ప్రాణము. ఆ అక్షరము లేనప్పుడు న+శివాయ అని ఏర్పడుతుంది. అప్పుడు శుభము కొరకు కాదు అన్న అర్థము వస్తుంది. దీనిని బట్టి రా+మ అన్న అక్షరములు హరి హర మంత్రములలోని సారయుక్తమైన అక్షరములని స్పష్టమవుతున్నది. అందువలన రా,మ అను అక్షరములు కలిసి 'రామ' అను మహామంత్రముగా పిలువబడుతున్నది. మహామంత్రము అనగా మంత్రము లన్నింటికన్నా శ్రేష్ఠమైనదని అర్థము. ''మన నాత్త్రాయతే యస్మాత్ మంత్ర మిత్యభి ధీయతే'' అనగా మననము గావించుట వలన అది రక్షిస్తుంది. కాబట్టి దానికి మంత్రము అని పేరు.


పూర్వకాలమున రత్నాకరుడు అను పేరుగల బ్రాహ్మణుడు ఉండేవాడు. అతడు బ్రాహ్మణోచితమైన కర్మలకు తిలోదకములనిచ్చి దుష్టులతోడి సహవాసము చేయసాగాడు. ఒకనాడు ఒక స్నేహితుడితో కలిసి ఒక దస్యుని గృహమునకు వెళ్ళాడు. ఆ దస్యుడు మితిమీరిన సంపద కలవాడు. అతడి భోగలాలసతను, ఇంటినిండా దాస దాసీ జనములను చూసి, దీనికంతటికీ మూలకారణము దస్యు వృత్తిద్వారా లభించు ఆర్జన అని గ్రహించాడు. ఒక దస్యు కన్యను వివాహమాడి, వారితో సంబంధ బాంధవ్యాలను పెంచుకున్నాడు. ఆ కన్య ద్వారా అతనికి సంతానము కూడా కలిగింది. తన సంసార బాధ్యత పెరిగినదని భావించి దొంగతనములు చేయడం, దారిదోపిడీలు చేయడం, ధనమును ఇవ్వనివారిని వధించడం మున్నగు పనులకు అలవాటు పడిపోయాడు. ఇలా కొంతకాలము గడిచిపోయింది. ఒకనాడు సప్తర్షులు వనము గుండా వెళ్ళసాగారు. రత్నాకరుడు దారికాచి వారిని ఆపి బెదిరించాడు. మీ దగ్గర ఉన్న సంపద, ధనము ఏదైనా ఉంటే తనకిమ్మని కఠినముగా అడిగాడు. సప్తర్షులు రత్నాకరుడి బెదిరింపులకు భయపడలేదు. వారు రత్నాకరునితో నాయనా! మేము సాధువులము. మా దగ్గర ఏమి ఉంటుంది? మా దగ్గర ఏమీ లేదు అని పలికారు. రత్నాకరుడు ఆగ్రహముతో వారిని కొట్టసాగాడు. అయినప్పటికీ వారు ఆగ్రహించకుండా – నాయనా! నీవు మమ్ములను కొట్టి పాపమును మూట కట్టుకుంటున్నావు. ఒక సంగతిని నీవు మర్చిపోతున్నావు. జీవహింస మహాపాపము. ప్రాణులను వధించడము మహాపాతకము. ఈ పనులు చేయుట వలన పరలోకములో అతి భయంకరమైన శిక్షలను అనుభవించవలసి వస్తుంది. మాకు ఒక సందేహము కలిగింది. నీవు ఇన్ని పాపకృత్యములను ఆచరిస్తున్నావు కదా! ఇవన్నీ నీ సంసారమును పోషించుట కొరకే కదా! అయితే నీ భార్యాబిడ్డలు నీవు పాపకృత్యముల ద్వారా సంపాదించిన దానిని స్వీకరిస్తున్నారు కదా! అదేవిధముగా నీకు లభించు పాపఫలితమునందు కూడా భాగస్వాములవుతారా? లేదా కేవలం నీవు మాత్రమే ఆ పాప ఫలితమును అనుభవిస్తావా? అని అడిగారు. మనిషికి మార్పు వచ్చు సమయము ఆసన్నమయినప్పుడు, అతని మనస్సులోను, బుద్ధిలోను మార్పు వస్తుంది. సప్తర్షులు అడిగిన ప్రశ్నలకు రత్నాకరుడి మనసులో ఆందోళన మొదలైంది. సప్తర్షులతో స్వాములూ! మీరు ఇక్కడనే ఉండండి అని పలికి వారిని ఒక చెట్టుకు కట్టివేసి ఇంటికి వెళ్ళాడు. అతడిని చూచి కుటుంబ సభ్యులు తొందరగా వచ్చాడని ఆనందించారు. రత్నాకరుడు భార్యాపుత్రులతో ఇలా అన్నాడు. మీరందరూ నేను తెచ్చిన సంపాదనను ఆనందముతో

అనుభవిస్తున్నారు. ఆ సంపాదన నాకు ఎలా వచ్చిందో ఏనాడూ మీరు అడగలేదు. ఒకవేళ నా సంపాదన పాపపు సంపాదన అయితే దానివలన వచ్చు పాప ఫలితమును కూడా ఇదేవిధముగా స్వీకరిస్తారా? అన్న రత్నాకరుడి ప్రశ్నకు భార్యాపుత్రులు ఇలా సమాధానమిచ్చారు. భార్యాపుత్రులను పోషించవలసిన బాధ్యత కుటుంబపెద్దగా మీది. మీరు ఎలా సంపాదించుతారన్నది మాకు అనవసరం. పాపమైనా, పుణ్యమైనా నీవే అనుభవించాలి. మాకు ఎటువంటి సంబంధము లేదు అని కరాఖండిగా చెప్పేశారు. ఆ సమాధానం విని రత్నాకరుడు నిర్ఘాంతపోయాడు. ఆలోచనలో పడిపోయాడు. ఇలాంటి వారికోసమా నేను ఇంతకాలం కష్టపడింది, రాత్రనకా, పగలనకా, ఆకలి దప్పులను పట్టించుకోకుండా, ఎండ, వాన, చలి మున్నగువాటిని పట్టించుకోకుండా, వీళ్ళంతా హాయిగా ఉంటారు, కడుపునిండా తింటారు అని కష్టపడితే తుదకు నాకు దక్కిన ఫలితమా ఇది? నేను తెచ్చిన సంపాదన అంటే వారికి మక్కువ. కాని నా పాప ఫలితము వారికి అనిష్టము అని తలచుకుంటూ, దుఃఖిస్తూ సప్తర్షుల దగ్గరికి తిరిగి వచ్చాడు. సప్తర్షులను బంధ విముక్తులను గావించి, వారి పాదముల మీదపడి, ఇంత జరిగిన వృత్తాంతమును తెలియజేసి విలపించసాగాడు. సప్తర్షులు రత్నాకరునితో – నీవు విలపించవలసిన పని లేదు. నీకు ఒక మంత్రమును ఉపదేశిస్తాము. ఆ మంత్రమును భక్తి శ్రద్ధలతో జపించినట్లయితే నీ సమస్త పాపములు నశించిపోతాయి అని పలికి రత్నాకరునకు రామనామ మంత్రమును ఉపదేశించి వెళ్ళిపోయారు.

రత్నాకరుడు 'రామ' అంటూ జపించడం మొదలుపెట్టాడు. రోజులు, మాసములు, సంవత్సరములు గడిచిపోయాయి. చీమలు అతని శరీరము మీద పుట్టలు పెట్టాయి. అయినా అతనికి ఇవేమీ తెలియవు. కేవలం రామనామ జపంలో లీనమైపోయాడు. ఒకనాడు సప్తర్షులు వనమునుండి వెళుతున్నారు. వారికి ఒక పుట్టనుండి సన్నని స్వరముతో 'రామ' శబ్దము వినిపించింది. వాళ్ళు ఆ పుట్ట దగ్గరికి వెళ్ళారు. అంతలో అకస్మాత్తుగా వాన కురిసింది. ఆ వానకు పుట్ట కరిగిపోయి చిక్కి శల్యమైన రత్నాకరుడు వారికి కనిపించాడు. రత్నాకరుడు సప్తర్షులను చూచి పుట్టనుంచి బయటకు వచ్చి వారికి పాదాభివందనము గావించాడు. సప్తర్షులు మంత్రజలమును అతని మీద చిలకరించారు. దానితో రత్నాకరుడు స్వస్థుడైనాడు. సప్తర్షులు రత్నాకరుడిని ఆశీర్వదించి వెళ్ళిపోయారు. పుట్టను వల్మీకము అని పిలుస్తారు. పుట్టలోనుండి బయట పడిన కారణము చేత రత్నాకరునకు వాల్మీకి యని పేరు వచ్చింది.

ఒకనాడు వాల్మీకి తమసా నదీతీరమునకు స్నానార్థము వెళ్ళసాగాడు. అక్కడ వాల్మీకి ఒక వృక్షము మీద ఒక క్రౌంచ పక్షుల జంటను చూశాడు. అవి ఆనందముతో కిచ కిచ ధ్వనులు చేయసాగాయి. ఆ శబ్దమును వింటూ ఆనందముతో వాటినే పరిశీలించసాగాడు. ఇంతలో ఒక బోయవాడు తన బాణమును ఒక క్రౌంచ పక్షికి గురిపెట్టి వదిలాడు. బాణము తగిలి ఆ పక్షి గిల గిల కొట్టుకుంటూ క్రింద పడిపోయింది. వెంటనే ప్రాణాలు విడిచింది. ఆడపక్షి కీచు కీచుమని అరుస్తూ అతి దీనంగా విలపించసాగింది. ఆ దృశ్యమును చూచిన వాల్మీకి హృదయము పరితపించిపోయింది. అనుకోకుండా ఆయన నోటినుండి ఒక శ్లోకం వెలువడింది. పిదప నారదుడు చెప్పిన రామాయణ గాథను, బ్రహ్మ ఆదేశముతో వాల్మీకి, మర్యాదా పురుషోత్తముడయిన శ్రీరాముని చరితమును మహత్తర కావ్యంగా రచించాడు. ఆ కావ్యము ఆదికావ్యంగా నిలిచిపోయింది.

మహత్తరమైన 'రామ' నామ మంత్రమును భక్తి శ్రద్ధలతో జపించుకుంటూ, ఇహ లోకమునందు సమస్త సుఖములనుభవించి పరలోకమున శ్రీరాముని అనుగ్రహముతో ముక్తిని పొందుదాము.



శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం సంకల్పించిన
మొత్తం 111 శ్రీనివాస కళ్యాణాలలో భాగంగా

## గత నెలలో నిర్వహించిన కళ్యాణాలు

### 78 వ కళ్యాణం

తేది 09-03-2025 ఆదివారం
ఉదయం 10.30 గంటల నుండి జరిగింది.
ఇది సీనియర్ సిటిజన్స్ గ్రౌండ్, కమలానగర్,
ఎ.ఎస్.రావ్ నగర్, హైదరాబాద్‌లో జరిగింది.
దీనిని శ్రీమాన్ గట్టోజు దశరథ్ మరియు
సభ్యుల బృందం నిర్వహించారు.
వైఖానసాగమోక్తంగా, అన్నమయ్య కీర్తనల
మధ్యన జరిగింది.



## 25వ భాగము


# తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశానిర్దేశం

## స్వామి వారి దివ్య లీలలు

**తెలంగాణలో మరో తిరుపతిగ తన 'హరినామ క్షేత్రము'ను ఏర్పాటు చేయుటకై తిరుమల శ్రీ వేంకటేశ్వరుని లీలల ధారావాహికం**


శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు

— **గోవింద దాసు** (పుల్లగూర్ల సాయిరెడ్డి)

**దిశా నిర్దేశం :** సిద్ధిపేటకు 7 కి.మీ. దూరములో ఉన్న చిన్నగుండవెల్లి అనే మా స్వగ్రామంలోని మా తోటబావి వద్ద తిరుమల శ్రీవేంకటేశ్వరుడు తన 'హరినామ క్షేత్రము'ను ఏర్పాటు చేయదలచాడు. కనీసం వెండి వాకిలి వరకైనా తిరుమల ఆలయ ప్రతిరూపమును నిర్మించమన్నారు. తాను స్వయంగా ఈ క్షేత్రంలో స్థిరనివాసమేర్పరచుకొని భక్తులను అనుగ్రహించుదునన్నారు. మరియు వివిధ భక్త బృందాలచే వంతుల వారిగా అఖండ హరినామ స్మరణ జరగాలని సూచించారు. స్వామివారిని తిరుమల నుండి ఆహ్వానించుటకు తగిన యోగ్యత సాధించుటకు వీలుగా కఠిన సాధనతో పాటు భాగవతుల ఆశీర్వాదమును పొందమన్నారు. తన కలల ద్వార ఏప్రిల్ 2000 నుండి శిక్షణ ఇచ్చుట ప్రారంభించి ఏప్రిల్ 2022లో అసలు విషయం తెలిపారు. మరియు ఈ కార్యక్రమములో భక్తులను భాగస్వాములుగ చేయుటకు వీలుగ స్వామివారు ప్రసాదించిన అనుభూతులను ఏప్రిల్ 2023 నుండి ప్రచురించమన్నారు. అందులో భాగంగా ప్రస్తుతపు 25 వ భాగపు లీలల ప్రచురణ. (మార్చి 2011 నుండి ఫిబ్రవరి 2012).

నేను వ్రాసుకున్న మొత్తం 6 అనుభూతుల పుస్తకముల నుండి 5వ పుస్తకమును ప్రారంభిస్తున్నాను. ఇప్పటినుండి స్వామివారు మరోరకంగా శిక్షణను ఇస్తూ మెల్లమెల్లగా లక్ష్యం వైపు తీసుకెళ్ళారు.

వరుసగ 10 రోజులు స్వామివారి లీలలను చూడకుండా నాది ఉండలేని స్థితి. ఇక స్వామివారు మాత్రం వారి గురించి సాధన చేయుమనే ఉద్దేశ్యముతో గత కొన్ని నెలల నుండి లీలలను చూపుట మానివేశారు. దీనిని అర్థం చేసుకోని నేను స్వామివారి లీలలను చూడాలని తపిస్తూ ప్రార్థించసాగాను.

### స్వామివారి లీలలను చూడబట్టి పుష్కరకాలం

స్వామివారి కోసం ప్రార్థించి విరక్తి చెందిన నేను చివరికి తేది 27-02-2011 నుండి వరుసగా రెండు రోజులు స్వామివారిని ఇలా ప్రార్థించాను. "ప్రభూ! శ్రీవేంకటేశ్వరా, నాకు బంధువులు, మిత్రులు లేరు, అందరితో కూడినప్పుడు అసౌకర్యంగా అనిపించుట వలన అందరికి దూరమైనాను. మీ విషయాలు కాకుండా ఇతర విషయాలపై మనస్సు వెళ్ళదు, నేను ఒంటరివాణ్ణి అయిపోయాను, మీరు కూడ దూరమైతే, మీరు లీలలను చూపకపోతే ఈ జీవితం అతి కష్టంగా, చీకాకుగా, బోరుగా ఉంటుంది. కాబట్టి ప్రభూ! మీ లీలలను వెనుకటి మాదిరి చూపమని వేడుకున్నాను. మరియు నాకు శక్తీ, ప్రేరణ అంతా తమరేనని, మీరు కరుణిస్తేనే నేను ఏదైనా చేయగలనని దుఃఖిస్తూ విన్నవించాను". దీనికి స్వామివారు చిన్న లీలను చూపారు. ఆనందించాను.

**తేది 01-03-2011 కల :** ఈ కలలో నేను ఒక దైవ క్షేత్రానికి వెళ్ళాను. అక్కడ ఒక నది, దానికి ఒక

ఒడ్డు ఉన్నది. అది ఒక నదీ పుష్కరాలు జరుగు స్థలము లాగా, భక్తులు స్నానాలు చేయుటకు అనువుగా ఉన్నది. ఈ ఒడ్డుపై ఎంతోమంది యాత్రికులు పవిత్ర స్నానాలు చేయుటకై ఉన్నారు. ఈ నదిలో అక్కడక్కడ నీరు, మధ్య మధ్యన ఇసుక దిబ్బలు ఉన్నవి. నీరు చాల స్వచ్ఛంగా మురికి లేకుండా ఉన్నవి. భక్తులు వారి వారి బట్టలను ఒడ్డుపై పెట్టి గోచి, అందరువేర్లతో స్నానాలు చేస్తున్నారు. నేను కూడ స్నానము చేయుటకై సిద్ధమైనాను. ఒక దగ్గర నీటిలో దుమికాను, ఈదాను. నా ప్రక్కనే ఒక ఇసుక నేలను చూచాను, మరియు ఎంతో మంది భక్తులను చూచాను. కల చెదిరింది.

దీనర్థం – నేను పుష్కరస్నానం చేసి దైవదర్శనానికి సిద్ధమౌతున్నానని అర్థం. సం॥ 1999 లో నాకు డయాబెటిక్ ప్రసాదించిన నాటి నుండి, దాదాపు పుష్కర కాలం నుండి స్వామివారు తమ లీలలను చూపుచున్నారు. బహుశా దీనికి సంకేతం కావచ్చునని భావించాను.

## జీవితము మెరుగైన దిశకు మార్చబడుట

ఇప్పటి నుండి స్వామివారి కృప వలన నేను యోగ్యత వైపు లేక జీవితంలో ఒక భాగం నుండి మరో మెరుగైన భాగానికి మార్చబడ్డాను. ఇప్పటి నుండి స్వామివారి లీలలు కూడ మరో విధంగా ఉంటాయి. సం॥ 2002 లో తిరుపతి లోని టిటిడి డైరీఫాంలో శ్రీవేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపాన్ని నిర్మించినప్పటినుండి, ప్రతి సంవత్సరం జరుగు పూజకు అలమేలు మంగాపురం నివాసియైన శ్రీమాన్ పత్తి సుబ్రమణ్యం అనే వ్యక్తి ఫోటోగ్రాఫర్ గా, తిరుపతిలో జరిగే మా అన్ని కార్యక్రమాలకు పని చేస్తున్నారు. ఈయనకు మేము చేసే ప్రతి సేవ తెలుసు, పైగా శ్రీవేంకటేశం మాసపత్రికకు కూడా ఈయనే ఫోటోగ్రాఫర్ గా ఉన్నారు. స్వామివారు ఈయనను ఉపయోగించి అద్భుతమైన ఈ క్రింది లీలను చూపారు.

**తేది 16-03-2011 కల:** ఒక సందర్భములో నేను హైదరాబాద్ నుండి సిద్ధిపేటకు వెళ్ళు క్రమములో నగర శివారు యైన అల్వాల్ ప్రాంతము దాటాను, ఇంతలో శ్రీనివాస మంగాపురం నివాసి, ఫోటోగ్రాఫర్ శ్రీమాన్ పత్తి సుబ్రమణ్యం గారు తిరుపతి నుండి ఫోన్ చేసి నాతో ఏదో చెప్పారు. ఒక ఆలయం అతి గమ్మత్తుగా, చాల విచిత్రంగా ఉన్నదని అన్నారు. అది నేను వెళ్ళేదారిలోనే ఉన్నదని, తప్పక దర్శించుకొమ్మని చెప్పారు. మరియు దగ్గరలోనే ఉంది కాబట్టి నా ప్రయాణాన్ని ఆలయం వైపు సాగించాను. నాకు ఆ ఆలయం, దాని గాలిగోపురం కనబడింది. ఆ గాలిగోపురం చాల ఎత్తు కలిగి రాతివిగ్రహాలతో, చక్కని చెక్కడముతో తయారు చేయబడ్డది. నాకు సమయం లేక నేను ఆ ఆలయాన్ని బయటినుండే దర్శించి వాహనం కూడ ఆపక 'యూ'



గాలి గోపురం ఎత్తు పెరుగుట

టర్న్ తీసుకుని వెళ్ళిపోవుచున్నాను. నేను ఆలయంను దాటి, వేరే మార్గమునకు వచ్చాను. ఈ ఆలయం నా మార్గానికి ఒక బ్రిడ్జి లాంటిదని నా మనస్సులో ఒక భావమేర్పడ్డది. ఇంతలో వెనుక నుండి ధాం... అంటూ చాల పెద్ద శబ్దము వినబడ్డది. వెంటనే నేను వెనుకకు తిరిగి చూచాను. ఆ ఆలయ గాలి గోపురం పైనున్న విగ్రహములు, ఒక్కొక్కటి అతి భయంకర శబ్దము చేయుచు, ఆ గోపురము క్రింది భాగము నుండి వాటంతట అవే వేరు చేయబడి పైకి ఎగిరి గాలి గోపురము పైభాగమున అతికించబడుటను చూచాను. అవి విడిపోవడము పైకి ఎగరడము తిరిగి అతికించబడుట స్పష్టంగ చూచాను. ఒకరకంగా ఈ గాలి గోపురము ఎత్తు పెరుగుతోంది. కల చెదిరింది. దీనర్థం – ఇప్పటినుండి నాలో ఆధ్యాత్మికత పెరిగే దిశగా, మరింత లక్ష్యం వైపు తీసుకెళ్ళగలరని భావం.

## భరతుని భక్తి బీజం నాటుట


తిరుమల శ్రీవేంకటేశ్వరుడు నాకు ఎన్నో సేవలను ప్రసాదించారు. ప్రతి సేవ మొదట ఒక మెరుపులాగా నా హృదయంలో కల్పిస్తారు. ఆ తరువాత దీని గురించి మరిన్ని లీలలను ప్రసాదించి, ఆ సేవను పొందుటకు స్వామివారిని తీవ్రంగా ప్రార్థించే విధంగా తయారు చేస్తారు. ఇప్పుడు భరతుని భక్తి బీజాన్ని నా హృదయంలో నాటారు. ఎంతో పులకరించిపోయాను, కలలోనే రోమాంచితుడనై ఆనంద

బాష్పాలు రాల్చాను. ఈ భక్తి బీజం భవిష్యత్తులో ఎప్పుడో ఒకప్పుడు మొలకెత్తగలదు. ఆ లీల ఈవిధంగా ఉంది.

చాల రోజుల తరువాత ఈ రాత్రి రెండు కలలు వచ్చాయి. ఇవి దేన్ని ఉద్దేశించి వచ్చాయన్నది అప్పుడు నేను గుర్తించలేదు. కాని నా మనస్సులో మాత్రం నా ప్రభు పట్ల భక్తి, ప్రేమ పెరిగి శరీరము పూర్వము వలె పులకరించింది. నా స్వామివారు మళ్ళీ నన్ను అనుగ్రహిస్తున్నారని మురిసిపోయాను.

**12-04-2011 మొదటి కల :** ఇది చాల చిత్రంగా ఉంది. అది మా ఊరు చిన్నగుండవెల్లి. నాకు ఒక పెండ్లికాని చెల్లెలు ఉన్నదట. ఆమెకు పెండ్లి చేయాలని అనుకుంటున్నాము. మా ఇంటికి నేనే పెద్దదిక్కు, మా తల్లితండ్రులు లేరట. ఒక సందర్భములో నేను హైదరాబాద్ నుండి ఎవ్వరిదో ఒక ఫంక్షన్ నిమిత్తమై మా ఊరికి వెళ్ళాను. మా ఊరిలో ఒక ఫంక్షన్ హాలులో ఉన్నాను. అందరూ కూర్చున్నారు. అందరూ తెలిసినవారే, మా ఊరివారే. కొందరు బంధువులు, మరికొందరు మిత్రులు ఉన్నారు. అందులో ఒకరు నాతో, మీ చెల్లెలుకు సంబంధం కుదిరిందా? పిల్లవాడు ఏం చేస్తాడని అడిగాడు. నేను, కుదిరింది ఆయన ఆయుర్వేదిక్ / హోమియోపతి డాక్టరు అన్నాను. ఆయన మంచి 6 అడుగుల ఎత్తు కలిగి, నల్లగ ఉన్నాడట, ఆయన కూడ ఆ సభకు వచ్చాడట. కాని మా చెల్లెలు మాత్రము కనబడలేదు. ఇది మొదటి కల లేదా మొదటి సన్నివేశం.

తరువాత కలలో, నేను ఊరిలోని మా ఇంటినుండి బయలుదేరి ఊరి చివర ఉన్న బడి (పాఠశాల) వరకు వెళ్ళాను. నాతోపాటు ఇంకొకరు 8-9 సం॥ వయస్సున్న చిన్న బాలిక ఉన్నది. ఆ దారిలో ఊరి అంచుకు ఒక ఇల్లుంది. ఆ ఇంటి వరండాలో నిలుచున్నాము. బహుశా మేము ఆ ఇంట్లో ఉన్నవారి కోసమని వెళ్ళి, వారి గుమ్మం ముందు నిలుచున్నాము. నా ముందు ఆ చిన్న బాలిక నిలుచుంది. ఇంతలో మేము వచ్చామని




భరతుని భక్తి బీజం నాటుట

గ్రహించి, ఆ ఇంటి నుండి ఒకరు బయటకు వచ్చారు, ఆయన వెనుక మరొకరు బయటకు వచ్చారు. మేము ఆ ఇంట్లో ఉన్న ఒక ముఖ్యమైన వ్యక్తి కోసం వచ్చామని గ్రహించి, ఆ వ్యక్తి లేరని సైగ చేశారు. కాని మేము వెళ్ళలేదు. వారు ఆ ఇంటిలోపల ఉన్నారని నమ్మాము. వారిని లోనుండి రప్పించాలనే ఉద్దేశ్యంతో, నా ముందు నిలుచున్న చిన్న బాలిక శ్రీరాముని పొగడుతూ మంచి కీర్తనలను పాడసాగింది. ఆమె అన్నమయ్య, త్యాగయ్య మాదిరిగా శ్రీరాముడిని కీర్తిస్తూ పాటలను పాడింది. అత్యంత శ్రావ్యంగ, శరీరం పులకరించిపోవునట్లు పాడింది. అది విని లోనుండి వచ్చిన వారు "మా భరత స్వాముల వారు లేరు బయటికి వెళ్ళారని ఏదో చెప్పారు" ఇంతలో నేను లేదా ఆ బాలిక మరొక అమూల్యమైన, భక్తి పరవశమైన పాటను పాడాము. అంటే వారు పొమ్మన్నా పోక మరింత భక్తిభావముతో శరీరము తన్మయత్వము చెందగా పాడాము. ఈ పాటను విన్నాక, మారు మాట్లాడక అలాగే నిలుచున్నారు. ఈ పాటను వినగానే అబ్బా... అని వారి శరీరాలు పులకరించాయి. వారి మనస్సులో భక్తిభావం శృతి మించి, ఆనంద బాష్పాలు రాలాయి. అనంతమైన ఆనందానికి, తన్మయత్వానికి లోనైనారు. అప్పుడు ఆ కలలోనే నాకు శ్రీరాముని తమ్ముడు భరతుడు, ఆయన భక్తి, అంకిత భావము గుర్తుకొచ్చాయి. నా శరీరము ఎంతో భక్తిభావంతో, సేవక భావంతో నిండి ఆనంద దాయకమైంది, కల చెదిరింది.

తెల్లవారి దీని గురించి ఆలోచించాను. కాని అదే భక్తిభావం నా మనస్సులో ముద్రించుకుంది. మళ్ళీ నా కళ్ళ నుండి ఆనంద బాష్పాలు రాలాయి, ప్రేమతో రోమ రోమాలు పులకించిపోయాయి. ఈ విధంగా నా మనస్సులో భరత మహారాజు గారి భక్తిబీజం నాటాడు. ఈ బీజం భవిష్యత్తులో స్వామివారు ఆశించినప్పుడు నాలో మొలకెత్తగలదు.

ఈ కల అర్థం : నాలో శ్రీ భరతుని భక్తి బీజం నాటుటతో పాటు నాకు ఈ విధంగ దిశా నిర్దేశం చేశాడు. మా ఊరి వారిలో మరియు ఆ ప్రాంత ప్రజలలో, వారు ఇష్టపడకున్నప్పటికీ, వారిలో శ్రీవేంకటేశ్వరుని భక్తిబీజం నాటుటకు ప్రయత్నించమన్నారు.

మా తోట బావి వద్ద స్వామివారి ఆలయం ఉండునని సూచించుట

గత చాల రోజుల నుండి స్వామివారు ఎలాంటి లీలలను చూపలేదు. చాల విచారించాను, ఏమి చేయాలో తోచలేదు. తిరిగి ఆయన కృప వల్ల మళ్ళీ ఈ రాత్రి మంచి కల కన్నాను.

**తేది 11-05-2011 కల :** ఉదయం 5 గంటల ప్రాంతమున ఈ కల వచ్చింది. నేను మా సొంత ఊరు చిన్నగుండవెల్లిలో మా తోటబావి వద్ద ఉన్నానట. మంచి తోట ఉన్నదట, దాదాపు నా చిన్ననాడు వ్యవసాయము చేయు రోజులు లాగా ఉన్నది. ఈ తోటలో అటు ఇటు తిరిగాను. ఈ కలలోని రెండవ సీనులో నేను తోటబావి దగ్గరికి వచ్చాను. అక్కడ ఒక ఆలయం ఉన్నది. నేను అందులోకి వెళ్ళాను. ఆ ఆలయంలో ఎన్నో విగ్రహములు ఉన్నవి. శివలింగం, వినాయకుడు, పార్వతీదేవి, నాగరాజు మొదలైన విగ్రహాలు ఉన్నవి. కాని అందులో రెండు శివలింగములు ఉన్నవి. నేను ఆ శివలింగముకు అభిషేకం చేసి పత్రిని సమర్పించి పూజించాను. విశేషమేమంటే నా చిన్ననాటి మిత్రుడు శ్రీవైష్ణవుడైన శ్రీమాన్ కలకుంట్ల వేంకటలక్ష్మీ నరసింహాచారి గారు ఈ ఆలయానికి పూజారి. నేను ఆయనను ఈ ఆలయంలో చూచాను. ఆయన తిరునామాలతో చక్కని పంచె ధరించి ఉన్నారు. చాల సంతోషించాను. కల చెదిరింది.

ఈ కలను స్వామివారు విశ్లేషణాత్మకంగా ప్రసాదించారు. మా తోటబావి వద్ద వైష్ణవ సాంప్రదాయముచే ఒక ఆలయం ఏర్పడగలదని సూచించారు. సకల రూపములు శ్రీవేంకటేశ్వరుని అంశగానే భావించమన్నారు. మరియు రెండు శివలింగాలకు అర్థం. ఇది శ్రీవేంకటేశ్వరుని మరియు లక్ష్మీమాత ఆలయం అని, నేను వారిని తనివితీరా సేవించుకుందునని ఇన్ డైరెక్ట్‌గా మొదటిసారి సూచించారు. కానీ ఈ కల కన్నప్పుడు దీనర్థమును గ్రహించలేదు.

## నూతన ఆఫీసు లోనికి మారుట

శ్రీవేంకటేశ్వరుని ఆదేశానుసారం ఇ.నెం.1-9-1113/30, వి.ఎస్.టి రోడ్, విద్యానగర్ లోని మా ఆఫీసును అమ్మివేసి, మా ఇంటికి దగ్గరలో హబ్సిగూడలో ఉన్న ఇ.నెం.1-1-53 లోని ఒక పాత ఇల్లును కొని మాకు సరిపడునట్లు క్రొత్త ఆఫీసును నిర్మించుకున్నాము. స్వామివారి కృపతో ఈ నాలుగు అంతస్థుల భవనము కేవలం 7 మాసములలో పూర్తి చేయగలిగాము. తేది 12-06-2011 నాడు పూజ చేసి ప్రవేశించాము. తేది 14-06-2011 నాటి ఉదయం కొద్ది రోజుల గురించి అమెరికా వెళ్ళి 09-07-2011 నాడు తిరిగి వచ్చాము. తేది 11-07-2011 తొలి ఏకాదశి నాడు ఈ ఆఫీసులో మొదటిసారి కూర్చున్నాను. స్వామివారు తృప్తిచెందే విధంగా ఈ ఆఫీసులో సేవ చేయాలని, ఇది నా చివరి ఆఫీసు కావలెనని, స్వామి కృపా విశేషాలు నా కారణంగ అందరికీ లభించాలని వేడుకున్నాను. ఎలాంటి గొడవలు లేకుండా ప్రశాంత జీవితమును ప్రసాదించమన్నాను. ఒకరకంగా ఇది నా సాధనాలయము కావాలని కోరుకున్నాను.

## 9వ పర్యాయంగా 7 కోట్ల జపసమర్పణకై రథయాత్ర

ప్రతి సంవత్సరం లాగే ఈసారి కూడా 9వ పర్యాయంగా వ్రాయించిన జపానికి మా ఇంట్లో 7 రోజులు ప్రత్యేక పూజలు

చేశాము. ఆ తరువాత తేది 27-07-2011 నుండి నమో వేంకటేశాయ రథయాత్రను మా ఇంటినుండి ప్రారంభించాము. శ్రీశ్రీశ్రీ సర్వవిధానంద స్వామి వారి ప్రత్యక్ష పర్యవేక్షణ, మంగళాశాసనములతో ఈ కార్యక్రమము ప్రారంభమైంది. భక్తులకు అన్న సంతర్పణ ఏర్పాటు చేశాము. తేది 28-7-2011 నుండి 10-08-2011 వరకు రథము హైదరాబాదులో వీధి వీధి తిరిగింది. ఆ తరువాత నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, మిర్యాలగూడ, బాపట్ల, చీమకుర్తి, కావలి, నెల్లూరు తిరిగి తేది 20-8-2011 నాడు తిరుపతి చేరాము. తేది 21-08-2011 నాడు అలిపిరి వద్ద స్వామివారి పాదాలకు సమర్పించాము. మరియు తేది 22-08-2011 గోకులాష్టమి నాడు శ్రీవేంకటేశ్వర డైరీఫాంలో జపహోమాదులు నిర్వహించి టిటిడి ఈఓ శ్రీమాన్ ఎల్.వి.సుబ్రమణ్యం గారు పూర్ణాహుతి గావించి స్వామివారికి సమర్పించారు. మరియు 10వ పర్యాయంగా 7 కోట్ల జపానికి శ్రీకారం చుట్టారు. ఈవిధంగా ఈ కార్యక్రమం ఆనందంగా ముగిసింది. ఈఓ శ్రీమాన్ సుబ్రమణ్యం గారు స్థూపం నిండిందని అన్నారు.

## సేవ ఫలించుట లేదని సూచించుట

ఈ జప సమర్పణ కంటె ఒకరోజు ముందు తేది 20-08-2011 నాడు ఈ జపంతో శ్రీవేంకటేశ్వర దివ్యమహామంత్ర స్థూపం నిండుతుందని భావించాను. ఈ.ఓ గారు కూడ అలాగే అన్నారు. దీనితో స్థూపాన్ని జపంతో నింపడము అనే మా సంకల్పంలోని ఒక భాగము నెరవేరుతుంది. దీనికి నేనెంతో సంతోషించాను. స్వామివారితో సంకల్పంలోని ఒక భాగం పూర్తవుతోంది ప్రభూ! అంటూ చెప్పాను. అప్పుడు స్వామివారు చూపిన లీల ఈవిధంగా ఉంది.

తిరుమల శ్రీవేంకటేశ్వరుడు నాకు ఎన్నో సేవలను ప్రసాదించి వాటి ద్వారా నాలోని వికారాలను తొలగించుకొని సంస్కరించుకొమ్మన్నాడు. ఇదే స్వామివారి అసలైన లక్ష్యం. కాని నేను మాత్రము ప్రయత్నించినప్పటికి 'నా' అన్నది నశింపచేసుకొనే శక్తి నాలో లేదని భావించి మళ్ళీ ఆ దిశగా ప్రయత్నించలేదు. మరియు నాకు మీ సేవ చేసి ఋణం తీర్చుకొనుటే ముఖ్యం తప్ప 'యోగ్యత'తో పనేముందనే ధోరణిలో జీవితాన్ని సాగించాను. మరియు వ్యాపారము చేయుట వలన సేవకు ఇబ్బంది లేదని భావించి వ్యాపారము కొనసాగించాను. ఇలాంటి సందర్భంలో స్వామివారు నన్ను నొప్పించక, మెల్ల మెల్లగా తన దారిలోకి తెచ్చుకున్నారు. మరియు నేను ఆధ్యాత్మికంగా ఎదుగుటకు నేను చదివిన ఇంజనీరింగు కళాశాలలో చేర్పించి ఎప్పటికప్పుడు నా స్థితిని తెలుపుట ప్రారంభించారు.

తేది 21-08-2011 సాయంత్రం 9వ పర్యాయంగా 7 కోట్ల జపాన్ని అలిపిరి పాదాల మండపముపై స్వామివారి పాదాలకు సమర్పించి పూజించాము. సాయంత్రం 8 గంటల వరకు ఈ పూజ జరిగింది. ఈ పూజ జరిగిన తరువాత ఇలా ప్రార్థించాను. "ప్రభూ! శ్రీవేంకటేశ్వరా! నేను నా శక్తిమేర ప్రయత్నించి రథయాత్రను వీలైనంత ఎక్కువమంది భక్తుల ఇంటికి తీసుకెళ్ళి మీ నామస్మరణ చేయించాను. దీనితోపాటు గత సంవత్సరం నుండి 70 వేల జప పుస్తకాలను పంచి మిమ్మల్ని స్మరింపచేశాను. ఇంతే నా శక్తి, ఇంతకు మించి చేయలేను, నాకు తెలిసి ఎక్కడా పొరపాటు కాని, అలక్ష్యము కాని చేయలేదు. మొత్తం సంవత్సర కాలము మీ నామమును వ్రాయించాను. ఆ తరువాత 25 రోజులు రథయాత్ర ద్వారా మిమ్ములను భక్తుల ఇంటికి తీసుకెళ్ళాను. ఇదే నా మొత్తం శక్తి, ఇంతకు మించి చేయలేను. కాబట్టి దీనిని మీరు తప్పక స్వీకరించాలి. నేనేమైనా తప్పులు చేసినట్లైతే క్షమించి స్వీకరించుమని మరి మరి వేడుకున్నాను. మరియు ఎస్.వి డైరీఫాం లోని స్థూపం ఈ 9వ పర్యాయంగా 7 కోట్ల జపముతో పూర్తిగ నిండుతుంది. నా సంకల్పములోని ఒక భాగమైన స్థూపమును మీ నామముచే నింపడము పూర్తగుచున్నది. కావున ఆశీర్వదించుమని వేడుకున్నాను. మిగిలిన 7 సం॥ల జపమును ఎక్కడ నిక్షేపము చేయమందురో కూడ సూచించమని వేడుకున్నాను. ఈ రోజు రాత్రి హోటల్ లో ఇదే ప్రార్ధన చేస్తూ ఆనందంగ పడుకున్నాను. ఆ తరువాత ఉదయం 4.30 నుండి 5 గంటల మధ్యన ఈ కల వచ్చింది.

తేది 22-08-2011 కల : గతంలో ఒకసారి నేను మరింత ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పొందాలని, స్వామివారు ఆశించే స్థితికి చేరాలనే ఉద్దేశ్యముతో స్వామివారు నన్ను, నేను చదివిన ఇంజనీరింగ్ కళాశాలలో ఉన్నత విద్యనభ్యసించుటకు మాస్టర్ డిగ్రీలో చేర్పించారు.

ఈ కలలో కూడా నేను ఇదే ఇంజనీరింగ్ కళాశాలలో చదువుచున్నానట. నేను చదివే కోర్సుకు తెల్లవారి పరీక్షలట. నేను ఈ కళాశాలలో చదివి కొన్నిరోజులు మానేసి మళ్ళీ తిరిగి చదువుచున్నానట. (అంటే ముందు బ్యాచిలర్ డిగ్రీ తరువాత కొన్ని రోజులకు మాస్టర్ డిగ్రీలో చేర్పించారు అని దీని అర్థం.) నేను చదివిన 1981-85 బ్యాచ్ క్లాస్ మేట్లతోనే ఇప్పుడు కూడ చదువుచున్నానట. ఆనాటి నా క్లాస్ మేట్స్ అందరూ కనబడ్డారు. వారు 1981-85 కాలంలో చిన్నగా, సన్నగా ఉండేవారు. కానీ ఈ మధ్య, కాలం గడిచింది కావున చాల లావుగా, ఎదిగి పెద్దవారైనారు. నేను మాత్రము వారిలాగ ఎదుగక మునుపటి ఆకారంగానే ఉన్నాను. మిగిలిన అందరు మిత్రులు బొజ్జలు పెంచి దృఢంగా ఉన్నారు. మురళీకృష్ణ అనే ఒక మిత్రుని ఆకారము చాల స్పష్టంగా, ఆయన బొజ్జ పెంచి, దృఢమైన ఆకారం కనబడ్డది. అదే సమయంలో ఆయనది 81-85 సంవత్సరంలోని బక్కటి, చిన్నటి

ఆకారము మరోప్రక్క కనబడ్డది. బహుశా ఇది తారతమ్యమును తెలుసుకొనుటకు చూపించారు. ఇక నేను రేపటి పరీక్షకు ఏమి చదువలేదు, ఏమి రాదట, అందుకని చాల దిగులుగా, విచార వదనముతో ఎలా పరీక్ష జరుగునోయని ఆలోచిస్తున్నాను. చాలా వెనుకబడిన విద్యార్థులతో మసలుచున్నాను. నీవు ఎలా చదివావని నా మిత్రులను అడుగుచున్నాను. ఇలా ఎలా పరీక్ష జరుగునోయని దిగులుతో, నేను పాస్ కాలేకపోవుదుననే బెంగతో ఉన్నాను. కల చెదిరింది.

దీనర్థం – స్థూపం నిండుచున్నది, నా సంకల్పములోని ఒక భాగము పూర్తగుచున్నదని ఆనందిస్తున్న నాకు, నీవు సరిగా చదువలేదని పరీక్షలో పాస్ కాలేవని సూచించారు. మరోప్రక్క నీతో చదివిన నీ మిత్రులు వారి వారి రంగములలో రాణించారు కాబట్టి వారు బొజ్జలు పెంచి లావుగా అయ్యారు. నేను మాత్రం నా ఆధ్యాత్మిక రంగంలో ఎదుగలేదు కాబట్టి మునుపటి లాగ చిన్నగా, సన్నగా ఉన్నానని అర్థం. మా భౌతిక రూపులను నా ఆధ్యాత్మిక సాధనకు ముడిపెట్టి చూపారు. నన్ను మరింత కఠిన సాధన చేయమన్నారు. ఇంత చక్కగ హితబోధ చేశారు. కాని దీని భావము ఆ సమయంలో అర్థం కాలేదు. నేను ఏ తప్పు చేయకుండా సేవ చేస్తున్నాననే ధోరణిలోనే ఉన్నాను.

## ఆఫీసు సరిపోయిందని సూచించుట

మేము మా ఆఫీసును హైదరాబాద్ లోని విద్యానగర్ వి.ఎస్.టి మెయిన్ రోడ్ నుండి హబ్సిగూడ లోని వీధినెం.1 కి మార్చాము. విద్యానగర్ లో మా ఆఫీస్ మెయిన్ రోడ్డులో ఉండుట వలన భక్తులకు అనుకూలంగ ఉండేది మరియు క్రొత్తవారు ఎక్కువ మంది వచ్చేవారు. ఫలితంగా మా కార్యక్రమము తొందరగా ప్రజలలో చొచ్చుకుపోయింది. కాని హబ్సిగూడలో మా ఆఫీసు మెయిన్ రోడ్డు నుండి దాదాపు 200 అడుగుల లోపలికి వచ్చిన తరువాత ఉన్నది కాబట్టి క్రొత్త భక్తులు రాలేరనే బెంగ నాకు కలిగింది. ఈ క్రొత్త ఆఫీసు మా ఇంటికి అత్యంత దగ్గరగా ఉండుట వలన భక్తుల కంటె నాకే సౌకర్యవంతంగా ఉన్నది. దీనితో నాకు చాలా బాధ కలిగింది. మెయిన్ రోడ్డులో భక్తులకు అత్యంత సౌకర్యవంతంగా, క్రొత్త భక్తులకు తెలిసేవిధంగా ఉన్న ఆఫీసును స్వామివారు హబ్సిగూడకు మార్చి, భక్తులకు అసౌకర్యము కలిగించారని ఒకింత బాధపడ్డాను. ఏవిధంగా స్వామి సేవను మరింత మంది భక్తులకు విస్తరింపచేయాలా అని చింతించాను. నా చింతను గమనించిన శ్రీవేంకటేశ్వరుడు ఒక చక్కటి ఈ క్రింది లీలను చూపి నన్ను ఆనందింపచేశారు.

హబ్సిగూడ మెయిన్ రోడ్డు ఈమధ్యనే 150 అడుగుల వరకు విస్తరించారు. ఇప్పుడిప్పుడే బీటి రోడు వేస్తున్నారు. మరియు మా ఆఫీసు ఉన్న ప్రాంతములో కూడా చిన్న చిన్న దుకాణాలు కొన్ని ఉన్నవి.

తేది 16-09-2011 కల : నేను ఒక క్రొత్త ప్రాంతములో నివసిస్తున్నానట. అక్కడ సరియైన వసతులు లేవని నేననుకొంటున్నాను. అనుకోకుండా ఒకరోజు నేను ప్రక్క వీధిలోని ఒక నాలుగు ఇళ్ళ బయటకు వెళ్ళాను. అక్కడ మంచి మార్కెట్ ను చూచాను. షాపులున్నవి, ముఖ్యంగ బట్టల షాపులు, కొన్ని టైలరు షాపులు, కిరాణ షాపులు ఇలా నాకు కావలసిన వస్తువులు దొరుకునని భావించాను. ఇది నేను ఎప్పుడూ వెళ్ళే మార్గం కాకుండా క్రొత్తమార్గం. ముందు పొరబడ్డాను. కాని వీటిని చూచిన తరువాత నాకు ఈ ప్రాంతం సరిపోతుందని అనుకున్నాను.

ఆ తరువాత బయటికి వెళ్ళాను. నూతనంగా వేసిన ఒక రహదారిని చూచాను. ఇది చాల వెడల్పుగా 150 అడుగులు విశాలంగా ఉన్నది. పోవుటకు వచ్చుటకు రెండువైపులా విశాలమైన డాంబర్ రోడ్డును ఈమధ్యనే నిర్మించారు. క్రొత్తగా ఉంది. రోడ్డుకు ఒక వైపు చూచిన తరువాత రెండవ వైపు వెళ్ళాను. ఇంతలో ఆ వైపు రోడ్డు పైపొర ఒకటి పగిలి దానిలోపలి నుండి జుర్రుమని శబ్దము చేసుకుంటు వేడినీరు ప్రక్కకు చిమ్ముచున్నవి. ఆ నీటి ప్రెషర్ కు రోడు పైపొర కొంతవరకు పగిలి ఆ నీటిలో కొట్టుకుపోయింది. నీరు అతి వేగంగా, వెడల్పుగా ఆ ప్రాంతములో పారుచున్నవి. నేను ఫుట్ పాత్ పై నడుస్తూ ఈ నీటి శబ్దమును వింటూ ఆ దృశ్యమును చూశాను. కల చెదిరింది.

దీనర్థం – ఈ క్రొత్త ఆఫీసు భక్తులకు, నీకు సౌకర్యంగానే ఉంటుంది చింతించవలసిన అవసరము లేదని సూచించారు. నేను కూడ బహుశా నాకు వయస్సు మళ్ళిన తరువాత ఇబ్బంది కలుగకుండ ఇంటికి దగ్గరి ప్రాంతము ఇప్పించాడని బావించాను.

## స్థూపం నిండిందని చెప్పట

దాదాపు 9 సం॥ల తరువాత దసరా, బతుకమ్మ పండుగలకు నేను మా సొంత ఊరు, చిన్నగుండవెల్లికి తేది 04-10-2011 నాడు కుటుంబ సమేతంగా వెళ్ళాను. తేది 05-10-2011 నాడు బతుకమ్మ పండుగ, మరియు 06-10-2011 నాడు దసరా ఉన్నది. పీఠమును సం॥ 2002 దసరా నాడు స్థాపించాము కాబట్టి ప్రతి దసరా దాని జన్మదినం కాబట్టి, హైదరాబాద్ లోనే ఉండి ఆఫీసులో పూజ చేసేవాడిని. అందుకని ఇన్ని రోజులు దసరా నాడు ఊరికి వెళ్ళలేదు. ఈనాడు ఈ పూజను ఊరిలోనే చేస్తానని భావించి ఊరికి వెళ్ళాను. ఆ రాత్రి మా ఇంట్లో స్వామివారిని స్మరించి పడుకున్నాను. ఆయన తప్పక ఈరోజు నాకు కనబడునని కూడ భావించాను. అనుకున్నట్లే ఒక కల వచ్చింది.

**తేది 05-10-2011 కల :** ఈ కలలో నేను తిరుపతిలో

ఉన్నానట. శ్రీవేంకటేశ్వర దివ్యమహామంత్ర స్తూపం కనబడ్డది. అదృశ్యరూపములో ఉన్న ఒక వ్యక్తి స్తూపం ఎక్కి మొత్తం చూచాడు. తరువాత ఈ స్తూపం నిండింది. "స్తూపం నిండింది" అని నాకు స్పష్టంగ వినబడే విధంగ అరిచాడు. ఆ స్తూపం కూడ కనబడి మెరిసింది. కల చెదిరింది.

గత కృష్ణాష్టమి తేది 22-08-2011 నాడు, 9వ పర్యాయంగా 7 కోట్ల జపముచే స్తూపము పూర్తిగా నిండింది. అప్పుడు స్వామివారిని "స్తూపం నిండింది ఏమి చేయమంటారు? ఇంకా 7 సం॥లు 7 కోట్ల జపాన్ని ఎక్కడ సమర్పించమంటారని వేడుకున్నాను. మార్గం చూపమని ప్రార్థించాను. కాని ఎలాంటి సమాధానం ఇవ్వలేదు. ఈరోజు మాత్రం స్తూపం నిండిందని చెప్పారు. తరువాత ఏమి సందేశమిస్తారో చూడాలని అనుకున్నాను.

## మరచిన ప్రతిజ్ఞను తిరిగి చేయించుట

తిరుమల శ్రీవేంకటేశ్వరుడు నేను ఈ జీవితంలో తృప్తి చెందే వరకు తన సేవాభాగ్యాన్ని ప్రసాదిస్తానని మాట ఇచ్చారు. నేను కూడా మొదట్లో నా జన్మాంతము వరకు స్వామివారి సేవ చేయాలని, నా కారణంగా స్వామివారు నా జన్మాంతము స్మరింపబడుతూ ఉండాలని భావించాను. కాని 2002 లో ఎప్పుడైతే 16 సం॥ల సేవను, 2002 నుండి 2018 వరకు చేపట్టానో నా జన్మాంతము స్వామివారి సేవ చేయాలనే భావము చెదిరిపోయింది. ఈ 16 సం॥లు సేవ చేస్తే సరిపోతుంది అనే భావం బలపడింది. దీనిని గమనించిన తిరుమల శ్రీవేంకటేశ్వరుడు తన లీలల ద్వార తిరిగి నా జన్మాంతము వరకు సేవ చేయాలనే ప్రతిజ్ఞను మళ్ళీ చేయించారు. ఆ లీల ఈ విధంగా ఉన్నది.

తిరుపతిలో శ్రీవేంకటేశ్వర దివ్య మహామంత్ర స్తూపం నిండింది. ఇంకా 7 సం॥ల జపమును ఎక్కడ సమర్పించమందురని స్వామివారిని గత కొన్ని రోజుల నుండి ప్రార్థించినప్పటికి సమాధానము రాలేదు. కాబట్టి నాకు రోజు రోజుకు భయమేసింది. తేది 20-10-2011న మా ఆఫీసులో స్వామివారిని దీనంగ ప్రార్థించాను. ప్రభూ! తిరుపతిలో స్తూపం నిండింది, మరో స్తూపమును నాచే నిర్మింపచేయుమని ప్రార్థించాను. దీనికి ప్రతిగా నా జీవితాంతము మీ సేవ చేసుకుంటూ ఉంటానని స్వామివారికి మాట ఇచ్చాను. అంటే సం॥ 2018 వరకే కాక నా జీవితాంతము మీ సేవ కొనసాగిస్తానని, నన్ను నమ్ముమని ప్రతిజ్ఞ చేశాను. దీనికి సంతోషించిన స్వామివారు చక్కటి లీలను ఈ క్రింది విధంగ చూపారు.

**తేది 21-10-2011 కల :** ఈనాటి కలలో నేను నా మనుష్యులతో స్వామివారిని ఇంటింటికి తీసుకుపోవుచున్నాను. వారిచే పూజలు చేయించుటకు ప్రయత్నిస్తున్నాను. భక్తులు నా స్వామివారిని చూడాలని, వారికి ఆశీస్సులు లభించాలని ఉవ్విళ్ళూరుచున్నాను.

అది ఒక పెద్ద భవనము, దానికి పెద్ద పెద్ద వరండాలు ఉన్నవి. ఆ వరండాలకు ఒక వైపు ఉన్న పలు రూములలో ఎన్నో కుటుంబాలు నివసిస్తున్నాయి. నేను ఆ భవనము లోనికి పూజా దుస్తులు ధరించి నడుచుకుంటూ వెళ్ళాను. నా వెనుక నా వారు కొందరు స్వామివారిని పల్లకిలో తెస్తున్నారు. ఆ పల్లకిని ముందు నల్గురు వెనుక నల్గురు కలిసి మోస్తున్నారు.




మరిచిన ప్రతిజ్ఞను గుర్తు చేసి స్వామి సేవను చేయించుట

ఆ పల్లకికి మధ్యలో స్వామివారు, వారి రాణులతో ఒక చిన్న గోపురము లాంటి దానిలో ఉన్నారు. మరియు మంచి మంచి పీతాంబరం బట్టలు ఆ గోపురమునకు కట్టబడి ఉన్నవి. లోన స్వామివారు వారి సతీమణులతో ఉన్నారట (ఊహ). ఈ పల్లకీని నా వెనుకనే ఈ భవనములోనికి తీసుకవచ్చారు. ఆ వరండాలో ఉన్న ఆ ఇంటివారితో (తెలిసినవారు) స్వామివారు వచ్చారని

చెప్పాను. వారు అప్రమత్తమయ్యారు. మరియు వారి ఉత్సాహాన్ని చూచిన నేను వారితో, ఇంకా ఇదేమి మా రథమును చూచినచో ఇంకా బాగుండునని మీరు తబ్బుబ్బి అవుతారని అన్నాను. ఇలా ఆ భవనములో ఇంటింటికి, రూం రూంకి, స్వామివారిని తీసుకుపోయాము. వారినందరిని రమ్మని స్వామివారిని చూచి పూజించండని కోరాను. కల చెదిరింది. ఇలా మళ్ళీ నాలో స్వామి పట్ల సేవాభావాన్ని పెంపొందించి జీవితాంతం మీ సేవ చేస్తానని మాట ఇచ్చే విధంగ చేశాడు.

తరువాత రోజులలో స్తూపములోని జప పుస్తకములను తీసి, డైరీ ఫాంలోనే ఒక గోయి తీసి అందులో నిక్షేపించాము. తిరిగి ఈ స్తూపాన్ని యథావిధిగా వాడుకుంటున్నాము. నిజానికి ఈ స్తూప నిర్మాణమప్పుడే ఈ విధమైన ఏర్పాట్లు చేశాము కాని స్వామి లీల ప్రభావంగా మరచిపోయాను.

## త్రివిక్రమ రూపును విరమించుకొనుట

**తేది 29-10-2011 :** గత కొన్ని సంIIల నుండి స్వామివారిని ఎత్తైన వానిగా వారి త్రివిక్రమ రూపమును, 'బ్రహ్మ కడిగిన పాదము' అనే భంగిమను ఒక 10-15 అడుగుల ఎత్తులో తయారు చేసి హైదరాబాదులో అక్కడక్కడ అనువైన స్థలాలలో అప్పుడప్పుడు పెట్టి భక్తులకు దర్శన భాగ్యమును కల్పించాలని భావించాను. దీనిని నట్ బోల్ట్ సిస్టముగ తయారు చేసి అవసరమున్నప్పుడు ప్రదర్శించి మళ్ళీ విప్పుకు పోవు విధంగా చేయాలనుకున్నాను. కాని ఇది అంత సులభమైంది కాదని, దీనిని ఎక్కడైన పర్మనెంటుగా కట్టాలనే ఆలోచననే విరమించుకున్నాను. దీనిని ఈ రోజు స్వామివారితో విన్నవించాను. (హరినామ క్షేత్రములో ఒక ఉపాలయముగా దీనిని నిర్మించాలని ఈ భాగం వ్రాయునప్పుడు భావమేర్పడింది.)

## నా స్థితిని తెలుపుట – వైరాగ్య బీజం నాటుట

తిరుమల శ్రీవేంకటేశ్వరుడు గతంలో నన్ను ఉస్మానియా యూనివర్సిటీ ఇంజనీరింగు కళాశాలలో ఆధ్యాత్మికంగా ఎదుగుటకు మాస్టర్ డిగ్రీలో చేర్పించాడు. పైకి చూచుటకు అది ఇంజనీరింగు కళాశాల అయినప్పటికీ స్వామి ఉద్దేశ్యములో అందులో నేను ఆధ్యాత్మిక విద్యను అభ్యసించి పై మెట్టుకు చేరాలి. నన్ను నేను సులభంగా అర్థం చేసుకొనుటకు వీలుగా ఇలా చేశాడు. ఇది స్వామివారి సంకల్పం. కాని ఇంతవరకు నేను ఆధ్యాత్మికంగా ఎంతవరకు ఎదిగానో తెలియదు. అందుకు స్వామివారు కొన్ని పరీక్షలు పెట్టారు. ఈ క్రింద తెలుపు రెండు లీలలు నా స్థితిని తెలుసుకొనుటకని భావించాను.


**తేది 30-11-2011 కల :** ఈ లీలలో బహుశా నేను ఒక ఇంజనీరింగు కళాశాల లాంటి సంస్థను స్థాపించుటకు సన్నాహాలు చేసుకొంటున్నాను. దీనికి యూనివర్సిటీ వారు తగిన పర్మిషన్ ఇవ్వాలి కాబట్టి అప్లై చేశానట. ఆ యూనివర్సిటీ వారు నేను తగిన వాణ్ణేనా? అని నిర్ణయించుటకు ఒక పరీక్ష పెట్టారు. ఇలా నాలాగా అప్లై చేసిన వారినందరిని పిలిచి ఇంటర్వ్యూ తీసుకుంటారట. ఇలా అప్లై చేసిన వారందరూ ఒకరోజు చిన్నగుండవెల్లిలోని మా ఇంటిలో సమావేశమైనాము. వారికి నేను మా సంస్థ గురించి చెప్పాను. అందరము కలిసి కొన్ని విషయాలు మాట్లాడుకున్నాము. ఆ తరువాత మేమందరము ఉస్మానియా యూనివర్సిటీ లోని ఒక భవనములోనికి ఈ ఇంటర్వ్యూ కోసమై వచ్చాము. చాల మంది ఉండుట మూలాన పోలీసువారు కూడా వచ్చారు. అందరినీ బయటకు పంపారు. నన్ను మాత్రము పోలీసువారు మొదట ఇంటర్వ్యూకై ఒక గదిలోనికి పంపారు. అక్కడ ఇంటర్వ్యూ తీసుకునేవారు ముగ్గురు ఉన్నారు. అందరూ నాకు తెలిసినవారే, ఒకరు నా చిన్నప్పుడు మా ఊరిలో చదువు చెప్పిన శ్రీరాములు టీచరు. ఈయన నాకు 1,2,3 తరగతులలో బోధించారు, చాల నల్లగా ఎత్తుగా, మొటిమలు కలిగిన ముఖముతో ఉన్నాడు. మరొకాయన ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంIIము విద్య నేర్పిన వారు, ప్రస్తుతము నా నైబర్ శ్రీమాన్ జగన్నాథ్ జెట్టి గారు. మూడవ వారు డాII మురళీ కృష్ణ, స్ట్రక్చరల్ ఇంజనీరింగ్ గురువుగారు. నాతో వారు చాలా సన్నిహితంగానే ఉన్నారు. అందులో ఎవ్వరో ఒక ప్రశ్న అడిగారు. రూంలో ఉన్నావు, తలుపులు మూసి యున్నవి అప్పుడు బయటివారు అవసరమున్నప్పుడు ఏం చేస్తావని అడిగారు. నేను బెల్ కొట్టెదనన్నాను. శ్రీరాములుగారు ఇంగ్లీషులో చెప్పాలన్నాడు. ఐ ప్రెస్ ద బెల్ బటన్ అని అన్నాను. శ్రీ జెట్టి గారు కల్పించుకుని ఇంగ్లీషు అవసరము లేదన్నారు. బయట ప్రపంచ బ్యాంకు లోన్ ఇచ్చినప్పుడు ఇంగ్లీషు అవసరమన్నారు. మూడవవారు తెలుగులో పేపరుపై ఏదో వ్రాస్తున్నారు. కల చెదిరింది.

మొత్తం మీద ఇది నా యోగ్యతను పరీక్షించేది. ఇందులో నెగ్గానా లేదా అనే విషయం తెలియదు. ఇంతకంటే కఠినమైన మరో పరీక్ష పెట్టాడు. నన్ను పైలోకము తీసుకెళ్ళి, ఒక ప్రక్క వేదాలను ఛేదించుమన్నారు. మరోప్రక్క ఈ జీవితము యొక్క లీలను, అంటే ఈ మనుష్యులు భూమిపైకి వస్తూ పోతుండుట సహజము. మమకారాలు, నా అన్నది విడిచి జీవించుట ఉత్తమమని భావించేలా చేశాడు. ఈ అద్భుతమైన లీల ఈవిధంగా ఉంది.

**తేది 17-12-2011 కల :** నేను ఈ భూమండలమును వదిలి వేరే ఒక గ్రహమునకు తీసుకుపోబడ్డాను. నేను వెళ్ళిన గ్రహము కూడా భూమిలాగా తన చుట్టూ తాను తిరుగుచూ, ఒక కక్ష్యలో తిరుగుచున్నది. నేను ఆ గ్రహముపై ఒక అందమైన, అతి సుందరమైన సభా మండపమును చూచాను. దీనిలో

ఎంతో విలాసవంతమైన కుర్చీలు, సోఫాలు రకరకాల వస్తువులు అన్నీ బంగారముతో చేసినట్లు ఉన్నవి. ఈ హాలు చాలా విశాలంగా అత్యంత మనోహరంగా ఉన్నది. నన్ను మా ఇంజనీరింగు కళాశాలలోని గురువైన కీ.శే ప్రొ.బద్రుద్దీన్ గారు అక్కడికి తీసుకువెళ్ళారట (ఈయన 2007 లో చనిపోయారు). అక్కడ ముస్లిం ఛాందసవాదులు, తీవ్రవాదుల రూపంలో కొందరు ఉన్నారు. నా ప్రక్కన బిన్ లాడెన్ లాంటి రూపము, గడ్డం కలిగిన ఒక వ్యక్తి ఉన్నాడు. ఆయన నాకు ఏదో ఒక ప్లాన్ ఇచ్చి, దానిని ఛేదించమని కోరాడు. ఆ ప్లాన్ లో మన వేదాలలోని రహస్యాలు ఉన్నవట. దీనిని ఛేదించుటకు ఈ బద్రుద్దీన్ నన్ను అక్కడికి తీసుకువెళ్ళారట. దీనిని చూచిన నేను ఓహో! శ్రీవేంకటేశ్వరుడు నాచే 'శ్రీవేంకటేశం' మాసపత్రికను స్థాపింపచేసి ఇన్ని రోజులు నడిపించింది ఇందులకా? అని ప్రశ్నించుకున్నాను. మరియు నేను మా ఇంటిని, కుటుంబాన్ని వదిలి పరలోకానికి వచ్చాను, అందుకు నా వారు ఎంత ఏడుస్తున్నారో? ఏమి చేస్తున్నారో అనే బాధ కలిగింది. మరు క్షణములోనే ఇది అంతా మామూలే, మనుష్యులు వస్తారు, పోతారు. అందరిలాగే మావారు కొద్దిరోజులు బాధపడి సర్దుకుంటారు అని నిభాయించుకున్నాను. నన్ను నేను పూర్తిగా సంబాళించుకున్నాను. ప్రేమను, మమకారమును చంపుకున్నాను. ఇలా జరిగేది లోక వ్యవహారము, నా స్వామివారి లీల అని అనుకున్నాను. అంటే 'నా', నాది, నావారు అన్నది కొద్దిగా వదులుకున్నాను. లోక వ్యవహారము గురించి కొంత బోధపడింది. కల చెదిరింది.

దీనర్థం – శ్రీవేంకటేశ్వరుడు ఈ లోక వ్యవహారము గురించి కొంత తెలిపాడు. ఏదీ, ఎవ్వరూ మనవారు కారు. కేవలం భగవంతుడే శాశ్వతుడు. ఆయన పైననే మమకారము కలిగి ఉండాలి తప్ప ఇతరములైన దేనియందు మనస్సు పెట్టరాదని సూచించాడు. శ్రీవేంకటేశం పత్రికలో ప్రచురించు, వ్యాసాల అంతరార్థములను చక్కగా తెలుసుకొమ్మన్నాడు. సేవ చేస్తూ, యోగ్యత సాధించుమన్నాడు. ముఖ్యంగా ఈ లీలతో నాలో అన్నింటిపైనా, అందరిపైనా మమకారమును త్రుంచి వేయుటకు వైరాగ్య బీజం నాటాడు. దీనిని అవసరమున్నప్పుడు మొలకెత్తిస్తాడు.




వేదాల రహస్యాలు తెలుపుమనుట

ఈవిధంగా నాకు రెండు లీలలను ప్రసాదించి నా స్థితిని పరీక్షించాడు. సేవ చేస్తున్నాను కాని సారాన్ని గ్రహించుట లేదన్నది ఈ రెండు లీలల నిజమైన అర్థం అని భావించాను.

## సురేఖకు మధుర స్మృతులను ప్రసాదించుట

ఇక మరో విషయంలో స్వామివారు నా భార్య సురేఖను ఎంతో ఆనందపరిచాడు. ఆమె ఆనందానికి హద్దులు లేవు. ఈ కలను పొందినందు కంటే కూడా స్వామివారు తన ప్రార్థనను విని కరుణించారని మురిసింది. తనకు స్వామి అత్యంత సన్నిహితుడనే నమ్మకము ఆమెలో దృఢపడింది. ఆ లీల ఈ విధంగా ఉంది.

గత కొన్ని రోజుల నుండి మా ఇంటిలో ఆర్థిక సమస్యలు చిరాకు పెట్టుచూ బాధ కలిగిస్తున్నవి. ఏ పని చేసినా సరైన ఆనందము కలుగుటలేదు. పైగా మా పెద్ద కొడుకు చి|| వేదాంత్, ఈ మధ్యన చాలా దురుసుగ ప్రవర్తిస్తున్నాడు. మన మాట వినకుండా తన వాదనే వినిపిస్తూ, ఒక మొండి ఘటంలా తయారౌతున్నాడు. దీనితో, తల్లియైన సురేఖ చాలా చిరాకుతో, బాధాతప్త హృదయముతో, చాలా రోజుల నుండి విచారంగా జీవనము సాగిస్తోంది. ఈమె పోస్టుగ్రాడ్యుయేట్ చేసినప్పటికీ పిల్లల పెంపకము గురించి ఉద్యోగము చేయలేదు కావున ఈ బాధ మరింత ఎక్కువైనది. చాల రోజుల నుండి బాధతో ఉన్నది కావున తనకు ఒక్కసారి సుఖము కావాలని కోరిక కలిగింది. కానీ మేము జీవిస్తున్న పరిస్థితులలో ఈ సుఖమును పొందుట అనివార్యము.

కావున తన ప్రభువైన శ్రీవేంకటేశ్వరుణ్ణి సుఖము ఇవ్వమని ప్రార్థించింది. ఈరోజు ఉదయము నుండి అలసిన సురేఖ రాత్రి పడుకోబోయే ముందు, స్వామివారిని తనివితీరా ప్రార్థించింది. స్వామీ! నాకు సుఖాన్ని ప్రసాదించండి! నా జీవితంలో సుఖాలను, సంతోషాలను చూడాలని కోరిక ఉంది, తీర్చండి ప్రభూ! అంటు దీనావస్థలో ప్రార్థించి పడుకుంది. స్వామివారు కరుణించి ఆనందాన్ని ఈవిధంగా ప్రసాదించారు.

**తేది 28-12-2011 కల :** ఈ కలలో ఒక మనిషి తన జీవితంలో పొందే మధుర క్షణములను, మరపురాని, నెమరు వేసుకోగలిగే అంశములను, క్రమబద్ధంగా, ఒక ఘట్టం తరువాత మరొకదానిని చూపి ఆనందపరచాడు. తేది 04-03-1990 రోజున నాకు, సురేఖకు హైదరాబాదులో పెండ్లి జరిగింది. అప్పుడు నాకు హైదరాబాదులో ఇల్లు లేదు. మా ఊరిలోనే ఉండేవారిమి. మా పెండ్లి ఉదయం 8 గం॥కు హైదరాబాదులో జరిగింది. ఆ రోజు సాయంత్రం 5 గంటల ప్రాంతమున మేము చిన్నగుండవెల్లికి కారులో ప్రయాణమై పోయాము. స్వామివారు చూపెట్టే కలలో మా పెండ్లైన సాయంత్రం కారులో ఊరికి పోవుట నుండి మొదలు మొత్తం పెండ్లైన మొదటి నెలలోని ప్రతి ఆనందకర సంఘటనలను చూపారు. క్రికెట్ మ్యాచ్ తరువాత దాని హైలైట్స్ ను ఏవిధంగా చూపుదురో అదేవిధంగా మా పెండ్లైన రోజు నుండి మొదలు, ఇంటికి ప్రయాణము, ఆ ప్రయాణములో మాట్లాడిన మాటలు, ఊరికి చేరుట, ఎదురుకోళ్ళు, ఇంట్లో పెళ్ళి సందడి, మా ఇంటిలోనికి మొదటి అడుగు పెట్టుట, చుట్టాలతో ఇల్లు కళకళ లాడుట, చూపెట్టాడు. మరునాడు నేను ఆమెను స్కూటర్ పై తీసుకెళ్ళి మా తోటబావిని చూపుట, అక్కడి అడవిలోని చెట్లు, గుట్టలు చూచుట, అక్కడ మాట్లాడిన మాటలు, తిరిగి ఇంటికి వచ్చుట ఆ తరువాత హైదరాబాద్ వచ్చుట ఉన్నదున్నట్లు చూపెట్టాడు. ఆ తరువాత మేము బెంగళూరు, కొడైకెనాల్ మొదలైన ప్రాంతాలకు హనీమూన్ నిమిత్తమై వెళ్ళుట, అక్కడి ఆనందకర సంఘటనలు, ఆ యాత్రలో తోటి జంటలతో మాట్లాడిన విషయాలు, అక్కడి వాతావరణములో విహరించుట, మాట్లాడిన మాటలు ఇలా మనస్సుకు ఆనందాన్ని కలిగించే ప్రతి సంఘటనను, పెండ్లి మొదలు ఒక మాసము వరకు జరిగిన ఆనంద దాయక ఘటనలను వరుసక్రమములో చూపెట్టాడు. చిత్రమేమిటంటే సురేఖ ఆ క్షణములో అదే వయస్సులో ఉండి స్వయంగ మళ్ళీ అనుభవించుచున్నట్లు, ఆనందపడుతున్నట్లు కల కన్నది. ఈ కలను పొందిన తరువాత సురేఖ చాల సంతోషించింది. స్వామి మధుర స్మృతులను కలిగించాడని మురిసిపోయింది. ముఖ్యంగా స్వామివారు తన ప్రార్థనను విని తన మొరను ఆలకించాడని అంతకంటే ముఖ్యంగా తన ప్రభు, తనకు అతి దగ్గరగా ఉన్నాడని, తనను సర్వవేళల ప్రతి సమస్య నుండి ఆదుకుంటాడనే ఆత్మ విశ్వాసం ఏర్పడింది. ఈ విధంగ సురేఖను స్వామివారు ఆనందపరచారు.

## మొదటి భజగోవిందం

గత 10 సంవత్సరాల నుండి నేను స్వామివారి సేవ చేస్తున్నప్పటికీ అది లిమిటెడ్ గానే ఉన్నది. కాని ఇప్పుడు సంఘము లోనికి చొచ్చుకుపోయే పరిస్థితులు ఏర్పడ్డవి. గతంలో శ్రీమాన్ కె.వి. రమణాచారి గారు, టిటిడి ఈ.ఓగా ఉన్నప్పుడు వారిని పరిచయము చేసి ప్రతి వైకుంఠ, తొలి ఏకాదశి రోజులలో 'భజగోవిందం' నిర్వహించునట్లు ఒప్పించారు. ఇప్పుడు మొదటిసారి శ్రీమాన్ రమణాచారి గారు ముందుండి నాచే భజగోవిందంను అత్యంత గొప్పగా హైదరాబాదు లోని లలిత కళాతోరణంలో వేలమంది భక్తులసమక్షములో నిర్వహింపచేశారు. ఇది నాలో ఎంతో పరివర్తన కలిగించింది. నా స్వామి నామస్మరణ ఇంతమందిచే, శ్రావ్యంగా జరిపించుట నన్ను పరవశింప చేసింది. శరీరం పులకరించి ఆనంద బాష్పాలు రాలాయి. దీనిని నా భాగ్యంగా భావించి ప్రతి తొలి, వైకుంఠ ఏకాదశి రోజులలో తప్పక నిర్వహిస్తానని దృఢ నిర్ణయము తీసుకున్నాను.

తేది 05-01-2012 నాడు వైకుంఠ ఏకాదశి. టి.టి.డి వారి సహకారముతో తెలుగు లలిత కళాతోరణంలో సాయంత్రం 'భజగోవిందం' సామూహిక హరి భజనను నిర్వహించాం. పుష్పగిరి పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ విద్యా నృసింహ భారతీ స్వామివారు, శ్రీశ్రీశ్రీ శ్రీనివాస వ్రతధర్ నారాయణ రామానుజ జీయరు స్వామివారు, డా॥ రమణాచారి, దేవాదాయ శాఖ వారు ఎన్నో భజన బృందాలు పాల్గొన్నవి. ముఖ్యంగ డా॥ రమాప్రభ బృందం వారు ఈ భజగోవిందంను శ్రావ్యంగా ఆలపించారు. ఈ భజనలో పాల్గొన్న ప్రతి భక్తుణ్ణి అనుగ్రహించమని స్వామివారిని ప్రార్థించాను. దీనిని ప్రతి తొలి ఏకాదశి మరియు వైకుంఠ ఏకాదశి పర్వదినాలలో ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నాను.

## శ్రీమాన్ కె.వి.రమణాచారి గారిని తోడుగా ఇచ్చుట

దాదాపు తేది 10-01-2012 ప్రాంతమున ఒక కల కన్నాను. అందులో డా॥ కె.వి. రమణాచారి గారు కనబడి నీవు ఆధ్యాత్మిక ఫంక్షన్స్ పెట్టినప్పుడు నీకు నేను తోడుగా ఉంటానని, మార్గదర్శనం చేస్తానని చెప్పారు. దీనర్థం – శ్రీమాన్ రమణాచారి గారి రూపంలో శ్రీవేంకటేశ్వరుడు నాకు సభలు నిర్వహించుటకు సహాయము చేస్తాడని భావించాను. ఆ లీల ఈవిధంగా ఉన్నది.

**తేది 10-01-2012 కల :** ఈ కలలో నేను ఏదో ఒక ఆధ్యాత్మిక పంక్షన్ చేయాలని భావించి, స్టేజి వద్ద ఏర్పాట్లు చేస్తున్న వారితో "ఇలా కాదు ఇలా" అంటూ చెప్పుటకు ప్రయత్నించాను.

ఇంతలో నా వెనుక నన్ను డా॥ రమణాచారి గారు నన్ను చప్పట్లతో పిలిచి, ఇలా... చేయాలని, నీకు నేను అన్నివిధాల సన్నిహితంగా, చేదోడు వాదోడుగా ఉంటాననే భావనచే నాకు ఏదో చెప్పారు. నాకు మార్గదర్శనము చేశారు. ఇంతే కల. దీనర్థం స్వామివారు నాకు వెన్నంటి ఉన్నారనే విషయాన్ని గ్రహించాను.

## స్వామి భక్తిని, సంకీర్తనలను విస్తృతపరచుట

ఈ మధ్యన మరో కల కన్నాను. ఇందులో తిరునామం ధరించిన భక్తులు ఊరేగింపు చేస్తున్నారు.

**తేది 14-01-2012 కల :** ఈ కలలో నేను సాంప్రదాయ దుస్తులు ధరించిన వైష్ణవ భక్తుల ఊరేగింపును చూచాను. నా ముందు వందల మంది భక్తులు ప్లకార్డ్స్ పట్టుకొని ఊరేగింపు చేస్తున్నారు. నేను వెనుక నడుస్తున్నాను. బహుశా నేను నిర్వాహకులలో ఒకడిని. నా ముందున్న వారిలో ఒకరిని పిలిచి నా చేతి వ్రేళ్ళను నుదిటిపై పెట్టి రెండు వ్రేళ్ళతో V ఆకారాన్ని చూపాను. ఇంతలో నా ముందు వెళ్ళేవారు వారి ప్లకార్డ్స్ ను నాకు త్రిప్పి చూపారు. దానిపై ‘V’ గా వ్రాసి (తిరునామం) ఉన్నది. ‘V’ ఆకారము తెలుపు రంగుతోను, మధ్యన ఉన్న ‘l’ నామము ఎర్ర రంగుతోను వ్రాసి తిరు నామము లాగా ఉన్నది. ఈ తిరునామము నాకు చాలా క్లోజప్ లో క్లియర్ గ కనబడ్డది. ఆ తరువాత ఆ వ్యక్తి తన ప్లకార్డ్స్ ను తిరిగి మంచిగా పట్టుకొని జై జై నినాదాలు చేస్తూ పోయారు. కల చెదిరింది.

దీనర్థం – బహుశా ఇప్పటినుండి నేను స్వామివారి సేవను విస్తృత పరచాలని సూచించారని భావించాను.

అంటే నేను భక్తులకు మార్గదర్శనము చేస్తూ, భక్తిని పెంపొందించాలని, విస్తృత పరచాలని నా మనస్సులోని భావమును స్వామివారు సూచించారు.

## స్వామివారిని విశ్వసించలేదని సూచించుట

తేది 03-02-2012 భీష్మ ఏకాదశి. ఈరోజు ఉదయం 6 గంటల ప్రాంతమున ఒక కల కన్నాను. అందులో నా పెండ్లి కాని రోజులలో 1987-90 ప్రాంతమున హైదరాబాద్ లో ఒక పెద్ద గదిలో నివసించేది, కాని దీనికి మధ్యలో ఉడెన్ పార్టిషన్ ఉండుట వలన రెండు రూములుగా ఉండేది. మరియు ఈ గదికి వెనకాల కూడ మరో డోర్ బయటకు పోవుటకు వీలుగ ఉండేది. ఈ కలలో ఆ ఇల్లు కనబడ్డది.

**తేది 03-02-2012 కల :** నేను నివసించే ఇల్లు రెండు రూములే! మొదటిరూములో కూర్చున్నాను. ఏడెనిమిది అడుగుల పొడవుతో చాలా లావుగా ఉన్న ఒక పాము, ముందు ద్వారము నుండి నెమ్మదిగా లోనికి ప్రవేశించి వెనుక రూం లోనికి వెళ్ళి, మధ్యన ఉన్న ఉడెన్ పార్టిషన్ ప్రక్కన పడుకున్నది. నేను భయపడి ఎలాగో ధైర్యం చేసి మెల్లగా వెనుక రూం నుండి, దాని డోర్ గుండా బయటకు వెళ్ళాలని భావించి లోనికి వచ్చి ద్వారం వైపు పోయాను. అప్పుడు ఆ పాము ఏమీ అనక ప్రక్కన పడుకొని ఉంది. నా భయం తీరింది. ఇంతే కల.

ఈ కల అర్థం అత్యంత విశ్లేషణాత్మకంగా ఉన్నది. పాము అంటే శ్రీవేంకటేశ్వరునిగా భావించమని గత ఎన్నో లీలలలో స్వామివారు చెప్పారు. ఇక్కడ పాము ఇంటిలోనికి వచ్చేసరికి నేను భయపడిపోయాను. అది ఏమీ చేయలేదు కాని భయపడి తప్పించుకున్నాను. దీనర్థం శ్రీవేంకటేశ్వరుడు మా భాగ్యవశాత్తు మా ఇంటిలో ప్రవేశించి నన్ను నేను సంస్కరించుకుని తన సంకల్పం నెరవేర్చుమన్నాడు. కాని నేను మాత్రం నా వ్యాపారము మరియు లౌకిక విషయాల పట్ల మక్కువచే స్వామి ఆదేశములకు బెదిరి పాటించలేదు. ఈ నిజమైన అర్థము ఈ భాగం వ్రాస్తున్నప్పుడు మాత్రమే గ్రహించాను.

## పరివర్తన దశ

నేను కేవలము స్వామివారి ఋణం తీర్చుకొనుటకు సేవ చేస్తున్నాను తప్ప నాలో మరో కోరిక లేదు. చివరికి మోక్షాన్ని పొందాలనే కోరిక కూడ లేదు. మరో నాలుగు జన్మలు మానవునిగా జన్మించి ఋణం తీర్చుకోవాలన్నదే నా ప్రధాన ధ్యేయం. నా మియాపూర్ భూ వివాదములో కూడ, ఒక భక్తునిగా రక్షించమని వేడుకున్నానే తప్ప సేవకు ప్రతిగ రక్షించమనలేదు. ఈ సేవ మొత్తం మీ ఋణం తీర్చుకొనుటకు కేటాయించబడ్డదని భావించాను. కాని స్వామివారు మాత్రం నేను భూమిపైన జీవించి ఉండగానే వారి సాక్షాత్కారాన్ని పొందే యోగ్యత సాధించాలనే లక్ష్యంతో ఉన్నట్లు తెలుస్తుంది. అందుకే ‘శ్రీవేంకటేశం’ మాసపత్రికను ప్రసాదించి, పురాణాలలోని సారాన్ని గ్రహిస్తూ, వికారాలను తొలగించుకుని సంస్కరించుకొమ్మన్నారు.

భగవంతుని సేవ మోక్షాన్ని ప్రసాదించవచ్చు, కాని స్వామివారి సాక్షాత్కారాన్ని కాదని తెలుస్తుంది. దీనికి యోగ్యత సాధించవలసి ఉంటుంది. ఈ సాక్షాత్కారాన్ని నేరుగా భగవంతుడే ప్రసాదించవచ్చు కదా... అంటే! ఈ లోకంలో విధి విధానాలు అలా ఉన్నవి. నేరుగా అన్నాన్ని ప్రసాదించవచ్చు. కాని దుక్కి దున్ని, పైరు వేసి, సంరక్షించి, కోసి, బియ్యము తీసి వండినప్పుడే అన్నం తయారగునట్లు సాక్షాత్కారానికి జీవుడు స్వయంగా కృషి చేయవలసి ఉన్నది. పూర్వము స్వామివారు ఇస్తానన్న బహుమానం బహుశా వారి సాక్షాత్కారము అయి ఉండవచ్చునని ఒక పర్యాయం భావించినప్పటికీ, ‘నా’ అన్నది నశింపచేసుకుని ‘యోగ్యత’ సాధించుట నా వల్ల కాదు, నేను

అల్పుణ్ణి, శక్తిలేని వాణ్ణిగా భావించి విరమించుకున్నాను. మరియు స్వామివారి ప్రత్యేక అనుగ్రహం ఉంటే తప్ప ఇది సాధ్యము కాదని కూడా గట్టిగా నమ్మి ఏప్రిల్ 2008 లోనే దీని గురించి పూర్తిగా మరచిపోయాను. ఒక చిన్నపిల్లవాణ్ణి చాక్లెట్ ఆశతో పిలిచి వానిచే అన్ని పనులు చేయించుకున్నట్లు నాచే స్వామివారు రకరకాల పనులు చేయించుకుంటున్నారని ఎన్నోసార్లు భావించాను.

ఈ భావాన్ని గమనించిన స్వామివారు నన్ను మార్చుటకు చాలా కష్టపడ్డారు. నన్ను వారు సేవకుడితో పాటు సాధకుడిగా ఉండాలని భావించారు. భగవంతుని సాధనలో జీవుని మనస్సు ఆయనపై తప్ప మరెక్కడికీ పోరాదు. సాధనకు ఏకాంతము, దృఢసంకల్పము అత్యవసరము. దీనిని సాధించుటకు ఎన్నో విషయాలు తెలిపారు. అందులో ముఖ్యమైనవి 1) ఇల్లు, ఆఫీసు తప్ప మరెక్కడికీ వెళ్ళవద్దని, అవసరముంటే తప్ప ఇతరులతో మాట్లాడవద్దన్నారు. అన్య మతస్థుల మధ్యన నివసించు హరిదాసు జీవితము గడపమన్నారు. 2) వ్యాపారములో రాణించలేదని చింతించకు, నీవు భవిష్యత్తులో స్వామివారి స్థిరనివాసం కోసం "పద్మపీఠం"ను తయారు చేస్తున్నావని చెప్పారు. 3) నన్ను ఆర్థికంగా దిగజార్చి తన దారిలోకి తెచ్చుకున్నందుకు ఎగిరి గంతేశారు. 4) నన్ను తన ఆంతరంగిక సేవకుడని చెప్పారు. 5) చివరికి వ్యాపారం మానివేయమని కఠినంగా చెప్పారు. నా ఆర్థిక బాధ్యతలు తనే చూచుకుందునన్నారు. 6) నాకు జన్మ జన్మల సేవను ప్రసాదించారు. 7) మా అమ్మకు వైకుంఠాన్ని ప్రసాదించినట్లు నిదర్శనాలు చూపారు. 8) లౌకిక వ్యామోహాన్ని దూరం చేసుకొమ్మన్నారు. రకరకాల రుగ్మతలను ప్రసాదించి మార్చుటకు ప్రయత్నించారు. 9) చివరికి స్వర్గం నుండి మా తండ్రి గారిని పంపి, 'హరినామ క్షేత్రం' ఏర్పాటు చేయమని చెప్పించారు. మా తండ్రి ఋణం తీర్చుకునే అవకాశం కల్పించారు. ఇలా లౌకిక వ్యామోహంతో ఉన్న నేను స్వామివారి అసలు లక్ష్యం తెలుసుకోక పొరపాటు చేశాను. కాని సం॥ 2015 నుండి 2018 వరకు నాలో స్వామివారిని పొందాలనే ఆశ చిగురించింది. ఇతర విషయాల పట్ల శ్రద్ధ పెట్టకుండా స్వామివారిని తీవ్రంగా స్మరించుట అలవాటు చేసుకున్నాను. దీనితో చెవుడు, మతిమరుపుతనం వచ్చిందనే స్థితికి చేరాను. 'హరినామ క్షేత్రం' స్థాపన కోసం కూడా చాలా కష్టపడ్డాను. కాని యోగ్యతే ప్రధానంగా ఉన్న ఈ సేవలో ఒక్క అడుగు ముందుకు వేయలేకపోయాను. చివరికి 2020 సంవత్సరంలో స్వామి ఆజ్ఞచే నా అనుభూతులను పూర్తిగా చదివినప్పుడు సంకల్పములో ఓడిపోయానని తెలుసుకుని చాలా దుఃఖించాను. అప్పుడు నేను పొందిన మానసిక క్షోభ అంతా ఇంతా కాదు. కాని దయామయుడైన స్వామివారు "శ్రీనివాస కళ్యాణాలు" అనే మరో సంకల్పమిచ్చి దీనిలోనైనా విజయం సాధించుమన్నారు.

ఈవిధంగా 2012 నుండి 2020 వరకు నా జీవితము పరివర్తన ఘట్టాన్ని చూచింది.

**నా దశ :** జీవితములో స్వామివారు నన్ను మరో దిశకు మార్చారు. భరతుని భక్తి బీజాన్ని నాటారు. మా తోట బావి వద్ద వైష్ణవ ఆలయం ఉండునని సూచించారు. సంకల్పంలో ఒక భాగం పూరించుట, నా స్థితిని తెలిపి మరింత ఎక్కువ విశ్వసించి స్వామి సేవ చేయమనుట.

**భాగవత ఆశీర్వాదము :** తిరుమల శ్రీవేంకటేశ్వరుని ఆజ్ఞచే కేవలము మీ యొక్క ఆశీర్వాదము పొందుటకని, మరియు స్వామి సంకల్పములో మిమ్మల్ని కనీసం ఆశీర్వాద రూపకంగా నైనా భాగస్వాములుగ చేయుటకు ఈ లీలలను ప్రచురిస్తున్నాము. కావున ఈ లీలలను చదివిన ప్రతి భక్తుడు వయస్సు, లింగ భేదం లేకుండా స్వామి వారిని స్మరించి సంకల్పం నెరవేరాలని ప్రార్థిస్తూ ఆశీర్వదించగలరని ప్రార్థన.


శ్రీవేంకటేశ్వర పాదసేవకుడు
గోవిందదాసు (పుల్లగూర్ల సాయిరెడ్డి)
ఇ.నెం.1-1-53, వీధి నెం.1. హబ్సీగూడ,
హైదరాబాద్. ఫోన్: 040-27175050



తిరుమల శ్రీ వేంకటేశ్వరుని
దిశానిర్దేశము




స్వామివారి 700 దివ్యలీలలు
మొదటి సంపుటము
తెలుగు మరియు ఇంగ్లీష్ భాషలలో లభించును.
12 భాగాలు కల
పుస్తకము ధర : 250/-
ప్రచురణ: శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం
గోవింద దాసు (పుల్లగూర్ల సాయిరెడ్డి)
ఇ.నెం. 1-1-53, వీధి నెం. 1, హబ్సీగూడ, హైదరాబాద్ - 500 007.
ఫోన్: 040-27175050 (10.00 am to 6.30pm)
website: srivenkatesham.org, mail: srivenkatesham@gmil.com
పై అడ్రస్ నుండి పుస్తకమును పొందవచ్చును. లేదా... పోస్టు / కొరియర్ ద్వారా పొందగోరువారు పుస్తకము ధరతో పాటు రూ. 50/- రిజిస్టర్ పోస్టు / కొరియర్ కొరకు కలిపి మొత్తం రూ. 300/- ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం ద్వారా 93482 12354 నంబర్‌కు పంపగలరు.
మరియు మీ అడ్రస్‌ను ఇదే నంబర్‌కు వాట్సప్ / మెసేజ్ ద్వారా పంపి పొందవచ్చును.
శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం, హైదరాబాద్

తిరుమల శ్రీ వేంకటేశ్వరునికి కోట్ల జపములో భాగముగా

# 23వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ

## శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర లిఖిత జపము



ఈ సంవత్సరము తిరుమల శ్రీవారికి సమర్పించబోయే 7 కోట్ల జపములో భాగస్వాములు కండి! ఆ స్వామి కరుణా కటాక్షములకు పాత్రులు కండి!!

మీ మీ కోరికలను తీర్చమని తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని ప్రార్థించే భాగ్యాన్ని మాకు ప్రసాదించండి!!

### సంకల్పం

శ్రీ వేంకటేశ్వరుని కరుణా కటాక్షములకు, స్వామివారి అనుగ్రహానికి అందరూ పాత్రులు కావలెననే ఉద్దేశ్యంతో ఆయన నామస్మరణలోని మాధుర్యాన్ని అందరూ అనుభవించాలనే ఆకాంక్షతో.. ప్రతి భక్తునిచే 1,008 సార్లకు తక్కువ కాకుండా 7 కోట్ల జపమును వ్రాయించి ఒక పవిత్రమైన రోజున తిరుపతిలో, కొండపై ఇట్టి జపమును శ్రీవారి పాదముల చెంత పెట్టి, నివేదించి, ఎస్.వి. డైరీ ఫాం ఆవరణలో జపహోమాదులు నిర్వహించి 'శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపం'లో స్వామివారికి సమర్పించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం చేపట్టబడింది.

### నిబంధనలు:

1. ఈ మహామంత్రాన్ని వ్రాయుటకు ముందు మీ మనస్సులోని కోరికలను శ్రీవారికి నివేదించి, మనసారా ధ్యానిస్తూ, నోరారా పలుకుతూ వ్రాయండి. మననం, స్మరణం స్వామివారికి ప్రియం.
2. ఈ మంత్రమును కుల మత భేదం లేకుండా అందరూ వ్రాయవచ్చును. మన ఆచారవ్యవహారాల ప్రకారం అర్హత లేని సమయములో వ్రాయకూడదు.
3. ఈ మంత్రమును మీ మీ సొంత పేపర్లపై వ్రాయండి లేదా మానుంచి స్వామివారి దివ్యమహామంత్ర లిఖిత జప పుస్తకమును పొంది వ్రాయండి. పుస్తకమును పోస్టు ద్వారా కోరువారు పోస్టు ఖర్చుల నిమిత్తం రూ. 5/– ఎం.ఓ (ఒక్కంటికి) పంపినచో మేము మీకు జప పుస్తకాన్ని పంపగలము. (రూ. 10/–కి తక్కువ కాకుండా పంపండి). 9348212354 నంబర్‌కు ఫోన్‌పే, పేటిఎం, గూగుల్‌పే ద్వారా డబ్బులు, అడ్రస్ పంపి జప పుస్తకమును పొందవచ్చును.
4. మీరు ఈ మంత్రమును 45 రోజులలో వ్రాసి 'శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం' ఇం.నెం. 1–1–53, వీధి నెం. 1, హబ్సీగూడ, హైదరాబాద్ – 500007 చిరునామాకు మాత్రమే నేరుగా గానీ / పోస్ట్ / కొరియర్ ద్వారా గానీ పంపగలరు. జప సమర్పణోత్సవ కార్యక్రమ వివరాలతో పాటు ఆహ్వాన పత్రం అందజేయడానికి వీలుగా సొంత చిరునామా కలిగిన రూ. 5/– స్టాంపు అతికించిన కవరును జతపరిచి పంపగలరు.
5. ఈ మహామంత్రమును వ్రాయునప్పుడు మీలో కలిగిన అనుభూతులను మాకు వ్రాసి పంపగలరు.
6. మీరు వ్రాయవలసిన దివ్య మహామంత్రం 'ఓం నమో వేంకటేశాయ'

### గమనిక:

మేము శ్రీవారికి 2002 నుండి ప్రతి సంవత్సరం సమర్పించదలచిన 7 కోట్ల జపములో మీరు ప్రతి సంవత్సరము పాల్గొని శ్రీవారి కృపను, ఆశీస్సులను సంపూర్ణంగా పొందగలరని ప్రార్థన.

స్వామి నామమును 1,008 సార్లు వ్రాయలేనివారు కనీసం 108 సార్లు అయినా వ్రాసి ఏడు కోట్ల జపములో భాగస్వాములు కాగలరని మనవి.

శ్రీ వేంకటేశ్వర అనుగ్రహ ప్రాప్తిరస్తు..!

**శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం**

ఇం.నెం. 1-1-53, వీధి నెం. 1, హబ్సీగూడ,
హైదరాబాద్ - 500007. ఫోన్: 040- 27175050

ఈ కార్యక్రమం గురించి పూర్తి వివరాలకు సంప్రదించండి:

**93482 12354**

# సమతామూర్తి భగవద్రామానుజస్య
# చరణౌ శరణం ప్రపద్యే

– డా॥ కూర్మాచలం శంకరస్వామి

"శ్రీమతే రామానుజాయ నమః"

"మేషార్ద్రా సమ్భవం విష్ణోర్దర్శన స్థాపనోత్సకమ్ ।
తుణ్ణీర మణ్డలే శేషమూర్తిం రామానుజమ్భజే ॥
కల్యబ్దే దివ్యకుమ్భే బుధజన విధితే వత్సర పిఙ్గళాభ్యే ।
చైత్రమాసేగతే ఛత్రియుద దశదినే దీప్యమానే హిమాంశౌ ॥
పఞ్చమార్ద్రా సమేతే సురగుర దివసే కర్కటాఖ్యేచ లగ్నే
శ్రీమన్రామానుజార్యస్సమజని నిగమన్తార్ధ సంరక్షణార్థం ।
యోనిత్య మచ్యుత పదామ్బుజ యుగ్మ రుక్మ
వ్యామోహ తస్తదిత రాణి తృణాయమేనే ।
అస్మద్గురోర్భగవతోస్యదయైక సిన్ధోః
రామానుజస్య చరణౌ శరణం ప్రపద్యే ॥



అస్పృశ్యత, అంటరానితనం ప్రబలంగా ఉన్న కాలంలోనే నిమ్నజాతి కులం వారికి ఆలయ ప్రవేశం లేక హీనంగా చూస్తున్నవేళ గుడిగోపురం ఎక్కి అష్టాక్షరీ మంత్రమును అందరికీ ఉపదేశించి అంటరాని వారిని సైతం ఆలయ ప్రవేశం గావించిన సమతామూర్తి, సామాజిక చైతన్య దీప్తి భగవద్రామానుజాచార్యులు.

కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీవేంకటేశుని నిత్యకైంకర్యం చేసి తరియించిన పెరియ నంబి గారికి ఇరువురు తోబుట్టువులు కలరు. వారిరువురు కూడా శ్రీదేవి, భూదేవి అంశతో కాంతిమతి, ధృతిమతి అనే పేర్లతో పిలువబడిరి. అందులో శ్రీదేవి అంశతో జన్మించిన కాంతిమతి హరితవంశంలో నారాయణాంశతో జన్మించిన శ్రీ పెరుంబుదూరు నివాసులగు అసూరి కేశవాచార్యులను వివాహమాడగా, భూదేవి యంశతో జన్మించిన ద్యుతిమతి నారాయణాంశమున జన్మించిన భరద్వాజ వంశజులగు కమల నయన భట్టులను వివాహమాడి, భూతపురి సమీపమున గల మలల మంగలమను గ్రామమునకు చేరిరి.

**లక్ష్మణాచార్యుల జననం :**

ఈ కలియందు శాలివాహన శకమున 938 వ పింగళనామ సంవత్సరం చైత్రశుద్ధ పంచమి గురువారం కర్కాటక లగ్నమున ఆర్ద్రా నక్షత్రమున అసూరి కేశవాచార్య, కాంతిమతి దేవుల గర్భాన శేషాంశచే ఒక బాలుడు జన్మించెను. ఈ విషయము తెలిసి తిరుమల నంబి, పెరియ తిరుమలనంబి గారు ఏతెంచి, మేనల్లునకు జాతక కర్మలు ఒనరించి, సర్వలక్షణ సంపన్నుడగు ఆ శిశువును చూచి లక్ష్మణాచార్యులని నామకరణం చేసిరి. ఆ బిడ్డకు అన్నప్రాశన, చేళోపనయనాదులను శాస్త్రోక్తముగా అతని తండ్రిచే చేయించి, వేద వేదాంగములను నధికరించి చతుర్దశ విద్యాపారంగతులైన పిదప పదహారవ యేట లక్ష్మణాచార్యులకు వివాహం జరిపించారు.

ఆ కాలంలో కాంచీనగరమందు యాదవ ప్రకాశుడనెడి ఏకదండియగు వేదాంతి యున్నాడు. అతని వద్ద లక్ష్మణాచార్యులు వేదాంత అద్వైతమును అభ్యసించారు. అదే సమయంలో మలల మంగళ గ్రామంలో ఉన్న కమలనయన భట్టుకు ఒక పుత్రుడు జన్మించాడు. అతనికి కూడా తిరుమలనంబి గారే గోవింద మిత్రుడని నామకరణం చేసి పంచ సంస్కారాలు గావించారు. వివాహానంతరం గోవింద మిత్రులు కూడా కాంచీనగరంలోని యాదవ ప్రకాశుల వద్దనే విద్యనభ్యసించారు.

**యాదవ ప్రకాశుని కాశీయాత్రా వ్యాజము :**

యాదవ ప్రకాశులు "సత్యం జ్ఞానమనన్తం బ్రహ్మ" అనెడి శ్రుతి వాక్యమునకు సత్యమనగా అసత్యమునకు భిన్నమైనదనియు, జ్ఞానమనగా జడ భిన్నమైనదనియు, అనంతమనగా పరిచ్ఛిన్న భిన్నమైనదనియు చెప్పగా లక్ష్మణాచార్యులు సత్యమనగా వికార శూన్యమనియు, జ్ఞానమనగా స్వయంప్రకాశమనియు, అనంతమనగా అపరిచ్ఛిన్నమని, చేతనా చేతన విలక్షణమై నిత్యమై యుండు బ్రహ్మమునకర్థము చెప్పిరి. మరొకనాడు లక్ష్మణాచార్యులు యాదవ ప్రకాశులకు తలంటు పోయునప్పుడు, "తస్యయదా కప్యాసనం పున్డరీక మేవక్షిణీ" అనెడి శ్రుతి వాక్యమునకు కప్యాసనమనగా వానరపృష్ఠమనియు యాదవ ప్రకాశులు అర్థము చెప్పగా విని లక్ష్మణాచార్యుల కనుల వెంట నీరు బెట్టుకొనగా యాదవులు అది చూచి ఇది ఏమియనగా, కపి యనగా సూర్యుడనియు, అసనమనగా ఆశ్రయణమనియు అర్థము చెప్పి, సూర్యునిచే వికసింపచేయబడిన లోతైన నీటిలో దృఢమగు నాళముపై గల పద్మముల వంటి నేత్రములు గలవాడు భగవానుడని అర్థము చెప్పారు లక్ష్మణాచార్యులు. అప్పుడు యాదవ ప్రకాశులు తనకన్నా విశేషార్థము చెప్పెడు లక్ష్మణాచార్యుల యందు మాత్సర్యము కలవాడై, కాశీయాత్ర నెపంతో గంగలో ముంచివేయనెంచి శిష్యసమేతంగా బయలుదేరి, వింధ్యారణ్యాలలో నడుచుచుండగా యాదవుల దురభిప్రాయము గమనించిన గోవింద మిత్రులు లక్ష్మణాచార్యుల సమ్మతితో యాత్ర మధ్యలోనే కంచికి వెళ్ళిపోవాలని లక్ష్మణులను కోరి గురువుగారి వెంటనే గోవిందుడు యుండి కాశీయాత్రను కొనసాగించారు. తిరుగు ప్రయాణంలో దారి దొరకక లక్ష్మణాచార్యులు ఇబ్బందులు పడుతున్న సమయంలో కోయ దంపతులు అతన్ని తమవెంట తీసుకొనిపోయి అతనికి సరియైన దారి చూపించి దాహంగా ఉందని నీరు తెమ్మని చెప్పగా లక్ష్మణులు తామరాకు దొప్పల్లో నీరు కొనిరాగా ఆ దంపతులు కానరాలేదు. అంత చుట్టుప్రక్కల వారిని విచారించి ఎలాగో కాంచీనగరానికి చేరుకున్న లక్ష్మణాచార్యులు తనకు అడవిలో మార్గం చూపిన దంపతులు పేరిందేవి, వరదరాజుల స్వామి వారేనని తలచి, నాటినుండి శాలక్కిణరు నుండి తీర్థమును తెచ్చి వరదరాజస్వామికి అర్పించుచుండిరి.

కాశీయాత్రలో ఉన్న యాదవులు శిష్య సమూహంలో లక్ష్మణులు కనిపించకపోవడంతో రాత్రిపూట ఏ మృగమో అతనిని చంపి ఉండవచ్చునని భావించి నిర్భయుడై కాశీయాత్ర కొనసాగించి గంగానదిలో స్నానమాచరిస్తుండగా, గోవిందభట్టు చేతికి ఒక శివలింగము తగలగా దానిని గురువుగారైన యాదవ ప్రకాశులకు చూపగా, అతడు మిక్కిలి సంతసించి ఆ లింగానికి "ఊళ్ళంగైకొణర్ న్ద నాయనార్" అని నామకరణం చేసి, నీ యందు శివానుగ్రహం ఉందని, దీనిని మీ గ్రామంలో ప్రతిష్ఠించి అర్చించాలని ఆజ్ఞాపించగా గోవిందుడు పరమానంద భరితుడై తన గ్రామమైన మలల మంగలలో ప్రతిష్ఠించి పూజలు కొనసాగించుచుండెను. ఆ కాలమున కాళహస్తీశ్వరుడు ఇతని శ్రద్ధకు సంతసించి, ఆలయాధికారుల నాదేశించి నాయనార్ లను కాళహస్తికి రప్పించి తన సేవలో నియమించుకున్నాడు.

అదేసమయంలో యాదవప్రకాశులు యాత్రనుముగించుకొని కంచికి చేరుకొనగా లక్ష్మణాచార్యులను చూచి ఆశ్చర్యపడి చేసేది ఏమీ లేక లోకనిందకు వెఱచి తిరిగి తన శిష్యులతో చేర్చుకొనెను. ఒకనాడు శ్రీరంగమునుండి ఇరువురు శ్రీవైష్ణవులు కంచికి వచ్చి వరదరాజులను సేవించి తిరిగి శ్రీరంగమునకు రాగా వారిని చూచి ఆళవన్దార్లు (యామునాచార్యులు) కంచిలోని విశేషాలను తెలుపుమనగా, వారు కంచిలోని యాదవ ప్రకాశుల శిష్యుడైన లక్ష్మణాచార్యుల శ్రుతి వాక్య విశేషాల గురించి వివరించారు. వెంటనే యామునులు శిష్యులతో కలిసి కంచికి చేరుకుని వరదరాజులను సేవించి, యాదవుల శిష్యులలో ఉన్న లక్ష్మణార్యులను చూచి అతని విశాల నేత్రాలను, దీర్ఘబాహువులను గమనించి భవిష్యదాచార్యులను చేయాలని వరదరాజులను ప్రార్థించి శ్రీరంగం వెళ్ళిపోయారు.

**బ్రహ్మరాక్షస విమోచనము :**

యాదవ ప్రకాశులు శిష్యులతో కూడియున్న కాలంలోనే ఆ దేశ రాజపుత్రికకు ఒక రాక్షసి ఆవహించినది. తన పుత్రికను రాక్షసి చెర నుండి బాపుటకు రాజు ఎంతగానో ప్రయత్నించాడు కాని లాభం లేకుండా పోయింది. ఈ బాధను నివారించువారు ఒకరున్నారని, అతడు యాదవ ప్రకాశులని, వారి మంత్రాల ద్వారా బ్రహ్మరాక్షసి పారిపోవునని చారుల ద్వారా విని అతనిని సాదరంగా తోడ్కొని రమ్మని సేవకులను ఆజ్ఞాపించగా వారు యాదవప్రకాశకులకు రాజాజ్ఞను వివరించగా యాదవప్రకాశులు తన శిష్యులతో కలిసి రాజాస్థానానికి వచ్చి బ్రహ్మరాక్షసిని చూసి అనేక మంత్రప్రయోగాలు చేసినా ఆ బ్రహ్మరాక్షసి రాజపుత్రికను విడువలేదు. చివరకు దైవాంశ సంభూతుడు, సకలవిద్యా శాస్త్ర పారంగతుడైన రామానుజులు తన పాదమును బ్రహ్మరాక్షసి తలపై ఆనించగానే బ్రహ్మరాక్షసి రాజపుత్రికను వదిలి పారిపోగా రాజుతో సహా యాదవ ప్రకాశులు కూడా ఎంతగానో సంతసించారు. కాని యాదవ ప్రకాశులకు తన శిష్యుడైన రామానుజులపై (లక్ష్మణాచార్యులపై) మరింత ఈర్ష్యాద్వేషాలు పెరిగాయి. అతని శాస్త్ర వ్యాఖ్యానాలకు రామానుజులు శాస్త్ర సమ్మతంగా ఎప్పటికప్పుడు ఖండించి సరియైన అర్థములు తెలుపగా ఆగ్రహించిన యాదవప్రకాశులు రామానుజులను తన ఆశ్రమము నుండి వెళ్ళగొట్టగా రామానుజులు చేయునది లేక తల్లి గారి సూచన మేరకు తిరుకచ్చినంబి వద్దకు చేరి ఆత్మజ్ఞానము

కొరకు వరదరాజస్వామికి కైంకర్య సేవలు చేయుచుండెను.

ఒకనాడు కంచి నుండి ఇరువురు శ్రీవైష్ణవులు శ్రీరంగము చేరి అళవన్దారులను (యామునులను) దర్శించుకోగా వారు రామానుజుల గురించి ప్రస్తావించగా వారు జరిగిన విషయము చెప్పి ప్రస్తుతం రామానుజులు యాదవులను విడిచి కంచి వరదరాజస్వామికి తీర్థ కైంకర్యములు చేయుచున్నాడని తెలిపిరి. అంతట యామునులు పెరియనంబిని చూచి మీరు కంచికి వెళ్ళి లక్ష్మణులను (రామానుజులను) తన వద్దకు తోడ్కొని రమ్మని ఆజ్ఞాపించెను. వారి ఆజ్ఞానుసారము పెరియనంబి కంచికేగి వరదరాజస్వామికి నమస్కరించి వారి అనుమతి మేరకు లక్ష్మణాచార్యులను తోడ్కొని శ్రీరంగము చేరుకోగానే అప్పటికే యామునాచార్యులు స్వర్గస్తులైరి. దానితో రామానుజులు ఎంతగానో మదనపడ్డారు. యామునుల కుడిచేతి మూడు వ్రేళ్ళు ముడుచుకొని యుండుట గమనించి దాని అర్థము తెలుపమని అక్కడి స్వాములను కోరగా వారు కూడా తమ నిస్సహాయతను తెలుపగా వారి మూడు కోర్కెలను నేను నెరవేర్తునని రామానుజులు శపథము చేయగా ముడుచుకున్న వేళ్ళు యథాస్థితికి వచ్చాయి. చివరి క్షణాల్లో యామునులతో మాట్లాడే అవకాశం కల్పించనందులకు శ్రీరంగస్వామిని దర్శించకుండానే రామానుజులు కంచికి చేరుకుని వరదరాజుల సేవలో మునిగిపోయారు.

లక్ష్మణాచార్యులకు నానాటికి తిరుకచ్చినంబి యందు ఆదరణ పెరిగి వారినాశ్రయించి ఈ ఆత్మనుజ్జీవింప చేయుడని ప్రార్థించగా నంబి భగవానుని యాజ్ఞ యగు వర్ణాశ్రమ ధర్మాలను పాటింపవలదా అనిరి. మరోనాడు లక్ష్మణాచార్యులు తిరుకచ్చినంబి గారిని తళిహ ప్రసాదము స్వీకరించమని కోరెను. అతనికి గురువుల ఉచ్చిష్టము అంటే మక్కువ. ఎలాగైనా ఆత్మజ్ఞానమును పొందాలన్న తపనతో గురువుగారిని భోజనమునకు ఆహ్వానించాడు. కాని లక్ష్మణాచార్యుల భార్య మాత్రం అతని భావాలకు పూర్తి విరుద్ధం. వారికంటె తక్కువ కులము వారంటే ఆమెకు పరమ అసహ్యం. తిరుకచ్చినంబి వైశ్యుడు కాబట్టి అతన్ని ఘోరంగా అవమానించి పంపిస్తుంది. ఈ విషయం తెలుసుకున్న లక్ష్మణులు తన గురువును అవమానించిన భార్యపై కోపగ్రస్థుడయ్యాడు. ఆ తరువాత గురువు పాదాలపై పడి శరణు వేడుకున్నాడు.

కంచి వరదరాజస్వామివారు తిరుకచ్చినంబి గారికి నేరుగా దర్శనమిచ్చి మాట్లాడుతూనే మాట విని లక్ష్మణాచార్యులు ఈ సాంసారిక బాధల నుండి విముక్తి పొంది కైవల్యమార్గము చూపమని స్వామివారిని కోరమని నంబి గారిని ప్రార్థించారు లక్ష్మణాచార్యులు. అతని కోరిక మేరకు ఒకనాడు తిరుకచ్చినంబి స్వామివారికి కైంకర్యసేవ చేసిన పిదప వరదరాజులు దర్శనమివ్వగా నంబిగారు లక్ష్మణుల కోరికను ఆ స్వామికి విన్నవించారు. అప్పుడు స్వామివారు ఆరు సూత్రాలను వివరించారు. అవి 1. పరతత్త్వము నేనే. 2. జీవేశ్వర భేదము నిత్యము. 3. శరణాగతియే నన్ను పొందు సులభోపాయము 4. శరణాగతునకు అంతిమ స్మృతి అక్కరలేదు 5. ప్రపన్నునకు శరీరావసానమున మోక్షమే. 6. పెరియనంబి శ్రీపాద తీర్థములనే ఆశ్రయింపుడు. ఈ నియమాలను ఆచరించిన వారికి కైవల్యము కలుగుతుందని వరదరాజస్వామి చెప్పినట్లుగా తిరుకచ్చినంబి లక్ష్మణాచార్యులకు వివరించారు. అప్పుడు లక్ష్మణాచార్యులు ఆ నియమాలను ఆచరించుటకు పెరియనంబిని ఆశ్రయించుటకై శ్రీరంగము బయలుదేరి దారిలో గల మధురాంతకము చెరువు గట్టునగల పెరుమాళ్ ఆలయమునకు చేరుకోగానే అంతకుముందు పెరియనంబి శ్రీరంగమునుండి కంచికి బయలుదేరి మార్గమధ్యలో నున్న ఆ ఆలయంలో ఉన్నారు. అనుకోకుండా ఆ ఇరువురు మధ్యలోనే కలుసుకున్నందులకు ఎంతగానో సంతసించారు. లక్ష్మణాచార్యులు పెరియనంబి గారికి సాష్టాంగ దండ ప్రణామము చేసి తన వాంఛితాలను తీర్చమని ప్రార్థించారు. అందుకు పెరియనంబి అచ్చటనే పంచ సంస్కారములు చేసి యామునులనే ఆచార్యులుగా భావింపుమని తెలిపెను.

**లక్ష్మణార్యులు సన్యాసాశ్రమము స్వీకరించుట :**

అనంతరము లక్ష్మణార్యులు తమ గృహమునకు తీసుకుని వెళ్ళి వారిని సద్భక్తిపూర్వకంగా సేవించి వారికి తగిన వసతి ఏర్పాట్లు తానే దగ్గరుండి చేస్తూ వారివద్ద ద్రవిడ ప్రబంధ దర్శనమును అధ్యయనం చేశారు. ఒకనాడు పెరియనంబి గారి భార్యను, లక్ష్మణార్యుల భార్య అవమానించగా పెరియనంబి భార్యతో కలిసి చెప్పకుండానే శ్రీరంగము వెడలిపోగా లక్ష్మణార్యులు ఎంతగానో విచారించారు. చివరికి ఆమెకు కావలసిన ధనమునిచ్చి, వరదరాజుల సన్నిధిలో సన్యాసాశ్రమము స్వీకరించగా వరదరాజులును అర్చకముఖముగా వీరికి రామానుజ ముని అని నామకరణము చేసి తిరుకచ్చినంబి ద్వారా మఠమున ప్రవేశింపచేశారు. ఆపై రామానుజుల పిన్నికుమారుడైన గోవింద భట్టరు శైవమతములో చేరి శ్రీకాళహస్తిలో ఉన్నాడని తెలిసి మేనమామ యైన తిరుమలనంబి గారి ద్వారా అతనిని వైష్ణవమతం స్వీకరింపచేశాడు రామానుజులు. ఆ తరువాత కూరత్తాళ్వాన్, ముదలియాన్డానులు కంచికేగి రామానుజాశ్రమములో చేరి ఒక్క క్షణము కూడా విడువక అతని సేవలో కొనసాగారు. తనను ఎన్నోమార్లు అవమానించి చంపాలని చూసిన యాదవ ప్రకాశులను కూడా చేరదీసి అతనికి పంచసంస్కారములు చేసి గోవింద జీయర్ అని నామకరణము చేసి అతని చేత "యతి ధర్మ సముచ్చయ"మనే గ్రంథాన్ని రచింపచేసి ఆచార్య పరతంత్రులుగా తీర్చిదిద్దారు రామానుజులు. ఇచ్చట

గురువుగారికే రామానుజులు గురూపదేశం చేయడం గొప్ప విశేషం.

**రామానుజులు శ్రీరంగము జేరుట :**

రామానుజులు కూరత్తాళ్వాను, ముదలియాన్దాన్ లకు "మీమాంసా శాస్త్రద్వయమును అధ్యయనము చేయుచు కంచి యందున్న కాలంలో ఈ విషయం తెలుసుకున్న పెరియనంబి మరియు ఆళవన్దార్ (యామునులు) శిష్యులు మిక్కిలి సంతసించి అతనిని శ్రీరంగము రప్పించవలసిందిగా శ్రీరంగనాథుని ప్రార్థించారు. అంతట శ్రీరంగనాథుడు అరైయరును పిలిచి "మీరు కంచికి వెళ్ళి వరదులను గానముచే మెప్పించి రామానుజులను శ్రీరంగమునకు తోడ్కొని రమ్మని" ఆజ్ఞాపించారు. వారు కంచికి వెళ్ళి వరదరాజులును శాస్త్రజ్ఞానమున వాదించి వరదులను మెప్పించగా వారు రామానుజులను అతని శిష్యులను తోడ్కొని శ్రీరంగము చేరుకోగానే అక్కడ వారికి శాస్త్ర మర్యాదపూర్వకముగా స్వాగతం లభించింది. ఆ తరువాత యెంబెరుమాళ్ ఎదురేగి రామానుజులను సత్కరించి స్వామివారి సన్నిధిలో వారికి శ్రీరంగనాథుని ప్రధాన అర్చకులుగా బాధ్యతలను అప్పగించి ఘనంగా సన్మానించారు. అప్పటినుండి రామానుజులకు "ఉడైయవర్" అనెడి తిరునామము ఏర్పడింది. దానితో రామానుజులు శ్రీరంగనాథునకు నిత్యోత్సవములు, మాసోత్సవాది మహోత్సవములు ఏ కొరత లేని విధంగా నిర్వహించారు. అదే సమయంలో తన సోదరుడైన గోవింద భట్టర్ శ్రీకాళహస్తిలో శైవారాధన చేస్తున్నాడని తెలిసి తన మేనమామయైన తిరుమలనంబి సహాయంతో అతనిని వైష్ణవ సంప్రదాయం లోకి మార్పించ, పంచసంస్కారముల నొనరించి ఆళ్వార్ల దివ్యప్రబంధాల రహస్యాలను తెలిపి అతనికి ఆచార్యత్వము కల్పించారు రామానుజులు.

**రామానుజులు చరమ శ్లోకార్థము పొందుట :**

రామానుజులు శ్రీరంగనాథుని సేవలో ఉన్నప్పటికీ అతనిలో ఒక అసంతృప్తి మిగిలి ఉంది. అదేమిటంటే ఆళవన్దార్ల ఆశయం నెరవేర్చలేదని. అదే విషయంలో ఒకనాడు పెరియనంబి గారి ఇంటికి వెళ్ళి అతనిని ప్రార్థించారు. అతని ప్రార్థనను మన్నించి "పాపహరమై, పుణ్యవర్ధకమై, సంసారబంధమును త్రెంప సమర్థమై, వేదసారతమై, శుభకరముగ శ్లాఘింపబడిన మంత్రరత్నమనబడు ద్వయార్థమును సవిశేషముగ అనుగ్రహించి మరికొన్ని అర్థవిశేషములు ఆళవన్దార్లచే అభిమానింపబడినవి. తిరుక్కొట్టియూరి నంబి గారి పాదముల నాశ్రయించి వినుమని సూచించారు. వారి సూచన మేరకు రామానుజులు తిరుక్కొట్టియూరి నంబి కడకేగి వారికి సాష్టాంగ నమస్కారములు చేసి చరమ శ్లోక రహస్యములను బోధించవలసిందిగా కోరారు. వారు రామానుజులను పరీక్షింపదలచి రేపు మాపు అంటూ 17 మార్లు రప్పించుకున్నారు. అయినను ఆత్మజ్ఞానము పొందాలని తపనతో నున్న రామానుజులు ఆత్మస్థైర్యం వీడకుండా నంబిగారు చెప్పినట్లు రావడంతోనూ శ్రీరంగనాథుని అనుగ్రహంతో రామానుజులను ఒంటరిగా రమ్మని ఆజ్ఞాపించగా అతడు కూరత్తాళ్వాన్ ను మొదలియాణ్వానును వెంట తీసుకుని రాగా, నేను త్రిదన్డము, పవిత్రములను వెంట తెమ్మని చెప్పితిని గదా. నీవు వీరితో కూడి వచ్చితివి అని ప్రశ్నించగా రామానుజులు వీరిరురువురును నాకు త్రిదన్డము, పవిత్రుల వంటి వారని సమాధానమివ్వగా సంతసించిన నంబి గారు రామానుజులను ఏకాంత ప్రదేశమునకు గొనిపోయి చరమార్థ శ్లోక రహస్యమైన అష్టాక్షరి మంత్రమును ఉపదేశించి దీనిని రహస్యముగా నుంచమని ఆజ్ఞాపించెను.

ఆ మరునాడే రామానుజులు తిరుక్కొట్యూరి గుడిగోపురమెక్కి అందరికీ వినిపించే విధముగా అష్టాక్షరీ మంత్రరాజము పెరియ తిరుమంత్రమును (జ్ఞాన, భక్తి, వైరాగ్యము) యొక్క మంత్ర రహస్యమును బహిర్గతపరచి అందరికీ ముక్తి మార్గాన్ని చూపిన సమతామూర్తి రామానుజులు. ఇతని చేష్టలకు కోపించిన నంబిగారు బయటకు చెప్పకూడదని చెప్పితిని కదా. దీని పర్యవసానము తెలిసి కూడా ఇలా ఎందుకు చేశావనగా, అయ్యా! ఈ మంత్ర ఉపదేశము వలన ఇంతమందికి కైవల్యము లభించువేళ నా ఒక్కనికి నరకము ప్రాప్తించినను సంతోషమే యని రామానుజుని సమాధానము విని నంబిగారు ఎంతో పొంగిపోయి రామానుజులను ఆలింగనము చేసుకొని ఆశీర్వదించారు. కంచిపూర్ణులు (కంచినంబి) మహాపూర్ణులు (పెరియనంబి) గోష్ఠిపూర్ణులు (తిరుక్కొట్టియారి నంబి) ఇలా ముగ్గురు పూర్ణుల శిష్యరికంలో పరిపూర్ణ జ్ఞానమును పొందారు రామానుజులు. అంతేకాదు పర సమృద్ధిలో గురువులకన్నా రామానుజులే గొప్పవారని కీర్తింపబడ్డారు.

ఆ తరువాత రామానుజులు తిరుమాలైన్దానుల వద్ద తిరువాయ్ మొషి కాలక్షేపము విని తిరువరజ్గిప్పెరుమాళ్ వద్ద చరమోపాయ జ్ఞానాన్ని సంపాదించారు. ఈవిధంగా రామానుజులు శ్రీరంగనాథుని ప్రధానార్చకులుగా వెలుగొందుతూ స్వామివారికి శాస్త్రోక్తముగా అనేక కైంకర్యాది సంస్కరణలు చేయుచుండగా అది చూసి గిట్టనివారు ఒక బ్రాహ్మణ యువతి ద్వారా భిక్షాన్నములో విషప్రయోగము చేసి చంపాలని చూశారు. ఎప్పటిలాగే రామానుజులు భిక్షకు వెళ్ళగా అభిమానవతి అయిన ఆ యువతి రామానుజులకు భిక్ష వేసి నోటితో చెప్పలేక సాష్టాంగ ప్రణామం చేయగా దానిలోని నిగూఢార్థాన్ని గ్రహించి కావేరి ఒడ్డున ఆ భిక్షను పెట్టి స్నానమాచరించి వచ్చుసరికి ఆ విషాన్నపు భిక్షను ఒక శునకము గ్రహించి అక్కడికక్కడే మృతి చెందగా దానిని చూసిన రామానుజులు తనను ఆ శ్రీరంగనాథుడే

రక్షించాడని తన మనసులోనే ఆ స్వామివారికి అనేక విధాల స్తోత్రార్చనలొనరించారు. ఆ తరువాత కిడాంబిని తన శిష్యునిగా చేసుకొని మరొక శిష్యుడైన అనంతాళ్వార్లను తిరుమల క్షేత్రానికి వెళ్ళి శ్రీవారికి పుష్పకైంకర్యము చేయమని ఆజ్ఞాపించారు. తిరుమల క్షేత్రానికి వెళ్ళి అక్కడి సంస్థానాధీశులను వాదనలో గెలిచి స్వామివారికి తిరునామమిడి శ్రీవేంకటేశ్వరస్వామివారి విగ్రహమునకు పంచ సంస్కారాలొనర్చి ఆ కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీవేంకటేశ్వరునకు ఆచార్యులయ్యారు రామానుజులు. శ్రీనివాసునికి పుష్పకైంకర్యాది సేవలొనర్చి, శ్రీవారికి అనేక మంగళా శాసనాలు చేసిన దివ్యమైన ఆచార్యులు రామానుజులు, విఠల దేవరాయల ఆశ్రయం పొంది గోవింద భట్టార్యులకు వైరాగ్య స్వీకరణకు కారకుడు రామానుజులే. యామునాచార్యుల చరమదశలో వాగ్దానమొనర్చిన విధంగా బ్రహ్మసూత్రాలు వ్యాఖ్యానాలు రాయించి భాష్యకారుడనే బిరుదును పొందారు రామానుజులు. అనేక జైత్రయాత్రలను నిర్వహించి ఆయా పండితుల సభలలో వాదనలలో పాల్గొని ఎన్నో విజయాలు పొందిన విశిష్టాద్వైత మూర్తి రామానుజులు. శిథిలమైన దేవాలయాలలో పునరుద్ధరణను చేపట్టి ధూప దీప నైవేద్య కార్యక్రమాలను జరుగునట్లు చేసిన ఆచార్యవర్యులు.

మన వెంటరాని వారే నిజమైన అంటరానివారని, భగవంతుని దృష్టిలో అందరూ సమానులేనని అస్పృశ్యత ప్రబలంగా ఉన్న కాలంలోనే నిమ్నజాతి కోసం పరితపించిన సామాజిక చైతన్యమూర్తి రామానుజాచార్యులు.

**"గురు రేవ పరంబ్రహ్మః**
**గురు రేవ పరం దీపం**
**గురు రేవ పరః కామో**
**గురు రేవ పరాయణమ్**
**గురు రేవ పరా విద్యా**
**గురు రేవ పరాగతి**
**యస్మాత్తదుపదేష్టా సా**
**తస్మాద్గురు తరో గురు**

ఆచార్యులే సర్వస్వము. ఆచార్యులే నడుస్తున్న శ్రీమన్నారాయణులని మధురకవి మాటలు రామానుజులకు సరిగ్గా సరిపోయే వ్యాఖ్యా రాజములు.

Statement about ownership and other particulars about **SRI VENKATESAM (Monthly)**

## FORM IV

See Rule 8

| | | |
|---|---|---|
| 1. Place of Publication | : | H.No.1-1-53, Street No.1, Habsiguda, Hyderabad - 500 007 |
| 2. Periodicity of it's Publication | : | Monthly |
| 3. Editor | : | **PULLAGURLA SAI REDDY** |
| 4. Printer's Name | : | **PULLAGURLA SAI REDDY** |
| Whether Citizen of India | : | Yes |
| Address | : | H.No.1-2-63/10/1, (Plot no.9/3, M-block) Kakatiya Nagar, Habsiguda, Hyderabad - 500 007. |
| 5. Editor's and Publisher's Name | : | **PULLAGURLA SAI REDDY** |
| Whether Citizen of India | : | Yes |
| Address | : | H.No.1-2-63/10/1, (Plot no.9/3, M-block) Kakatiya Nagar, Habsiguda, Hyderabad - 500 007. |
| 6. Name and Address of Owner | : | **PULLAGURLA SAI REDDY** H.No.1-2-63/10/1, Kakatiya Nagar,Habsiguda, Hyderabad - 500 007. |


I P.Sai Reddy, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

HYDERABAD
Date : 1-04-2025

**(Sd.) P. SAIREDDY**
Signature of the Publisher

# ఉపమన్యు మహర్షి

**– మందరపు వి.జి.శంకరాచారి**



బాల భక్తులలోని అగ్రగణ్యులలో భక్తప్రహ్లాదుడు, మార్కండేయుడితో పాటు ఉపమన్యుడు కూడా వస్తాడు. ఇతడు కేవలం పాయసాన్ని ఆరగించేందుకు శివుడి గురించి ఘోరమైన తపస్సు నాచరించి ముక్కంటి అనుగ్రహాన్ని పుష్కలంగా పొందిన బాల భక్తుడు. ఇతడు వ్యాఘ్రపాదుని కుమారులలో పెద్దవాడు. చిన్నవాడైన ధౌమ్యుడు తదనంతర కాలంలో పాండవులకు పురోహితుడిగా సేవలందించాడు.

వ్యాఘ్రపాదుడు ఒక మునికన్యను వివాహం చేసుకున్న కారణంగా ఉపమన్యుడు, ధౌమ్యుడు అను ఇరువురు కుమారులు కలిగారు. ఒకసారి వీరిద్దరూ తల్లితో పాటు మరొకరి ఇంటికి ఆతిథ్యానికి వెళ్ళారు. అక్కడ వారు పాయసాన్ని ఆరగించారు. ఆరేళ్ళ ఉపమన్యుడికి ఆ పాయసం ఎంతగానో నచ్చింది. ఇంటికి వచ్చిన వెంటనే తనకు అటువంటి పాయసం చేసిపెట్టమని మారాం చేశాడు.

ఉపమన్యుడి అల్లరి భరించలేక ఆ తల్లి వారికి ఇంట్లో ఉన్న బియ్యప్పిండిని నీటితో కలిపి పలచగా చేసి ఇచ్చింది. (ఇలా చేసిన దానిని పిష్టరసం అంటారు) అది వారిద్దరిలో చిన్నవాడైన ధౌమ్యుడు త్రాగివేస్తాడు కాని అది పాయసం కాదని గుర్తించలేకపోతాడు. పెద్దవాడైన ఉపమన్యుడు మాత్రం అది తన చుట్టాల ఇంటి దగ్గర తాగిన పాయసంలా లేదని... తనకు అటువంటి పాయసమే కావాలంటూ మారాం చేశాడు.

అప్పుడు ఆ తల్లి ఉపమన్యుడి అల్లరి భరించలేక నిజం చెబుతుంది. "నాయనా ఉపమన్యు... నువ్వు తిన్న పాయసం లాంటిది కావాలంటే పాలు కావాలి.. పాలు కావాలంటే ఇంట్లో ఆవులుండాలి. మనం పేదవాళ్ళం కాబట్టి ఆవులను కొనగలిగే స్థితి లేదు. అయితే పాలు కావాలంటే ఏం చేయాలి? ఎలా లభిస్తాయి? ఎవరు పాలను మనకు ఇస్తారు? అని అడుగుతాడు. అప్పుడు ఆమె ఈ బ్రహ్మాండాన్ని సృష్టించిన శివుడినే అడగాలి. అతడే అన్నింటిని మనకు ఇవ్వగల సమర్థుడు. మిగిలిన వారెవరూ మన పేదరికాన్ని తొలగించలేరు అని చెప్పింది.

తల్లి మాటలు ఉపమన్యుడి మదిలో బలంగా నాటుకుపోయాయి. వెంటనే శివసాక్షాత్కారం పొందాలని నిర్ణయించుకుంటాడు. వెంటనే ఈ విషయాన్ని తల్లికి తెలియజేసి ఆమెను ఒప్పించి తపస్సు చేయడానికి ఒక ఏకాంత ప్రదేశానికి బయలుదేరి వెళతాడు. అక్కడ శివ సాక్షాత్కారం కోసం తపస్సు చేయడం ప్రారంభిస్తాడు.

ఎడమకాలి బొటనవ్రేలిపై నిలిచి మహా తపస్సుని ప్రారంభిస్తాడు. నూరేండ్లు పండ్లు మాత్రమే తిని, మరియొక నూరేళ్ళు ఆకులు మాత్రమే తిని, ఇంకొక నూరేండ్లు నీరు మాత్రమే త్రాగి, మరొక నూరేండ్లు గాలిని మాత్రమే పీలుస్తూ వేయి సంవత్సరముల పాటు ఘోరమైన తపస్సుని ఏకాగ్రతతో చేస్తాడు.

పరమశివుడు అతడి భక్తికి మెచ్చి అతణ్ణి పరీక్షించదలచి ఇంద్రుడి రూపంలో సాక్షాత్కరిస్తాడు. ఉపమన్యూ నీవు మహాభక్తుడవు. నీ కోర్కె తీర్చడానికి నీ దగ్గరకు వచ్చాను. నీవు మహాశివుడి కొరకు తపస్సు చేస్తున్నావు. కానీ అతడి దగ్గర ఏముంది? బూడిద తప్ప. నేను ఇంద్రలోకానికి రాజుని. నీ యొక్క కామితార్థములన్నింటినీ తీర్చగల వాడను. కాబట్టి నువ్వు నన్ను శరణు కోరు. నీ కోరిక లేమిటో నాకు తెలియచేయి. వెంటనే తీరుస్తాను అన్నాడు.

ఇంద్రుడు చేసిన శివదూషణను విన్న ఉపమన్యుడు శివనిందలు వినలేక శివ శివా అని చెవులు మూసుకున్నాడు. కోపంతో నువ్వు ఇంద్రుడివైనా, మరియొక చక్రవర్తివైనా నా కోర్కెను తీర్చడానికి అర్హుడివి కావు. నా మనస్సు నిండా ఆ శివుడిని నింపుకుని ఉన్నాను. నీవు నా కళ్ళ ఎదుట నుండి వెంటనే పో. లేకపోతే ఇప్పుడే నిన్ను శాపానికి గురి చేస్తాను అంటూ ఇంద్రుణ్ణి వెళ్ళగొట్టడానికి తల్లి తనకు రక్షణగా ఇచ్చిన భస్మమును తన పిడికిట పట్టుకొని అఘోరాస్త్రాన్ని మదిని తలచి ప్రయోగించబోగా అప్పుడు పరమేశ్వరుడు తన మారు రూపుని వదలి ప్రత్యక్షమై కన్నుల పండుగ చేసి అతడి కామితార్థములన్నింటినీ తీరుస్తాడు. అంతేకాదు... పాల కొరకు తపస్సు చేసిన అతడికి క్షీరసాగరాన్నే బహుమతిగా ఇస్తాడు. తరువాత కాలంలో ఉపమన్యుడు శివభక్తితో చిరకాలం జీవిస్తాడు.

# తిరుప్పావై

**శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామివారు**

గత సంచిక తరువాయి

## 1 0 వ పాశురము

నోత్తు చ్చువర్ క్కమ్ పుగుగిన్ఱ అమ్మనాయ్!
మాత్తముమ్ తారారో వాశల్ తిఱవాదార్,
నాత్తతుళాయ్ ముడి నారాయణన్, నమ్మాల్
పోత్తప్పఱై తరుమ్ పుణ్ణియనాల్ , పణ్డొరునాళ్
కూత్తత్తిన్ వాయ్ వీళ్ న్ద కుమ్భకరుణనుమ్,
తోత్తు మునక్కే పెరున్దుయిల్ తాన్ తన్దానో,
ఆత్త వనన్దలుడైయాయ్! అరుంగలమే!
తేత్తమాయ్ వన్దు తిఱవేలో రెమ్బావాయ్.

తాత్పర్యం – సర్వస్వామినే దాసోహమనిపించుకొను అదృష్టమును నోచి ఆతనితో నీ ఒక్కతెవే స్వర్గానుభవమంద జూచుచున్నావా. ఎంత స్వార్థమమ్మా! తలుపు తీయకపోతె మానే. పోనీ ఒక్క పలుకైనా నోరు తెఱచి పలుకరాదా? మిక్కిలి పరిమళించు శ్రీ తులసీమాలికలచే నలంకరింపబడ్డ కిరీటము గల కాల నియన్తయైన శ్రీమన్నారాయణుని నోరు తెరిచి కీర్తిస్తూ పాడినచో మన కోరికను (పఱై) అను దానినిచ్చును. ధర్మానికి ప్రతిరూపమైన శ్రీరామునిగా మన స్వామి ఇదివరలో అవతరించెను. అప్పుడీ స్వామిచే మృత్యుముఖమున త్రోయబడ్డ కుంభకర్ణుడు ఒకవేళ నీతో నిద్రలో పోటీపడి నీవలెనే నిద్రపోలేక ఓడిపోయి తన పెద్దనిద్రను కూడా నీకే ఇచ్చివేసెనా ఏమి? లేకపోయినచో అంత బద్ధకమేమిటమ్మా? నీతో కలిసిననే మా గోష్ఠి పూర్ణమగునట్లు శిరోభూషణమైన దానివి గదా నువ్వు. తొట్రుపడక తెలివితెచ్చుకుని వచ్చి జాగ్రత్తగ తలుపును తీయుము.

విశేషార్థము : ఈరోజున శ్రీ ఆండాళ్ ఐదవ గోపికను మేల్కొలుపుతుంది. ఈమె గొప్ప సౌందర్యవతి. గోపికలందరూ కృష్ణుని కోసం నానా పాట్లూ పడుతూ ఉంటే ఆ కృష్ణుడే ఈమెకోసం అన్నిపాట్లూ పడుతున్నాడట. పైగా ఈమె ఇంటికి ప్రక్కనే శ్రీకృష్ణుని మేడ కూడా ఉంది. మధ్యలో గోడ ఒక్కటే అడ్డు. కోరినప్పుడల్లా గోడదూకి లోనికి ప్రవేశించి ఆటలాడుకుంటాడట. ఎంత పిలిచినా ఆ గోపిక వెలికి రాలేదు. 'ఎందుకు రాడు



కృష్ణుడు చూద్దాం' అని నిర్భరురాలై ఆమె ఉన్నదీ అంటే కృష్ణుడే ఈమె కోసం నోము నోచినట్లు ఉంది అని ఆమెను లేపడానికి వచ్చినవారందరూ అనుకుంటున్నారు. అంత గొప్పదైన ఈమె తమ ముందుంటే కృష్ణుడు త్వరగా అనుగ్రహిస్తాడని వీరందరూ లేపడానికి వచ్చారు.

'పరమాత్మయే ఆనందాన్ని పొందిస్తాడు' అనే ఉపనిషద్వాక్యాన్ని విశ్వసించిన జ్ఞానులు స్వప్రయత్నాన్ని విరమించిన 'సిద్ధోపాయనిష్ఠులు' పరమాత్మానుగ్రహం మీదనే వీరందరూ ఆధారపడతారు. 'తేషా మేవాను కంపార్థ మహమజ్ఞానుజం తమః నాశయామి ఆత్మ భావస్థః జ్ఞానదీపేన భాస్వతాః', 'తనయందు ప్రేమకల హృదయాన్ని స్వగృహంగా కూర్చుకొని వారి అజ్ఞానాన్ని పోగొట్టే జ్ఞానదీపాన్ని నేనే వెలిగించుకుంటున్నాను' అని అన్నాడు కృష్ణభగవానుడు.

'ప్రాజ్ఞేనాత్మనా సంపరిష్యక్తః నాంతరం కించన వేద న బాహ్యం' ఆనందమయుడు, అపరిమితానందము గల పరమాత్మను జ్ఞానులు తమలో దర్శిస్తారు. క్షుద్ర సుఖాసక్తికి దూరమైపోతుంది. దేహమనే తమ ఇంటిలోనే కృష్ణునితో వారు చేరి యుంటారు. బాహ్యసుఖాలన్నీ వారికి పగటి దివిటీలే. వీరికి శ్రీకృష్ణతత్వం బాగా తెలిసిందన్నమాట. అట్టివారికి 'తేషాం రాజన్ సర్వయజ్ఞా స్సమస్తాః' అన్ని యజ్ఞాలు చేసినట్లే, అన్ని కర్మలూ ఆచరించినట్లే అంటుంది భారతం.

పురుషోత్తముడని శ్రీకృష్ణుని కీర్తించినవారు కృతకృత్యులు.

కృత్య = చేయవలసినవన్నీ, కృత = చేసినవారు అని అర్థం. చేతనా చేతనాలతో కూడి ఉన్న ఈ సంసార వృక్షాన్ని సృజించి పోషించి విశ్రాంతినిచ్చే పరాత్పరుడే పురుషోత్తముడు. చేసేవాడు అతడే అయినపుడు, జీవుడు నేనేదో చేస్తున్నాననీ అహంకరించడం అజ్ఞానం. భగవానుని ప్రయత్నానికి అణిగి ఉండడమే కృతకృత్యత. లోపల నిద్రిస్తున్న గోపిక కృష్ణుని ఉపాయత్వాన్ని పూర్తిగా విశ్వసించిన కృతకృత్యురాలు. సిద్ధోపాయనిష్ఠ కనుక లేవలేదు. బయట లేపడానికి వచ్చినవారికి కూడా ఈ విషయం తెలుసు. భగవద్గీతలో కర్మ జ్ఞాన భక్తి యోగాదులన్నీ తరించే ఉపాయాలని చెప్పి చివరికి అవన్నీ వదిలి నన్నే అమోఘమైన ఉపాయంగా 'శరణం వ్రజ' ఆశ్రయించమని అన్నాడు. అంటే మిగిలినవాటిని అన్నిటినీ వదిలివేయమని కాదు. సిద్ధోపాయమైన తాను అన్నింటికంటే సులభంగా, గొప్ప ఫలాన్ని ఇస్తానని, కర్మాదులు కూడా తన వల్లే ఫలించాల్సి ఉన్నవనీ, తననే ఆశ్రయిస్తే నేరుగానే కోరికలిస్తానని అన్నాడు. అంతటి ప్రతిజ్ఞను చేసిన వానిని పట్టుకున్నాక ఇక మనకు ఫలం సిద్ధించడంలో ఆలస్యం ఏమి ఉంటుంది? వానికి చేతకాకనా విలంబం? తెలివి లేదనా? ఆ రెంటికీ లోపం లేనప్పుడు వెంటనే ఫలం లభించాలని బయటివారు ఆరాటపడతారు. వీరి ఆరాటానికి వారు చేసే ప్రయత్నాలు సూచకాలు. వీటిని ఉపాయ బుద్ధ్యా వీరు చేయరు. అంతే కర్మలు వీరు ఆచరించినా అవి భగవత్కైంకర్యాలని పిలుస్తారు. జ్ఞానయోగం ఉంటుంది. కాని వీరికి ఇది స్వరూప జ్ఞానంలో చేరుతుంది. వీరికి భక్తియోగం ఉంటుంది. జీవునిలో చైతన్యం ఒకటి ఉంది. అది ఊరకనే ఉండనివ్వదు. కాబట్టి ఆ మాత్రమైనా ఆర్తి పడతారు. అది దోషం కాదు. అందుచేతనే బయటవారు లోపల ఉన్న గోపికను నిద్ర లేపుతున్నారు. వారి జ్ఞానాన్ని, అనుభవాన్ని తమకు ప్రసాదించమని ప్రార్థించారు.

స్థితప్రజ్ఞావస్థలో నిన్న లేపబడ్డ గోపిక వశీకారావస్థలో నుండి శ్రీ శుకుని వలె అన్ని రకాల సుఖాల మధ్య ఉన్న వాటిలో పట్టింపులేక భగవతత్పరత కలిగి ఉండిపోయింది కదా! ఈ గోపిక వానికి క్రింద అవస్థ అయిన 'ఏకేంద్రియావస్థ'లో నున్న మహాజ్ఞాని. దీనిని రెండవ అధ్యాయంలో కృష్ణుడు –

'దుఃఖేష్వనుద్విగ్నమనాః సుఖేషు విగత స్పృహః
వీతరాగ భయః క్రోధః స్థితధీః మునిరుచ్యతే'

అన్నాడు. గురువుల ఉపదేశంచే లభించిన భగవత్సంబంధ జ్ఞానం వీరిలో స్థిరపడింది. అది వీరికి ఒక కవచం లాగా ఉంది. లోనున్న పరమాత్మనే జీవుడు పరతంత్రుడని, వాని ప్రయోజనమే తప్ప, తనకంటూ ఏమీ లేదనే ప్రజ్ఞ అదే ఒక రక్షణా వలయం. వీరు అందులో సంతత మననాభ్యాసం వల్ల చేరుతారు. వీరినుండి రాగ భయ క్రోధాలు బయటికి పోతాయి. రాగ ద్వేషాల వల్ల కలిగే సుఖ దుఃఖాలు వీరు పొందరు. వీరు నిశ్చలంగా జడభరతుని లాగా ఉన్నారు. జడుని వలె ఉన్న జడ భరతుణ్ణి పట్టుకుపోయి పల్లకీ మోయమన్నా, తిట్టినా రహూగణుని ఏమీ అనలేదు. పైగా అతడు తత్త్వాన్ని బోధించాడు. లోపల కృష్ణ సౌఖ్యంలో నున్న గోపికను ఆండాళ్ లేపుతోంది.

ప్రస్తుత నోముకి ఫలం కృష్ణానుభవమనే స్వర్గం. దానిలో నీవు ప్రవేశిస్తూనే ఉన్నావమ్మా. తలుపుతీయకపోతే మానే. నోరైనా తెరవరాదా? అన్నది ఆండాళ్. బాగుపడే జీవికి జ్ఞానుల రూపదర్శనం కంటే వారి శ్రీసూక్తులను వినడమే ప్రథమ కర్తవ్యం. సూక్తుల వల్ల సత్తా నిలుస్తుంది. రూపం చూస్తే అహంకారం తొలగుతుంది. మా సత్తా నీ అధీనం అంది ఆండాళ్. స్వామి ఉనికిని ఎంత దాచినా తులసిమాల పరిమళం ఎవరూ దాచలేరు. పుష్పం దాగినా పరిమళం దాగుతుందా! తులసి వంటి సహజమైన భగవత్ప్రేమ పరిమళం జ్ఞానులలో దాగదు కదా! అతను కావలి గది తలుపులు దాటి లోనికి వచ్చే వీలులేదు అంటున్నావా తల్లీ. అతని పేరు 'నారాయణుడు'. ఏ తలుపులూ అతనిని అడ్డుకోవు. 'అంతర్బహిశ్చ' వ్యాపించినవాడు. మాలోనూ ఉన్నా 'తప్పదు కనుక' అంటాడు. నీవంటి జ్ఞానులలో వత్సలుడై, భోగ్యుడై కదమ్మా ఉన్నది. జ్ఞానులంగీకరిస్తే ఆశ్రితులను స్వామి రక్షిస్తాడనే తులసిని కిరీటాన ధరించాడు. అమ్మా స్వామి కృపకు మనం శ్రమించవలసిన అవసరం లేదు. ఎదురు తిరగకుంటే రక్షిస్తాడు. జన్మ తారతమ్యాలు చూడనివాడు మన స్వామి. మొక్కుబడులను ఆశించనివాడు. స్వామి అంగీకరిస్తే స్వామి కాదనడు. నీవు నిదుర వదిలి రమ్ము. అనుగ్రహించు. మేం తరిస్తాం. నిద్ర కుంభకర్ణుని మృత్యువులోకి తోసింది. అయితే ఈమెది కుంభకర్ణుని వలె తామస నిద్ర కాదు. సాత్విక నిద్ర. పరమయోగుల నిద్ర ఇది. భగవదనుభవంతో మనసు నిండి కలిగే నిద్ర ఇది. నీవు నాయికా మణివంటి దానవు. తేరుకొని వచ్చి తలుపు తెరువు తల్లీ. మా అజ్ఞానాంధకారాన్ని దూరం చెయ్యి అని ప్రార్థించింది ఆండాళ్.

## 11వ పాశురము

కత్తుక్కఱవై క్కణంగళ్ పలకఱన్దు,
శెత్తార్ తిఱలళియ చ్చెన్ఱు శెరుచ్చెయ్యుమ్,
కుత్త మొన్ఱిల్లాద కోవలర్ దమ్ పొఱ్కొడియే!
పుత్తరవల్ గుల్ పునమయిలే! పోదరాయ్,
శుత్తత్తు త్తోళిమారెల్లారుమ్ వన్దు, నిన్
ముత్తమ్ పుకున్దు ముకిల్ వణ్ణన్ పేర్ పాడ,
శిత్తాదే పేశాదే శెల్వ ప్పెండాట్టి, నీ!
ఎత్తుక్కుఱంగుమ్ పొరుళేలో రెమ్బావాయ్

తాత్పర్యము – చక్కని వయస్సులో ఉన్న పశువుల యొక్క అనేక మందల యొక్క పాలను ఒక్కొక్కరే పితుక గలిగిన బలము కల వారున్నూ, ఎదిరించిన శత్రువుల వద్దకే వెళ్ళి వారు

నిర్వీర్యులగునట్లు యుద్ధము చేయు సామర్థ్యము కలవారున్నూ, ఏ రకమైన అధర్మములు చేయక పరిశుద్ధులైయుండెడి గొల్లల యొక్క సద్వంశమున జన్మించిన ఓ బంగరుతీగా! తన పు ట్టలో నిర్భయముగా విప్పుకొనిన పాము యొక్క పడగవలె విశాలమైన జఘన ప్రాంతము కల సుందరీ! అడవిలో స్వేచ్ఛగా తిరుగాడుచుండెడి సుందర నెమలివలె ప్రకాశించుదానా! త్వరగా విచ్చేయవమ్మా! మేమిట్లు నిన్ను పిలుచుటతో చుట్టూ ఉండే మన చెలికత్తెలందరూ గూడ లేచి వచ్చి, నీ వాకిటలో చేరి, నీవింకా లేవకపోవుటచే, నిను పోలిన నీలమేఘవర్ణుడైన శ్రీకృష్ణుని గూర్చి పాడుతున్నప్పటికిన్ని, నీవు ఉలుకూ పలుకూ లేకుండా అలా నిదురపోవు చుండుట తగునటమ్మా! నీవైశ్వర్యవంతురాలవైనందుకు ఇదేనా చేయదగిన పని?

విశేషార్థము : ఆరవ గోపబాలిక అత్యంత విలక్షణమైన యోగ్యత కల కృష్ణప్రియ. ఆమెను ఆండాళ్ ఈరోజు మేల్కొలుపుతోంది. భగవానుడు మనలో దోషాలను కూడా చూస్తాడు లేచి. కాని భక్తులు, మనలో యోగ్యత లేకున్నా దానిని కలిగించి మరీ ఉజ్జీవింప చేస్తారు.

చేసే ప్రతి పనిలోను విజయాన్ని కోరే మానవునికి శ్రీకృష్ణుడు సులభమైన ఉపాయాన్ని చెప్పాడు. అతని ఆరాధన రూపముగా తన విధులను ప్రపంచములో జరుపుకు పోయేవారికి శ్రీకృష్ణుడే విజయాన్ని చేకూర్చి పెడతానన్నాడు. జనక మహారాజు అట్టివాడు.

కర్మల నాచరించక తప్పదు ప్రతివానికీ. స్థితప్రజ్ఞుడై ఆచరించాలి. ఏదైనా అనుభవిస్తూ ఉంటే అది సుఖాన్నో దుఃఖాన్నో ఇస్తుంది కదా. వాటిని పొందినా సుఖాన్నిచ్చేదానిని పొగడడు. పొగిడితే ఇంకా కావాలని అర్థం కదా. మనసులో ఆకాంక్ష వానికి ఉండదు కానీ, సుఖాన్నిచ్చేవి పొందుతాడు. అలానే దుఃఖాన్నిచ్చేవీ ఎదురౌతాయి. వాటినీ అనుభవిస్తాడు. మనవలె వాటిని ద్వేషించడు. అంటే వానికి స్నేహములో నున్న పరమాత్మ యందే తప్ప బయట వానిపై ఉండదు. బయట వాటినే ఊరికే తలచుకుంటూ కూర్చోడు. రాజ్యాన్ని పాలించే జనకునిలో యాజ్ఞవల్క్యుని శిక్షణ వల్ల ఇట్లాంటి నిష్ఠ ఉండేదిట. ఈ రకమైన స్థితిని 'వ్యతిరేకావస్థ' అంటారు జ్ఞానదశలలో.

అన్ని కర్మలను బుద్ధి నైపుణ్యంతో ఆచరిస్తారు. కర్మ సు'యోగః కౌశలం' బుద్ధి కుశలురకే కర్మ యోగముగా మారుతుంది. 'యోగం' అంటే 'సమత్వం యోగ ఉచ్యతే' జయాపజయాలలో యోగికి మనస్సు నిర్వికారంగా నిలచును. అంటే విధి నిర్వహణలన్నీ భగవత్సేవగా మార్చి, భావనలన్నీ వాని సేవ వల్ల కలిగే ఆనందాన్ని పొందేవిగా మలుస్తారు. అప్పుడు వారి విధులన్నీ వారికి అందాన్నిస్తాయి. భగవానుడే వీరి బాధ్యతలు తీసుకుంటాడు. కనుక వారి సంపదలు అపరిమితం. గొప్ప కృష్ణైశ్వర్యం వల్ల వంశకీర్తి పెరుగుతుంది. అంటే అందమూ, ఐశ్వర్యమూ, వంశకీర్తి (అభిజాత్యము) ఇవి మూడూ వస్తాయి. ఈ రోజు లేపబడే గోపికలో ఈ మూడూ ఉన్నాయి. నందవ్రజంలో కృష్ణుడొక్కడే పురుషులలో చెప్పదగిన వాడైతే గోపికలలో ఈ గోపిక అంత గొప్పదిగా చెప్పదగినదట.

భగవానుడే తన సర్వస్వము, కృష్ణుడే మా సర్వము అనుకొనే వారు ప్రపన్నులు. వారందరిదీ ఒకే కులం. కర్మ, జ్ఞాన, భక్త్యాది నిష్ఠల వల్ల కలిగే కులం మనిషికి దర్పాన్ని కలిగిస్తే ప్రపన్నులుగా భగవన్నిష్ఠ ఏర్పడిన వారికి సౌమ్యత్వం, వినయం, ప్రేమ ఏర్పడుతాయి. ఇవన్నీ కలవారంతా ప్రపన్న కులానికి చెందినవారు. మన గోపికలు అలాంటివారు.

కృష్ణుని సేవ అనే ఐశ్వర్యం వల్ల ఈమెలో అద్భుత సౌందర్యమున్నది. అందమంటే పరులను వశీకరించుకొనేది. జీవునికి అందం పరాత్ పురుషుడైన పరమాత్మను వశం చేసుకోగలిగేది ఉన్నప్పుడే కదా ప్రకాశించేది.

ఈనాటి గోపబాలిక ఆత్మసౌందర్యంతో పాటు దేహ సౌందర్యాన్ని కూడా అద్భుతంగా ఆండాళ్ వర్ణించింది. జ్ఞానుల యొక్క భాగవతుల యొక్క దేహ సౌందర్యం కూడా మనకు ఉపాదేయమే. ఓ గోపకుల బంగారుతీగా మీ వంశ గౌరవం ఘనమైనది. దూడలను కన్న లేత ఆవుల మందలనేకములున్నవి. భగవదనుభవం చేసే నిత్యసూరులు పరమపదంలో ఇరవై ఐదు వర్షముల ప్రాయములో ఉంటారు. అలానే సంతత శ్రీకృష్ణుని స్పర్శ చేత స్వామి మురళీ రసాస్వాదన చేత పెరుగుతున్నది. కనుక ఎన్ని ఏండ్లు గడిచినా, ఎన్నిసార్లు వినినా లేత దూడల వలె క్షీరసమృద్ధి కలిగి వుంటాయి.

స్వస్వరూపం ప్రకాశించిన జ్ఞానికి వయస్సెప్పుడూ ఇరువది అయిదే. అంటే (24 తత్వాలతో కూడిన దేహం) చెప్పబడింది. మ = జ్ఞానము, మ = తెలుసుకొనుట. ఇవి రెండూ కల ఆత్మ మ కారముతో చెప్పబడుతుంది. ప్రకృతి విలక్షణమనీ, ప్రకృతి నశించినట్లు ఆత్మ నశించదనీ భగవంతునికే చెందినదనీ ఓంకారములో స్పష్టం. అవి సాక్షాత్కరించుకొన్న వారు కదా నిత్యులు. దానిని గుర్తించేవారే జ్ఞానులు. కనుక వారెప్పుడూ 25 సంవత్సరముల వారే. శ్రీరాముని చూచుకొని తన అరవై వేల సంవత్సరాల వార్ధక్యాన్ని మరచి దశరథుడు యవ్వనాన్ని చెందినట్లు ఉండేవాడట. అలాంటి లేతవయస్సు కల గోవుల మందలు కూడా ఇన్నని లెక్కింప వీలు కాకున్నది. ఏమి నీ గో సంపద, అంటోంది ఆండాళ్ ఈ పాశురంలో గోపికని.

లోకంలో లెక్కకందని సంఖ్య కలవి కొన్ని ఉంటాయి. ఆత్మకి గడచిన జన్మలెన్ని? భగవానుని అవతారాలెన్ని? శ్రీరాముని గుణాలెన్ని? మన శ్రీకృష్ణుని దుండగీడు చేష్టలెన్ని? ఎడారిలో ఇసుక రేణువులెన్ని? నింగిలో తారలెన్ని? ఇవన్నీ ఎవరైనా

లెక్కించ గలిగితే ఈనాటి గోపబాలికకు గల పశువుల మందలనీ లెక్కించగలమట. అంత సంపద.

గోవులంటే వాక్కులు. వాక్కు యొక్క మార్పే శాస్త్రం వాఙ్మయం. అదే వేదము. దాని దూడలే అంగములు. ఇక వేల గోపకులు భాగవతులు, శాస్త్ర సార గ్రాహులన్న మాట. ఎందరినో జ్ఞానులను తరింపచేసే ఆచార్యులన్నమాట. ఈనాడు మేల్కొల్పబడుతున్నారు. మనలను అనుగ్రహించమని ప్రార్థింపబడుతున్నారు.

ఈ గోపిక వంశీయులకు భుజబలం మెండు. ప్రపంచాన్ని పరమాత్మ ఒక్కడే సృష్టించినట్లు ఒక్క గోపకుడే అన్ని ఆవుపాలను పితుకుతాడు. పాలం కోసం ధర్మము కాదు. వాటి చేపునకు బాధపడితే చూచి జాలితో పితుకుతారు. శ్రీకృష్ణునికై పితుకుతారు. ఇది వారి వృత్తి. వీరు శత్రువున్న చోటికి వెళ్ళి, వారి బలాన్ని అణచివేస్తారు. అదే వీరి గొప్పదనం. శత్రువు వస్తే ఆత్మరక్షణ చేసుకోవలసి రావడం కూడా చేతకాని తనమేనట. అటువంటి వీరులున్నారనే రాత్రికి రాత్రే బయలుదేరి ఇక్కడకు చేరారు. వీరిచ్చిన శిక్షణ వల్లనే కంసుడున్న చోటికి పోయి మరీ చంపాడు మన కృష్ణుడు. అటువంటి గొప్ప వంశంలోని వాడవయిన నీవు మా ఆటంకాలు తొలగించాలి కదా. వీరు శత్రువులు కాదు అని లోపలి నుండి ఆమె పలికింది. నిజమే మేము శత్రువులం కాము. అందుచేత మా దగ్గర బింకం ఎందుకు? ప్రియులతో కూడా శత్రువుల వలె దూరంగా ఉండడం తగునా? లేచి రావేల? అంటున్నారు.

వీరు జ్ఞానులు. వేదశాస్త్ర సారగ్రాహులు. వీరూ శత్రు సంహారం చేస్తారు. మొదట శత్రువు మనకి శరీరం. కూడనివి కోరి పాడు చేస్తుందీ శరీరం. సుఖాలకు మరిగి ఆత్మజ్ఞానాన్ని నశింపచేసేదీ ఈ శరీరమే. దీనిని పాములా చూడమన్నారు పెద్దలు. శరీరంలో బంధించే కర్మలు గత జన్మనుంచి వచ్చిన వాటిని 'సంచితములు' అనీ, చేస్తున్నదానివల్ల భవిష్యత్తులో రాబోయే వాటిని 'ఆగాములనీ' రెండు రకాలు. జ్ఞానులు ఉపదేశం ద్వారా మంత్రార్థాన్ని తెలిపి సంచితాలను నశింపచేస్తారు. ఆగాములంటనట్లు చేస్తారు. వారి జ్ఞానబలం వల్ల ఆ పని చేయగలుగుతారు.

శత్రు సంహారం దోషమే కదా! అనిపిస్తుంది. సామాన్యులకైతే ఏమో గాని ప్రభువులకు శత్రు సంహారం ఒక విధి. 'విహితమైనది చేయడమే ధర్మం'. మనకు మంచిదనిపించిందల్లా చేయడం అధర్మం. ఈ గోపకులు ఏమి చేసినా కృష్ణునికే చేస్తారు కాబట్టి వీరిది నిష్కళంకమైన వంశం. గోప కులమంతటికీ ఈమె బంగారు తీగె. ఆలంబన మీద ఆధారపడేదే తీగ. నీవు స్వంత అనుభవం మాని మాతో చేరి కృష్ణానుభవాన్ని మాతో పొందాలి కదా! అతిలోక సౌందర్యవతీ! నీ అందం కృష్ణుణ్ణి మా వద్దకు తీసుకువస్తుందని అనుకుంటున్నాము. కానీ విడదీస్తోంది. భాగవతులు ఏకాంతానుభవం చేయరు. పురుషోత్తముని ఆకర్షించేది మనలోని పరమభక్తి, ప్రవృత్తి నివృత్తులకు మధ్యనున్నదే వైరాగ్యం. అంటే విషయ విరాగంతో బాధారహిత ప్రవృత్తి కలిగి, ఇతర విషయ విరక్తి కలిగి కర్మలలోని నిస్వార్థ ప్రవృత్తి కలిగిన స్థిత ప్రజ్ఞునికి ఉండే భగవద్వ్యామోహమే స్వామికి ఆనందదాయకం. ఆ సౌందర్యమే పరమాత్మకి ఆనందదాయకం. ఆ సౌందర్యం ఆమెలో ఉంది. నీవు లేచివస్తే మన గోష్ఠి సనాథమై శోభిల్లుతుంది. నీవు నెమలి వంటి దానివి. మేమూ నీలిమేఘవర్ణుని గానం చేస్తున్నాము. నీవు పురివిప్పి నాట్యమాడినట్లు మాకు దర్శనమివ్వాలి. కానీ ఉలుకూ పలుకూ లేదే.

భగవంతుని తోడి ఏకాంత అనుభవం దుఃఖాన్ని కలిగిస్తుంది. భక్తులలో చేరినప్పుడే అనుభవం పరిపూర్ణమవుతుంది. స్వామికి ప్రీతి కలగాలంటే నీవు మాలో చేరాలి. నీవు స్వామిని సేవించేటప్పుడు మేము మీ ఇరువురినీ సేవించాలి కదా. స్వయంపాకం మాని తదీయారాధన చేరాలి కదా అంటూ భగవదనుభవజనిత ప్రీతితో సర్వము మరచి దేనియందూ స్నేహము లేకుండా ఉండడం, అనగా భక్తులతో స్నేహాన్ని మానమని కాదు. భగవత్ప్రేమకు వారు సహకారులు. అది లేనివాటిలో అనభి స్నేహముండదగునని స్థిత ప్రజ్ఞత లోని వ్యతిరేకావస్థను వర్ణించినది ఆండాళ్. ఆరవ గోపబాలిక గోష్ఠిలో వచ్చి చేరినది.

## 12వ పాశురము

కనైత్తిళం కత్తెరుమై కన్ఱుక్కిరంగి,
నినైత్తు ములైవళియే నిన్ఱుపాల్ శోర,
ననైత్తిల్లమ్ శేఱాక్కుమ్ నఱ్చెల్వన్ తంగాయ్!
పనిత్తలైవీళనిన్ వాశల్ కడైపత్తి,
శినత్తినాల్ తెన్నిలంగై క్కోమానై చ్చెత్త,
మనత్తుక్కినియానై ప్పాడవుమ్ నీవాయ్ తిఱవాయ్,
ఇనిత్తా నెళున్దిరాయ్ ఈదెన్న పేరుఱక్కమ్,
అనైత్తిల్లత్తారు మఱిన్దేలో, రెమ్పావాయ్.

తాత్పర్యము – యుక్తమైన చిన్నవయస్సునందున్న గేదెలు, తమయొక్క దూడలు పాలు త్రాగుటకై రాకపోవుటచే పొదుగుల బాధచే అరచుచు, ఆ దూడలు వచ్చి త్రాగుచున్నవనే భావనతో తమ స్తనముల ద్వారా విడుపులేని ఏకధారగ పాలు కార్చుచు నీ ఇల్లంతా బురద చేసివేస్తున్నాయి. ఇట్టి అధిక సంపద కల్గి, కృష్ణుని విడువక ఉండెడి గోపవీరుని చెల్లెలా! క్రింద బురద కాగ, మా తలలపై చల్లని మంచు తడిపి వేయుచున్ననూ, నిన్ను విడిచిపోలేక నీ చూరు పట్టుకొని వ్రేలాడుచున్నాము. తన వస్తువును దొంగిలించినాడనే కోపముతో నయనానందకరముగా

నిర్మింపడిన లంకాపట్టణ ప్రభువైన రావణుని చిత్రవధ చేసిన మనోరంజకుడగు శ్రీరాముని గూర్చి పాడుచున్నాము. అయిననూ నువ్వు నోరు తెరవ కున్నావే! ఇకనైనా లేచి రావమ్మా. అబ్బ ఇదెక్కడి పెద్ద నిద్ర? ప్రక్కిళ్ళ వాళ్ళంతా లేచివచ్చి నీ మొద్దు నిద్రను గురించి తెలుసుకుంటున్నారులే.

విశేషార్థము : శ్రీకృష్ణుని ముఖోల్లాసమే పరమావధిగా గల ఒక గోపాలుని చెల్లెలిని ఆండాళ్ మేల్కొలుపుతోంది. ఈ ఏడవ గోపిక సంపద విలక్షణమైనది. వీరి స్వధర్మం పశుపాలన. అది చేసిన గోపకుని పిల్ల నిన్నటిది. ఈనాటి ఈమె అది కూడా మానినవాని చెల్లెలు.

శరీరమేర్పడినది కర్మాచరణకు. కర్మాచరణ వల్ల మనో మాలిన్యాలు తొలగిపోతాయి. జ్ఞానం భగవద్భక్తిగా పండుతుంది. భగవదనుగ్రహం పొందడానికి దోహదమవుతుంది. కనుక కర్మలు ఎవరికీ వదలరానివేనంటాడు శ్రీకృష్ణుడు. 'సర్వధర్మాన్ పరిత్యజ్య' – అన్న చరమ శ్లోకంలో వదలమన్నది కర్మలను కాదు, కర్మలను పూర్తిగా మానడం సన్యాసం కాదు. అది తామస త్యాగం. కష్టమైనవేవో వాటిని మానడం రాజసత్యాగం. నేనే ఫలభోక్తననుకొనే బుద్ధిని వదలాలి. ఫలసంగ కర్తృత్వములనే మాటలను వదలి భగవదాజ్ఞచే భగవత్ప్రీతికరమైన నేను భగవత్సేవ చేస్తున్నాననుకొంటూ చేయడమే సన్యాసం. ఇదే సాత్విక త్యాగం. ఇది నిన్నటి గోపాలుని స్థితి.

శ్రీకృష్ణుని కోసం ఈనాటి గోపాలుడు స్వధర్మాన్ని కూడా వదిలాడు. ఇది విశేష ధర్మం. గోపాలురకు శ్రీకృష్ణుడే ఉపాయం – ఫలమూ కూడా. ఇతర ఉపాయాలను ఆశ్రయించరు. ఇతర ఫలాలను కోరరు. ఇక స్వధర్మమైనా కృష్ణ సేవకు అడ్డు రానంతవరకూ అతని కోసమే చేస్తారు తప్ప అదే ప్రయోజనమని చేయరు.

వీరు చేయడం మారు మానడం రెండూ సాధనాలు కావు. కృష్ణానుగ్రహమే వీరికి సాధనం. ఫలం అతడే. కర్మలు భరతుని కర్మలు, లక్ష్మణుని కర్మలు అని రెండు రకాలు. ఇరువురికీ రామ ప్రేమ సమానమే. అయినా రామప్రేమ భరతుని ఒకచోట నుండి పాలన సాగించేట్లు చేసింది. అదే లక్ష్మణుని విషయంలో రాముని వెంట తిరిగేటట్టు చేసింది. రామసేవకు అడ్డువచ్చిన నిత్యకర్మలను కూడా వదిలాడు.

లక్ష్మణునిలా నిరంతరం కృష్ణసేవలో ఉండి భుజంపైన చేయి వేయించుకునేటంత ఆప్తుడైన గోపాలుని ఇల్లిది. కృష్ణ సేవలో మునిగి పశుపాలనాది స్వధర్మమును కూడా మరచాడు. మానితే దోషం రాదా? రాదట. నిజమైన భగవత్కైంకర్య నిష్ఠులకు ఇది సమర్థనీయమే. ఇది స్థితప్రజ్ఞతకు మొదటి మెట్టు. దీనిని యతమానావస్థ అంటారు. ఇంద్రియాలకు విషయాలపై పోవాలని తెలుసు. కాని కృష్ణప్రేమ అడ్డు వచ్చి విషయములు ప్రమాదమని భావించి వెనుకకు లాగుతూ ఉంటుంది. ఇది సాధనలో మొదటిది. ఆఖరిదైన వశీకారావస్థకు చేరువవును. అట్టి జ్ఞానుల కృప మనపై పడడం వల్ల మనలో స్థితప్రజ్ఞత్వం అంకురిస్తుంది. వారెలా ఉంటారో ఈ గోపికను మేల్కొలుపుతూ ఆండాళ్ వివరిస్తోంది.

'సత్సంపదలు కలవాని చెల్లెలా! లేగదూడలు గల గేదెలు కట్టువిప్పువారు లేక తన లేగలను తలచుకొని పాలు చేపునకు రాగా పితుకువారు లేక బాధ భరించలేక, వాత్సల్యం పొంగి, పొదుగుల నిండా ఏకధారగా పాలవృష్టి కురిపిస్తున్నాయి. ఈ తలంపు ప్రేమచే ఎప్పుడూ ఉంటుంది. కనుక పాలధారలు ఆగవు. ఆవుకంటే గేదెకు దూడపై ప్రేమ అధికం. జ్ఞానం కల జీవునికి భగవంతునికి చెందినవాడననే జ్ఞానంతో చేసే సేవ నిజమైన సేవ. పశు పక్ష్యాదుల కంటే విలక్షణమైన ఈ జ్ఞానమే గుర్తింపు మానవునికి గొప్పతనాన్ని ఇస్తుంది.

కృష్ణుని వల్ల కలిగినవే ఆత్మలకు సత్సంపదలు. వాటిని అనుగ్రహించే కృష్ణుడు తన ఆశ్రితులకు ఎంత ఇచ్చినా ఇంకా తక్కువ ఇచ్చాననే బాధపడతాడు. ఏ కాస్త పుచ్చుకున్నా వారిని ఉదారులు అంటూ కీర్తిస్తాడు గీతలో. భగవత్ జ్ఞానం కల మహానుభావులకు ఆర్తి కల జీవులను బాగు చేయాలనే వాత్సల్యం ఉంటుంది. ఆర్తజీవులు దూడల వలె తమ బాగుకై ఏమీ చేసుకోలేరు. ఈ జీవులందరూ దూడలే. శరీరమనే కర్రకు కర్మ అనే త్రాటితో కట్టుబడి ఉంటారు. మనకై మనం వదిలించుకోలేని అశక్తులం. జ్ఞానులు విడిపించాలి. ఈ జీవులు కోరరు. జ్ఞానులు అనుగ్రహించినా స్వీకరించలేని మూర్ఖులు కావచ్చు. అయినా వారి వాత్సల్యం ఆగదు.

గేదెలు నాలుగు శిరముల గుండా పాలు వర్షించినట్లు జ్ఞానులున్నూ నాలుగు కారణాల వల్ల జ్ఞాన ధారలు కురిపిస్తారు.

1. పూర్వుల ఆస్తిని సంతానానికి అందించినట్లు పెద్దల ఉపకారాన్ని స్మరించి ఎవరో కొందరికి విధిగా భగవత్ జ్ఞానాన్ని కొందరందిస్తారు.
2. అడిగితే వద్దన్నా ధనమిచ్చినట్టు భక్తులు అడిగితే ఆర్తి ఉందని కొందరు ఉపదేశం చేస్తారు.
3. అడుగుతున్నా ఒకని బాధ గుర్తించి తీర్చే ప్రయత్నం చేసినట్టే తననాశ్రయించుకున్నా అపమార్గంలో పోయేవానిని సన్మార్గంలో పెట్టడానికి ఉపదేశిస్తారు కొందరు.
4. అసలు వాడడగకున్నా తన వద్ద ఉన్నది ఇచ్చినట్టే కేవలం వాత్సల్యమే ప్రధానంగా చెప్పనిదే నిలువలేక చెబుతారు కొందరు.

నీటి పాలధారల వల్ల నేలంతా ముద్దయిపోయింది. పైన మంచు ధారగా కురుస్తోంది. మదిలో మాధవుని గుణ ప్రవాహం సాగుతోంది. మూడు ప్రవాహాలకూ నిలువ లేకను ఇంటి గడప

ప ట్టుకొని నిలబడ్డాము తల్లీ! క్రింది జ్ఞానులయిన ఆచార్యుల ఉపదేశాలు. పైన కురుస్తున్న మంచు ఆళ్వార్ల శ్రీసూక్తి ధార. పగటి ఎండచే ఆవిరి అయిన నీరే చంద్రకాంతితో మంచుగా నేలమీదికి కురుస్తుంది. సూర్యుని వంటి తీక్షత కలవాడు భగవానుడు. శాస్త్రాలలో ఉండే అతని గుణాల గీతాదులలో తాను అందించినా అవి ఎండవలె మనకి సహించడానికి వీలు కావు. అసూయ కలిగిస్తాయి. సూర్యకాంతితోనే వెలుగొందే చంద్రునిలాగా భగవదనుగ్రహం కలిగిన చల్లని హృదయం ఆళ్వార్లది. అవే భగవద్గుణాలు. ఆళ్వార్లు ప్రబంధాల ద్వారా మంచులాగా చల్లగా కురిసి మన మనస్సులలో భగవత్ప్రేమను పంచి పెడతాయి. ఈ మూడు ప్రవాహాలలో నిలకడకై పెట్టిన గుమ్మమే నారాయణ మంత్రములోని 'నమః'. అది భగవంతుని గుణానుభవంలోని దోషాలను తొలగించి, భాగవతులతో కలిసి భగవానుని ప్రీతికై సేవించేటట్టు చేస్తుంది. అమ్మా! విభీషణాదులు సీతమ్మను ఓదార్చినట్లు నీవూ మమ్ము చేరవద్దా! మమ్మ రక్షింపవద్దా! స్త్రీలను ఏడిపించి సరదాపడే కొంటెవాడు శ్రీకృష్ణుడని లోపలి ఆమె మాట్లాడలేదు. ఆమె తృప్తికై, స్త్రీ విరహవేదన ఎరుగని కృష్ణుని మాని స్త్రీ దుఃఖాన్ని నివారించడానికి ఏదైనా చేయడానికి సిద్ధపడ్డా శ్రీరాముని కీర్తిద్దామని ఆండాళ్ ప్రారంభించింది.

జితక్రోధుడైనా, తన భక్తులను బాధించిన సుందర దక్షిణ లంకానగర ప్రభువైన దశకంఠుని దునిమిన మనోరంజకుడైన శ్రీరాముణ్ణి కీర్తిస్తున్నాను. నీవు మాతో కలిసి పాడకున్నావే మమ్మూ! ఇదేమి పెద్దనిద్ర! చుట్టుప్రక్కల వారందరికీ నీ గురించి తెలిసిపోయిందిలే అన్నది ఆండాళ్.

పూతన మొదలైన వారిని వచ్చినట్లే చంపివేశాడు శ్రీకృష్ణుడు. రావణుని మార్చడానికి ప్రయత్నించి అప్పుడు చంపదలిచాడు శ్రీరాముడు. కృష్ణుని దుండగీడు చేష్టలు చూసి 'వ్యర్థముగా పెంచిందీ యశోద' అని వేలెత్తి చూపారు. సంతానాన్ని బట్టి కదా తల్లితండ్రులను స్మరిస్తుందీ లోకం. శ్రీరాముని గుణ గణాలను చూసి విశ్వామిత్రుడు కౌసల్యను పొగిడాడు. సుందరమైన జింకయే శరీరం. దీని ప్రభువు అహంకార గ్రస్తమైన పది ఇంద్రియముల అధిపతి యైన మనస్సే రావణుడు.

వంద యోజనాల దూరమే నూరేళ్ళ జీవితం. దీనిలో బంధింపబడ్డ జీవుడే సీత. రావణుని చెరపడ్డ సీతలాగా మనం ఈ మనస్సు చేత వంచింపబడ్డాం. అహంకారానికి బానిసలైనాం. శ్రీరాముడే ఈ లంకలోని చెరనూ విడిపించాడు. వాని నామమే మనకు గతి. తనను నమ్మిన సీతకై ప్రాణాలకు తెగించినట్లు భగవానుడు నమ్మిన భక్తుని కోసం ఏమైనా చేస్తాడు. ఆచార్యుని పంపిస్తాడు. మనస్సులో అహంకారాన్ని తొలగిస్తాడు. రజస్సు రావణుడు. తమస్సు కుంభకర్ణుడు. వారిని తొలగించి విభీషణునికి పట్టం కట్టాడు. అహంకార రహితమైన మనస్సుతో పరమాత్మ ప్రకాశిస్తాడు. లోపల నిద్రించుచున్న గోపకన్నె ఆ స్థితిలోనే ఉంది. అయితే పిలవగానే బయటికి రాదు. పరీక్షించి గాని జ్ఞానాన్ని ఉపదేశించదు. లోక విలక్షణమైన సాత్విక నిద్ర నుండి మమ్ము అనుగ్రహించమని ఆండాళ్ ప్రార్థించింది.

**(సశేషం)**


## రచనలకు శ్రీ వేంకటేశం ఆహ్వానం



'శ్రీ వేంకటేశం' మాస పత్రికలో వివిధ రకాల శీర్షికలకు రచయితల నుండి, కవుల నుండి, పాఠకుల నుండి సరికొత్త రచనలను ఆహ్వానిస్తున్నాము. యాత్రానుభవాలు, భక్తుల అనుభూతులు, దైవసంబంధమైన వ్యాసాలు, కథలు, కవితలు, ఇతర అంశాలను పంపవచ్చు. అయితే ఆయా రచనలతో పాటు అందుకు సంబంధించిన ఫొటోలను వీలైనచో జత చేయండి. పరిశీలించిన తరువాత ప్రచురణకు యోగ్యమైన రచనలను ప్రచురిస్తాం.

రచనలు తిప్పిపంపగోరువారు తగు స్టాంపులు అతికించిన కవరు కూడా జతచేయాలి. ప్రచురించిన ప్రతి రచనకు తగు పారితోషికం ఉంటుంది. రచనలలో అవసరమైతే భాష, శైలిలో మార్పులు, చేర్పులు చేసుకునే స్వేచ్ఛ మా సంపాదక వర్గానికి ఉంటుందని తెలియజేయుచున్నాం.

ఈ పత్రిక ప్రపంచంలోని నలుమూలలలో గల తెలుగు ప్రజలు అంతర్జాలంలో (ఇంటర్‌నెట్) వీక్షించుచుదురు కావున రచయితలు తగు జాగ్రత్తలు వహించి మంచి రచనలు పంపగలరని మనవి.

మీరు పంపే ప్రతి రచన పాఠకులలో భక్తిభావం కలిగే విధంగా, వారి జీవితమునకు కొంతవరకైనా ఉపయోగకారిగా ఉండవలెనని మనవి. రచనలు తెలిసే విధంగా దస్తూరి స్పష్టంగా ఉండాలి. ఫోన్ నెంబర్ తప్పనిసరిగా వ్రాయాలి.

**గమనిక: మీ రచనలను ఆన్‌లైన్‌లో పంపాలనుకునేవారు srivenkatesham@gmail.com మెయిల్ చేయండి.**

రచనలు పంపవలసిన చిరునామా

**శ్రీ వేంకటేశం** ఆధ్యాత్మిక మాసపత్రిక,
(శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం)
ఇం.నెం. 1-1-53, వీధి నెం.1, హబ్సీగూడ, హైదరాబాద్-07.
ఫోన్: 040-27175050, సెల్: 9348212354
Email: srivenkatesham@gmail.com

# శ్రీ వేంకటేశ సహస్ర నామావళి

**వ్యాఖ్యాత : కె.వి.రాఘవాచార్యులు**

## 347. ప్రద్యుమ్న జనకాయ నమః

**ప్రద్యుమ్నునకు తండ్రియైన వాడు కృష్ణుడు.**

ప్రద్యుమ్నుడు కృష్ణునికి రుక్మిణి యందు జన్మించినవాడు. ఇతని భార్య రతి. కుమారుడు అనిరుద్ధుడు. ఇతడు ప్రద్యుమ్నునికి రుక్మి కూతురు (మేనమామ కూతురు) కు జన్మించినవాడు అనిరుద్ధుడు.

పూర్వము శివుని కంటి మంటచే దగ్ధుడైన మన్మథుడు దేహ లబ్ధి కొరకు రుద్రుని గూర్చి తపస్సు చేసి శివుని వలన వరము పొంది రుక్మిణీ కృష్ణులకు కుమారుడుగా జన్మించినాడు.

ప్రద్యుమ్నుడు శిశువుగా ఉన్నప్పుడు శంబరుడను రాక్షసుడు నారదుని వలన ప్రద్యుమ్నునిచే తనకు మరణము సంభవించునని తెలిసికొని, తన మాయచే ఇతరులకు తెలియకుండా సూతికా గృహమున ప్రవేశించి ప్రద్యుమ్నుని తీసుకొనిపోయి సముద్రమున పారవేసినాడు. సముద్రమందలి చేప ఒకటి ఆ శిశువును మ్రింగింది. అది చేపలు పట్టుచున్న జాలరులకు చిక్కింది. ఆ చేప మినుకు మినుకు మని మెరయుచున్నందున అది విశిష్టమైన చేప యని తలంచి జాలరులు తమకు ప్రభువగు శంబరాసురునికి కానుకగా సమర్పించారు. శంబరుడు ఆ చేపను ఆహారము సిద్ధము చేయుటకై వంట శాలకు పంపించినాడు.

అప్పుడు నారదుని ఉపదేశము ననుసరించి రతి మాయావతి అను పేరుతో పాతివ్రత్యము నడుపుచు దగ్ధుడు అయిన తన భర్త మన్మథుడు శరీర ధారణము చేసి వచ్చుటను ఎదురు చూచుచు శంబరాసురుని వంట పనులకు సహాయకురాలుగా ఉన్నది. ఆమె సూపకారుల వద్ద ఉండి ఆ చేపను తెచ్చి చీల్చగా దాని కడుపులో ఉన్న శిశువును చూచి నేను బిడ్డలు లేని దానను కనుక ఈ బిడ్డను పెంచుకొనెదను అని శంబరుని అడిగి వాని అనుమతి పొంది నారదోపదేశమున ఆ శిశువును పెంచి, అతడు యౌవన వంతుడు కాగానే అతనికి సర్వశత్రు మాయావినాశిని అను మహావిద్యను ఉపదేశించి అతనిచే శంబరాసురుని చంపించింది. తాను అతనికి భార్య అగుటను తెలిపి అతనితో కలిసి ద్వారకకు వచ్చింది. అప్పుడు రుక్మిణీ కృష్ణులు వారిని తమ కొడుకు ప్రద్యుమ్నుడు కోడలు రతి అని తెలుసుకుని మహదానందమును పొందినారు. వారితో కలిసి రతీ ప్రద్యుమ్నులు సుఖముగా ఉన్నారు.


ప్రద్యుమ్నుని జనకుడైన కృష్ణునిగా జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

## 348. కామినే నమః

**అంతులేని వరదానేచ్ఛ కలవాడు విష్ణుదేవుడు.**

చిన్న చిన్న కోరికలను తీర్చుట పదార్థములను ఇవ్వగల్గుటతో పాటు గొప్ప వస్తువులను కూడా ఇవ్వగలిగినవాడు. కోరిన వారికి ప్రసాదించుటకు కామములు,

**వినా వేంకటేశం న నాథో న నాథః**
**సదా వేంకటేశం స్మరామి స్మరామి**



**అన్ని నామాలూ నీవే అయిన**
**ఓ వేంకటేశా! నీకు నమస్కారము**

ఐశ్వర్యములు మున్నగు భోగ్యపదార్థములు అపారంగా తనయందు కలవాడు – విష్ణువు. అడిగిన దానికంటే ఎన్నోరెట్లు అధికమైన వస్తువులను ఇచ్చువాడని కామీ అను పేరు తెలుపుచున్నది.

బాలుడైన ధ్రువునకు బ్రహ్మాండమందు అత్యున్నత స్థానము కల్పించిన వాడు విష్ణుదేవుడు.

పూర్ణాః కామాః యస్యసః అని విగ్రహ వాక్యం. కామీ పూర్ణములయిన కోరికలు కలవాడు అని అర్థము చెప్పవచ్చును. పరమాత్ముడు అవాప్తకాముడు, పూర్ణకాముడు. ఇతడు పొందవలసినవి లేవు. కొరత, కోరిక లేని పరిపూర్ణుడు విష్ణువు, పూర్ణకామ స్వరూపుడు విష్ణువు విశ్వరచనను కోరినాడు. స అకామయత అని శ్రుతి. అంత జగత్తు ఆవిర్భవించింది. కామస్తదగ్రే అను వేదమంత్రములోని ఆంతర్యమిదే. విశ్వరచనకు సంకల్పించిన విష్ణువును సత్యకామః, సత్యసంకల్పః అని వేదం స్తుతించింది.

కామః అస్యాస్తి అను వ్యుత్పత్తిని బట్టి కామ శబ్దముపై అతిశయార్థమున ఇన్ ప్రత్యయము వచ్చింది. భక్తులు కోరినవన్నియు తన వద్ద కలవు అని భావము.

కామియైనవాడు కవియగు రవి యగునని వేమన సూక్తి.

ఈ కామీ నామము విష్ణు సహస్ర నామములలో 659 సంఖ్యతో ఉన్నది.

కామి అయిన విష్ణుదేవుని అర్చామూర్తియగు వేంకటేశునకు నమస్కారము.

## 349. ప్రద్యుమ్నాయ నమః

**చతుర్వ్యూహములలో ప్రద్యుమ్న రూపియగు విష్ణు దేవునికి నమస్కారము.**

ప్రకృష్టం ద్యుమ్నం యస్యసః ప్రద్యుమ్నః

స్వయముగా ప్రకాశించు ప్రభావము కలవాడు గనుక ప్రద్యుమ్నః అని శ్రీమన్నారాయణుని చతుర్వ్యూహములలో ఒక వ్యూహమునకు పేరు. మూల సంహితలో ప్రద్యోతయితా అనియు ప్రద్యుమ్నః – పురుషోత్తమః, అధిష్ఠాయ స్థితః, సాక్షాత్ భక్తానాం సుగతి ప్రదః అనియు చెప్పబడి యున్నది. సర్వ ప్రపంచమును ప్రకాశింపచేయువాడు పురుషోత్తముడైన శ్రీమన్నారాయణుడు కనుక ప్రద్యుమ్నః అని పిలువబడుచున్నాడు.

ద్యుమ్నము అనగా ఐశ్వర్యము, కాంతి, మిక్కిలిగ ప్రకాశించేవాడు ప్రద్యుమ్నుడు. ప్రద్యుమ్నః అను పేరుతో ఒక క్షేత్రమున – శంకరాలయమున – వేంచేసి యుండి భక్తులకు సద్గతిని ప్రసాదించుచున్నాడు అని మూల సంహితా శ్లోకమునకు అర్థము. తాను ప్రకాశిస్తూ జగతిని ప్రకాశింప జేయుచున్న పరమ తేజస్వి సూర్యనారాయణుడు.

ఈ నామము విష్ణు సహస్ర నామములలో 646 సంఖ్యతో ఉన్నది.

ప్రద్యుమ్నుడైన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

ధారావాహికం



# రామాయణ రత్నాకరం

– రాళ్ళబండి శ్రీనివాసన్

గత సంచిక తరువాయి

## బుద్ధి కుశలత

రాక్షసాంగనల బెదిరింపులు, సీతమ్మ మాటలు, రావణుడు పెట్టిన గడువు, త్రిజట స్వప్నం అన్నీ విన్నాడు హనుమంతుడు. ఆలోచించసాగాడు. సీతాదేవికోసం వానరాన్వేషణ – లక్షల మందిలో ఈమె దర్శన భాగ్యం నాకే దక్కింది. గూఢచారిగా వచ్చాను. అన్నీ తెల్సుకున్నాను. లంకాపురిని చూశాను. రాక్షస బలగాలు చూశాను. రాక్షసరాజు ధోరణి చూశాను. అతని ప్రభావం చూశాను. ఈ సీతాదేవి రామదర్శనానికి ఆరాట పడుతోంది. ఇపుడీమెను ఓదార్చాలి. అది న్యాయం. యుక్తం. తెల్లవారేలోగా ఓదార్చాలి. మనసు వ్యాకులమై ఉంది. ఈమె ఆత్మహత్య చేసుకోవచ్చు. ఇక్కడ ఈమెను, అక్కడ రాముని ఓదార్చాలి. అది న్యాయం. సమంజసం. సీతమ్మను చూశాను అని వెనక్కి వెడితే – సీత ఏం చెప్పింది – రాముడు అడిగితే – నేనేం చెప్పాలి? ఈమెతో మాట్లాడాలి. సందేశం తీసుకోవాలి. లేకపోతే రాముని కోపాగ్నికి దహించబడతాను. లేదా సుగ్రీవుని ప్రేరణతో రాముణ్ణి తీసుకొని వస్తే – అంతవరకు ఈమె బతికి ఉండాలి. లేకపోతే శ్రమ వృథా. నేనిక్కడ ఉండాలి. ఓదార్చాలి. ఆ పని చేయాలంటే ఈ రక్కసి మూకలున్నాయి. నేనేం చేయాలి? ఇదో పెద్ద చిక్కు. లేదా ఈమె దగ్గర రాక్షస స్త్రీలు ఉండరాదు. అప్పుడు మాట్లాడాలి. ఓదార్చాలి. మనిషి అనేవాడు కష్టాలకి దూరంగా ఉండాలనుకుంటాడు. మనసున్నవాడు కష్టాల్లో ఉన్నవాళ్ళకి దగ్గరగా ఉండాలనుకుంటాడు.

నేను సూక్ష్మరూపిని. వానరుణ్ణి. మానవ భాషలో మాట్లాడాలా? సంస్కృతంలో మాట్లాడాలా? వానరుడేమిటి? సంస్కృతం మాట్లాడటమేమిటి? కామరూపి రావణుడని భయపడవచ్చు. కోసలదేశ భాషలో మాట్లాడితే – కెవ్వున కేక వేయవచ్చు. వింటారు రాక్షస స్త్రీలు. యమకింకరులై పోతారు. ఆయుధాలు పడతారు. నామీదికి వస్తారు. ఎలాగో పట్టుకోవాలనుకుంటారు. చంపాలని చూస్తారు. నేను ఈ కొమ్మ, ఆ కొమ్మ, ఈ చెట్టు, ఆ చెట్టు దూకుతూ పోతాను. ఈ నా రూపం చూస్తారు. అనుమానిస్తారు. భయపడతారు. నా నిజరూపం చూస్తారు. ఇంకా భయభ్రాంతులవుతారు. వెర్రి కేకలేస్తారు. రాక్షసులు వస్తారు. వనరక్షకులూ వస్తారు. నన్ను కమ్ముకుంటారు. అన్నివైపులా అడ్డగిస్తారు.

నేను పోరాడతాను. ఒకవేళ పట్టుబడితే – సీతాదేవితో మాట్లాడటం కుదరదు. లంక దాటి పోలేను. రాముణ్ణి కలవడం ఉండదు. రాక్షసులు హింసా ప్రవృత్తి పరులు. మైథిలిని చిత్రహింసలు పెడతారు. చంపేస్తారు. తర్వాత నన్ను చంపేస్తారు.

ఒకవేళ అది నిజమైతే రామకార్యం భగ్నమవుతుంది. ఈ లంకా రాజ్యంలోకి ఎవరూ రాలేరు. రామకార్యానికి తోడ్పడేవారుండరు. ఎన్ని వేలమందినైనా హతమారుస్తాను. పోరాటంలో నేను అలసిపోవచ్చు. సముద్రం దాటగలనా? యుద్ధంలో జయాపజయాలు నిశ్చయించలేం. సంశయాస్పదమైన పనిని ప్రాజ్ఞుడు చేయడు. తొందర పడడు. ఆలోచిస్తాడు. తర్కిస్తాడు.

పోనీ నేను మాట్లాడకుండా వెనక్కి పోతే – ఈమె ప్రాణత్యాగం చేసుకోవచ్చు. ఏ దూత అయినా అవివేకంతో చేస్తే – సూర్యోదయానికి చీకట్లు నాశనమైనట్లే – పనులన్నీ పాడైపోతాయి. విచక్షణా జ్ఞానం లేని దూతలుంటారు. అన్నీ తమకే తెల్సు అనుకుంటారు. పనులు పాడు చేస్తారు.

ఇపుడు రామకార్యం నెరవేరాలి. సముద్ర లంఘనం వృథా కారాదు. నా శ్రమ వృథా కారాదు. నేను మాట్లాడాలి. ఓదార్చాలి. సీతాదేవి వినాలి. విన్న తర్వాత భయపడరాదు. అదెలా సాధ్యం – ఆలోచిస్తున్నాడు ఆంజనేయుడు.

సీతమ్మ మనసు రాముని మీదే ఉంది. అందుకు రాముణ్ణి కీర్తిస్తే ఆమె భయపడక పోవచ్చు. ఇక్ష్వాకు వంశ శ్రేష్ఠుడు, విదితాత్ముడు రాముడని చెప్పాలి. ఆ మాటలు ధర్మయుక్తం. శుభకరం. ఈమె నమ్మేట్లు చెబుతాను. అది హనుమంతుని నిశ్చయం. చూశాడు సీతమ్మని. చెట్టుకొమ్మ దిగాడు. మధ్య కొమ్మ మీదికి వచ్చాడు. మృదు మధురంగా అంటున్నాడు.

## రామ కథా గానం

జనకాత్మజతో మాట్లాడాలి. ఓదార్చాలి – అది హనుమ సంకల్పం. మధురంగా రామకథ పలుకుతున్నాడు. ఆ మాటలు సీతమ్మకు మాత్రమే వినపడేట్లు వున్నాయి. కోసల దేశ భాషలో మాట్లాడాడని విమర్శకుల అభిప్రాయం.

ఇక్ష్వాకు వంశంలో ఓ మహారాజు. పేరు దశరథుడు. చతురంగ బల పరాక్రమవంతుడు. పుణ్యశీలుడు. కీర్తిమంతుడు. ఋజువర్తనుడు. రాజర్షుల్లో శ్రేష్ఠుడు. తపోధనులతో సమానుడు. అహింసా రతుడు. సత్య పరాక్రముడు. ఉదార స్వభావుడు. దయాళువు. ఐశ్వర్యవంతుడు. ప్రజారంజకుడు. ఆ దశరథుని పెద్దకొడుకు రాముడు. చంద్రుని పోలిన ముఖం కలవాడు. సర్వధర్మాల్లో శ్రేష్ఠుడు రాముడు.

**"రక్షితా స్వస్య ధర్మస్య స్వజనస్య చ రక్షితా ।**
**రక్షితా జీవలోకస్య ధర్మస్య చ పరంతప ॥**

తన ధర్మాన్ని తాను రక్షించుకునేవాడు రాముడు. తనవారిని రక్షించేవాడు, సకల జీవ లోకాన్ని రక్షించేవాడు. ధర్మాన్ని రక్షించేవాడు.

రక్షిత – ధర్మస్య – ఈ రెండు పదాలు పునరుక్తి అయ్యాయి. నరునిగా అవతరించినవాడు నారాయణుడు. శిష్టరక్షణ దుష్టశిక్షణ – అది అవతార ప్రయోజనం. అది నారాయణునికే సాధ్యం. సర్వ జగద్రక్షకుడు నారాయణుడు. సర్వప్రాణి రక్షణ బాధ్యత నారాయణునిదే. జీవలోక రక్షకత్వం ఆ స్వామిదే.

ముందుగా తన ధర్మాన్ని తాను రక్షించుకోవాలి. అది నరుని బాధ్యత. తర్వాత స్వజన రక్షణం. అంటే తన రాజ్య ప్రజల సంరక్షణ బాధ్యత రాజుదే. ప్రజానురాగం పొందాలి. ఆ కాలంలో ఆశ్రమ ధర్మాలుండేవి. చాతుర్వర్ణ వ్యవస్థ ఉండేది. ఆయా ధర్మాల్ని, వారి వారి ధర్మాల్ని ఆచరించేలా చూడాలి. అది రాజు కర్తవ్యం.

అలా ధర్మజ్ఞుడైన రాముడు సత్య సంకల్పుడు. దృఢవ్రతుడు. పితృాజ్ఞను శిరసా వహించాడు. భార్యతో తమ్మునితో వనవాసానికి వెళ్ళాడు. దండకారణ్యంలో కామరూపులైన రాక్షసుల్ని వధించాడు. జన స్థానంలో ఖర దూషణాది రాక్షస సేనను హతమార్చాడు. అది రావణునికి తెల్సింది. మాయా మృగంతో రాముణ్ణి మోసగించాడు. రాముని భార్య జానకిని అపహరించాడు. ఆ సాధ్విని వెతుకుతూ వెళ్ళాడు రాముడు. సుగ్రీవుడు ఒక వానరుడు. అతనితో స్నేహం చేశాడు. మహాబలశాలి వాలిని చంపాడు. వానర రాజ్యాన్ని సుగ్రీవునికి అప్పగించాడు. అతడు సీతాన్వేషణ సాగించాలన్నాడు. అది సుగ్రీవాజ్ఞ. వేలాది వానరులు, కామరూపులు సీతను వెతకసాగారు. సీతాదేవి జాడ చెప్పాడు సంపాతి. నూరు యోజనాల సముద్రం దాటాను. లంకకు వచ్చాను. మైథిలి ఎలా ఉంటుందో చెప్పాడు రాముడు. ఆ సీతాదేవితో ఆనవాళ్ళు సరిపోయాయి. జనకరాజపుత్రిని చూస్తున్నాను అని ముగించాడు హనుమ. మౌనం వహించాడు.

## హనుమత్ దర్శనం

వినింది సీతమ్మ. ఆశ్చర్యపడింది. అడ్డుగా ఉన్న తలవెంట్రుకల్ని సవరించుకుంది. తల పైకెత్తింది. చెట్టుకేసి చూసింది. నలుదిక్కులా చూసింది. సర్వాత్మనా రాముణ్ణి ధ్యానించింది. పరమానంద భరితురాలైంది.

**దదర్శ పింగాధిపతేః అమాత్యమ్ ।**
**వాతాత్మజం బుద్ధిమతాం వరిష్ఠమ్ ॥**

అచింత్య బుద్ధిమంతుడు సుగ్రీవుని మంత్రి ఉదయకాల సూర్యునిలా ఉండే వాతాత్మజుణ్ణి చూసింది.

అది ఇరుగుడు చెట్టు. ఒక కొమ్మ మీదున్నాడు హనుమంతుడు. చూసింది సీతాదేవి. తెల్లటి వస్త్రంతో మెరుపుల రాశిలా పచ్చగా ఉన్నాడు. బంగారు రంగు కనులున్నవాడు. ప్రియవాది. వినయాన్వితుడు. వికసించిన అశోక పుష్పంలా ప్రకాశిస్తున్నాడు. నిశితంగా చూసింది. ఉలిక్కిపడింది. పరమాశ్చర్యం చెందింది. ఆలోచించసాగింది.

వంకర తేలిన ముఖం ఈ వానరరూపం భయంకరంగా ఉంది. చూడశక్యంగా లేదు. తెలివి తప్పింది. మళ్ళీ తేరుకుంది.

రామా లక్ష్మణా అనుకుంది. ఏడ్చింది. మళ్ళీ చూసింది. ఇది కలా అనుకుంది. మళ్ళీ చూసింది. ప్రాణం పోయిన దానిలా అయ్యింది. మళ్ళీ తెలివిలోకి వచ్చింది.

కలలో కోతిని చూడరాదు. దోషం. అది శాస్త్ర వచనం. రామునికి లక్ష్మణునికి మంగళమగు గాక. మా తండ్రి జనకునికి మంగళమగు గాక. ఇది స్వప్నం కాదు నిజం. నిద్రలో కలలు వస్తాయి. నేను నిద్రపోతే కదా. శోకపీడితనై ఉన్నాను. రామచంద్రునికి దూరమైనాను. నాకు సుఖమెక్కడిది? నిద్ర ఎక్కడిది? రామా రామా అంటూ అహర్నిశం రాముణ్ణే స్మరిస్తున్నాను. రామకథలా వినపడిందేమో! ఏది వినిపించినా రాముని గూర్చే – రామకథే వినపడుతూ వుంటుంది. రామ ప్రభువు గూర్చి చెబుతున్నాడు. అందుకే అతణ్ణి చూస్తున్నాను. నా మనోరథమ్ వానర రూపమైందేమో! కాని ఆలోచిస్తే అలా కాదనిపిస్తోంది. మనోరథానికి రూపం ఉండదు కదా. కానీ ఇది వానర రూపమ్. నన్నే చూస్తున్నాడు. స్పష్టంగా మాట్లాడుతున్నాడు. నన్ను ఉద్దేశించే మాట్లాడుతున్నాడు. సందేహం లేదు.

**నమోస్తు వాచస్పతియే సవజ్రిణే**
**స్వయంభువే చైవ హుతాశనాయ చ**

బృహస్పతికి నమస్కారం. ఇంద్రునికి నమస్కారం. బ్రహ్మదేవునికి నమస్కారం. అగ్నిదేవునికి నమస్కారం. ఈ వానరుని మాటలు నిజమగు గాక. అన్యథా కాకుండు గాక.

త్రిజట చెప్పింది విన్నారు రాక్షసాంగనలు. సీతమ్మని శరణు వేడారు. మెల్లగా నిద్రలోకి జారుకున్నారు. అది చూశాడు హనుమ. మంచి అవకాశం అనుకున్నాడు. రామకథ వినిపించాడు. గోరోజనం అంటే పసుపురంగు లేదా గోధుమరంగు అని అర్థాలు. అవి రెండూ కలిసిన రంగులో హనుమంతుడున్నాడు అని భావిస్తారు. కాని మేలిమి బంగారు రంగులో ఉన్నాడన్నాడు వాల్మీకి.

## సంభాషణం

చెట్టు నుంచి దిగాడు హనుమంతుడు. అతని ముఖం పగడంలా ఎర్రగా ఉంది. సీతమ్మ దగ్గరికి వచ్చాడు. అతని ముఖంలో వినయం ఉంది. దైన్యం ఉంది. తల మీద చేతులు పెట్టాడు. నమస్కరించి అంటున్నాడు. అమ్మా ఈ చెట్టుకొమ్మ పట్టుకున్నావు. నీ కన్నుల్లో కన్నీరు కారుతోంది. నీవు ఎవరు ఓ మంగళ స్వరూపిణీ! నీవు దేవతా స్త్రీవా? అసుర కాంతవా? నాగకన్యవా? గంధర్వాంగనవా? రాక్షస స్త్రీవా? యక్ష యువతివా? కిన్నర వనితవా? ఎవరమ్మా నీవు?

రుద్రులకి వసువులకి మరుత్తులకి చెందిన దానవా? నీవెవరు? నక్షత్రాల్లో రోహిణివా? చంద్రుడు విడిచేస్తే రాలిపడ్డ దానవా?

కళ్యాణీ! నీ భర్త ఎవరు? నీ పుత్రుడెవరు? తండ్రి ఎవరు? సోదరుడెవరు? ఎవరైనా పరలోక గతులైనారా? వారికోసం దుఃఖిస్తున్నావా? నీ నిట్టూర్పులు విన్నాను. నీ కన్నీరు చూశాను. నీ పాదాలు చూశాను. భూమిని తాకుతున్నాయి. నీవు మానవ కాంతవు. నీ రాజ లక్షణాలు చూశాను. నీవు ఒక రాజకన్యవో, పట్టపు రాణివో అయి ఉండాలి.

జనస్థానానికి వచ్చాడు రావణుడు. బలవంతాన సీతాదేవిని అపహరించాడు. ఆ సీతమ్మవి నివేనా? నీకు మంగళమగు గాక. నీ అతి మానుష రూపం చూశాను. నీ తాపస వేషం చూశాను. రాముని పట్టమహిషివి. అది నా విశ్వాసం.

వైదేహి రామ సంకీర్తనం విన్నది. సంతోషించింది. అంటోంది హనుమంతునితో. "భూమండలంలోని రాజుల్లో ప్రధానుడు, ప్రసిద్ధుడు, శత్రువుల్ని పరితపింప చేసేవాడు దశరథుడు. ఆయన కోడల్ని. మహాత్ముడు – విదేహరాజు జనకుడు. ఆయన కుమార్తెని. నా పేరు సీత. ధీమంతుడు రాముడు. ఆయన భార్యని.

నేను రామునితో అయోధ్యలో ఉన్నాను. ఏ లోటూ లేదు. పన్నెండేళ్ళు మానుష భోగాలనుభవించాను. పదమూడో సంవత్సరం వచ్చింది. రాముణ్ణి యువరాజుగా ప్రకటించారు.

యువరాజ్యాభిషేకం జరగరాదు. అది జరిగితే నేను నీళ్ళు తాగను. అన్నం తినను. రాముడు వనవాసం చేయాలి. భరతుడు రాజు కావాలి. అది కైకేయి పట్టుదల.

వరాలు గుర్తుకు వచ్చాయి దశరథునికి. అవి కైకకు ఇచ్చాడు. మూర్ఛ పోయాడు. భరతునికి రాజ్యం ఇచ్చేశాడు. తండ్రి మాట జవ దాటడు రాముడు. సత్యపరాక్రముడు రాముడు. దానం చేస్తాడు కాని ప్రతిగ్రహించడు. రాజ్యం వదిలేశాడు. భోగాలు వదిలేశాడు. రాముడు లక్ష్మణుడు నేను – మేం ముగ్గురం దశరథుని ఆజ్ఞా బద్ధులం. వనవాసానికి వచ్చాం. దండకలో వుంటున్నాం. దుర్మార్గుడు రావణుడు. నన్ను అపహరించాడు. ఇక్కడికి తెచ్చాడు. రెండు నెలలు గడువు పెట్టాడు. అవి దాటితే నేను బతకను" ఆగింది జనకాత్మజ.

## సందేహం

సీతామాత చెప్పింది విన్నాడు హనుమంతుడు. "అమ్మా! నేను రామదూతను. సందేశం తెచ్చాను. రాముడు బ్రహ్మాస్త్ర సంపన్నుడు. వేదవిదుల్లో శ్రేష్ఠుడు. దాశరథి క్షేమంగా ఉన్నాడు. నీ భర్తకు ఇష్టుడు, అనుచరుడు, మహాతేజశ్శాలి లక్ష్మణుడు. అతడు శోక సంతప్తుడై ఉన్నాడు. శిరసా నీకు నమస్కరించాడు" అని ఓదార్చుతున్నాడు.

రామ కుశల వార్త వినిందామె. సంతోషించింది. ఒడలంతా పులకరించింది.

**"కళ్యాణీ బతగాథేయం లౌకికీ ప్రతిభాతిమా |**
**ఏతి జీవంత మానందో నరం వర్ష శతాదపి" ||**



“బ తికి వుంటే నూరేళ్ళకైనా ఆనందం పొందవచ్చు. అది లోకంలో సామెత. అది నాకెంతో శుభకరమైంది” అంది జానకి. ఈ శ్లోకం శ్రీరామాయణంలో ఒక రత్నం. బతికి వుండిన సుఖముల బడయవచ్చు. బతికివుంటే బలుసాకైనా తినవచ్చు అవి తెలుగులో నానుడులు.

ఆధ్యాత్మికంగా ఆలోచిస్తే జీవునిది కర్మజన్మల చక్రబంధం. అందులో తిరుగాడుతూ ఉంటాడు. దుఃఖభరితుడవుతూ ఉంటాడు. భగవత్ సంబంధం కలిగినపుడు ఆనందభరితుడవుతాడు. అదే బ్రహ్మానందం. అదే మోక్షం.

సీతా హనుమలు అలా పరస్పరం సంభాషించుకుంటున్నారు. మెల్లగా కదిలాడు మారుతి. ఆమెకి దగ్గరైనాడు. చూసింది సీతమ్మ. వెంటనే శంకించింది. అతడు రావణుడేమో అనుకుంది. అయ్యో వీడితో మనసు విప్పి మాట్లాడాను. మోసపోయాను. వీడు రావణుడే. వానర రూపంలో వచ్చాడు. చెట్టుకొమ్మని పట్టి వుంది. దాన్ని విడిచింది. నేలమీద చతికిల పడింది. భయభ్రాంత అయింది. దుఃఖించింది.

గమనించాడు హనుమంతుడు. సాష్టాంగ నమస్కారం చేశాడు. చూసిందామె. హడలిపోయింది. మళ్ళీ మనసు మార్చుకుంది. కపివరుణ్ణి చూసింది. నిట్టూర్చింది. సున్నితంగా అంటోంది.

“నీవు రావణుడవు. మాయావివి. వానర రూపంలో వచ్చావు. మళ్ళీ నాకు సంతాపం కల్గిస్తున్నావు. ఇది మంచిది కాదు. ఆరోజు నిజరూపం త్యజించావు. జనస్థానానికి వచ్చావు. సన్యాసి వేషంలో వచ్చావు. కామరూపుడవు నీవు. నిశాచరా! ఉపవాసాలతో కృశించాను. శోకంతో కృంగిపోయాను. దీనురాలిని. నన్ను పదే పదే బాధపెడతావు ఎందుకు? అది భావ్యం కాదు. అయితే నిన్ను చూస్తుంటే రావణుడవు కాకపోవచ్చు. ఎందుకంటే నీ దర్శనం సంతోషం కల్గిస్తోంది. నీవు నిజంగా రామదూతవైతే నీకు శుభం. నదీ ప్రవాహం గట్లని లాగేస్తుంది. అలా రామగుణ ప్రవాహం నన్నూ ఆకర్షిస్తుంది. కపివరా! నాకు రామకథ ఇష్టం. ఆయన గుణగణాల్ని చెప్పు”.

అలా అంది కానీ మళ్ళీ ఆలోచనలో పడిందామె. లంకకు రామదూత రావడమా! అసంభవం. ఇది సుఖ స్వప్నం కానీ ఆ కలలో రాముడు కనపడలేదు. కలకి కూడా నాపై అసూయ. కలలో కోతి కనపడింది. సంతోషంగా ఉంది. ఇది కల కాదేమో. నా చిత్తభ్రమా! వాత ప్రకోపమా! ఉన్మాదమా! వికారమా! ఎండమావులా? అయినా నేను తెలివిలో ఉన్నాను. ఎదురుగా వానరుడు. చూస్తున్నాను. నాది ఉన్మాదం కాదు. మోహం కాదు. రాక్షసులు మహా బలవంతులు. వానరులు అత్యల్పులు. సముద్రం దాటడం – రాక్షసుల్ని ఏమార్చడం – ఇక్కడికి రావడం – ఒక వానరునికి అసాధ్యం. అలా తర్కించుకుంటోందామె. ఏం మాట్లాడలేదు. మౌనం వహించింది.

## నన్ను శంకించకు

వాయుపుత్రుడు బుద్ధిమంతుడు. వైదేహి మనసు చదివాడు. ఆమె సందేహం తీర్చాలనుకున్నాడు. ఆమె వీనులకి ఇంపుగా పలుకుతున్నాడు. “అమ్మా! నన్ను శంకించకు. రాముడు సూర్యునిలా తేజశ్శాలి. చంద్రునిలా ఆహ్లాదకరుడు. కుబేరునిలా రాజాధిరాజు. విష్ణువులా విక్రమ సంపన్నుడు. బృహస్పతిలా సత్యవాది. మూర్తీభవించిన మన్మథుడు. ప్రియవాది. మధురభాషి. మనోహరుడు. కాంతిమంతుడు. ఎవరిపై కోపించాలో, ఎవరిని కొట్టాలో తెలిసినవాడు. మహారథుడు. ఆ మహాత్ముని భుజచ్ఛాయని ఈ లోకం ఆశ్రయించి ఉంది.

అలాంటి రాముడు లేడిరూపాన్ని చూశాడు. మోసపోయాడు. ఆశ్రమానికి దూరమైనాడు. అపుడు రావణుడు వచ్చాడు. నిన్ను ఎత్తుకు వచ్చాడు. దాని ఫలం వాడనుభవిస్తాడు. నీవు చూస్తావు. ఆ రాముడు పంపాడు. దూతగా వచ్చాను. నిన్ను చూచాను. రాముడు విరహ బాధితుడు. దుఃఖార్తుడు. నిన్ను కుశలమడిగాడు. లక్ష్మణుడు నమస్కరించాడు. నీ కుశలమడిగాడు. రామ లక్ష్మణ సుగ్రీవులు నిత్యమూ నిన్నే స్మరిస్తూ ఉంటారు. నీవు రాక్షసాంగనల మధ్య ఉన్నావు. జీవించి ఉన్నావు. అదృష్టవంతురాలివి. త్వరలో రామలక్ష్మణులు వస్తారు. కోట్లాది వానరసేనతో సుగ్రీవుడు వస్తాడు.

నేను సుగ్రీవుని మంత్రిని. వానరుణ్ణి. నా పేరు హనుమంతుడు. సముద్రం లంఘించాను. లంకలో ప్రవేశించాను. రావణుడు దురాత్ముడు. వాడి తలపై నా ఎడమ కాలు పెట్టినట్లు వచ్చాను. నిన్ను చూశాను. అమ్మా నీవు అనుకున్నట్లు మాయావిని కాను. నన్ను శంకించకు. నా మాట నమ్ము.

**(సశేషం)**

# బ్రహ్మజ్ఞాన సంపన్నుడు..

# వీరాధివీరుడు.. పరశురాముడు

– చింతలపాటి శివశంకర శాస్త్రి

"పరిత్రాణాయ సాధూనాం వినాశాయచ దుష్కృతాం
ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే"

సజ్జన సంరక్షణకు, దుర్జన శిక్షణకు, ధర్మ సంస్థాపనకు ప్రతి యుగంలోనూ నేను పుడుతున్నాను అంటాడు గీతాచార్యుడు. ధర్మానికి, అధర్మానికి, న్యాయానికి, అన్యాయానికి, సత్యానికి, అసత్యానికి సంఘర్షణ జరిగినప్పుడు ధర్మాన్ని నిలబెట్టడానికి, సజ్జనులను రక్షించడానికి భగవంతుడు దశావతారాలను ధరించాడు. ప్రతి అవతారానికి ఒక లక్ష్యం ఉంది. ప్రతి ఆకృతికి ప్రత్యేకత ఉంది. అధర్మ పాలనలో దురాచారాన్ని ప్రబలింప చేస్తున్న రాక్షస సంహారం కోసమే నారాయణుడు దాల్చిన అవతారాలలో ఆరవది పరశురామావతారం.

భృగు మహర్షి వంశానికి చెందినవాడు ఋచీక మహర్షి. ఈతని భార్య సత్యవతి. గాదిరాజు యొక్క పుత్రిక. దివ్యతేజస్సంపన్నుడైన తనయుని ఇమ్మని భర్తను కోరింది. ఋచీకుడు అందుకు సమ్మతించి ఒక యజ్ఞాన్ని నిర్వహించాడు. ఆ సందర్భంలో తనకే కాక, తన తల్లికి కూడా సత్సంతానం కలగాలని సత్యవతి కోరింది. అందుకు అంగీకరించిన ఋచీకుడు యజ్ఞ ప్రసాదంగా 'చరువు (యజ్ఞ యోగ్యాన్నము) ని రెండు భాగాలు చేసి తన మంత్రశక్తితో అభిమంత్రించాడు. ఒక దానిలో క్షత్రియ తేజస్సును నిహితం చేసి దానిని గాధి పత్నికి ఆరగింపు చేయమని చెప్పాడు. మరొక దానితో బ్రహ్మ తేజస్సును అభిమంత్రితము చేసి దానిని సత్యవతి ఆరగించాలని ఆదేశించాడు. దైవయోగం వల్ల ఆ రెండు ప్రసాద భాగాలు తారుమారయ్యాయి. క్షాత్ర తేజం దాగిన ప్రసాదం సత్యవతి ఆరగించింది. బ్రహ్మ తేజస్సు నిండిన చరువును గాధి భార్య స్వీకరించింది. విషయం తెలుసుకున్న ఋచీకుడు, వాటి ఫలితంగా బ్రహ్మర్షులైన తమకు క్షాత్ర తేజస్సంపన్నుడైన వాడు జన్మిస్తాడని, గాధికి బ్రహ్మర్షి కాగల పుత్రుడు కలుగుతాడని భార్యకు చెప్పాడు. ఆ విషయం భర్త ద్వారా విన్న సత్యవతి తమకు బ్రహ్మ తేజస్వియే కలగాలని కోరగా ఒక్క తరం తర్వాత క్షాత్ర వీరత్వాన్ని ప్రకటించే మహాత్ముడు కలిగేలా తరం దూరాన్ని ఏర్పాటు చేయగలిగాడు. అప్పుడు సత్యవతికి కలిగిన సంతానమే జమదగ్ని మహర్షి. ఈతని భార్య రేణుక. రేణుక దివ్యశక్తి స్వరూపిణి. పరమాణువులో దాగిన పరాశక్తికి ప్రతీక.



తేజోమయమైన చైతన్యమే జమదగ్ని. ఆ చైతన్యశక్తి రేణుక. రేణుక పరమాణు శక్తి. ఆ దంపతుల కుమారుడే పరశురాముడు.

భృగు మహర్షి పరశురాముని పరమశివుని గురించి తపస్సు చేయమని ఆదేశించాడు. పరశురాముడు హిమాలయ పర్వతశ్రేణిలో ఘోర తపస్సు చేయనారంభించాడు. శంకరుడు వ్యాధుని రూపంలో పరశురాముని పరీక్షించదలచి, రౌద్రాస్త్రమును భరించే శక్తి కోసం తీర్థయాత్రలు చేసి రమ్మని ఆదేశిస్తాడు. తీర్థయాత్రల అనంతరం మరల తపస్సు చేయనారంభించాడు. ఇంద్రాది దేవతలు దానవుల అకృత్యాల నుండి తమను రక్షించమని శంకరుని ప్రార్థించారు. నీలకంఠుడు పరశురాముని తీసుకురమ్మని మహోదరుని పంపగా, పరశురాముడు పరమశివుని దగ్గరకు వస్తాడు. అప్పుడు శివుడు రాక్షసులను వెడలగొట్టమని ఆదేశిస్తాడు. పరశురాముడు వారిని నేనెలా వెడలగొట్టగలనని పలుకగా శివుడు 'పరశువు' అనే

అస్త్రాన్ని, తన తేజస్సుని ఇచ్చాడు. ఆ అస్త్ర ప్రభావంతో దానవులను తరిమికొట్టి ఇంద్రనగరాన్ని దేవతలకు అప్పగిస్తాడు. శంకరుడు పరశురాముని నిశ్చలభక్తికి మెచ్చి 'భార్గవ' అనే అస్త్రాన్ని ప్రసాదించాడు. అప్పటినుండి భార్గవ రామునిగా ప్రసిద్ధికెక్కాడు.

హైహయ వంశీకుడైన కార్తవీర్యార్జునుడు ఒకనాడు జమదగ్ని వద్దనున్న కామధేనువును అపహరించాడు. దానితో గోరక్షణకై ఆయుధాన్ని ధరించి తన తాతగారి యజ్ఞప్రసాద మహిమ వల్ల తనకు సంక్రమించిన క్షాత్రతేజాన్ని ప్రదర్శిస్తూ కార్తవీర్యుని సంహరించి కామధేనువును తీసుకువచ్చాడు పరశురాముడు. కార్తవీర్యుని పుత్రులు ప్రతీకార వాంఛతో రాముడు లేని సమయంలో ఆశ్రమానికి వచ్చి జమదగ్నిని సంహరించారు. ఆశ్రమానికి తిరిగి వచ్చిన భార్గవుడు ఆ సంఘటనకు విచలితుడై ఉగ్రుడయ్యాడు. తల్లి రేణుక భర్త శవంపై పడి ఏడుస్తూ కనిపించగా ఇరవై ఒక్కసార్లు గుండెలు బాదుకున్న మాతృమూర్తిని ఓదార్చుతూ ఇరవై ఒక్కసార్లు క్షత్రియులను వధిస్తానని శపథం చేశాడు. విషయం తెలుసుకున్న భృగుమహర్షి తన మంత్రజలంతో జమదగ్నిని బ్రతికిస్తాడు. పరశురాముడు ఎంతో సంతోషిస్తాడు.

జమదగ్ని పత్ని రేణుక ఒక గంధర్వుని చూచి చిత్తంలో విభ్రమం చెందింది. అది గమనించిన జమదగ్ని ఆమెను సంహరించమని పుత్రులకు ఆదేశించాడు. తండ్రి మాటను ఇతర పుత్రులు అంగీకరించలేదు. పరశురాముడు మాత్రం పితృవాక్యాన్ని అనుసరించి తల్లి తలను వధిస్తాడు. జమదగ్ని తన ఆజ్ఞను శిరసా వహించినందుకు మెచ్చుకుని పరశురాముని ఒక వరము కోరుకొమ్మన్నాడు. రాముడు తన తల్లి రేణుకను బ్రతికించమని అర్థించాడు. జమదగ్ని సంతోషించి రేణుకను పునర్జీవింపచేశాడు.

కార్తవీర్యార్జునుని సంహరించిన పరశురాముడు శంకరుని చూడటానికై కైలాసగిరికి వెళ్ళాడు. ఆ సమయంలో పార్వతీ పరమేశ్వరులు ఏకాంతంలో ఉన్నారు. శివపార్వతుల ఏకాంతానికి భంగం కలగకుండా ఉండటానికి గుమ్మం దగ్గర వినాయకుడు ఉన్నాడు. పరశురాముడు లోనికి వెళ్ళబోగా వినాయకుడు అడ్డుకొన్నాడు. ఇరువురికి కొంత వాగ్వాదం జరుగగా వినాయకుడు తన తొండముతో పరశురాముని ఎత్తగా, పరశురాముడు తన పరశువుతో వినాయకుని ఒక దంతాన్ని ఖండించాడు. అప్పటినుండి వినాయకుడు ఏకదంతుడయ్యాడు. తన కుమారుని పరశురాముడు కొట్టి దంతమును ఖండించడం చూచి పార్వతీదేవి ఆగ్రహం చెంది శ్రీమహావిష్ణువును ప్రార్థించింది. శ్రీహరి పార్వతీదేవిని ఓదార్చి పరశురాముని కూడా పుత్రభావంతో చూడమంటాడు. పరశురాముడు తన తప్పిదమును గ్రహించి పార్వతీమాతను ప్రార్థించి నమస్కరించాడు.

దుష్ట క్షాత్ర సంహారం కోసమై అవతరించిన పరశురాముడు (శ్రీమన్నారాయణుడు) తన అవతార ప్రయోజనమును నెరవేర్చిన భార్గవుడు తాను చేసిన అనివార్యమైన హింసకు ప్రాయశ్చిత్తంగా తీర్థయాత్రలు చేశాడు. తాను సాధించిన భూమినంతటినీ కశ్యప ప్రజాపతికి దానమిచ్చాడు. త్రిపుర రహస్యాన్ని దత్తాత్రేయుని ద్వారా గ్రహించిన పరశురాముడు ఆరు భగవతీ క్షేత్రాలను స్థాపించాడు. మూకాంబిక మొదలుకొని కేరళ వరకు విస్తరించిన ఆరు క్షేత్రాలను బిందువులు గ్రహించిన వాటిని కలిపిన గొడ్డలి ఆకారంగా గోచరించడం విశేషం. తన యజ్ఞపు తెడ్డుతో భూమిని కమ్ముకొన్న సముద్ర జలాలను తోడి, సముద్రముచే ఆక్రమింపబడిన భూభాగాన్ని తిరిగి రక్షించాడు. అదే కేరళ రాష్ట్రము. పరశురామ క్షేత్రంగా విఖ్యాతి చెందింది.

బ్రహ్మజ్ఞాన సంపన్నుడు, తేజోమూర్తి, వీరాధివీరుడు, దానుష్కులకందరికీ గురుదేవుడు, మహా మహిమోపేతుడు పరశురాముడు. ఈతడు రుద్రుని గురించి ఘోర తపమాచరించి, ఆతని అనుగ్రహమున దివ్యాస్త్రములను పొందాడు. అస్త్ర విద్య యందు ఇతనితో సాటి రాగల వారెవరూ లేరు. పరశురాముడు ఎంతటి పరాక్రమవంతుడో అంతటి మానవతావాది. అన్యాయం ఎక్కడ జరిగినా సహించలేనివాడు.

కాశీరాజు యొక్క కుమార్తెలు అంబ, అంబిక, అంబాలిక. యుక్తవయస్సుకు వచ్చిన కుమార్తెలకు వివాహము చేయదలచి స్వయంవరమును చాటించాడు. శంతన, గంగాదేవిల యొక్క కుమారుడు భీష్ముడు. ఇతడు సర్వ ధర్మ శాస్త్రవేత్త. శంతనునకు సత్యవతి వల్ల కలిగిన చిత్రాంగదుడు, విచిత్రవీర్యులు ఈతని సోదరులు. తన సోదరులు కాశీరాజు కుమార్తెల పట్ల అనురాగం కలిగి యున్నారనే విషయం తెలుసుకొని కాశీరాజు ప్రకటించిన స్వయంవరమునకు వెళ్ళి రాజులందరినీ జయించి, ఆ రాజకుమార్తెలను బలవంతంగా తీసుకొని వచ్చి వివాహము చేయుటకు పూనుకున్నాడు. కాశీరాజు కుమార్తెలలో ఒకరైన అంబ తాను సాళ్వుని ప్రేమించానని, ఆతనినే వివాహము చేసుకుంటానని పలుకగా భీష్ముడు ఆమెను సగౌరవంగా సాళ్వుని వద్దకు పంపించాడు. అంబ సాళ్వుని సమీపించి తన మనోరథమును తెలుపగా సాళ్వుడు అందుకు నిరాకరించాడు. తన వివాహం భగ్నం కావటానికి భీష్ముడే కారణమని తలచి భీష్ముని ఎలాగైనా వధించి తీరాలని తలపోసి పరశురాముని ఆశ్రయించింది. అంబ ద్వారా సమస్త విషయం తెలుసుకొనిన పరశురాముడు ఆమెను ఓదార్చి అభయమొసంగాడు.

పరశురాముడు తన శిష్యుడైన భీష్ముని రప్పించి ఈ కన్యను నీ తమ్ముడికిచ్చి వివాహం జరిపించు. ఆ విధంగా చేయకపోవడం నీవంటి వాడు చేయవలసిన పని కాదు. ఆమెను తిరస్కరించడం అనుచిత కార్యమే అవుతుంది. నా మాట వినమని పలికాడు.

అందుకు భీష్ముడు "గురుదేవా! ఆమెను హస్తినకు తీసుకువచ్చిన మాట నిజమే కాని ఆమె "నేను సాళ్వుని కోరి ఉన్నానని చెప్పగానే సత్యవతి గారి అనుమతితో అతని వద్దకు తిరిగి పంపించాను. సాళ్వుని వరించానన్న కన్యను ఏవిధంగా నా తమ్ముడికిచ్చి వివాహం చేయగలను" అని పలికాడు. అందుకు పరశురాముడు ఆగ్రహించి గురు తిరస్కారం చేసినట్లయితే, నీ మాట మీద నీవు నిలబడితే నిన్ను, నీ బంధువులను వధించి తీరుతానని, యుద్ధానికి సన్నద్ధుడవై రమ్మని పలికాడు.

భీష్ముడు వినయంతో యుద్ధమే అనివార్యమైతే అందుకు నేను సంసిద్ధుడను. నేను ఏ సైన్యాన్నీ వెంటబెట్టుకు రాను. ఒంటరిగా వస్తానని పలికాడు. వారిద్దరి మధ్య యుద్ధము ఇరవై రోజుల పాటు నిర్విరామంగా, ఘోరంగా జరిగింది. మరుసటిరోజు నారదుడు యుద్ధభూమిలో అడుగుపెట్టి భీష్మునితో "నీవు చేస్తున్న పనేమిటో తెలుసా? కఠినాత్ముడవై సకల శస్త్రాస్త్ర ప్రయోగ ఉపసంహారాలను నేర్పి నిన్నింతవాణ్ణి చేసిన గురువుకి తీరని అవమానాన్ని కలిగిస్తున్నావు. నువ్వా మహావీరుడివి. ఈ విధంగా గురువును పరాజయం చేయటం కానీ, వధించటం కానీ చేయడం న్యాయమేనా? సముచితమేనా? అని పలికాడు.

భీష్ముడు నారదుని, తనను చూడవచ్చిన గంగాదేవి, వసువుల మాటలు ఆలకించి వినమ్రుడై పరశురామునికి సాష్టాంగ ప్రణామం చేసి గురువు పట్ల తనకున్న వినయాన్ని ప్రదర్శించాడు. భీష్ముని శక్తికి, భక్తికి మెచ్చి పరశురాముడతనిని కౌగలించుకొని ఆశీర్వదించాడు.

భరద్వాజముని కుమారుడైన ద్రోణుడు భీష్మాచార్యుల నియోగమున కౌరవులకు, పాండవులకు అస్త్ర విద్యలను నేర్పుటకు నియోగింపబడినాడు. సూతుడు తనకు దైవవశమున లభించిన కుమారుని పెంచి కర్ణుడని పేరుపెట్టి అల్లారుముద్దుగా పెంచుకోసాగాడు. యుక్తవయస్సునకు రాగానే కర్ణుని వెంటబెట్టుకొని ద్రోణుని వద్దకు వెళ్ళి ధనుర్విద్యను, అస్త్రవిద్యను నేర్పమని కోరగా క్షత్రియులకు తప్ప తక్కినవారు అస్త్ర విద్యకు అర్హులు కారని నిరాకరించాడు. అంతట కర్ణుడు ఏవిధంగానైనా అస్త్ర విద్యను గ్రహించవలెననే తలంపుతో బ్రాహ్మణ వేషములో పరశురాముని ఆశ్రయించి ఆయన వద్ద సాంగముగా అస్త్రవిద్యను అభ్యసించాడు. పరశురాముడు కొలదికాలంలోనే కర్ణుడు బ్రాహ్మణుడు కాదని తెలిసికొని తనను మోసగించి విద్యను గ్రహించినందులకు ఆగ్రహించి తాను ఉపదేశించిన మహాస్త్రములు ఆపత్కాలమున ఫలింపవని శాపమిచ్చాడు. పై సంఘటనాధారముగా పరశురాముడు అన్యాయమును, మోసమును సహించలేని మహోన్నత వ్యక్తిగా సాక్షాత్కరించాడు.

"ఇదం బ్రాహ్మ్యం – ఇదం క్షాత్రం" అని తపోమయమైన బ్రహ్మశక్తితో పాటు, అన్యాయాన్ని సహించని క్షాత్రాన్ని ప్రదర్శించి లోకరక్షణ చేసిన అవతారమూర్తి భార్గవుడు. జ్ఞానానికి, వీరత్వానికీ సమన్వయాన్ని చూపించి, రెండూ శాశ్వత శాంతికి, క్షేమానికీ వినియోగించాలని నిరూపించిన పరశురాముడు అందరికీ ఆదర్శం.

★★★

# పిల్లనగ్రోవి కథ

అనగనగా అవి సీతారాముల వనవాసపు రోజులు. సీతమ్మవారొక రోజు చెరువులో జలకాలాడుతున్నదట. స్నానం కానిచ్చి ఒడ్డుకు వచ్చి, పర్ణశాలకి దారి తీస్తుండగా, దార్లో ఓ ముల్లు ఆవిడ కాల్లో గుచ్చుకుందట. బహు సుకుమారి. కళ్ళంట నీళ్ళు జివ్వున చిప్పిల్లాయి. అల్లంత దూరాన వున్న రాముల వారిని "స్వామీ... " అని పిలిచి పక్కనే ఉన్న రాయి మీద కూర్చుండిపోయిందట. పరుగున వచ్చిన రాముల వారు ఎర్రగా కందిపోయిన అమ్మవారి మొహాన్ని చూసి కంగారు పడ్డారట.

ఇంకొకింత ఎర్రగా కందిన అరికాలిని చూసి బెంబేలు చెందారట. ఎలాగో తంటాలు పడి నెమ్మదిగా ఆ ముల్లును బైటికి లాగి, సీత మొహం వైపు చూశారట. ముల్లు దిగిన దానికంటే పైకి లాగిన బాధ ఎక్కువగా ఉందేమో. జలజలా నీటిబొట్లు ఎర్రటి చెక్కిళ్ళ మీద జారిపోతుండగా "వచ్చేసిందా?" అన్నట్లు చూస్తోందట ఆయన వైపు. ఏడు మల్లెలెత్తు రాకుమారిని అడవులెంట తిప్పుతున్నానే అనే బాధలో అసలే మునిగి ఉన్నారేమో రాములవారు. చేతిలో ఉన్న ముల్లు వైపు క్రోధంగా చూశారట. అది చూపా? అనల బాణమా? (అనలము = అగ్ని) ముల్లు భగ్గున మండి బూడిదైపోయిందట. ఇదంతా చూస్తున్న సీతమ్మవారు... "అయ్యో! ఏలే దొరలే కినుక చూపితే ఇంక దిక్కెవరు ప్రాణులకు? మండుట అగ్ని లక్షణం. అలాగే గుచ్చుట ముల్లు లక్షణం. ఇంత పెద్ద శిక్షా ప్రభూ?" అని వాపోయిందట. మహాత్ముల కోపం తాటాకు మంట కదా? చప్పున చల్లారిన రామయ్య నొచ్చుకున్నాడు. బూడిదైన ముల్లుని దయగా చూశాడు.

కాల్చిన చూపే కరుణించి ఏం వరమిచ్చిందయ్యా ముల్లుకి అంటే... మరు జన్మలో వెదురై పుట్టి కృష్ణుడి చేతిలో పిల్లనగ్రోవి అయిందట. సంతోషంతో మధురంగా మ్రోగిందట.

# ముకుందమాల

- డా|| భువనేశ్వరి మారేపల్లి, 9550241921




మదన పరిహర స్థితిం మదీయే
మనసి ముకుంద పదారవింద ధామ్ని ।
హర నయన కృశానునా కృశోసి
స్మరసి న చక్ర పరాక్రమం మురారేః ॥

ఓ మన్మథుడా! శ్రీముకుందుడి పాదకమలములకు స్థానమైన నా మనస్సును విడిచిపొమ్ము. మన్మథుడా! రుద్రుడి నేత్రాగ్ని జ్వాలలను చవి చూసిన వాడివి దానికంటే తీక్షణమైన శ్రీమన్నారాయణుడి చక్రాయుధమైన సుదర్శనుడుని తెలుసుకొనుము.

హృదయములో మన్మథ వికారములు కలిగితే అనేక అనర్థాలకు దారి తీస్తాయి. త్రేతాయుగమున శ్రీరామ పట్టాభిషేక నిర్ణయం అయిన తరవాత కూడా సందర్భము మారిపోయి వనవాస ముహూర్తం అవ్వడానికి, కైకాదేవి మనసులో కలిగిన మన్మథ వికారములే కారణం. ఎలాంటి పుత్రుడైనను పాండిత్యము, ధనము, అధికారము మొదలైన వైభవములతో ఉన్నప్పటికీ దుష్టపు ఆలోచనా ప్రవృత్తి కలవాడు, తండ్రికి భయపడతాడు. కులశేఖరాళ్వార్లు అది అనుసరించి ముకుందుడి కుమారుడైన వాడు మన్మథుడు కాబట్టి, తండ్రిని పట్టుకున్నట్లైతే కొడుకు నిలవజాలడు.

పరమాత్మను మన మనస్సుయందు నిశ్చలంగా నిలుపుకొన్నట్లైతే వికారములు కలగవు అని తెలియచేస్తున్నారు. మన్మథ వికారములు ఉంటే శేషత్వానుసంధానము కలగదు. ఎలా ఇది తొలగుతుంది అంటే,

ప్రజహాతి యదా కామాన్ సర్వాన్ పార్థ మనోగతాన్ ।
ఆత్మన్యేవాత్మనా తుష్టః స్థిత ప్రజ్ఞస్తదోచ్యతే ॥ (గీత 2.55)

మనస్సునందలి కోరికలన్నీ పూర్తిగా తొలగిపోయి, ఆత్మద్వారా ఆత్మయందు సంతుష్టుడైన వానిని, అనగా పరమాత్మ సంయోగము వలన ఆత్మానందమును పొందినవాడిని స్థితప్రజ్ఞుడని యందురు. పరమాత్మ యొక్క దివ్యపాదములకు ఎవరైతే తమ మనస్సును అర్పిస్తారో అలాంటి వారికి రక్షకుడు పరమాత్మే. సమస్త వికార రహితుడై నిత్యానందమయుడై తరిస్తాడు అని కులశేఖరాళ్వార్లు సులువైన, సుఖకరమైన మార్గమును చూపిస్తున్నారు. అటువంటి స్థితప్రజ్ఞుడే భక్త విజయదాసు.

కర్ణాటక రాష్ట్రంలో రాయచూరు సమీపంలోని "కల్లూరు" లో సుబ్బనాచార్యుడు గొప్ప పండితుడు. ఆయన సుధా పండితులుగా ప్రసాదులు. కానీ దాసకూట మంటే ఆయనకు ఏవగింపు. ఒకసారి కల్లూరులో సుధా మంగళ నిర్వహిస్తున్నారు సుబ్బనాచార్యులు. విజయ దాసు అనే మహా భక్తుడు విచ్చేసి పండితుణ్ణి దర్శించాడు. "నీవేనా కుశి కుమారుడవు దాసూ!" అన్నారు. "చిత్తం తమరొక 'సుధా వాక్యం' ఉపదేశిస్తే ధన్యుడనౌతాను" అన్నాడు దాసు.

"నీకా ....... సుధా వాక్యమా! న్యాయ సుధా అంటే ఏమనుకున్నావు? ఇంకేమైనా పవిత్ర గ్రంథాలు చదివావా!" అన్నారు ఆచార్యుల వారు.

"నేను కేవలం హరిదాసును స్వామీ!" అంత గొప్ప గ్రంథాలు పఠించడం నాకెలా సాధ్యం! అన్నాడు విజయదాసు.

"సుధా వాక్యం అనినచో ఏదో కన్నడగీతం అనుకుంటున్నావా?" హేళన చేసాడు సుబ్బనాచార్యులు.

"నేను వివాదంలోకి దిగలేను స్వామీ మీరొక వాక్యం అనుగ్రహిస్తే మననం చేసుకుందామని వచ్చాను" అని విజయదాసు వినయంగా మనవి చేశాడు.

"నీ గురువు ఎవరు? ఇప్పటి వరకూ ఏఏ గ్రంథాలు చదివావు?" అని తిరిగి పండితులు ప్రశ్నించారు. "కోపగించకండి స్వామీ! నేనే మహా గ్రంథాలను చదవలేదు. వ్యాస రాయలు, పురందరదాసులు నాకు గురువులు. వారి వాక్కును అనుసరించి, హరికీర్తన గాయకుడిని ఐనాను" అని జవాబు చెప్పాడు విజయదాసు.

"ఏమీ! వ్యాసుణ్ణి కూడా నట విట గాయకులతో సమానం చేశావా!" అన్నాడు పండితుడు. "సందేహం ఏముంది? స్వామి! శ్రీ కృష్ణ భగవానుడొక నటుడు, మధ్వాచార్యులు, టీకాచార్యులు, శ్రీపాదరాజు, రాఘవేంద్రస్వామి అందరూ నటులే"

అన్నాడు దాసు. "నారాయణ, నారాయణ" అంటూ చెవులు మూసుకున్నాడు సుబ్బనాచార్యులు.

"అందరినీ దాస కూటమిలో చేర్చావు నీకు సుధా వాక్యం అర్థం అవుతుందనుకోను" అన్నాడు పండితుడు. "చిత్తం గురువులకు అర్థం అయితే శిష్యుడికి తప్పక అర్థమౌతుందన్నాడు" విజయదాసు.

ఇంతలో అటు వైపున కావడిలో నీళ్ళు మోసుకు వెళుతున్న బ్రాహ్మణుడి పిలిచి, అక్షింతలు చల్లి,

"సుధా గ్రంథములోని టీకా కర్తలకు కూడా అందని కఠినాతి కఠినమైన సూత్రాలను వివరించ మన్నాడు.

టీకా కర్తలకు సైతం బోధపడని క్లిష్టమైన సూత్రములను ఆ విప్రుడు – ఆశువుగా చెబుతూంటే అక్కడ ఉన్న పండితవరేణ్యులు నిర్ఘాంతపోయారు.

"నిజమైన భక్తాగ్రగణ్యుడు విజయదాసు" అని అర్థం చేసుకుని, పశ్చాత్తాప పడి క్షమాపణ కోరారు సుబ్బనాచార్యులు తదితరులు. గర్వం పటాపంచలు కాగా, మోకరిల్లి శిష్యుడు ఐనాడు సుబ్బనాచార్యులు. "విజయ కవచం" గానం చేస్తూ ఆశీర్వదించాడు విజయదాసు.

కర్ణాటక దాసకూటంలో పురందరదాసు మొదటి వారు కాగా విజయదాసు రెండవవారు. పూర్వ జన్మలో పురందరదాసు కుమారుడే విజయదాసు అయినాడని కూడా చెబుతారు.

వీరి పూర్వజన్మగురించి మరికొంత వివరం కూడా తెలుస్తోంది. "త్రేతాయుగంలో వీరు నారద మహర్షిని సేవించి 'సురలీల' అనే కపిశ్రేష్ఠునిగా జన్మించి శ్రీరామచంద్రుని సేవలో ధన్యులయ్యారు. ద్వాపరయుగంలో 'నికంపు'నిగ జననమంది శ్రీకృష్ణుని సేవలో తరించారు. అనంతరం కలియుగంలో పురందరదాసుల ఇంటిలో గోవుగా పుట్టారు. దాసుల వచనామృతాన్ని విని విని ఆ పుణ్యం చేత బ్రాహ్మణ జన్మమెత్తారు." ఈ విషయమంతా వీరి శిష్యులైన ఆనందదాసులు (హయవదన విఠల) తమ కీర్తనలో చెప్పడమే కాక స్వయంగా విజయదాసులే ఒక సుళాదిలో తామే చెప్పుకున్నారు.

దాసప్ప చీకలపర్విలో పెరిగి పెద్దవాడై ఉపనయన సంస్కారం పొంది వేదాధ్యయనం చేశాడు. అనంతరం వివాహమైంది. జీవిక కోసం ఏదో చిన్న ఉద్యోగంలో ప్రవేశించాడు. ఆ జీతంతో సంసారం సాగక పోవడంతో దాన్ని వదిలిపెట్టి దేశ సంచారానికి బయలుదేరాడు. దారిలో దొంగలు ఇతని దగ్గర ఉన్న కొద్దిపాటి సొమ్మును దోచుకున్నారు. దానితో దాసప్పకు ఈ లోకమే దుఃఖమయ మనిపించింది. ఈ బంధువులు సంబంధీకులు నిష్ప్రయోజనమని ఎవరికీ చెప్పకుండా కాశీ పయనమయ్యాడు. అప్పటికే అతని వయస్సు 16 సంవత్సరాలు. అలా నాలుగు సంవత్సరాలు తిరిగి తిరిగి వచ్చి మళ్ళీ సంసారంలో



కుదుటపడ్డాడు. ఆ సమయంలో దాసప్ప కేవలం వైరాగ్య శాలిగా తపస్సులోనే కాలం గడుపుతూ ఉండేవాడు.

ఇలా ఉండగా ఒక రోజున సాక్షాత్తు లక్ష్మీదేవి దాసప్ప తపస్సుకు మెచ్చి పంచ పక్వాన్నాలతో కూడిన బంగారు పాత్రను తీసుకుని, దాసప్ప ఇంటిలో లేనివేళ, సంధ్యా సమయంలో ఇంట్లో ఆడవాళ్ళకి ఇచ్చి వెళ్లిపోయింది. దాసప్ప రాగానే రాత్రి భోజనానికి అదే అతనికి వడ్డించారు. అది భోజనమా? కాదు, అమృతం. ఆడవాళ్లు అది వచ్చిన సంగతి చెప్పగానే దాసప్ప "ధన్యుణ్ణయ్యాను ధన్యుణ్ణయ్యాను. అమ్మా! నీకు అనంతానంత ప్రణామాలు. త్వరగా సాధు సజ్జనులైన దాసుల సంయోగం కలిగించి ఆ పరమాత్ముని పాదారావిందాలు విడువకుండగా అవిచ్ఛిన్నంగా భక్తిని ప్రసాదించి కాపాడమ్మా! తల్లీ!" అని వేడుకున్నాడు. అప్పటికి దాసప్ప వయస్సు 34 సంవత్సరాలు.

మళ్లీ కాశీ యాత్రకు బయలుదేరి కాశీ చేరుకున్నాడు. అక్కడ రోజు గంగా స్నానం చేసి సజ్జన సహవాసం చేస్తుండగా, ఒక రోజున పరమాత్మ కలలో దర్శనమిచ్చి గంగకు అవతలి ఒడ్డున ఉన్న వ్యాస కాశీకి తీసుకొని పోయాడు. అక్కడ వ్యాస మహర్షి తన శిష్యులతో సమావేశమై ఉండగా, దాసప్ప వారికి సాష్టాంగపడి వినయంగా కూర్చున్నాడు. వ్యాసమహర్షి 'దాసుడవు' కమ్మని ఉపదేశించారు. అదే కలలో పురందరదాసులు 'అంకితోపదేశాన్ని' ఇచ్చి "నీవు దాసుడవై నేను చేయదలచుకున్న ఐదు లక్షల పదాలకు తక్కువ అయిన 25 వేల పదాలను పూర్తి చేసి రచించు" అని ఆదేశించారు.

వెంటనే దాసప్పకి తెలివి వచ్చి తన స్వప్నానికి ఆశ్చర్యపోయి "విజయ విఠల" అనే అంకిత నామంతో శ్రీహరి చరిత్రను స్తుతించసాగాడు. విజయదాసులకు జ్ఞానోదయం అయింది. సామాన్య జనులకి మధ్వ సిద్ధాంతాన్ని బోధిస్తూ, గురువాజ్ఞ మేరకు పదాలు, సుళాదులు, ఉగాభోగాదులు రచిస్తూ 25 వేల పదాలు శ్రీహరికి సమర్పణగా రచించాడు. వీరు రోజు

10 కీర్తనలు రచించేవారు అని వారి శిష్యులు తిమ్మణ్ణదాసులు "ఆహ్నిక పద్ధతి" అనే కీర్తనలో పేర్కొన్నారు.

(కన్నడ సాహిత్యంలో కీర్తనలు, సుళాదిలు, ఉగాభోగాలు అన్నవి వివిధ సాహిత్య ప్రక్రియలు. కన్నడ వైష్ణవ భక్తి సాహిత్యంలో అంతర్భాగంగా, విష్ణువు, ఇతర దేవతలను స్తుతించే ఈ కూర్పులను దాసర పదగలు (దాసుల కూర్పులు) అంటారు. వారు తమ కూర్పుల ద్వారా కర్ణాటక సంగీతం, హిందుస్థానీ సంగీతం రెండింటినీ ప్రభావితం చేశారు. ఈ కూర్పులను కీర్తనలు, సుళాదిలు, ఉగాభోగాలు, కేవలం పాదాలుగా వర్గీకరించవచ్చు. సూళాదులు అంటే సప్త తాళాలు. సంగీతంలో తాళాలు చాలా ముఖ్యమైనవి. భావ, రాగ, తాళాలు కీర్తనలకు అవసరమని చెబుతారు.)

వీరి కీర్తనలలో విశేషంగా సుళాదులలో సమస్త ఉపనిషదర్థాలు, శృతి స్మృతులు తొణికిస లాడుతూ ఉంటాయి. ఈ విధంగా సమస్త వేద వేదాంత సారాన్ని కన్నడ భాషలో సుందరంగా పద్య రూపంలో రచించారు.

వీరి శిష్యులలో భాగణ్ణదాసులు, మోహన దాసులు, పంగనామ తిమ్మణ్ణదాసులు, ఆనంద దాసులు, హయగ్రీవ దాసులు ముఖ్యులు. వీరిలో మొదటి ముగ్గురి దాసకూట పరంపర నేటికీ కొనసాగుతోంది. ఈ ముగ్గురిని విజయదాసులు ప్రేమతో... భక్తిలో భాగణ్ణ, యుక్తిలో మోహన్న, శక్తిలో తిమ్మణ్ణ అని పొగిడేవారు. అనంతర కాలంలో విజయదాసులు చీకలపర్విని వదిలి తమ శిష్యులైన మోహనదాసుల స్థలమైన 'చిప్పగిరి' తరలి వెళ్లారు. ఇది గుంతకల్లు స్టేషన్ కు నాలుగు మైళ్ళ దూరంలో ఉంది. ఊరికి ముందే విజయదాసుల బృందావనం ఉంది. అది నిర్జనమైన మంత్ర సిద్ధి కల పుణ్య ప్రదేశం. ఇక్కడ విజయదాసులు నిర్మించిన ఒక చెఱువు ఉంది. ఇందులో గంగ ప్రత్యక్షమై ఉంటుంది. అక్కడ విజయదాసులకు దొరికిన పురందరుల చిన్న తంబుర, గోపాల బుట్ట, కైచిటికెలు, కాలి గజ్జలు నేటికీ ఉన్నాయి.

విజయదాసుల వంశస్థులు ఇక్కడ నివసిస్తూ ప్రతి సంవత్సరం



వీరి ఆరాధనను చాలా ఘనంగా చేస్తూ ఉంటారు. చిప్పగిరిలో ఉన్న భోజేశ్వరాలయమే వీరు తపస్సు చేసుకున్న స్థలము అని చెబుతారు. వీరి అంత్యకాలాన్ని గురించి జగన్నాథ దాసులు చెప్పిన ప్రకారం, విజయదాసులు యువ నామ సంవత్సరం కార్తీక శుద్ధ దశమి గురువారం చిప్పగిరిలో దేహం విడిచారని తెలుస్తోంది. విజయ దాసులు 73 సంవత్సరాలు జీవించారు. దీనిని బట్టి వీరి జననం 1681, నిర్యాణం 1754 అని తెలుస్తోంది.

విజయదాసు అశ్వత్థ నారసింహ స్వామి వరప్రసాదంగా 1687లో మాన్వికి ఎనిమిది మైళ్ళ దూరంలో ఉన్న చీకల పర్వి [చిప్పకూట] లో శ్రీనివాసప్ప, కూసమ్మ దంపతులకు ముగ్గురు మగబిడ్డలలో పెద్దవానిగా జన్మించారు. మాన్వి తాలూకా, రాయచూరు జిల్లాలో – అతని బాల్యం గడిచింది.

ఇతని పేరు మొదట దాసప్ప. పదహారేళ్ళ వయసులో ఇతడు కాశీ వెళ్లి సన్యాసులతో పాటు దేశమంతా తిరిగి వచ్చారు. ఇరవయ్యో ఏట అరలమ్మను వివాహం చేసుకున్నాడు దాసప్ప.

హరి నామ స్మరణ గావిస్తున్న విజయదాసును కాశీ మహారాజు పల్లకీతోను, అనేక విలువైన కానుకలతో సత్కరించారు. కాశీ, బదరి, ఉడిపి, తిరుపతి, పండరి, బేలూరు, శ్రీరంగపురం, రామేశ్వరం, మొదలగు క్షేత్రాలు దర్శించాడు విజయదాసు. క్రీ.శ. 1716 నుండి ప్రతి సంవత్సరం తిరుపతి బ్రహ్మోత్సవాలకు వెళ్లేవారని వారి జీవితచరిత్రను బట్టి తెలుస్తుంది. తిరుమల శ్రీనివాసునికి సంబంధించి దాదాపు 90 కీర్తనలు వున్నాయి.

ఎందోడ నాడువె, నిన్న దరుశనకె, నిన్ననోడలి బందె, జయ మంగళం అనేవి వీరి కీర్తనలలోనివే. వీరి కాలంలోనే జీవించినవారు ప్రసన్న వేంకటదాసులు.

అక్కడి బావిలో లభించిన శ్రీ కృష్ణ విగ్రహాన్ని భక్తితో పూజించేవాడు. 'చందప్ప' అనే గోపాలుడొకడు తన పొలంలో సగభాగం గోపాల దేవునికి సమర్పించాడు.

చిప్పగిరిలో పతితయైన ధనికురాలొకతె ఆహ్వానింపగా విజయదాసు ఆమె విందును స్వీకరిస్తాడు. ఆమె చరమ దశలో సేవచేసి అంత్యక్రియలు కూడా తానే చేశాడు దాసు.

త్యాగం, సేవ, భక్తకోటికి విజయదాసు అనుగ్రహించిన ఉపదేశాలు.

దాస సాహిత్య నందనవనంలో విజయదాసు గానం చేసిన భజన పుష్పాలు గుబాళించినవి. భక్తి – భజన సంప్రదాయానికి నిలిచిన జ్యోతి విజయదాసు.

కులశేఖరాళ్వార్లు చెప్పిన విధంగా, ఎవరైతే పరమాత్మ యొక్క దివ్యపాదములకు తమ మనస్సును అర్పిస్తారో అలాంటి వారికి రక్షకుడు పరమాత్మే. అతడు సమస్త వికార రహితుడై నిత్యానందమయుడై తరిస్తాడు.

**ఓం నమో భగవతే వాసుదేవాయ**

ధారావాహికం



# శ్రీ వేంకటాచల మాహాత్మ్యము

డా|| విష్ణుభట్ల గోపాలకృష్ణమూర్తి, 9491579452

## బ్రహ్మాండ పురాణాంతర్గతం

**గత సంచిక తరువాయి**

### శ్రీనివాసుడు అనుగ్రహించుట

అని ఈ విధంగా స్తుతించి చక్రవర్తి శ్రీనివాసునికి మరల మరల సాష్టాంగదండ ప్రణామములాచరించాడు అంతట అతని భక్తికి మెచ్చి శ్రీనివాసుడు ఆ పర్వతగుహలు ప్రతిధ్వనిస్తుండగా సముద్ర ఘోషను మించిన గంభీర ధ్వానంతో "ఓ రాజేంద్రా! నీ భక్తి వలన నేను నీకు మిక్కిలి ప్రసన్నుడనయ్యాను, ఇతరులకు దుర్లభమైనది, నీకిష్టమైన వరాన్ని కోరుకో నీవు కోరినవన్నీ ప్రసాదిస్తాను బాధపడవద్దు" అన్నాడు.అప్పుడారాజు"ప్రభూ! యోగివర్యులకు కూడా దుర్లభమైన నీ ఈ సుందర రూపం సర్వజనులకు దర్శనమిస్తూ ఇలాగే ఇక్కడే ఉండుగాక! మానవు లందరినీ ఉద్ధరించుటకై నీవు ఎల్లప్పుడు ఇక్కడే నివసించు".

యత్ర ద్రూపం దుర్లభం యోగివర్యైః ।
రమ్యం భూయా దీదృశం సర్వదృశ్యమ్ ॥
అత్రైవ త్వం సర్వదా వాసమీయాః ।
సర్వేషాం వై మానవానాం హితాయ ॥

**-బ్రహ్మాండ పురాణం అధ్యాయం 9 శ్లోకం 25.**

అని ప్రార్థించాడు. అంతట శ్రీనివాసుడు 'తథాస్తు' అట్లే అగుగాక! అని రాజుకు వరమిచ్చి ఇంకను ఇలా అన్నాడు, 'ఓ రాజా! నీవు నా భక్తుడవు, నాకు నీతో సమానమైనవాడు లేడు, నేను నీ యందు సంతుష్టుడనై నిన్ను నా స్నేహితునిగా చేసుకుంటున్నాను నీవు నన్ను నీ స్నేహితునిగాను, భక్త పరాధీనునిగాను తెలునుకో" అనిచెప్పి మరల మాధవుడు మంద హాసవదనారవిందుడై 'రాజా! నీవు నా ఆజ్ఞానుసారము ప్రతిరోజు మూడువేళల, త్రిసంధ్యలలో నన్ను సేవించు, ఆరాధించు"– అన్నాడు.

భగవంతుని అజ్ఞను శిరసావహించి నిత్యం ప్రీతితో భగవంతుని సేవిస్తున్నాడు. రాజు తన రాజధానీనగరంలో ఉంటూ ప్రతిరోజు శ్రీనివాసుని సేవిస్తూ ఉన్నాడు. వేంకటాద్రికి వెళ్ళివస్తూ ఉండేవాడు. రాజు తనను సేవించేటప్పుడు భక్తవత్సలుడైన శ్రీనివాసుడు అర్చాభావమును వదలి, మానుష రూపంతో ఆ చక్రవర్తికి హితాన్ని ఉపదేశించేవాడు.

సేవాకాలేషు తస్యాయం రాజ్ఞో వై భక్తవత్సలః ।
అర్చాభావమతి క్రమ్య హితార్థాన వ్యపాదిశత్ ॥

**-బ్రహ్మాండ పురాణం అధ్యాయం 9. శ్లోకం 29.**

## శ్రీనివాసుని మహోత్సవానికి బ్రహ్మరుద్రాదుల రాక

ఆ చక్రవర్తి ఒకసారి సూర్యుడు కన్యామాసంలో ఉండగా శాస్త్రోక్తంగా ధ్వజారోహణం చేసి శ్రీనివాసునికి మహోత్సవం ప్రారంభించాడు. యథావిధిగా గరుడధ్వజాన్ని తయారు చేసి, దానిని పూజించి ధ్వజస్తంభంపై ఎగురవేశారు. బ్రహ్మదేవుణ్ణి, ప్రమథ గణములతో కూడిన పరమ శివుణ్ణి, ఇంద్రుణ్ణి, ఇతర దిక్పాలక ప్రముఖులను శ్రీనివాసుని సేవించుటకై విచ్చేయ వలసినదిగా బ్రాహ్మణోత్తములు మంత్ర పూర్వకంగా ఆహ్వానించారు.

అంతట బ్రహ్మదేవుడు హంస వాహనారూఢుడై, అంజలి బద్ధుడై మునులతో పాటు లక్ష్మీపతిని సేవించుటకై వేంచేశాడు. శంకరుడు వృషభవాహనాన్నధిరోహించి పార్వతీసహితుడై, ప్రమథగణాలతో కూడి శ్రీనివాసుని సేవించుటకై సంతోషంతో ఏతెంచాడు. ఇంద్రుడు కూడా దట్టమైన సిందూరంతో ప్రకాశించే కుంభస్థలంగల ఐరావతాన్నధిష్ఠించి శ్రీనివాసుని మహోత్సవాన్ని దర్శించడానికి చనుదెంచాడు. ఇతర దిక్పాలకులు కూడ తమతమ వాహనముల నధిష్ఠించి భగవంతుని మహోత్సవాన్ని దర్శించాలనే కుతూహలంతో శేషాచల ప్రాంతానికి విచ్చేశారు.

నారదుడు కూడ విష్ణు సహస్రనామాన్ని పఠిస్తూ, 'మహతి' అనే వీణను మీటుతూ, మనస్సులో ఆ తేజస్స్వరూపుడైన పరమాత్మను ధ్యానిస్తూ, వేదాలను కూడ పఠిస్తూ అక్కడకు వచ్చాడు. ఆ తరువాత నానాదిక్కులనుండి ఆ మహోత్సవాన్ని దర్శించడానికి రాజులు, సకల మానవులు పుత్రులను, నేత్రములను ప్రసాదించమని శిరస్సులు వంచి ప్రార్థిస్తూ వచ్చారు.

ఆ మహోత్సవ యాత్రలో పాల్గొనడానికి నలుదిక్కుల నుండి వచ్చిన భక్తులంతా స్వామిని ప్రార్థించారు, కీర్తించారు, ఆ పరాత్పరుని వైభవాన్ని గానం చేశారు. ఆ విధంగా ఆ శ్రీనివానుని మహోత్సవం అంతకు ముందెన్నడూ కనివిని ఎరుగని రీతిలో అందరికీ అత్యంతాశ్చర్యానందాలను కలిగించింది. వారిలో కుంటివారు పరుగెత్తారు. గ్రుడ్డి వారికి దూరదృష్టి వచ్చింది. మూగవారు మాట్లాడారు. అప్పటినుండి ప్రతిసంవత్సరం ఆ వేంకటేశుని మహోత్సవంలో పాల్గొని, శ్రీనివాసుని దర్శించి, సేవించి, నమస్కరించేవారు తప్పక సమృద్ధిని పొందుతున్నారు. శ్రీనివాసుని మహోత్సవ యాత్రలో మహేంద్రుని ఆజ్ఞతో మేఘాలు వర్షించి రాజవీధుల్లో దుమ్ములేకుండా శుభ్రం చేసేవి.

ఆ చక్రవర్తి, స్వామివారికి రత్నఖచితమైన బంగారు రథాన్ని చేయించాడు. ఉత్సవం ఎనిమిదవ రోజున ఆ అందమైన దివ్యరథంలో స్వామి దివ్యతేజస్సుతో విరాజిల్లాడు. మహోత్సవంలో ఎనిమిది రోజులు పూర్తయిన తరువాత తొమ్మిదవనాడు శ్రవణానక్షత్రంలో, శుభముహూర్తంలో భగవంతుని ఆజ్ఞచే సుదర్శన చక్రమునకు యజ్ఞసమాప్తి సూచకంగా అవభృథస్నానం నిర్వర్తించారు. ఆ రాత్రి విప్రశ్రేష్ఠులు ధ్వజావరోహణం చేసి మహానైవేద్యాన్ని సమర్పించారు. ఆ మరునాడు సుగంధాన్ని వెదజల్లే పలువిధాలైన సుమనో హరపుష్పాల్తో ఆ దేవదేవుని యథావిధిగా పూజించారు. (ఇదే పుష్పయాగం, దీనిని ఉత్సవం మరునాడు చేసేవారు ఉత్సవంలో జరిగే లోపాలకు ప్రాయశ్చిత్తమిది) ఆ మహోత్సవానికి విచ్చేసిన బ్రహ్మరుద్రాది దేవతలు స్వామివారిని సేవించి తమతమ స్థానాలకు తిరిగి వెళ్ళుటకై స్వామి అనుమతికొరకు అంజలి బద్ధులై నిరీక్షిస్తుండగా శ్రీనివానుడు వారందరికీ అనుమతిచ్చి పంపాడు.

ఈ విధంగా ఆ మహారాజు వృషశైలాధిపతికి దివ్యమైన మహోత్సవాన్ని మహావైభవంగా జరిపించి తనను కృతార్థునిగాను, ధన్యునిగాను భావిస్తూ సంతోషంతో తన నివాసానికి వెళ్ళాడు.

అథాన్యస్మిన్ దినే దేవమానర్చ విధివత్తదా ।
ప్రసూనై ర్వివిధైశ్చాపి సుగంధై స్సుమనోహరైః ॥
హరిర్వి సర్జయామాస దేవాన్ సేవార్థ మాగతాన్ ।
బ్రహ్మరుద్ర పురోగాంశ్చ ప్రణమ్య శిరసస్తదా ॥
ఇత్థం సరాజా వృషశైలభర్తుః ।
మహోత్సవం దివ్యమిమం సమాప్య ।
హృష్టః కృతార్థం బహుమన్యమాన ।
హ్యాత్మానమావాసమియాయ భూయః ॥

-బ్రహ్మాండపురాణం అధ్యాయం9. శ్లోకాలు 48,49, 50.

## కృష్ణశర్మ వృత్తాంతం

ఆ మహోత్సవం పూర్తయిన తరువాత కొన్నాళ్ళకు ఒక బ్రాహ్మణుడు ఆ రాజు దగ్గరికి వచ్చాడు. ఆయన పచ్చి బాలింతరాలైన తన భార్యను వెంటబెట్టుకొని వచ్చాడు. ఆ మహారాజు ఆయనకు స్వాగతం పలికి అర్ఘ్యపాద్యాదులిచ్చి ఉచితాసనంపై కూర్చుండబెట్టి యథావిధిగా పూజించి, నమస్కరించి కుశల ప్రశ్నలడిగాడు! ఓ విప్రోత్తమా! మీ దేశమేది? ఇక్కడకు ఎందులకు విచ్చేశారు? మీకు నేనేమి ఉపకారం చేయాలో ఆజ్ఞాపించండి? అని అడుగగా ఆ బ్రాహ్మణుడు రాజుతో 'మహారాజా! దక్షిణ సముద్రతీరంలో 'చంద్రపురి' అనే పట్టణముంది. ఆ పట్టణంలో ధర్మజ్ఞుడైన 'కూర్మ'డనే బ్రాహ్మణోత్తముడు నివసిస్తున్నాడు. నేనతని పుత్రుడను, నన్ను 'కృష్ణశర్మ' అంటారు. ఈమె నాభార్య ఈమె పేరు సుధర్మిణి. నేను మోక్ష సాధకమైన కాశీక్షేత్రాన్ని దర్శించటానికి వెళుతున్నాను. ఈమె బిడ్డకు మూడు నెలల వయస్సు, నాభార్య

బాలింతరాలగుటవ లన బలహీనంగా ఉంది దుర్బలురాలైన ఈమె దూర ప్రయాణము చేయలేదని భావించి మీవద్దకు వచ్చాను మాకు నీవే రక్షకుడవు, నేను కాశీ క్షేత్రాన్ని దర్శించి వచ్చే వరకు ఈమెను తమ రక్షణలో ఉంచాలని నా ఉద్దేశ్యం! అని చెప్పాడు.

అంతట రాజు 'అలాగే కానివ్వండి' అని అంగీకరించగా శిశువుతో కూడా తన భార్యను రాజువద్ద ఉంచి ఆయన దగ్గర సెలవు తీసుకొని కృష్ణశర్మ కాశీయాత్రకు వెళ్ళాడు. ఈ రాజు బ్రాహ్మణుని భార్య నివసించుటకై ఒక వసతినేర్పాటు చేసి ఆరు నెలలకు సరిపడ ఆహారసామగ్రి సమకూర్చి ఆమెను ఆ గృహంనుండి బయటకు రావద్దని శాసించాడు.

రాజు తన దైనందిన రాజకార్యములలో నిమగ్నుడై ఆమె విషయాన్ని విస్మరించాడు, కొంతకాలం తరువాత కృష్ణశర్మ కాశీ నుండి తిరిగి వచ్చి రాజుతో 'రాజా! నేను కృష్ణశర్మను కాశీ క్షేత్రాన్ని మంగళప్రదమైన గంగానదిని దర్శించి వచ్చాను. నేను కాశీకి వెళ్ళునపుడు నా భార్యను, బిడ్డను మీ వద్ద న్యాసముంచాను ఆమె నా వియోగంతో చాలా బాధపడుతూ ఉంటుంది. కావున నా భార్యను, బిడ్డను నాకు అప్పగించండి! అని అడుగగా రాజు దుఃఖితుడై ఈ విధంగా చింతించాడు.

'అయ్యో! నేను అజాగ్రత్తతో లౌకిక విషయాలలో నిమగ్నుడనై ఈ బ్రాహ్మణుని భార్య గురించి విచారించలేదు. అప్పుడెప్పుడో ఆమెకు ఆరు నెలలకు సరిపడ గ్రాసాన్నిచ్చాను. ఆ ఆరునెలలు ఎప్పుడో దాటిపోయింది. ఆ బ్రాహ్మణి ఏం చేస్తుంది? ఆమెను యింటినుండి బయటకు రావద్దని నేను ఆజ్ఞాపించాను!

రాజు ఈ విధంగా విచారించి ఆ బ్రాహ్మణుని భార్య, బిడ్డ ఆ యింట్లో ఎలా ఉన్నారో చూసి రమ్మని ఒక సేవకుణ్ణి పంపాడు అతడు వెంటనే వెళ్ళి చూసి వచ్చి రాజుకు ఈ విధంగా విన్నవించాడు. 'ప్రభూ! ఆ బ్రాహ్మణుని భార్య బిడ్డతోపాటు చనిపోయింది. వారిద్దరి శరీరాలు ఎండిపోయినాయి అని చెప్పగా విని రాజు మిక్కిలి దుఃఖితుడై కలవరపాటు చెందుచున్న ఆ బ్రాహ్మణుని పిలిచి యిలా అన్నాడు.

ఓ బ్రాహ్మణోత్తమా! నీ భార్య నా అనుమతితో దేవదేవుని సేవించుటకై యిప్పుడే వెళ్ళింది. రేపామెను వెంటనే పిలిపించి భద్రంగా మీకప్పగిస్తాను ఒకరోజు మీరు విశ్రమించండి. రేపు మీ భార్యను బిడ్డను తోడ్కొని వెళ్ళవచ్చు, అని బ్రాహ్మణునికి చెప్పి ఆ రాజు మనస్సులోసంశయిస్తూ యింటినుండి బయలుదేరి వెంటనే వేంకటాచలానికి బయలుదేరాడు. ఆ దేవ దేవుని వీలుచూసుకుని దర్శించి అంజలిబద్ధుడై నిలబడ్డాడు. ఒక నిముషం నిట్టూర్పు విడిచి దుఃఖిస్తూ స్వామికి ఈ విధంగా విన్నవించుకున్నాడు.

ప్రభూ! నా ఈ విన్నపాన్ని సావధానంగా ఆలకించండి. నేను మిమ్మల్ని శరణు వేడుతున్నాను. కావున మీరే నన్ను రక్షించాలి నేను అజాగ్రత్తతో అలసత్వంతో ఒక పాపకార్యాన్ని చేశాను నేను లౌకిక వ్యవహారాలలో మునిగి ఒక బ్రాహ్మణోత్తముడు నావద్ద న్యాసంగా పెట్టిన (రక్షించుటకై ఉంచిన) మహాపతివ్రతయైన ఆయన భార్య యోగక్షేమాలను విచారించుట మరచాను. ఇప్పుడా బ్రాహ్మణుడు తిరిగి రాగా వెనుకటి సంగతిని గుర్తు తెచ్చుకొని, ఆమె ఎలా ఉన్నదో అని విచారించగా ఆమె ఆహారం లేక శిశువుతోపాటు కృశించి, శుష్కించి మరణించిందని తెలిసింది. అప్పుడు నేను మనస్సులో నిర్వేదం పొంది పైకి బ్రాహ్మణునితో ఇలా అన్నాను. ఆమె భగవంతుని సేవించుటకై కొండకు వెళ్ళింది. రేపు ఆమెను బిడ్డతోపాటు తీసుకువస్తాను. నీవు భయపడవద్దు. అని ఆ బ్రాహ్మణుని విశ్రాంతి తీసుకొమ్మని మీవద్దకు వచ్చాను. ఆమె మరల ఎలా బ్రతుకుతుందా అని నాకు చాల విచారంగా ఉంది. అందువల్ల ఓ దేవా! ఆశ్రయించిన వారి ఆపదలను పోగొట్టే నిన్ను నేను శరణుపొందాను కావున నాకు పాపం రాకుండాను, బ్రాహ్మణుడు కృతార్థుడయ్యేటట్లు అనుగ్రహించు ఓ దేవదేవా! ఆ విధంగా చేయడానికి నీకు తప్ప లోకంలో మరెవ్వరికీ సాధ్యం కాదు. ఓ జగత్ప్రభూ! శరణార్థినై నన్ను ఈ దుఃఖసముద్రం నుండి కాపాడు. మాకు నీవు తప్పవేరెవ్వరూ దిక్కులేరు". అని ప్రార్థించి, ఆ దేవునికి నమస్కరించి ఆ రాజు మిన్నకున్నాడు.

అంతట భక్త వత్సలుడు, కరుణామయుడు శరణాగత రక్షకుడు అయిన శ్రీనివాసుడు అతనిని మృదుమధురమైన మాటలతో అనునయిస్తూ, ఓదార్చుతూ ఇలా అన్నాడు.

ఓ రాజర్షీ! నీవు బాధపడవద్దు, భయపడవద్దు, ఆ బ్రాహ్మణుని భార్య బ్రతికే ఉపాయం నీకు చెబుతాను, ఆ విప్రుడు కాశీకి వెళుతూ నన్ను దర్శించి నా అనుమతి పొందే వెళ్ళాడు. అతని భార్య సుధర్మిణి కూడా నా భక్తురాలే. ఆ సాధ్వి మనస్సును నాయందే లగ్నం చేసింది ఆమె ప్రాణాలు యముని కర్పించలేదు. అవి నాయందే భద్రంగా ఉన్నాయి. అని చెప్పి అతనిని ఊరడించి వినమ్రుడై అంజలి ఘటించి వేత్రహస్తుడై నిలబడి ఉన్న విష్వక్సేనునితో యిలా అన్నాడు.

## అస్థికూట సరోవర మాహాత్మ్యము

'విష్వక్సేనా' నా ఆజ్ఞను విను. ఇక్కడకు ఈశాన్యదిక్కులో 'అస్థకుట'మనే పవిత్ర తీర్థము ఉంది. ఆ పుణ్యజలాలను తీసుకొనివచ్చి సుధర్మికి మరియు ఆమె బిడ్డ శరీరాలకు స్నానం చేయించు ఆమె నిద్రలేచిన దానివలె బిడ్డతో పాటు తప్పక లేచి కూర్చుంటుంది! అని భగవానుడు ఆజ్ఞాపించగా విష్వక్సేనుడు 'అలాగే' నని ఆ తీర్థజలాలను తెచ్చి వారిరువురి శరీరాలకు స్నానం చేయించాడు. వెంటనే ఆ బ్రాహ్మణుని భార్య అయిన మహాసాధ్వి 'సుధర్మిణి' బిడ్డతో పాటు లేచి కూర్చుంది.

అంతట మధుసూదనుడు రాజును పిలిచి 'ఓ పుణ్యాత్మా! ఈ పర్వత మహిమను చూశావా! ఈ నా గిరి ప్రభావాన్ని సనకాది

యోగులు కాని, బ్రహ్మాది దేవతలు కాని ఎరుగరు. రాజా! రాజులు తమ మనస్సులో ఏమేమి కోరుకుంటారో ఈ పర్వత ప్రభావము వలన అవన్నీ సిద్ధిస్తాయి' అని చెప్పాడు.

**ప్రభావమచలస్యాస్య సనకాద్యాశ్చ యోగినః ।**
**బ్రహ్మాద్యాః సకలా దేవా న జనన్తి యథా మమ ॥**
**యద్యచ్ఛతి వై జన్తుర్మనసా–భీప్సితం నృప! ।**
**తథా సిధ్యతి తత్సర్వం గిరేరస్య ప్రభావతః ॥**

**-బ్రహ్మాండ పురాణం. అ.10.42,43,44.**

భగవానుడు ఆ తరువాత ఆ బ్రాహ్మణుని భార్య సుధర్మిణిని పిలిచి ' నీకేమి వరం కావాలో కోరుకొమ్మన్నాడు. ఆ దేవదేవుడు యిలా వరమనుగ్రహించగా ఆమె మాధవునితో' ఓ దేవదేవా! నాకు ఎల్లప్పుడు నీయందు దృఢమైన భక్తిని ప్రసాదించమని వేడుకొంది. శ్రీనివాసుడు ఆమె కోరిన విధంగా ఆమెకు నిశ్చలభక్తిని ప్రసాదించాడు.

ఆ తరువాత బ్రహ్మరుద్రాది దేవతలు, సనకాది యోగులు అందరూ ఆ అద్భుతాన్ని చూడటానికి వృషాద్రికి వెళ్ళారు కృష్ణశర్మ కూడా సంతుష్టుడై ఆశ్చర్యంతో దేవదేవుడు, లక్ష్మీపతి అయిన శ్రీనివాసునికి నమస్కరించి స్తోత్రం చేశాడు. అప్పుడు దేవదేవుడు రాజుతో 'ఓ రాజా! ఈ విప్రునితో సమానమైనవాడు భూలోకంలో మరెవరూ లేరు. ఇతడు నా భక్తుడు, జితేంద్రియుడు. ఇతడు జన్మాంతరంలో వేదాంతార్థాలను ప్రవర్తింపజేసి లోకంలో ప్రచారంచేసి దేహాంతంలో నా సాయుజ్యాన్ని పొందుతాడు.! అని చెప్పాడు.

అంతట ఆ రాజు ఆ బ్రాహ్మణుని పిలిచి భార్యా బిడ్డతో పాటు సంతోషంగా అతనిని స్వగ్రామానికి పంపించాడు. అప్పటినుండి ఆ రాజు ప్రతిరోజు స్వయంగా వేంకటాచలానికి వెళ్ళి దృఢమైన భక్తితో శ్రీనివాసుని సేవిస్తూ ఆయనకు అనేక కైంకర్యాలను చేసేవాడు.

అంతట నారదుడు భృగుమహర్షితో ఓ మహర్షీ! ఆ దేవ దేవుడైన శ్రీమహావిష్ణువు యొక్క భవిష్యత్ వృత్తాంతాన్ని నీకు చెప్పాను. ఆయన కలియుగంలో భక్తులచే పూజించబడుతూ అనేక అద్భుతమైన మహిమలను ప్రదర్శిస్తూ ఆ వేంకటాచలంపై లక్ష్మీదేవితో కూడా విహరిస్తూ దేవతలు, సిద్ధుల చేత సేవించబడుతూ ఆనందంగా నివసిస్తాడు. అని ఈ విధంగా వ్యాసుడు తనకు చెప్పిన వేంకటాచల మాహాత్మ్యాన్ని నారదుడు భృగు మహర్షికి చెప్పాడు.

## సింహాదుడనే రాక్షసుని వృత్తాంతం

భృగుమహర్షి నారద మహర్షిని 'ఓ దేవర్షీ! సర్వజ్ఞా! మీకు నమస్కారం, ఓ కరుణామయా! మీకు నమస్కారం మీ దయవలన జరిగిన జరుగబోయే వేంకటాచల మాహాత్మ్యాన్ని విన్నాను. ఆ వేంకటాచలపతి ఆ కొండపై ఏ కారణం వల్ల కల్పాంతం వరకు నివసిస్తాడు? ఆ దేవదేవుడు ఏం చేస్తాడు, ఓ మునిశ్రేష్ఠా! ఇదంతా నాకు సంగ్రహంగా చెప్పండి ఏది వింటే యిక వినవలసింది ఏమి వుండదో అటువంటి భగవంతుని దివ్య చరిత్రను లీలా విశేషాలను నాకు తెలియజేయండి! అని అడిగాడు.

అంతట నారదమహర్షి భృగుమహర్షితో యిలా చెప్పసాగాడు– ఓ మహామునీ! ఆ వేంకటేశ్వరుని పవిత్రచరిత్రను చెబుతాను శ్రద్ధగావిను, పూర్వం అగస్త్యమహర్షి భవిష్యత్ వృత్తాంతాన్ని చెబుతూ ప్రసంగవశాత్తు దీనిని చెప్పారు రాబోవు కాలంలో చక్రవర్తనే రాజు భూమిని పరిపాలిస్తాడు. అప్పుడు సింహాదుడనే మహా పరాక్రమవంతుడైన రాక్షసుడొకడుంటాడు. ఆ దుర్మార్గుడు పాపవినాశానికి ఉత్తరంలో ఒకటిన్నర యోజనదూరంలో (12 మైళ్ళు) బ్రహ్మదేవుని ధ్యానిస్తూ తపస్సు చేశాడు. అఘవినాశిని అనే తీర్థంలో మూడు వేళలా స్నానం చేస్తూ ఓ ప్రజాపతీ! ఈ ప్రపంచంలో మాకు నీకంటే వేరెవరు దిక్కులేరు. మేము శ్రేయస్సులను పొందెదముగాక! మా మనోరథములు నెరవేరుగాక!'' అనే మంత్రాన్ని జపిస్తూ నిత్యం చతుర్ముఖుని ఆరాధించాడు. ఇలా ఒక సంవత్సర కాలం తపస్సు చేయగా బ్రహ్మదేవుడు హంసనధిరోహించి సింహాదునికి ప్రత్యక్షమయ్యాడు.

అంతట బ్రహ్మదేవుడు ఓ సింహాదా! లెమ్ము! నీకు శుభమగుగాక! నీ తపస్సుకు మెచ్చాను. ఓ సువ్రతా! వరం కోరుకో' అనగా సింహాదుడు 'జగత్ప్రభూ! నీకు నమస్కారం, సకల కారణ కారణా! నీకు నమస్కారం నీవు నాయందు ప్రసన్నుడవైతే నాకు గొప్ప వరాన్నివ్వు, దేవతలు, రాక్షసులు, గంధర్వులు, యక్షులు, రాక్షసులు, నాగులు నాకు వశులై ఉండాలి. నా ఆజ్ఞను పాలించాలి. వారివలన నాకు భయముండకూడదు' అని వరమడుగగా బ్రహ్మదేవుడు 'తథాస్తు' అలాగే అగుగాక! అని వరమిచ్చి సింహాదుడు చూస్తుండగనే యోగీశ్వరులతో పాటు అదృశ్యమయ్యాడు.

అప్పటి నుండి ఆ దురాత్ముడు దేవతాసమూహములను, క్షత్రియులను, మునులను, మానవులను అందరినీ పీడించసాగాడు. ఈ విధంగా ఆ రాక్షసునిచేత పీడితులైన దేవతలు, తపోధనులైన మునులు, పెన్నిధి వంటి వాడు, సర్వలోక శరణ్యుడైన వేంకటేశ్వరుని ఈ విధంగా శరణు వేడారు. 'ఓ దైత్యసంహారీ! ఓ దేవదేవా! శరణాగతవత్సలా! పుండరీకాక్షా! మమ్మల్ని ఆ సింహాదుడనే రాక్షసాధముని నుండి రక్షించండి. అతను ముల్లోకాలను పీడిస్తున్నాడు. సుందరీమణులను చెరపడుతున్నాడు. అతడు పరమ దుర్మార్గుడు, క్రూరుడు. ఆ పాపాత్ముడు బ్రహ్మదేవుని వలన వరాలను పొంది ఈ విధంగా విర్రవీగుతున్నాడు! అని ఋషులు, దేవతలు వేంకటేశ్వరునికి

విన్నవించుకున్నారు.

వారి విన్నపము విన్న భగవానుడు మేఘ గంభీరధ్వనితో వారిననుగ్రహిస్తూ యిలా అన్నాడు. ఓ దేవతలారా! ఆ సింహాదునికి బ్రహ్మదేవుడు వరమిచ్చాడు. ఆ వరప్రభావం వల్ల దుర్మార్గుడైన అతనిని రాక్షసులు గాని, దేవతలుగాని, నాగులుగాని, మానవులు గాని రాక్షసులుగాని, దేవతలుగాని, చంపలేరు. అతనికి రాక్షసాంశలో పుట్టినటువంటి చాలామంది సహాయం చేసేవారున్నారు. ఖరుడు, కడారుడు, పింగాక్షుడు, కనకుడు, కద్రువుడు, కపి, ఈ ఆరుగురు బాణుని సంతతివారు. వీరు సంకరజాతివారు.

పూర్వం నేను ప్రహ్లాదుని యందు ప్రీతితో నీ వంశంలో వారు ముల్లోకాలను క్షోభింపచేసినా వారిని చంపను, అని వరమిచ్చాను. కాబట్టి అతనిని సంహరించే ఉపాయం మీకు చెబుతాను. శ్రీకాళహస్తి సమీపంలో సువర్ణముఖరీ తీరంలో పడమటివైపున పవిత్ర సౌధంలో చక్రవర్తి ఉన్నాడు. అతడు నా భక్తుడు, మీరు మీ మీ అంశలతో అతనిని అతని బలాన్ని పెంపొందించండి అతడు మహాబలవంతుడై రాముడు రాక్షసులను సంహరించినట్లుగా ఆ గొప్ప బలపరాక్రమాలు గల సింహాదుని సంహరిస్తాడు. కాబట్టి మీరందరు దిగులు చెందకుండా స్వస్థచిత్తులు కండి. మీకంతా శుభమే జరుగుతుంది. అని చెప్పి సర్వహృదయవాసియైన శ్రీమహావిష్ణువు దేవతలందరిని పంపించి తన దివ్యవిమానంలో ప్రవేశించారు.

అనంతరం దేవతలు, గంధర్వులు, సిద్ధులు, మహర్షులు అందరూ కలిసి బ్రాహ్మణవేషాలు ధరించి భగవంతుడు చెప్పినట్టు ఆ చక్రవర్తి వద్దకు వెళ్ళి ఆయనను ఆశీర్వదించారు. తన మందిరానికి వచ్చిన ఆ మహాత్ములందరిని యథావిధిగా పూజించి ఆ రాజు వారికి నమస్కరించి కుశల ప్రశ్నలడిగాడు అంతట బ్రాహ్మణ వేషాలలో ఉన్న ఆ దేవతలందరు వినయశీలుడైన ఆ రాజుతో ఒకేమాటగా యిలా చెప్పారు.

## సింహాదుని వధకై దేవతలు చక్రవర్తిని ప్రేరేపించుట

"ఓ రాజా! నీవు భూమిని పరిపాలిస్తుండగా మేమందరం క్షేమంగా ఉన్నాము. సూర్యుడు ప్రకాశిస్తుండగా లోపల చీకటి ఉండదు కదా! కాని సింహాదుడనే రాక్షసుడు బ్రాహ్మణులను బాధిస్తున్నాడు. అతని వలన యజ్ఞయాగాదులు గాని, హోమాలుగాని సత్కర్మలేవీ జరగడం లేదు. ఆ దుర్మార్గుడు బ్రాహ్మణహింసకుడు, దురాచారుడైన రాక్షసాధముడు పాపవినాశనానికి ఉత్తర దిక్కున ఒకటిన్నర యోజనంలో నివసిస్తున్నాడు. సకల లోకకంటకుడు, దుర్మార్గుడైన ఆ సింహాదుని నీవు సంహరించు, మేమందరం దేవతా స్వరూపులం మేమంతా నిన్ననుగ్రహిస్తున్నాం అని వారు చెప్పగా ఆ చక్రవర్తి ఓ భూసురులారా! మీ అనుగ్రహం వల్ల నేను ఆ సింహాదుని తప్పక సంహరిస్తాను. అసలా సింహాదుడెటు వంటివాడు? అతని బలమేమిటి? తెలియ జేయండి అని అడిగాడు. అప్పుడా బ్రాహ్మణులు 'ఓ రాజేంద్రా! ఆ సింహాదుడు ఘోరమైన పరాక్రమం కలవాడు. బ్రహ్మదేవుని వరప్రసాది. అతనిని దేవతలు గాని, చివరకు దేవదేవుడైన శ్రీమహా విష్ణువు గాని సంహరించడానికి వీలు కాదు. అందువల్ల అతనిని సంహరించగలవాడవు నీవే. ఇందుకేమాత్రం సందేహం లేదు. దేవతలందరూ నిన్నావహిస్తారు! అని చెప్పి ఆ బ్రాహ్మణులందరూ ఆ రాజునాశీర్వదించి అదృశ్యమయ్యారు. అదిచాల ఆశ్చర్యంగా ఉండింది.

అనంతరం ధర్మాత్ముడు, మహా తేజస్వి అయిన ఆ రాజు తన మంత్రులను సమావేశపరచి, ఆ దుర్మార్గుని సంహరించే ఉపాయాన్ని ఆలోచించాడు. ఆ తరువాత తన కర్తవ్యాన్ని నిర్ణయించుకొని సంతోషంగా వేంకటేశ్వరుని సన్నిధికి వెళ్ళాడు. మునుపటివలె వేంకటేశ్వరుని బంగారు ఆకులు, పూలతో తులసీదళాలతో పూజించి, ఆ రాజు స్వామిని యిలా ప్రార్థించాడు. 'ప్రభూ! సింహాదునిచే పీడితులైన విప్రశ్రేష్ఠులు అతనిని సంహరిచుటకు నన్ను నియోగించారు ఇప్పుడు నేనేమి చేయాలి?' అని అడుగగా శ్రీనివాసుడు ప్రసన్నుడై 'రాజా! నీకు భావిసామ్రాజ్య సూచకాలైన నా శంఖచక్రాలను, కౌమోదకి అనే గదను, శారఙ్గమనే ధనుస్సును, నందకమనే ఖడ్గాన్ని ప్రసాదిస్తాను. నీవా పంచాయుధాలను ధరించి దేవద్రోహి, దురాత్ముడు అయిన ఆ దుష్టరాక్షసుణ్ణి యుద్ధభూమిలో బంధు వర్గంతోను, మంత్రులతో సహా సంహరించు' అని చెప్పి శ్రీనివాసుడు ఆ చక్రవర్తికి తన పంచాయుధాలను ప్రసాదించాడు.

## కిరాతరూపాల్లో చక్రవర్తి సైన్యం

అనంతరం ఆ రాజు తన పట్టణానికి తిరిగి వెళ్ళి దేవతా తేజస్సుతో కూడిన తన సైన్యాన్ని సమకూర్చుకున్నాడు. సకల దేవతల తేజస్సుతో దేదీప్యమానంగా ప్రకాశిస్తూ కిరాతవేషం ధరించి సైనికులతో కూడా యుద్ధానికి బయలుదేరాడు. ఆ సైనికులందరు కూడా బోయవారి వేషాలు ధరించి వేటకుక్కలను వెంటబెట్టుకొని వేటయందాసక్తి కల చక్రవర్తిని అనుసరించారు.

ఆ రాజభటులు పెద్దపులులను, తోడేళ్ళను, సింహాలను, చిరుతపులులను, ముళ్ళపందులను, అడవి పందులు మొదలైన అడవి మృగాలను, క్రూరమృగాలను వేటాడుతూ పాప వినాశన తీర్థం ఒడ్డుకు చేరారు. అక్కడ నుండి బలగర్వితులైన ఆ సైనికులు మెల్లమెల్లగా ఆ సింహాదుడుండే భయంకరమైన అడవికి చేరుకున్నారు.

అంతట ఆ రాక్షసరాజైన సింహాదుడు తన వనదుర్గంనుండి బయట కు వచ్చి ఆ కిరాతసైన్యాన్ని చూసి భయరహితుడై చిరునవ్వుతో "దేవతలు, రాక్షసులు, గంధర్వులు, దానవులు కూడా నన్నేమి చేయలేరు. ఇక ఈ చక్రవర్తి సైన్యం నన్నేమి చేస్తుంది? ఇక నాకు భయమెందుకు?" అని నిశ్చయించుకొని తన సైన్యంతోపాటు బయలుదేరాడు.

చక్రవర్తి సైన్యాన్ని ఎదుర్కొనడానికి సింహాదుడు సింహాన్ని అధిరోహించి వెళ్ళాడు. నూరువేలకోట్ల సైన్యంతో ఖరుడు, ఆరుకోట్ల సేనతో కడారుడు, ఏడుకోట్ల సేనతో పింగాక్షుడు, పదికోట్ల సేనతో కనకుడు, మరో పదికోట్ల సేనతో కద్రుకుడు, నూరుకోట్ల సేనతో కపి అనే వాడు బయలుదేరారు. ఇతర రాక్షసాధిపతులు కూడ తమ తమ సైన్యాలతో అక్కడకు చేరారు. మొత్తం ఆ రాక్షస సేన నూరు అక్షౌహిణులయ్యారు.

## పాపనాశన తీరంలో చక్రవర్తి సింహాదుల యుద్ధం

భగవద్భక్తుడు మహాబలపరాక్రమ సంపన్నుడైన చక్రవర్తి 30 అక్షౌహిణుల సేనతో ఆ సింహాదునితో సమానంగా యుద్ధం చేశాడు. ఆ ఉభయ సేనల మధ్య మహాసంగ్రామం జరిగింది. ఆ రెండు సేనావాహినులు కలిస్తే యిక గంగాయమునల సంగమంలాగా ఉంది. ఆ మహావీరుల యుద్ధోత్సాహాన్ని చూడటానికి దేవతాగణాలు ఆకాశమార్గంలో విమానాలనధిరోహించి వచ్చారు. ఆ చక్రవర్తి రాక్షసరాజుల మధ్య జరిగే గొప్ప యుద్ధాన్ని చూడాలనే కుతూహలంతో బ్రహ్మాది దేవతలందరూ వేంచేశారు.

అంతట సింహాద చక్రవర్తుల సేనలకు భయంకరమైన యుద్ధం జరిగింది. యుద్ధంలో మరణించి వీరస్వర్గం అలంకరించిన వారి కొరకు దేవలోకంలో అప్సరసలు పోటీపడ్డారు. చక్రవర్తి తన సైన్యం యుద్ధంలో క్షీణించడం చూసి ఆగ్రహోదగ్రుడై భగవద్దత్తమైన శారఙ్గమనే ధనుస్సును చేతపట్టి వాడి బాణాలను సంధించాడు. ఆ మహారాజు ఒక్కొక్క బాణంతో పదులు, వందలు, వేలు, పదివేలు, లక్షలు, పదిలక్షల సైన్యాన్ని సంహరించాడు. అతని పరాక్రమాన్ని చూసి సింహాదుడు సింహ వాహనాన్నధిష్ఠించి గదతో అతి వేగంగా చక్రవర్తి గుర్రాన్ని చంపాడు తన గుర్రం చనిపోగా రాజు ఐరావతం వంటి ఏనుగునెక్కి మరొక మహేంద్రునివలె కౌమోదకీ అనే గదను చేతపట్టాడు. రాజు ఆ గదను విసరగా అది సింహాదుని వాహనాన్ని వధించి, అరవై అక్షౌహిణుల సేనను పిండి చేసి, మరల రాజును చేరింది.

అప్పుడు సింహాదుడు తన మాయతో క్షణంలో ఆ గదచే నిహతులైన తన సైనికులను మరల బ్రతికించాడు. మహాపరాక్రమశాలియైన సింహాదుని సైనికులు పునరుజ్జీవితులు కావడం చూసి స్వర్గంలో దేవతలు, ఋషులు ఆశ్చర్యపడ్డారు. అప్పుడు పరాక్రమశాలియైన ఆ రాజు శారఙ్గమనే ధనుస్సును చేత పట్టి అర్ధచంద్రాకారం గల బాణమును సంధించి సింహాదుని శిరస్సును నూరుసార్లు ఖండించాడు. రాజు ఆ సింహాదుని శిరస్సును ఎన్నిసార్లు ఖండించినా అన్నిసార్లు మరల పుడుతూనే ఉంది. అది చూచి దేవతలు విషాదాన్ని పొందారు. అప్పుడు శ్రీనివాసుని భక్తుడైన చక్రవర్తి రాముడు మూలబలంపై ప్రయోగించినట్లు శారఙ్గధనుస్సును గాంధర్వాస్త్రాన్ని సంధించి ప్రయోగించాడు. దానితో శత్రుసైన్యమంతా దిగ్భ్రమ చెంది తమలో తాము ఒకరినొకరు భక్షిస్తూ, పరస్పరం కొట్టుకుంటూ పిచ్చివారివలెను, దయ్యం పట్టినవారి వలెను తిరగసాగారు.

## వాయుదేవుని మంత్రోపదేశం

అంతట బ్రహ్మదేవుని ఆజ్ఞానుసారం వాయుదేవుడు బ్రాహ్మణ వేషంతో వచ్చి చక్రవర్తికి చెవిలో 'ఓం సుదర్శనాయ' అనే ఆరక్షరాల సుదర్శనమంత్రాన్ని ఉపదేశించి 'ఓ రాజా' నీవు గో బ్రాహ్మణుల హితం కోసం ఈ రాక్షసుని శిరస్సును వెంటనే ఖండించు అని చెప్పి అంతర్ధానం చెందాడు. ఆ బ్రాహ్మణోత్తముని పలుకులు విని మహామనస్వి అయిన చక్రవర్తి భగవంతునివలె వేయి అంచులుగల సుదర్శనచక్రాన్ని ధరించాడు. ఆ చక్రపాణి అయిన రాజును చూసి సింహాదుడు అతను సాక్షాత్తు శ్రీహరి అని భావించి భయవిహ్వలుడయ్యాడు. ఇంతలో చక్రవర్తి ఆ సుదర్శన చక్రంతో సింహాదుని శిరస్సును మరల పుట్టకుండా ఖండించాడు.

అప్పుడు అతని అనుచరులైన రాక్షసవీరులందరు తమ సైన్యంతో సహా గాంధర్వాస్త్రంతో సమ్మోహనం చెంది ఆ యుద్ధభూమిలోనే పడిపోయారు దేవతలు ఆ రాజుపై పుష్పవృష్టి కురిపించారు. ఆ ప్రాంతమంతా దేవదుందుభులు మారుమ్రోగినాయి అశరీరవాణి మాటప్రకారం ఆ చోళరాజపుత్రుడు ఆ గాంధర్వాస్త్రాన్ని ఉపసంహరించలేదు. అని నారదమహర్షి భృగుమహర్షితో పూర్వం నాకు అగస్త్యమహర్షి చెప్పిన వృత్తాంతాన్నంతా మీకు చెప్పాను ఇంకా కొంత చెప్పవలసి ఉంది. అది కూడా చెబుతాను విను అంటూ కలియుగంలో మానవులకు ఆ యుద్ధభూమిలో రాక్షసవీరుల కోలాహలధ్వని రాత్రిపూట వినబడుతుంది. (అక్కడే యుద్ధగళతీర్థమున్నది) ఆ తీర్థప్రాంతంలో ఈ యుద్ధం సంభవించుటవలన దానికి యుద్ధగళతీర్థమనే పేరొచ్చింది. ఇప్పటికీ ఆ యుద్ధగళతీర్థంలో రాత్రిపూట యుద్ధశబ్దాలు వినిపిస్తాయి. ఆ క్షేత్రపాలకుని ఆజ్ఞ చేత సింహాదుని సైనికులంతా మానవులకు కనబడకుండా అక్కడ సంచరిస్తుంటారు.

**(సశేషం)**

ధారావాహికం

# శ్రీ కృష్ణ తత్వం

**- రాళ్ళబండి శ్రీనివాసన్**



**గత సంచిక తరువాయి**

కృష్ణ భగవానుడు తనమీద వచ్చిన అపవాదును తొలగించుకోవాలనుకుని– కొందరు నగరవాసులతో సత్రాజిత్తు తమ్ముడైన ప్రసేనజిత్తుని వెదకడానికి వెళ్లాడు.జాంబవంతుని గుహలోని క్రీడావస్తువుగా వున్నట్టి మణిని చూసాడు. ఆ మణిని తీసుకోవడంలో జాంబవంతునికి–కృష్ణునికి 28 రోజులు భయంకరమైన యుద్ధం జరిగింది.

కృష్ణ భగవానునిలో రాముని దర్శించిన భాగ్యశాలి జాంబవంతుడు. కృష్ణునికి తన కుమార్తెయైన జాంబవతితో మణిరత్నాన్ని సమర్పించుకున్నారు.ఆ మణిని సత్రాజిత్తుకి ఇచ్చి తనకు కలిగిన కళంకాన్ని పోగొట్టుకున్నాడు కృష్ణుడు.

అయితే సత్రాజిత్తు తన కూతురు అయిన సత్యభామను, మణిరత్నాన్ని కృష్ణునికి ఇచ్చేసాడు.

ఒకానొకప్పుడు శమంతకమణితోపాటుగా సత్యభామను శతధన్వునికి ఇస్తానని మాటిచ్చాడు సత్రాజిత్తు. అయితే మాటతప్పి–

కృష్ణునికి ఇవ్వడంతో సత్రాజిత్తు మీద ప్రతీకారం తీర్చుకోవాలని నిరీక్షిస్తూ వున్నాడు శతధన్వుడు.

లక్క ఇంటి నుంచి–అంటే అగ్ని ప్రమాదం నుంచి పాండవులు బయట పడిన విషయం తెలిసింది కృష్ణునికి. వాళ్లందరినీ పరామర్శించాలని రామకృష్ణులు వెళ్లారు. అదే అదనుగా తీసుకొని సత్రాజిత్తును చంపేసాడు. వెంటనే మణిని తీసుకుని పారిపోయాడు శతధన్వుడు.సత్యభామ దుఃఖభరితురాలైంది. ఆ అశుభ వార్తను కృష్ణునికి చేరవేసింది. వెంటనే వచ్చిన కృష్ణుడు–సత్యభామను ఓదార్చి–శతధన్వుని హతమార్చాలని నిర్ణయించుకున్నాడు. అది తెలిసి–కృతవర్మ అక్రూరుల సహాయాన్ని అర్థించాడు శతధన్వుడు. ఆ ఇద్దరూ కృష్ణ భగవానుని ప్రభావాన్ని తెలిసినవారు కనుక–కృష్ణుడు అంటే ఎవరనుకున్నావ్? ఈ సర్వ జగత్తును లీలగా ఏలేవాడు. అతనిని వ్యతిరేకించలేము అన్నారు.

శతధన్వుని వెంటాడి– చంపేసాడు కృష్ణభగవానుడు. కానీ అతని దగ్గర శమంతకమణి లేదు. ఆ మణి వలననే సత్రాజిత్తు ప్రసేనజిత్తు– శతధన్వుడు చచ్చారు.ఒకే లోభగుణం వలన వాళ్లు పోయారు. అది గ్రహించిన అక్రూరుడు ఆ మణి ప్రభావం వలన లభిస్తున్న ధనాన్ని యజ్ఞయాగాది సత్కార్యాలకు వినియోగించసాగాడు. ఆ విషయము తెలిసి– శమంతకమణి అక్రూరుని దగ్గర వుండటం శ్రేయస్కరమని తలచాడు కృష్ణభగవానుడు.

నరకుడు భూదేవి కుమారుడు. అయితే అతడు ఏవిధంగా ఎపుడు పుట్టాడో భాగవతం స్పష్టంగా చెప్పలేదు.వాడు క్షుద్రమైన అసురప్రవృత్తిని కలిగినవాడు. లోకంలోని ఐశ్వర్యం అంతా తనకు మాత్రమే చెందాలనుకునే వాడు నరకుడు.ఇంకా పదహారు వేల మందిని చెరబట్టాడు. వరుణదేవునికి చెందిన ఛత్రాన్ని– దేవతల తల్లియైన అదితి కుండలాలను–ఇంకా మందర పర్వతానికి చెందిన మణిశిఖరాన్ని ఇంకా అనేకానేక ప్రసిద్ధ వస్తువులను బలాత్కారముగా వశపరచుకున్నాడు.

మానవునిగా పరమస్వార్థపరుడై–ఈ సర్వ జగత్తులోని యావత్ పదార్థాలు అన్నీ తనకే భోగ్యమని విర్రవీగుతూ– కన్నుమిన్ను గానక ప్రవర్తిస్తాడో–వాడు ఒక పరమ నీచుడై– నరకుడు అవుతాడని భాగవతం చెబుతున్నది.

శ్రీమన్నారాయణుడు వరాహావతారంలో భూమిని భార్యగా కలిగి వున్నాడు. వారిద్దరి సంతానమే నరకుడు.ఆ నరకాసురుని నగరం ఒక దుర్భేద్యమై– మురాసురుని మాయా బలంతో పరివేష్ఠితమైంది.

కృష్ణభగవానుడు సత్యభామా సమేతుడై గరుడుని అధిరోహించి నరకాసురుని ప్రాగ్జ్యోతిషపురానికి వెళ్లాడు. అక్కడున్న దుర్భేద్యమైన దుర్గాలను ధ్వంసము చేసినాడు.తన

పాంచజన్యాన్ని తీసుకుని పూరించాడు.అది విని మురాసురుడు ఉగ్రుడైపోయాడు.ఐదు శిరస్సులతో పెద బొబ్బలు పెడుతూ కృష్ణభగవానుని ఎదుర్కొన్నాడు. వాని ఐదు శిరస్సులను చక్రాయుధంతో ఖండించాడు కృష్ణుడు.

మురాసురుడు చచ్చాడన్న వార్తని నరకుడు విన్నాడు. ఇక తన సేనలతో కృష్ణభగవానునిపైకి ఒక్కుమ్మడిగా తలపడ్డాడు. అపుడు గరుత్మంతుడు గజసైన్యాన్ని హతమార్చగా నరకుడు విజృంభించాడు. వాని శిరస్సు కృష్ణుని చక్రానికి తెగిపడింది.

**సకుండలం చారు కిరీటభూషణం బభౌ పృథివ్యాం పతితం సముజ్వలత్ ॥**

కుండలాలతో అందమైన కిరీటంతో కూడుకున్న నరకుని శిరస్సు భూమి మీద పడిపోగానే- మహోజ్వలంగా ప్రకాశించింది.అపుడు దేవతాదులు కృష్ణభగవానుని మీద పుష్ప వర్షం కురిపించారు.

నరకాసురుని వధానంతరం భూదేవి కృష్ణభగవానుని సమీపానికి వచ్చింది. బలాత్కారంగా నరకుడు దోచుకున్న అదితిమాత కుండలాలను ఇంకా వైజయంతీమాలను వరుణఛత్రాన్ని అలాగే చింతామణిని కృష్ణదేవునికి సమర్పించింది.

అయితే ఇక్కడేమో నరకాసురుని సత్యభామ సంహరించిందని ఈలోకంలో బహుళ ప్రచారంలో వుంది. ఎపుడంటే కృష్ణుడు మూర్ఛ పోయినపుడు- సత్యభామ యుద్ధం చేసిందనే ఒక విషయం భాగవతంలో లేదు. కృష్ణుడే స్వయంగా నరకాసురుని వధించినట్లు వుంది. మరి భూదేవి కంటే మరొక భార్య గరుడవాహనంపై వున్నట్లు భాగవతంలో కనిపిస్తోంది. ఇక భూదేవి కృష్ణభగవానుని స్తుతిస్తూ-

**"తవ పాదపంకజం భీతః పపన్నార్తి హరోపసాదితః**
**తత్ పాలయైనం కురు హస్తపంకజం శిరస్యముపాఖిల కల్మషాపహమ్" ॥**

నరకుడు భయపడి నీ పాదపద్మాలను ప్రపత్తి చేసినాడు. అందువల్ల ఇతనిని క్షమించాలని- పాపపరిహారకమైన నీ హస్తకమలాలను దీనిపై వుంచాలని భూదేవి ప్రార్థించింది.

కృష్ణుడు నరకాసురుని సంహరించిన తరువాత- అతనిచేత బంధింపబడిన పదహారు వేల రాజకన్యలను అందరినీ విడిపించాడు.ఇకపోతే వాళ్లందరూ ఎవరికి వారు కృష్ణ భగవానుని బ్రహ్మదేవుడు తమ తమ పతిదేవునిగా పంపించాడని భావించారు.

**అథో ముహూర్త ఏకస్మిన్ నానా గారేషు తాః స్త్రియః ।**
**యథోపయేమే భగవాన్ తావత్ రూపధరోవ్యయః ॥**

ఏమాత్రమూ ప్రకృతి ధర్మానికి విరుద్ధం కలుగకుండా పదహారువేల రూపాలను ధరించి ఒకే ముహూర్తంలో వారి వారికి ఏర్పరచినటువంటి వేర్వేరు గృహాలలో అందరినీ ఒక్క సారిగా వివాహము చేసుకున్నాడు కృష్ణభగవానుడు.

ఇది సామాన్య దృష్టికి విరుద్ధంగా కనపడవచ్చు. అయితే సౌభరి అనే ఒక సాధారణ మహర్షికి నూరు రూపాలు ధరించి నూర్గురిని పెండ్లాడటమనేది ఒకానొక యోగ ప్రభావంతో సుసాధ్యమైనపుడు- యోగేశ్వరుడైన కృష్ణభగవానునికి సాధ్యం కాదా?

కృష్ణ భగవానుడు అంత మందిని వివాహం చేసుకున్నపుడు ఇక వారితో ఏవిధంగా సంసారం చేస్తున్నాడనే ఒక పెద్ద సందేహం మరి ఎవరికో కాదుకదా- నారదమహర్షికే కలిగింది. తరువాత స్వయంగా చూసాక- కృష్ణ పరమాత్మ అలౌకికమైన యోగమాయా ప్రభావానికి ఆశ్చర్యచకితుడైనాడు.

కృష్ణ భగవానుడు రుక్మిణీ దేవితో ఈవిధంగా అంటున్నాడు భద్రే! మేం ఉదాసీనులం.స్త్రీలు ధనం సంతానం మొదలైన వాటి పట్ల మేం కామాన్ని కలిగినవారం కాదు.కేవలం ఆత్మలబ్ధి వలననే పరిపూర్ణులం.అందు వలన పరమ స్వార్థంతో క్రియా కలాపాలను సాగించేవాళ్లం ఏమాత్రం కాదు మేం.

కృష్ణ భగవానునికి ఎనిమిది మంది భార్యలు కదా. అందులో జాంబవతి సత్యభామ రుక్మిణిలను ముందుగానే పెండ్లాడినాడు. తరువాత వరుసగా కాళింది మిత్రవింద నాగ్నజితి భద్ర లక్షణలను వివాహం చేసుకున్నాడు.

**అవజానంతి మాం మూఢాః మానుషీం తనుమాశ్రితమ్ ।**
**పరం భావమజానంతో మమీభూత మహేశ్వరమ్॥ [గీత-9-11]**

మానవ దేహాన్ని ధరించిన నన్ను మూఢులు అవమానపరుస్తున్నారు. సర్వభూత మహేశ్వరుడైన నా స్వభావాన్ని తెలుసుకోలేపోతున్నారని కృష్ణ భగవానుడు అర్జునునితో అంటున్నాడు.

అందుకు శిశుపాలాదులే కాకుండా కాశీరాజు పౌండ్రక వాసుదేవుడు అని ఒకడు వున్నాడు.

పౌండ్రకవాసుదేవుడు కృష్ణభగవానుని వేషాన్ని వేసుకుని- తానే నిజమైన వాసుదేవుడనని చెపుకుంటూ-తనకు కలిగిన కృష్ణ ద్వేషాన్ని బాగా ప్రచారం చేయసాగాడు.

ప్రస్తుత పరిస్థితులలో కొందరు మేమే భగవదవతార సంభూతులమని-ఇంకా అవతార పురుషులమని విర్రవీగుతు చెప్పుకుంటున్నారు. అలాంటి వాళ్లు సమాజాన్ని వంచిస్తూ- విశాలమైన ఆశ్రమాలను నిర్మించుకున్నారు.ఇంకా శ్రీమంతులను - రాజకీయనాయకులను ఆకర్షిస్తున్నారు. అయితే అలాంటి వాళ్లను కృష్ణ భగవానుడు ఉపేక్షించక ఆనాడే అంతం చేసాడు. అందుకు ఉదాహరణమే పౌండ్రకవాసుదేవుని సంహారం.

సుదక్షుణుడు అనేవాడు పౌండ్రకుని కుమారుడు. తన తండ్రిని చంపిన కృష్ణుడిని హతమార్చాలని అభిచారహోమం చేసాడు. వెంటనే ఒకానొక కృత్య ఆవిర్భవించింది.అది సరాసరి

ద్వారకా నగరాన్ని పీడిస్తూ వుండటాన్ని చూసి కృష్ణ భగవానుడు చక్రాయుధాన్ని ప్రయోగించాడు.సుదర్శన జ్వాలలు ప్రజ్వరిల్లగా– కాశీ పట్టణాన్ని భస్మం చేసాయి. అభిచారప్రక్రియ తిరగబడి సుదక్షణుణ్ణి దహించింది. చెరపకురా చెడేవు అన్న సామెత యథార్థమైంది.

కృష్ణ భీమార్జునులు బ్రాహ్మణ వేషంలో జరాసంధుని దగ్గరికి వెళ్లారు.భీమార్జునులు దానం ఇవ్వాలని అడిగారు. అయితే కృష్ణస్వామి మాత్రం యుద్ధభిక్ష పెట్టాలంటూ–తామెవరైంది చెప్పేసాడు.

కృష్ణా! నాకు భయపడి– సముద్రంలో దాక్కున్నావు. నీవు నాకు సమ ఉజ్జీ కావు. అర్జునుడు చిన్నవాడు.ఇక భీముడే తగిన యోధుడు. వీనితో యుద్ధానికి సిద్ధమన్నాడు జరాసంధుడు.

ఇరవై ఏడు రోజులు అవిశ్రాంతంగా ఉభయులూ యుద్ధం చేసారు.అయితే భీముడు అలసిపోవడం– యుద్ధానికి విముఖత చూపుతున్నాడని వెంటనే గ్రహించాడు కృష్ణభగవానుడు. అందుకు ఒక కొమ్మను పట్టుకుని– దాన్ని రెండుగా చీల్చుతూ– చేసిన సూచన గమనించాడు భీమసేనుడు.జరాసంధుని కాళ్లను పట్టుకుని రెండుగా చీల్చి చంపేసాడు.

కృష్ణ భగవానుడు చేసిన అద్భుతమైన కార్యాలలో జరాసంధవధ ఒకటిగా అభివర్ణించారు వ్యాఖ్యాతలు.

**(సశేషం)**

# గోవుకు ఆహారం ఎలా అందించాలి ?

**– శ్రీమతి వెలమకన్ని పద్మావతి**



ఈ రోజులలో ఎవరికి ఏ రకమైన సమస్య వచ్చినా, పరిహారాలు తెల్సుకొని ఆచరించడానికి జ్యోతిష్కులను – సిద్ధాంతులను సంప్రదించినప్పుడు, ఎక్కువగా వారు సూచించే పరిహారాలు గో సంబంధంగా ఉంటున్నాయి. కొన్ని సమస్యలకు నానబెట్టిన సెనగలు, పెసలు, కందులు, బొబ్బర్లు, ఉలవలు, గోధుమలు, బియ్యం, మినుములు నూ పప్పు వంటివి గోవులకు పెట్టాలని పరిహారం సూచిస్తున్నారు. కొందరు గోవులకు కేరెట్లు తినిపించమంటున్నారు. కొందరు ఏదో ఒక గ్రాసం ఆకుకూరలు గానీ, పచ్చగడ్డి గానీ, ఎండుగడ్డి గానీ పెట్టి సమస్యలు దూరం చేసుకోమని పరిహారాలు చెప్తున్నారు. ఈ సందర్భంలో గోవుకు మనం ఏదైనా తినిపించేటప్పుడు ఏయే జాగ్రత్తలు పాటిస్తూ భక్తి శ్రద్ధలతో ఏ శ్లోకం చదువుతూ ఆవుకు తినిపించాలో ఇప్పుడు మనం తెల్సుకుందాం.

1. గోవుకు పరిశుభ్రమైన, తాజాగా, పవిత్రంగా ఉన్న ఆహారాన్ని మాత్రమే తినిపించాలి.
2. పాచిపోయిన, పులిసిపోయిన పారవేయదగిన ఆహారం గోవుకు తినిపించరాదు.
3. గోవుకు అందించే ఆహారాన్ని శుభ్రంగా కడిగి దుమ్మూ – దూసరా లేకుండా పరిశుభ్రమైన స్థితిలోనే అందించాలి. అంతేకానీ నిర్లక్ష్యంగా ఏదో ఒకటిలే అని భావించి పెట్టరాదు.
4. సంపూర్ణమైన భక్తి శ్రద్ధలతో గోవుకు ఆహారాన్ని అందించాలి.
5. మిగిలిన పదార్థాలు, ఎంగిలి చేసిన పదార్థాలు, బహిష్టులు తాకిన పదార్థాలు గోవుకు సమర్పించరాదు. ఒక్కమాటలో చెప్పాలంటే మలిన పదార్థాలు ఆవుకు పెట్టరాదు. పవిత్రమైన, పరిశుభ్రమైన, తాజా ఆహారాలు మాత్రమే గోవుకు సమర్పించాలి.
6. ఇక గోవుకు ఆహారాన్ని అందించేటప్పుడు మార్కండేయ మహాముని చెప్పిన ఈ క్రింది మంత్రాన్ని జపిస్తూ, అందించాలి. దీనితో పాటు మన ఇష్టదేవతా మంత్రాన్ని కూడా మనసులో జపించుకుంటూ గోవుకు ఆహారాన్ని అందించాలి.

**సౌరభేయా స్సర్వహితాః**
**సర్వపాప ప్రణాశనాః**
**ప్రతిగృహ్యంతుమే గ్రాసం**
**గావస్త్రైలోక మాతరం**

ఇదీ ఆ శ్లోకం. తమ తమ గ్రహ దోషాలు తొలగించుకొనదానికి గోవుకు గ్రాసం అందించే పరిహారాలు పాటించేవారు అందరూ ఈ జాగ్రత్తలు పాటించి సత్ఫలితాలు పొందాలని ఆశిద్దాం.

# తిరుమల సర్వస్వం

– పల్లపోతు వాణిశ్రీ

ధారావాహికం



**గత సంచిక తరువాయి**

**ధూ ప దీప హారతులు:** పుష్పమాలాలంకరణ పూర్తయిన తరువాత వేదపండితులు మంత్రపుష్పాన్ని సమర్పిస్తారు. ఆ తరువాత స్వామివారికి ధూప, దీప నక్షత్ర హారతులు, చివరగా కర్పూర హారతి సమర్పిస్తారు.

**ముప్పూటలా తోమాలసేవ:** ఈ సేవ సుమారు అరగంటకు పైగా సాగుతుంది.

నిత్యార్చనలో భాగంగా జరిగే ఈ తోమాలసేవ ఉదయం విస్తారంగా, మధ్యాహ్నం క్లుప్తంగా, మరల సాయంత్రం విస్తారంగానూ ముప్పూటలా జరుగుతుంది. ఉదయం జరిగే తోమాలసేవ మాత్రమే ఆర్జితసేవ. అప్పుడు మాత్రమే ఈ సేవను భక్తులు దర్శించుకోగలరు. మధ్యాహ్నం, రాత్రి జరిగే తోమాలసేవలు ఏకాంతంగా జరుగుతాయి.

ఈ మాలలన్నింటినీ మూర (18 అంగుళాలు), బార (36 అంగుళాలు) కొలమానంతో వ్యవహరిస్తారు. అంతటితో తోమాలసేవ ముగుస్తుంది.

**కొలువు (లేదా ఆస్థానం లేదా దర్బార్):** బంగారు వాకిలిని ఆనుకుని లోపల ఉన్న గదిని 'స్నపన మండపం' అంటారు. అక్కడే శ్రీవారికి ప్రతిరోజూ ఉదయం 4.30 గంటల నుండి ఆస్థానం జరుగుతుంది. సన్నిధిలో ఉన్న పంచ బేరాలలో ఒకరైన కొలువు శ్రీనివాసమూర్తిని ఛత్ర చామరాది మర్యాదలతో, మంగళవాద్యాలతో, స్నపన మండపంలో ఉంచిన బంగారు సింహాసనంపై వేంచేపు చేస్తారు. ఆ తర్వాత స్వామివారికి కొలువు నిర్వహింపబడుతుంది. ఈ సేవ పూర్తిగా ఏకాంతం. అర్చకులూ, ఆలయ అధికారులచే నిర్వహింపబడుతుంది. భక్తులకు అనుమతి లేదు. కొలువు శ్రీనివాసునికి షోడశోపచారాలు నిర్వహించి, ధూప దీప హారతులు సమర్పిస్తారు. అనంతరం అర్చకులు శ్రీవారినుండి తాంబూలం, దక్షిణతో కూడిన 20 శేర్ల (ఇంచుమించుగా 16 కిలోలు) బియ్యాన్ని దానంగా స్వీకరించి, "నిత్యైశ్వర్యోభవ" అని శ్రీవేంకటేశ్వరస్వామిని ప్రార్థిస్తారు. ఆస్థాన సిద్ధాంతి శ్రీనివాసునికి పంచాంగ శ్రవణం చేస్తూ, ఆనాటి తిథి, వార, నక్షత్ర, యోగ, కరణాలను వినిపిస్తూ, నాటి ఉత్సవ విశేషాలను శ్రీవారికి తెలుపుతారు. ఆలయం యొక్క బొక్కసం (ట్రెజరీ) అధికారులు క్రితం రోజు ఆలయానికి హుండీ ద్వారా వచ్చిన రొక్కం, ఇతర కానుకల వివరాలను, ఆర్జిత సేవల ద్వారా వచ్చిన ఆదాయ వివరాలను మొదలగు వాటిని చదివి వినిపిస్తారు.

కొలువు లేదా దర్బార్ యొక్క మిగతా విశేషాలన్నింటినీ మనం పంచ బేరాలు కొలువు శ్రీనివాసుడు అనే ప్రకరణంలో తెలుసుకున్నాం. ఉదయం 4.30 గంటల ప్రాంతంలో, ఆలయ పరిసరాల్లో మనం ఎక్కడున్నా "కొలువు" సందర్భంగా శ్రీవారికి చెప్పబడే వివరాలన్నింటినీ మనం కూడా వీనుల విందుగా విని తరించవచ్చు.

**సహస్ర నామార్చన:** స్వామివారికి ప్రతిరోజూ మూడుపూటలా ఆనందనిలయంలో ఈ అర్చనసేవ జరుగుతుంది. ఉదయం 4.45 గంటల నుండి 5.30 గంటల వరకు జరిగే మొదటి అర్చనలో సహస్ర నామావళితోనూ, మధ్యాహ్న మరియు సాయం సమయాల్లో అష్టోత్తర నామాలతోనూ స్వామిని అర్చిస్తారు. శ్రీవారి సహస్రనామాల్లో ఒక్కోదానికి ఒక్కో విశేషం, ఒక్కో

పరమార్థం ఉంది . ఈ నామాలు శ్రీమహావిష్ణువు యొక్క అన్ని అవతార విశేషాలను స్ఫురణకు తెస్తాయి.

భక్తులు కులశేఖరపడి నుంచి గరుడాళ్వార్ సన్నిధి వరకు బారులు తీరి కూర్చుని, సహస్ర నామార్చనలో పాల్గొంటారు.

శ్రీవారి పాదపద్మాల వద్ద వైఖానస అర్చక స్వాములు ఒక మేడికర్రతో చేయబడిన కూర్మాసనంపై కూర్చుని సహస్ర నామార్చనను ప్రారంభిస్తారు.

ఆ తరువాత అర్చకులు తులసిదళాలతో శ్రీవారి పాదాలను, వారి వక్షస్థలంలో వెలసి ఉన్న మహాలక్ష్మి అమ్మవారినీ అర్చిస్తారు. అనంతరం నక్షత్ర హారతినిచ్చి, నారికేళాన్ని, అరటిపండ్లను సమర్పిస్తారు. ఆ తరువాత స్వామివారికి చక్కెరపొంగలి, పులిహోర, పొంగలి మున్నగు అన్నప్రసాదాలతోను, లడ్డు వడల వంటి పిండివంటలతో నిండిన గంగాళాలను స్వామివారి ముందుంచి నివేదన జరుపుతారు.

అంతకుముందుగానే ఒక పరిచారకుడు శ్రీవారి వంటశాల నుండి ప్రసాదాలను ఛత్రచామర మంగళవాద్యాలతో వరాహస్వామి ఆలయానికి తీసుకుని వెళ్ళి క్షేత్రనియమానుసారం, కలియుగారంభంలో శ్రీనివాసుడిచ్చిన మాట ప్రకారం, తొలి నివేదన ఆది వరాహునికి చేస్తారు. అక్కడ నివేదన జరిగిన తరువాత మాత్రమే, ఇక్కడ ఆనందనిలయంలో శ్రీవారికి నైవేద్య సమర్పణ జరుగుతుంది. అనంతరం అర్చకులు సుగంధద్రవ్యపూరితమైన తాంబూలాన్ని శ్రీవారికి సమర్పిస్తారు.

ఈ అర్చన చేసినా, విన్నా పాప విముక్తులౌతారని, సర్వదోషాలు హరిస్తాయని భక్తుల నమ్మిక.

ఈ నామావళి మహాత్మ్యాన్ని సాక్షాత్తూ నారద మహర్షి తన తుంబురనాదంతో కీర్తించడమే కాకుండా, స్వయంగా శ్రీనివాసునికి సహస్రనామార్చన గావించి జన్మ ధన్యం కావించుకున్నాడని ప్రతీతి.

**నిత్య కళ్యాణోత్సవం:** శ్రీదేవి-భూదేవి సమేతుడైన శ్రీ మలయప్ప స్వామికి ప్రతినిత్యం మధ్యాహ్నం 12 గంటలకు అభిజిల్లగ్నంలో నిత్యకళ్యాణోత్సవం ప్రారంభమవుతుంది. రెండవ అర్చన, గంట (గంట గురించి తరువాత తెలుసుకుందాం), నివేదన పూర్తయిన తరువాత సంపంగి ప్రాకారంలోని కళ్యాణ మంటపంలో శ్రీ మలయప్ప స్వామివారు తూర్పుముఖంగా ఒక బంగారు సింహాసనం మీద వేంచేపు చేయబడతారు. దక్షిణంగా శ్రీదేవి-భూదేవి అమ్మవార్లు మరొక బంగారు సింహాసనం మీద వేంచేపు చేస్తారు. 15-17 శతాబ్దాలలో తాళ్ళపాక వంశీయులు ఈ కళ్యాణోత్సవం ప్రారంభించినట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది. తాళ్ళపాక వంశస్థులే నేటికీ కన్యాదాతలుగా వ్యవహరిస్తున్నారు. శ్రీవారికి కళ్యాణం చేయించటానికి విచ్చేసిన గృహస్థులను కళ్యాణ మంటపానికి అనుమతించి, వారి గోత్ర నామాదులతో సంకల్పం చెప్పించి, వారిని స్వామివారికి అభిముఖంగా కూర్చోబెడతారు.

కళ్యాణోత్సవ కైంకర్యం జరిపించే వైఖానస అర్చకులు పసుపు ధోవతి ధరించి, బృహస్పతిగా వ్యవహరించే మరో అర్చకునితో సహా 'పోచి' సహాయంతో మంటప ప్రవేశం చేసి శ్రీవారి పాదసేవ చేసుకుంటారు.

తదుపరి క్రమంగా విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, అంకురార్పణ, రక్షాబంధన (కంకణ ధారణ), అగ్ని ప్రతిష్ఠ, హోమములు, తెరపట్టడం, కన్యావీక్షణం, మహా సంకల్పం, కన్యాదానం, గోత్రపఠనం, మాంగల్యపూజ, మాంగల్యధారణ, కర్పూరనీరాజనం, ప్రధానహోమం, లాజహోమం, పూర్ణాహుతి, రక్షా తిలక ధారణ వంటి కైంకర్యాలను పూర్తి చేస్తారు.

ఆ వెంటనే 'వారణ మాయిరం' (వధూవరులు నారికేళాలు చేతులు మార్చుకునే వివాహ లాంఛనం) కైంకర్యం జరిపి, పుష్పమాలా పరివర్తనం (శ్రీవారు – అమ్మవార్లు వేడుకగా పుష్పమాలలు మార్చుకునే ఘట్టం) గావించి, అమ్మవార్లను స్వామివారి వద్దకు వేంచేపు చేసి 'అక్షతారోపణ' తంతు (తలంబ్రాలు పోసుకోవడం) కావించి, చివరగా ఆనంద కర్పూర హారతితో కళ్యాణం ముగిస్తారు.

సర్వజనులు క్షేమ, స్థైర్య, ధైర్యాదులతో ఉండాలనీ, స్త్రీలు ఈ జన్మలోనూ, మరుజన్మలోనూ సువాసినులుగా ఉండాలనే మహాసంకల్పంతో శ్రీవారికి నిత్యకళ్యాణోత్సవం జరిపించటం పరిపాటి. ఈ నిత్యకళ్యాణోత్సవం వల్లనే శ్రీవారికి 'కళ్యాణచక్రవర్తి' అని, తిరుమల క్షేత్రం నిత్యకళ్యాణం-పచ్చతోరణంగా విరాజిల్లుతున్నదని ప్రశస్తులు ఏర్పడ్డాయి. ప్రతిరోజు మధ్యాహ్నం 12 గంటల నుండి 1 గంట వరకూ ఈ నిత్యకళ్యాణోత్సవం జరుగుతుంది.

**డోలోత్సవం:** నిత్యకళ్యాణోత్సవం పూర్తయిన తరువాత శ్రీదేవి-భూదేవి సమేత శ్రీమలయప్పస్వామిని ధ్వజస్తంభానికి ఎడమవైపు (మనం మందిరంలోకి వెళ్ళేటప్పుడు కుడివైపు) ఉన్న ఆయినా మహల్ (అద్దాల మంటపం) లోకి తీసుకుని వెళతారు. ఈ మండపం మధ్యలో ఉన్న డోల (ఉయ్యాల) లో స్వామివారు ఉభయ దేవేరుల సమేతంగా డోలోత్సవం నిర్వహిస్తారు. భక్తులను స్వామివారికి ఎదురుగా కూర్చుండబెట్టి, వేదపఠనం, వేదాశీర్వాదం జరుపుతారు. ఈ మండపంలో బిగించి ఉన్న అద్దాలలో స్వామి అన్నివైపులా కనిపిస్తూ, భక్తులకు దివ్యదర్శనాన్ని అనుగ్రహిస్తూ, తన సర్వవ్యాపకత్వాన్ని తెలియజేస్తారు. తదుపరి శ్రీవారికి పంచ కజ్జాయం అనే ప్రసాదాన్ని నివేదన చేసి, హారతిస్తారు (శ్రీవారికి సమర్పించే అనేక రకాలైన ప్రసాదాల గురించి మరొక ప్రకరణంలో విస్తారంగా తెలుసుకుందాం).

ప్రతిరోజూ మధ్యాహ్నం 1-2 గంటల మధ్య

డోలోత్సవం జరుగుతుంది.

**ఆర్జిత బ్రహ్మోత్సవం:** ఉభయ దేవేరులతో కూడిన మలయప్పస్వామికి సంక్షిప్తంగా వాహనసేవలను నిర్వహించడం 'ఆర్జిత బ్రహ్మోత్సవం'గా పిలువబడుతుంది. శ్రీవారి ఉత్సవ మూర్తులను బంగారు తిరుచ్చి మీద ఆలయం వెలుపల ఉన్న వైభవోత్సవ మండపానికి (ఈ మండపాన్ని రాం బగీచా అతిథి గృహం నుంచి శ్రీవారి మందిరానికి వెళ్ళేటప్పుడు, గేటు దాటగానే కుడిప్రక్కన చూడవచ్చు.

అక్కడ శ్రీవారికి ఆర్జిత బ్రహ్మోత్సవంలో భాగంగా ముఖ్యమైన వాహనాలైన గరుడ వాహనం, హనుమంత వాహనం, పెద్ద శేషవాహనంలో వేంచేపు చేసి హారతి ఇస్తారు.

ఈ సేవలో పాల్గొనటం ద్వారా భక్తులకు శ్రీవారి అనుగ్రహం ద్వారా బుద్ధిబలం, యశస్సు, ధైర్యం, ఆరోగ్యం, ధనలాభం, సంతానప్రాప్తి కలుగుతాయి.

ప్రతిరోజు మధ్యాహ్నం 2-3 గంటల మధ్య ఈ సేవ జరుగుతుంది.

**ఆర్జిత వసంతోత్సవం:** ఆర్జిత బ్రహ్మోత్సవానంతరం, శ్రీవారి ఉత్సవ మూర్తులను (శ్రీదేవి-భూదేవి సమేత మలయప్ప స్వామిని) స్నానపీఠం మీదకు వేంచేపు చేసి తెల్లటి స్నాన వస్త్రాలను ధరింపచేస్తారు.

తదుపరి, భక్తులను అనుమతించిన తరువాత వైఖానస అర్చకులు ఘంటానాదంతో వసంతోత్సవ కైంకర్యాన్ని ప్రారంభించి, విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, వరుణదేవతారాధన, ద్రవ్యదేవతారాధన నిర్వహిస్తారు.

పంచామృత ద్రవ్యాలైన ఆవుపాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్ళు మరియు చందనాదులతో ఆయా దేవతలను ఆవాహన చేసి అర్చిస్తారు. అనంతరం అర్చకులు ఉత్సవమూర్తులకు పంచామృత ద్రవ్యాలతో స్నపన తిరుమంజనం (అనగా పవిత్ర అభిషేకం) నిర్వహిస్తారు.

చివరగా కుంభంలోని మంత్రోదకంతో సహస్రధారా స్నపన (జల్లెడ వంటి వెయ్యి రంధ్రాలు కలిగిన, వెండి సహస్ర ధారాపాత్ర ద్వారా అభిషేక ద్రవ్యాన్ని మూర్తులపై ప్రోక్షింప చేయటం) చేసిన పవిత్ర తీర్థజలాన్ని భక్తుల శిరస్సు మీద జల్లుతారు. తరువాత శ్రీవారికి వస్త్ర, ఆభరణ, పుష్పమాలా సమర్పణ మరియు మహానివేదన జరిపి, కర్పూర హారతి సమర్పణతో వసంతోత్సవం పూర్తి చేస్తారు.

ఈ సేవలో పాల్గొన్న భక్తులకు శ్రీవారి కరుణ వల్ల సంతానవృద్ధి, విజయప్రాప్తి, కీర్తి, కామ్యసిద్ధి, సర్వవ్యాధి-పీడనివారణ, దేహాంతంలో విష్ణు సాయుజ్యం లభిస్తాయి.

వసంతోత్సవం వైభవ మండపంలో సాయంకాలం 3-4 గంటల మధ్యలో జరుగుతుంది.

**సహస్ర దీపాలంకరణ సేవ:** ఉభయ దేవేరులతో కూడిన మలయప్పస్వామి వారు వైభవోత్సవ మండపం నుండి సహస్ర దీపాలంకరణ మండపానికి విచ్చేస్తారు. ఈ మండపం నాద నీరాజనం వేదికకు కుడిప్రక్కగా, తూర్పు-దక్షిణ మాడవీధుల కూడలిలో ఉంటుంది.

అప్పటికే దేదీప్యమానంగా ప్రకాశిస్తున్న సహస్ర దీపాల మధ్య ఉన్న ఊయలలో స్వామివారు ఉభయ దేవేరుల సమేతంగా ఆసీనులై భక్తులకు దర్శనమిస్తారు. శ్రీవారికి మొదటగా పంచ కజ్జాయం నివేదన చేసిన తరువాత వేదపారాయణ పఠనం, అన్నమాచార్య-పురందరదాసు కీర్తనల ఆలాపన, నాదస్వర వాదన వినిపిస్తారు. ఈవిధంగా వేద, నాద, గానాలతో మలయప్పస్వామి మెల్ల మెల్లగా ఊయల ఊగుతూ భక్తులకు దర్శనమిస్తారు. తరువాత శ్రీవారికి నక్షత్రహారతి, కర్పూర నీరాజన సమర్పణతో ముగిసే ఈ సేవ ప్రతిరోజూ సాయంకాలం 5.30 గంటలకు మొదలవుతుంది. ఏవిధమైన ముందస్తు బుకింగు లేకుండా, టికెట్టు లేకుండా కూడా ఎవరైనా ఈ సేవ చూసి తరించవచ్చు. ముందస్తు టిక్కెట్టు తీసుకున్న భక్తులకు మాత్రం ముందు వరుసల్లో కూర్చుని, సేవను సమీపం నుండి దర్శించుకునే అవకాశం కలుగుతుంది.

అనంతరం స్వామివారు ఉభయ నాంచారులతో, నాలుగు మాడవీధులలో నిత్యోత్సవానికి వేంచేస్తారు. ఆలయానికి 8 దిక్కులలో కర్పూర నీరాజనం సమర్పిస్తారు. తూర్పు మాడ వీధిలో పుష్కరిణి వద్ద 'పుష్కరిణి హారతి' సమర్పింపబడుతుంది. తదుపరి కుంభహారతి మరియు కర్పూరహారతి సమర్పణతో శ్రీవారు ఆలయ పునః ప్రవేశం చేస్తారు.

దీనితో ఉత్సవ మూర్తులకు ఆలయం వెలుపల జరిగే నిత్యసేవలు పూర్తవుతాయి.

**సాయంకాలం అర్చన:** శ్రీవారి ఉత్సవ మూర్తులను బంగారు వాకిలిలో వేంచేపు చేసి, సిరాతళిగను (రవ్వతో చేసిన ప్రసాదము – రవ్వకేసరి లాగా ఉంటుంది) నివేదించి నీరాజనం సమర్పిస్తారు. ఉత్సవర్లను తిరిగి సన్నిధిలో యథాస్థానానికి వేంచేపు చేసి హారతి సమర్పిస్తారు. అపుడు రెండవ తోమాలసేవ ప్రారంభమవతుంది.

సన్నిధిగొల్ల ముందు రాగా అర్చకులు ఆలయ ప్రవేశం చేసి స్వామికి పాదసేవ చేసి, హారతి ఇచ్చిన తరువాత మూలవర్లకూ, ఇతర దేవతా మూర్తులకూ ఉదయం తోమాలసేవలో అలంకరింపబడిన పుష్పమాలలు సడలింపు చేయబడతాయి. తరువాత స్థలశుద్ధి, పాత్రశుద్ధి జరుపబడతాయి. అనంతరం జియ్యర్ స్వాములు యమునోత్తరై లోని పుష్పమాలలు వెదురు బుట్టలో ఉంచి, శిరస్సు మీదుంచుకుని ధ్వజస్తంభ ప్రదక్షిణగా సన్నిధికి చేరుతారు. పిమ్మట అర్చకులు ఘంటానాదం చేసి,

జియ్యంగారు స్వామికి ఆలవట్టం (వెడల్పైన, నగిషీలతో కూడిన వెండి వింజామర) ఇచ్చి, వారి చేతి నుండి తులసి స్వీకరించి, ప్రాణాయామం, సంకల్ప క్రియలు చేస్తారు. బంగారు బావి తీర్థంతో పాత్రలు నింపి శ్రీవారి ఆరాధనకు సిద్ధం చేస్తారు. మూలవర్లకు ఆసనం, పాద్యం, అర్ఘ్యం, ఆచమనం, శంఖోదకం వంటి ఉపచారాలు చేస్తారు. తర్వాత మూలవర్లతో సహా దేవతామూర్తులందరినీ పుష్పమాలలతో నేత్రపర్వంగా అలంకరిస్తారు. మంత్రపుష్పం చదివిన తరువాత, ఉదయం వలె జియ్యర్ స్వాములు "సాయిత్తిరుళా..." అని పాత్రం చెప్పగానే, కులశేఖరపడి వెలుపల ఉన్న అధ్యాపకులు, "నిత్యానుసంధానం" అనే నాలాయిర దివ్య ప్రబంధంలోని పాశురాలను గానం చేస్తారు.

అనంతరం శ్రీవారికి నక్షత్ర హారతి, కర్పూర నీరాజన సమర్పణ జరుగుతుంది. అర్చకస్వామి శ్రీవారికి ఆలవట్టం సమర్పించి, క్షమాప్రార్థన, పాదసేవ చేసిన తరువాత జియ్యరు స్వాములకు, గోష్ఠికి (అర్చక బృందం) శఠారి ఇస్తారు.

**రాత్రి అర్చన:** అర్చకస్వామి ఘంటానాదం చేసి, కూర్మాసనం మీద ఆసీనుడై, సంకల్పం చేసి అర్చన ప్రారంభించగానే, వేదపారాయణదారు కేశవాది చతుర్వింశతి నామాలు పఠిస్తుండగా, తులసి దళాలను శ్రీవారి పాదాలకు అర్పించి, ధూప, దీప సమర్పణ చేస్తారు. తర్వాత శ్రీవారికి అష్టోత్తర నామావళి పఠనంతో పాటుగా తులసీ దళార్చన జరుగుతుంది. వెంటనే వక్షఃస్థల మహాలక్ష్మికి "చతుర్వింశతి" నామార్చన చేసి, నీరాజనం సమర్పణ చేసి, నైవేద్యాన్ని సమర్పించి బంగారు వాకిలి ప్రక్కన ఉన్న ఘంటామండపంలోని గంటలన్నింటినీ ఒకేసారి గంభీరంగా మ్రోగిస్తారు.

**పర్యంకాసనము (లేదా ఏకాంతసేవ):** శ్రీవారి ఆలయంలో చిట్టచివరిగా జరిగే సేవ ఏకాంతసేవ. దీనినే ఆగమ పరిభాషలో "పర్యంకాసనము" లేదా "శయనాసనము" అని కూడా అంటారు. మొట్టమొదటగా, సన్నిధిలో శ్రీవారి మూలవర్లకు, ఇతర దేవతామూర్తులకు రాత్రి తోమాలసేవలో అలంకరించిన పుష్పమాలలను సడలింపు చేస్తారు.

బంగారు పట్టెమంచాన్ని తెచ్చి ఆనందనిలయానికి ముందున్న శయన మండపంలో వెండిగొలుసుతో వ్రేలాడదీసి దానిపై పట్టుపరుపునూ, దిండ్లనూ అమర్చుతారు. శయనమండపంలో ముగ్గువేసి దీపాలను వెలిగించుతారు.

**పర్యంకాసనంలో అయిదు ఉపచారాలు ఉంటాయి.**

1. మృగనాభిశ్చ తాంబూలం (కస్తూరి సహిత సువాసన భరిత తాంబూలం), 2. గంధము, 3. పుష్పము, 4. ప్రదక్షిణ, 5. నమస్కారాదులు.

ఈ ఉపచారాల మహాభక్తురాలైన తరిగొండ వేంగమాంబ వంశీయులు పట్టెమంచం చుట్టూ రంగవల్లులు తీర్చిదిద్దుతారు.

ఈ సేవను కౌతుకబేరం భోగశ్రీనివాసునికి జరుపుతారు. అయితే ధనుర్మాసంలోని 30 రోజులూ భోగశ్రీనివాసునికి బదులుగా సన్నిధిలో ఉన్న వెండి కృష్ణమూర్తికి జరుపుతారు.

అర్చకులు ఆనందనిలయాంతర్భాగంలో గల రాములవారి మేడ తలుపు దగ్గరగా వేసి, బంగారు వాకిలికి తెర వేస్తారు. అప్పుడు గరుడమండపం వద్ద సన్నాయిమేళం శ్రవణానందంగా మ్రోగింపబడుతుంది. పోటువారు వేడిగా కాచిన ఆవుపాలు సన్నిధికి తెస్తారు. సభ అరవారు పంచకజ్జాయం (జీడిపప్పు, పంచదార, యాలకులు, గసగసాలు, ఎండుకొబ్బరి ముక్కల మిశ్రమం), మధుర ఫలాల ముక్కలు, తాంబూలం, చందనం సిద్ధం చేసి సన్నిధికి తెస్తారు. అర్చకస్వామి పంచపాత్రలలో, బంగారు బిందె లోని తీర్థం నింపి ఉంచుతారు. ఆలయ ఐతిహ్యం ప్రకారం రాత్రి తలుపులు వేసిన తరువాత బ్రహ్మాది దేవతలు శ్రీవారికి ఏకాంతంగా ఆరాధన చేస్తారని ప్రతీతి. వారి ఆరాధన కోసం పంచపాత్రలలో ఈ తీర్థం సిద్ధం చేస్తారు. శ్రీవారి దర్శనం తరువాత, వకుళమాత దర్శనానంతరం ముఖ్యాలయానికి ఎడమప్రక్కగా ఉన్న గట్టుమీద, అంకురార్పణ మంటపంలో సుప్రభాతసేవ భక్తులకు వితరణ చేసే తీర్థం అదే. బ్రహ్మచే అభిషేకించబడిన తీర్థం కనుక "బ్రహ్మతీర్థం" అంటారు.

శ్రీవారి గెడ్డాన్ని పచ్చకర్పూరంతో అలంకరిస్తారు (దీనికి సంబంధించి ఆసక్తికరమైన కథను శ్రీవారి భక్తశిఖామణి అయిన అనంతాళ్వార్ చరిత్రలో తెలుసుకుందాం). శ్రీవారి బంగారు పాద కవచాలు తీసి, స్వామి పాదాల మీద రెండు చందనపు ముద్దలు సమర్పిస్తారు. వక్షఃస్థల లక్ష్మీ అమ్మవారికి ఒక చందనపు ముద్ద ఉంచుతారు. మరొక ముద్ద బ్రహ్మాది దేవతల ఆరాధన నిమిత్తం, అరముద్ద భోగశ్రీనివాసమూర్తి హృదయం పైనా ఉంచుతారు. తరిగొండ వంశీయులు "ముత్యాలహారతి" తట్టలో ముత్యాలతో శ్రీవారి రూపం ఏర్పరచి, హారతికర్పూరం, ముడుపు (తమలపాకులు, వక్కలు) సిద్ధం చేస్తారు.

తదుపరి సన్నిధిలో వైఖానస అర్చకులు మాత్రం ఉండగా, రాములవారి మేడ తలుపులు వేయబడతాయి. అర్చకులు మంచాన్ని మంత్రోదకంతో సంప్రోక్షించి, ఉదయం ఆరాధన సమయంలో మూలవర్ల నుండి ఇతర బేరములకు ఆవాహన చేసిన శక్తిని తిరిగి మూలవర్లలోనికి పునరావాహన చేసి శ్రీవారి శయనబేరం అయిన భోగశ్రీనివాసుణ్ణి శయనం పైకి ఆహ్వానించి, పట్టెమంచంపై నుండి భక్తులను చూస్తున్నట్లుగా, దక్షిణం తలంపుగా శయనింపచేస్తారు. తదుపరి హారతి సమర్పించడంతో ఆరోజు నిత్య కైంకర్యాలు సమాప్తి అవుతాయి.

అర్చకులు సాబూతు (స్వామివారికి అలంకరించిన నగల పరిశీలన) చూసుకుని, మంత్రోచ్చారణ జరుగుతుండగా కుంచెకోలతో తలుపులు మూసివేస్తారు.



# శ్రీరామనవమి

– డా|| మరుదాడు అహల్యాదేవి



**శ్రీరాఘవం దశరథాత్మజ మప్రమేయం |**
**సీతాపతిం రఘుకులాన్వయ రత్నదీపం |**
**ఆజానుబాహుం అరవింద దళాయతాక్షం |**
**రామం నిశాచర వినాశకరం నమామి ||**

చైత్రశుద్ధ నవమినాడు దేశమంతటా రామజన్మ వేడుకలు, కళ్యాణ మహోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపబడతాయి. సుందర మేఘశ్యాముడు, సుగుణాభిరాముడు, దశరథ మహారాజు పుత్రుడుగా చైత్రశుద్ధ నవమి, బుధవారం, పునర్వసు నక్షత్రయుక్త కర్కాటక లగ్నంలో శుభఘడియలలో అవతరించినట్లు రామాయణంలో తెలుపబడింది.

బాల్యం గడిచి, సీతాదేవిని చేపట్టి కళ్యాణరాముడైనదీ చైత్రశుద్ధ నవమిరోజే కావడం ఆరోజుకు అత్యంత పవిత్రతను చేకూర్చింది. అందుకే రామనవమి పర్వదినాన ఉత్తర భారతంలో అయోధ్యలో జన్మోత్సవ వేడుకలు భక్తిశ్రద్ధలతోనూ, దక్షిణ భారతంలో కళ్యాణోత్సవ వేడుకలు ఆనందోత్సాహాలతోనూ జరుపబడుతున్నాయి.

**శ్రీరాముని పూజ**

శ్రీరామనవమి రోజున సీతా, రామ, లక్ష్మణ, భరత, శత్రుఘ్న, ఆంజనేయ సమేతముగా ఆరాధించవలెను. ముందుగా గణపతికి పూజ పూర్తిచేసి, వినాయకుని ధ్యానించి, పునః సంకల్పం చేసుకుని శ్రీరామునికి షోడశోపచార పూజ యథావిధిగా గావించి, ఆపై రామాష్టకం, శ్రీరామ అష్టోత్తరం, జానకీ అష్టకం పఠించి పువ్వులతో పూజ చేయాలి. చైత్రమాసం మల్లెల మాసమే కనుక మల్లెపూలతో పూజిస్తే శుభప్రదం. మల్లెపూవులు లభ్యం కాని ప్రాంతాలలో ఉన్నవారు ఏదైనా సువాసనలు గల తెల్లరంగు పూలతో లక్ష్మణ భరత శత్రుఘ్న ఆంజనేయ సమేత సీతారాముల పటానికి లేదా విగ్రహానికి పూజించాలి. స్వామి సాత్వికుడు కాబట్టి, భక్తుల నుంచి పరిపూర్ణ భక్తి విశ్వాసాలు మాత్రమే ఆశిస్తాడు. వడపప్పు, పానకం రామయ్యకు అత్యంత ప్రీతిపాత్రమైనవి. వాటితో పాటు ఆరోజు ఏ వంటలు చేయాలనుకున్నారో ఆ వంటలు పూర్తి చేసుకుని అది కూడా నైవేద్యం పెట్టాలి. ఏదైనా ఒక ఫలం కూడా నివేదన చేస్తే చాలా మంచిది. పూజానంతరం స్వామివారి ప్రసాదంగా ముందుగా పానకం, వడపప్పు తీసుకోవాలని మరువకూడదు.

**రామనామ మహిమ**

సంసార సముద్రాన్ని తరింప చేసే తారకమంత్రం రామనామం. అందులో 'ఓం నమో నారాయణాయ' అనే అష్టాక్షరి మంత్రంలోని 'రా' బీజాక్షరం 'ఓం నమశ్శివాయ' అనే పంచాక్షరీ మంత్రంలోని 'మ' బీజాక్షరం కలిసి ఉండడం వల్ల అద్వైతులు రామనామాన్ని పరబ్రహ్మ గానూ, యోగులు, పరమాత్మగానూ, వైష్ణవులు విష్ణువుగా, శాక్తేయులు శక్తి సంకేతంగా, శైవులు శివపరంగా అన్వయించుకుని, జపించి ధన్యత్వం పొందుతున్నారు. కాశీక్షేత్రంలో మరణించిన వారికి స్వయంగా శివుడే చనిపోయే వాళ్ళ కుడిచెవిలో రామనామాన్ని వినిపించి ముక్తిని ప్రసాదిస్తాడు.

**శ్రీరామ రామ రామేతి రమే రామే మనోరమే**

**సహస్రనామ తత్తుల్యం రామనామ వరాననే**

శ్రీరామ రామ రామ అనడం వేయి విష్ణు నామాలు పలికిన దానితో సమానం. రామనామంలో అగ్ని, సూర్య, చంద్ర బీజాలు నిక్షిప్తమై ఉన్నాయి.

(రామ = ర + అ + మ) = (రా)

అగ్ని బీజమైన 'ర' కారం అశుభాన్ని, పాపాన్ని నశింపచేస్తుంది. 'అ' కారమైన సూర్య బీజం అజ్ఞానమనే చీకటిని పారద్రోలుతుంది. 'మ' కారం చంద్రబీజం. మనశ్శాంతిని ప్రసాదిస్తుంది. 'రా' అని నోరు తెరవడం వల్ల పాపాలు బయటకు పోగా, 'మ' అనడంతో నోరు మూతబడి అవి మళ్ళీ లోపలకి ప్రవేశించకుండా ఉంటాయి. అంటే రామనామం వల్ల పాపాలు



తొలగి జ్ఞానం వృద్ధి పొంది మనస్సు ప్రశాంతంగా ఉంటుంది.

రామ నామ మహిమ తెలియకపోయినా 'మరా' అంటూ మునులు నేర్పించిన మాటను ఏకాగ్రతతో జపించిన కిరాతకుడు వాల్మీకి మహర్షియై రామాయణ గ్రంథాన్ని రచించే సామర్థ్యం పొందాడు.

శ్రీరామనవమి రోజు రామాయణ పారాయణ గావించి, గుడిలో జరిగే విశేష పూజలు చూసి శ్రీరామకోటి రాయడానికి ఉత్సాహంగా ప్రారంభించడం ఎంతో శుభప్రదం. శుభ్రమైన చోట తూర్పుముఖంగా కూర్చుని నిర్మల హృదయంతో రామనామాన్ని వ్రాయాలి.

'శ్రీరామ జయరామ జయ జయ రామ' అని మనస్సులో అనుకుంటూ రాయాలి. తమ శక్త్యానుసారంగా రోజూ కొంతసేపు కనీసం పది నిముషాలైనా ఇలా రాయగలిగితే ఎంతో మనశ్శాంతి కలుగుతుంది. రామనవమి పర్వదినాన రాముని బాల్యక్రీడలను, కళ్యాణ వైభవాన్ని కళ్ళకు కట్టేలా హృద్యంగా వర్ణించే రామాయణంలోని కొన్ని ఘట్టాలైనా చదవడం వల్ల ఆ స్వామి అనుగ్రహం సంపూర్ణంగా సిద్ధిస్తుంది.

సీతాదేవి ముఖపద్మం మీద భ్రమరంలా వాలే శ్రీరాముని కడగంటి చూపులు భక్తజనావళి మీద సర్వశుభాలు కురిపిస్తాయి. ఇది అక్షర సత్యం.

**"శ్రీరామచంద్రః శ్రితపారిజాతః**

**సమస్త కళ్యాణ గుణాభిరామః**

**సీతాముఖాంభోరుహ చంచరీకః**

**నిరంతరం మంగళమాత నోతుః"**

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

సర్వజనులకూ ఆ శ్రీరామచంద్రుని కరుణా కటాక్ష వీక్షణాలు కురవాలని కోరుకుందాం.

**'సర్వేజనా సుఖినో భవంతు'**



# శ్రీ సీతారాముల కళ్యాణ అక్షతలు (తలంబ్రాలు)

క్షతము కానిది అక్షతము. అంటే నశించనిది అని అర్థము. వివాహ సమయంలో చేసుకునే వేడుకలలో తలంబ్రాలు ఒ కటిగా మారాయి. కాని తలంబ్రాల వెనుక ఉన్న భారతీయ సదాచారము, సాంప్రదాయాలలో అక్షతలు ఎంతో పవిత్రంగా ఆరాధింపబడుతున్నాయి. ఎలాగంటే – పెద్దలు చిన్నవారిని ఆశీర్వదించేటప్పుడు తలపై అక్షతలు ఉంచుతారు (వేస్తారు అ నకూడదు). అలానే భగవంతుని పూజించేటప్పుడు భక్తితో భగవంతుని పాదాల వద్ద అక్షతలు సమర్పిస్తాము.

ఈ అక్షతలను వివిధ సందర్భాలలో ఏ విధంగా ఉపయోగించి, ఎలాంటి కోరికలు కోరుకుని ఫలితాలు పొందుతున్నామో ప్రామాణికంగా తెలుసుకుందాం. ముందుగా విఘ్నేశ్వరుని ఐశ్వర్య ప్రాప్తి కొరకు –

**శ్లో ॥ గజానన నమస్తేఽస్తు అక్షతైశ్వర్య దాయక ।**
**రత్నాక్షతా మయాదత్తాః స్వీకురుష్వ హరాత్మజ ॥**

ఓ శివపుత్రుడవైన విఘ్నేశ్వరా! రత్నములతో కూడిన అక్షతలను నేను నీకు సమర్పిస్తున్నాను. వీటిని స్వీకరించి నశించని సంపదలనిచ్చి నన్ను అనుగ్రహింపమని ప్రార్థిస్తున్నాను – అని అక్షతలు సమర్పిస్తాము.

అలానే తులసి పూజలో –

**శ్లో ॥ అక్షతాశ్చ మహాదేవి తులసి భాగ్యదాయికే ।**
**అర్పయామి సదా భక్త్యా సుఖ సంతతి లబ్ధయే ॥**

భాగ్యదాయిని వైన ఓ తులసి మహాదేవీ! నేను నీకు భక్తితో సమర్పించే అక్షతలతో సుఖ సంతానమును అనుగ్రహింపుము.

ఇలా ఎన్నో రకాలుగా అక్షతలను సమర్పిస్తూ మనం ప్రయోజనాలను పొందుతున్నాం.

వివాహ సమయంలో అక్షతలను పెద్దల చేతికి అందించేటప్పుడు మంగళప్రదములైన వేదమంత్రములతో పూజింపబడిన మాంగల్య సహితముగా తాకిస్తూ ఇస్తారు. ఎందుచేతనంటే ఆ మాంగల్యమునకు ఆపాదించబడిన (ఆవాహన చేయబడిన) మంత్రశక్తి వలన మంచి మనస్సు గలవారి తపశ్శక్తి మాత్రమే ఆ మాంగల్యమును చేరి, దురాలోచన పరుల చెడు ఆ మాంగల్యమును చేరదు. పూజింపబడిన అక్షతల శక్తి, మాంగల్యశక్తి ఆ నూతన వధూవరుల జీవితమును సుఖవంతం చేయగలుగుతుంది.

వివాహ సమయంలో పెద్దలచే ఆశీర్వాద పూర్వకముగా తలపై ఉంచబడేవి అక్షతలు.

వివాహం చేసుకునే వధూవరులు ఒకరి తలపై ఒకరు ఉంచుకునే అక్షతలు తలంబ్రాలు. ఇవి తండులాలలో అనగా బియ్యములో శ్రేష్ఠమైనవి మాత్రమే ఎంచుకోవాలి. అంటే విరిగినవి, నలిగినవి కాకుండా చూసుకోవాలి. నిండుగా ఉన్న గింజలనే తీసుకోవాలి. వాటిలో మంగళద్రవ్యములైన ఆవునెయ్యి, ఆవుపాలు ఉపయోగించి, పసుపు కూడా కలిపి అక్షతలను (తలంబ్రాలను) తయారు చేసుకోవాలి. నవధాన్యాలలో బియ్యం చంద్రునికి సంబంధించిన ధాన్యం. చంద్రుడు మనస్సుకు, బుద్ధికి కారకుడు. పసుపు శుభసూచకం.

ఈ తలంబ్రాలను వధూవరులు ఒకరి తలపై ఒకరు ఉంచుకునేటప్పుడు వారిద్దరి జీవితం ఒకటే జీవితం అయింది గదా! అందుకని వారిద్దరి చేత చేయబడే పుణ్యం వర్ధిల్లాలని, శాంతి కలగాలని, సుఖ సంతోషాలతో ఉండాలని, ఆయుష్షు, ఆరోగ్యం ఇలా అన్నీ తమకు అనుకూలంగా ఉండాలని మంత్రాలను చదువుచుండగా జరుపుకుంటారు. అంటే ఇంత గొప్ప సంస్కారం భారతీయ వివాహ వ్యవస్థలో దాగి ఉన్నదన్న మాట.

ఇప్పుడు సీతారాముల కళ్యాణ ఘట్టంలోని తలంబ్రాలను

గురించి తెలుసుకుందాం.

**శ్లో ॥ జానక్యాః కమలామలాంజలియాః పద్మరాగాయితా**
**న్యస్తా రాఘవ మస్తకే తు విలసత్కుంద ప్రసూనాయితాః ।**
**స్రస్తా శ్యామల కాయకాంతి కవితాయా ఇంద్రనీలాయితాః**
**ముక్తాస్తా శ్శుభదా భవంతు భవతాం శ్రీరామ వైవాహికాః ॥**

–శ్రీరామ కర్ణామృతము

సాక్షాత్తు విష్ణువే శ్రీరామచంద్రుడు. విష్ణుపత్నియైన లక్ష్మీదేవియే సీతమ్మ. సీతమ్మ యొక్క ఎర్రనైన దోసిలిలో శ్రీరాముని తలపై ఉంచుటకు ముత్యాల తలంబ్రాలు తీసుకోగా, ఆ తెల్లనైన ముత్యాలు సీతమ్మ చేతుల ఎర్రదనానికి పద్మరాగ మణుల లాగా ప్రకాశించాయట. మరి ఆ తలంబ్రాలు శ్రీరాముని తలపై గదా సీతమ్మ ఉంచింది. అప్పుడు పద్మరాగ మణుల లాగా ప్రకాశించే ఆ ముత్యాలు శ్రీరాముని తలను చేరగానే (తలపైనున్న నల్లని తలవెంట్రుకల మీద) మల్లెపూల లాగా ప్రకాశించాయట. ఆ తలంబ్రాలు తలపై నుండి జారుతూ నీలమేఘశ్యాముడైన శ్రీరాముని శరీర కాంతిని పొంది ఇంద్రనీల మణులు లాగా ప్రకాశించాయట. అటువంటి ముత్యాల తలంబ్రాలు మీకు శుభమును కలిగించు గాక అని చెప్పిన పై శ్లోకాన్ని ధ్యానం చేసుకుంటూ అప్పుడు జరిగిన సీతారామ కళ్యాణ ఉత్సవమును శ్రీరామనవమి నాడు మనము కూడా నిర్వహించుకుని తాదాత్మ్యము చెందుచూ భగవంతునికి కళ్యాణ అక్షతలను సమర్పించి, కళ్యాణమైన తరువాత భగవదనుగ్రహ రూపమైన ఆ అక్షతలను మనం కూడా శిరస్సుపై ఉంచుకుని – అంతేకాదు వాటితో మరికొన్ని అక్షతలను కలిపి కళ్యాణమును చూడలేకపోయిన మన బంధువులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు, ఇంకా ఎందరెందరికో పంచి, మన మనస్సులను భగవంతునికి అర్పించుకుని, శిరస్సు వంచి నమస్కరించి, శ్రీ సీతారాముల అనుగ్రహానికి పాత్రులమవుదాం.

# మనో నేత్రాలు

మన ఆలోచనలే మన లోచనాలు. లోచనాలు అంటే కళ్ళు. మన ఆలోచనలే మన కళ్ళు. మనం ఎలా ఆలోచిస్తే మన కళ్ళు అలా చూస్తాయి. మన ఆలోచనలు మంచివైతే మన కళ్ళకి అన్నీ మంచిగానే కనబడతాయి. అలాగే మన ఆలోచనలు చెడ్డవైతే మనకి అన్నీ చెడ్డగానే కనబడతాయి. అవే మన మనోనేత్రాలు. అందుకే ఎప్పుడూ మంచిగానే ఆలోచించాలి. అన్నింటిలోనూ మంచినే చూడాలి.

ఇద్దరు వ్యక్తులు చంద్రుని పైనున్న మచ్చలను చూస్తున్నారు. అందులో ఒకాయన అన్నాడు "ఆహా! ఆ మచ్చలను చూడండి. అచ్చం దేవాలయ గోపుర శిఖరాల్లా ఉన్నాయి" అని. దానికి రెండో ఆయన "అబ్బే... అవేం కాదండీ... అవి ప్రేయసీ ప్రియులు ఒకరినొకరు ముద్దాడుకుంటున్నట్లు ఉన్నాయి చూడండి" అన్నాడు.

మొదటి ఆయన ఆధ్యాత్మిక దృష్టితో చూస్తే రెండో ఆయన శృంగార పరంగా చూశాడు. అవే మచ్చలు. కాని చూడడంలో తేడా. మన మనసెలా ఉంటే మన పరిసరాలు అలా అనిపిస్తాయి. మనం సంతోషంగా ఉంటే మన చుట్టూ ఉన్న ప్రపంచం అంతా ఆనందమయంగా కనిపిస్తుంది. అదే మనం విచారంగా ఉంటే ప్రపంచం అంతా దుఃఖమయంగా కనిపిస్తుంది.

ఒక పాదచారి నడుచుకుంటూ వెళ్తూ త్రోవలో రోడ్డు ప్రక్కన ఒక వ్యక్తి అచేతనంగా పడి ఉండటం చూసి "పీకల దాకా త్రాగి ఉంటాడు. అందుకే పడిపోయాడు" అనుకుంటూ వెళ్ళిపోయాడు. అదే దారిన వెళుతున్న మరొకతను చూసి "అయ్యో పాపం స్పృహ తప్పి పడిపోయినట్లున్నాడు" అని చల్లని నీళ్ళు తెచ్చి ఆ వ్యక్తి ముఖం మీద చల్లాడు. వెంటనే అతను తేరుకున్నాడు. మొదటి ఆయన ఆలోచనను బట్టి అతనికి ఆ వ్యక్తి అలా కనిపించాడు. ఇంక రెండో ఆయన విధానం వేరు. అంచేత అతనికి అదే వ్యక్తి మరోలా కనిపించాడు.

అలాగే రామాయణాన్ని ఒక కథగా అనుకుంటే కథలాగే అనిపిస్తుంది. అలా కాకుండా ఆధ్యాత్మికంగా ఆలోచిస్తే అందులోని అంతరార్థం బోధపడుతుంది. శ్రీరాముడు పరమాత్మ. సీతమ్మ జీవాత్మ. ప్రతి మానవుని దేహం లంకా నగరం. ఈ లంకా ద్వీపమనే దేహంలో బంధింపబడిన సీతమ్మ అనే జీవాత్మ శ్రీరాముడనే పరమాత్మను చేరుకోవాలని కోరుతుంటుంది.

కాని రాక్షసులు దానిని జరగనీయరు. రాక్షసులు అంటే మానవునిలోని రజో, తమో గుణాలు. ఈ రజో, తమో గుణాలు సీత అనే జీవాత్మను శ్రీరాముడనే పరమాత్మతో కలుసుకోనీయకుండా దేహమనే లంకలో బంధించి ఉంచాయి. అలా బంధింపబడి శ్రీరాముని కలుసుకోగోరే సీతమ్మ వద్దకు హనుమంతుడనే గురువు వస్తాడు. శ్రీరాముని అంగుళీయకం ఆమెకు చూపిస్తాడు. సకల భ్రాంతులను రూపుమాపే బ్రహ్మజ్ఞానమే ఆ అంగుళీయకం.

ఈ విధంగా శ్రీరాముని చేరడానికి సీతమ్మకు మార్గమేర్పడుతుంది. అంటే గురువు వలన పొందిన బ్రహ్మజ్ఞానమే జీవాత్మ పరమాత్మతో ఐక్యం కావడానికి మార్గదర్శనం చేస్తుంది.... ఆధ్యాత్మికం ఆనందం.



# త్రివేణీ సంగమంలో సరస్వతీ నది

ఉత్తరప్రదేశ్ లోని అలహాబాద్ వద్ద త్రివేణీ సంగమం ఉంది. అటే మూడు నదుల కలయిక ప్రాంతం అది. ఆ ప్రాంతాన్ని ప్రయాగ అని కూడా అంటారు. గంగ, యమున, సరస్వతీ నదులు కలిసిన ఆ నదులన్నిటినీ కలిసిన జలాన్ని త్రివేణీ సంగమంగా పిలుస్తారు. ఆ త్రివేణీ సంగమంలో కనిపించే నదులు గంగ, యమున మాత్రమే. సరస్వతీనది కనిపించదు. సరస్వతీనది అంతర్లీనంగా ప్రవహిస్తూ ఆ నదులతో కలుస్తుందని అక్కడివారు చెబుతున్నారు. సరస్వతీనది అంతర్లీనమవటానికి సంబంధించిన అన్ని కథలు పురాణాల ద్వారా వివరించబడినాయి.

బ్రహ్మదేవునికి ఉండే అయిదు శిరస్సులలో ఒక శిరస్సును శివుడు ఖండించడంతో, శివునికి బ్రహ్మహత్యా పాతకం చుట్టుకుంది. సరస్వతీనదిలో స్నానం ఆచరించి, తన పాపానికి పరిహారం చేసుకోవాలనుకున్నాడు. ఆ విషయం తెలిసిన సరస్వతీనది ఆ పాతకం తనకు చుట్టుకుంటుందని భయపడి అంతర్ధానమయినట్లుగా ఒక పురాణ కథ తెలుపుతోంది. మరొక కథ ద్వారా సరస్వతీనదికి ఉతథ్యుడనే ఋషి శాపం ఇవ్వడంతో ఎడారి వైపు ప్రవహిస్తూ, ఆ ఎడారి ఇసుకలో ఇంకిపోయినట్లుగా తెలుస్తోంది.

భారతంలోని అరణ్యపర్వంలో నారదుడు పాండవుల వద్దకు వచ్చి సరస్వతీనది ప్రవహించే తీర్థ క్షేత్ర మహత్యాలను గురించి చెప్పాడు. సరస్వతీనది వివశన ప్రాంతాన అదృశ్యమయి, మేరు పర్వత ప్రాంతాన కన్పించిందట. పద్మపురాణం ద్వారా కురుక్షేత్రం వద్ద ప్రవహించేనది సరస్వతీ నదేనని, ఆ నదికి 'ప్రాచీ సరస్వతి' అనే మరోపేరు ఉందని తెలుస్తోంది. సరస్వతీనదీ తీరంలో అంత్యవరుడనే ముని పన్నెండు సంవత్సరాలు సత్రయాగం జరిపినట్లుగానూ, సరస్వతీనది స్త్రీ రూపంలో వచ్చి అతడిని వివాహం చేసుకున్నట్లుగానూ, మరోకథ వివరించింది.

దేవీభాగవతంలో సరస్వతి, గంగ, పద్మ విష్ణుమూర్తి భార్యలనీ, వారు ముగ్గురూ ఒకరితో ఒకరు కలహించుకుంటూ ఉండేవారనీ, సవతులవడం వల్ల పరస్పరం వారు ఆగ్రహంతో శపించుకుని ముగ్గురూ నదులుగా మారినట్లుగా చెప్పబడింది.

మహాభారతం సరస్వతీనది గురించి మరో కథ తెలియచేసింది. సరస్వతీనదీ తీరంలో బ్రహ్మదేవునితో పాటుగా గయుడు, ఉద్దాలకుడు, వసిష్ఠుడుతో కలిసి ఎందరో మునులు, గురువులు యజ్ఞయాగాదులు, హోమాలను నిర్వహించినప్పుడు సరస్వతీ నది స్త్రీరూపం ధరించి, ఏడు పేర్లతో వారినుంచి సత్కారాన్ని పొందింది. ఏడు రూపాలను ధరించి, ఏడు పేర్లను పెట్టుకోవడం వల్ల సరస్వతీనదికి 'సప్తసారస్వతము' అనే పేరు వచ్చిందట.

హిమాలయ పర్వతాలలోని శివాలిక్, సిరేమూల్ కొండలలోని ఒక వృక్షం నుంచి సరస్వతి పుట్టిందని చెబుతారు. సరస్వతీనది పుట్టుక గురించి కూడా వివిధ అభిప్రాయాలు ఉన్నాయి. సరస్వతీనది బదరికాశ్రమం వద్దనే పుట్టి, అక్కడినుంచి ప్రవహించిందని కొందరి అభిప్రాయం. స్కందపురాణం ద్వారా హిమాలయాల నుంచి బయల్దేరిన సరస్వతీనది ముందుకు ప్రవహిస్తూ, ప్రభాసకు చేరుకున్నట్లుగా తెలుస్తోంది. మహాభారతంలోని శల్యపర్వంలో సరస్వతీనది ప్రవాహం ముందుకు సాగే పొడవునా, పుణ్యతీర్థాలు, పుణ్యక్షేత్రాల గురించి వివరించింది. ప్రభాస వద్ద సరస్వతీనది సముద్రంలో కలిసిపోతుంది. సరస్వతీనది జన్మస్థానం గురించి, ఆ నది పుట్టుక గురించి పురాణాలలో వివిధ రకాలైన కథలు తెలుపబడ్డాయి. సరస్వతీనది భూమిలోపల అంతర్లీనంగా ప్రవహిస్తోందని, ఆ నది పితృలోకం లోకి చేరుకుంటుందన్న నమ్మకంతో మానవులు తమ పితృదేవతల చితాభస్మాన్ని త్రివేణీ సంగమంలో కలుపుతారు.

– కౌతా నిర్మల

## శ్రీ వేంకటేశ్వర మహామంత్రపీఠం ఆధ్వర్యంలో

# శ్రీనివాస కళ్యాణాలు

**ఉచిత శ్రీనివాస కళ్యాణాలను నిర్వహించండి!**
**శ్రీవారి కృపకు పాత్రులుకండి!!**



**తిరుమల శ్రీవేంకటేశ్వరుని కరుణా కటాక్షములు అందరికీ లభించాలని 'కరోనా' లాంటి మహమ్మారి నుండి లోకాన్ని స్వామివారు రక్షించాలనే ఉద్దేశ్యంతో, భగవంతునికి మరియు ఆయన భక్తులకు సేవచేయాలన్న లక్ష్యంతో 'శ్రీనివాస కళ్యాణాలు' అనే కార్యక్రమమును చేపట్టాము.**

కలియుగ దైవమైన తిరుమల శ్రీవేంకటేశ్వరునికి ప్రతి సంవత్సరం 7 కళ్యాణాల కంటే తక్కువ కాకుండా కనీసం 111 కళ్యాణాలను వివిధ ప్రాంతాలలో ఉచితంగా నిర్వహించాలని సంకల్పించాము.

ఆహ్వానించిన భక్తుల ప్రాంతములో అనగా వారి వారి ఊరు, అపార్టుమెంట్ లేదా ఇంటివద్దనే నిర్వహించెదము. శ్రీవారి కళ్యాణమును శాస్త్రోక్తంగా నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు అనగా విగ్రహాలను, బ్రాహ్మణులను, ఇతర సామగ్రిని మేమే ఏర్పాటు చేసెదము. కళ్యాణముతో పాటు వీలైతే అన్నమయ్య కీర్తనలు, ప్రవచనములను కూడా ఏర్పాటు చేయగలము. భక్తులలో శ్రీవేంకటేశ్వరస్వామి పట్ల భక్తి భావమును, శరణాగత తత్త్వమును ప్రోత్సహించుచు, స్వామివారి సేవాభాగ్యమును మరియు ఆశీస్సులను అందించుటే మా లక్ష్యం.

**శ్రీవారి కళ్యాణమును తమ ప్రాంతము, ఊరు, ఇంటి వద్ద నిర్వహించుటకు ఆసక్తికల భక్తులు మమ్మల్ని సంప్రదించవలెనని మనవి. భక్తులకు అనువైన రోజున 'నమో వేంకటేశాయ' రథ యుక్తంగా విచ్చేసి శ్రీనివాస కళ్యాణమును నిర్వహించుదుము.**

(హైదరాబాద్ మరియు పరిసర ప్రాంతాలలో మాత్రమే)

**శ్రీవేంకటేశ్వర మహామంత్రపీఠం**

శ్రీవేంకటేశ్వర పాదసేవకుడు
**పుల్లగూర్ల సాయిరెడ్డి**
(గోవిందదాసు)

ఫోన్: 040-27175050
సెల్: 93482 12354
E.mail: srivenkatesham@gmail.com
Website:Srivenkatesham.org

# రాశి ఫలితములు

## మేషరాశి

**అశ్వని 1,2,3,4 పాదములు, భరణి 1,2,3,4 పాదములు, కృత్తిక 1వ పాదము**

ఈ రాశి స్త్రీ పురుషులు ప్రతి విషయంలో చాలా జాగ్రత్తగా నిర్ణయములు తీసుకొనవలెను. ఏమాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా ఏదో ఒక విషయంలో ఇరుక్కున్నచో కోలుకోలేరు. వినాయక, సరస్వతి, చిత్రగుప్త పూజలు, నవగ్రహ ప్రదక్షిణలు చేయండి. అవకాశం ఉన్నవారు జపదానములు చేయండి.

## వృషభరాశి

**కృత్తిక 2,3,4, రోహిణి 1,2,3,4 పాదములు, మృగశిర 1,2 పాదములు.**

ఈరాశి స్త్రీ పురుషులు తొందరపాటు కలిగి ఉంటారు. కలహములకు తావు ఇవ్వరాదు. ప్రయాణములో అపశృతులు. అనారోగ్యము ఉన్నది. వ్యర్థ ప్రయాణములకు దూరంగా ఉండండి. అభివృద్ధి ఉన్నది, ప్రక్కనే సమస్యలు ఉన్నవి. చాలా జాగ్రత్తగా ఉండండి. నవగ్రహ ఆరాధన వలన అనుకూలత.

## మిథునరాశి

**మృగశిర 3, 4 పాదములు, ఆరుద్ర 1,2,3,4 పాదములు, పునర్వసు 1, 2, 3 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు సామాన్యంగా ఉంటుంది. గతంలోని తగాదాలు, కోర్టు సంబంధమైన విషయములు రాజీమార్గంలో పరిష్కరించుకొనగలరు. వ్యాపార లావాదేవీలు అనుకూలంగా ఉండగలవు. అపవాదులకు, కొన్ని నిగ్రహ సంబంధమైన దోషాల నివారణకు నవగ్రహ ప్రదక్షిణలు చేయండి.

## కర్కాటకరాశి

**పునర్వసు 4వ పాదము, పుష్యమి 1,2,3,4 పాదములు, ఆశ్లేష 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులు ప్రతి విషయంలో పాజిటివ్ ఆలోచనతో ముందుకు సాగండి. వివాహ ప్రయత్నములు ఫలించుట, విందు వినోదములు. సంఘంలో గౌరవ మర్యాదలు. ప్రయత్న లోపము లేకుండా ముందుకు సాగండి. ఆర్థికంగా బాగుంది. అఖండ దీపారాధన, ఇష్ట దైవారాధన చేయండి.

## సింహరాశి

**మఘ 1,2,3,4 పాదములు, పుబ్బ 1,2,3,4 పాదములు, ఉత్తర 1వ పాదము**

ఈ రాశి స్త్రీ పురుషులకు అనుకూలంగా ఉంటుంది. పెద్దవారితో పరిచయాలు చక్కటి అనుభూతి కలుగుతుంది. ఆకస్మికంగా ధనం వస్తుంది. అనవసర విషయాలలో తలదూర్చిన ఆకస్మికంగా తగాదాలు రాగలవు. కోర్టు సమస్యలు చాకచక్యంగా పరిష్కరించుకొనగలరు. నవగ్రహ జపాలు, దానాలు ప్రదక్షిణలు చేయండి.

## కన్యారాశి

**ఉత్తర 2,3,4 పాదములు, హస్త 1,2,3,4 పాదములు, చిత్త 1,2 పాదములు**

ఈ రాశి స్త్రీ పురుషులకు అనుకూలంగా ఉంటుంది. కాని మీ నిర్లక్ష్యం లేక స్నేహితులను నమ్మి బయటప్రపంచంలో చెడు మాటలకు మోసపోవుట. స్త్రీలోలురు అగుటకు అవకాశములున్నవి. కోర్టు సంబంధమైన సమస్యలు ఉన్నవి. నవగ్రహ ప్రదక్షిణలు చేయండి.

## తులారాశి

**చిత్త 3,4 పాదములు, స్వాతి 1,2,3,4 పాదములు, విశాఖ 1,2,3 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు సామాన్యంగా ఉంటుంది. చిక్కులు చికాకులు ప్రభుత్వం వారిచే ఒత్తిడి గృహం మారుట. అనవసరం మాటలు పడుట. ఉద్యోగస్తులపైన దాడులు దైవరాధన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి అభిషేకం హోమం చేయించండి. ప్రతిరోజు కుజ గ్రహ జపము చేయండి.

## వృశ్చికరాశి

**విశాఖ 4వ పాదము, అనూరాధ 1,2,3,4 పాదములు, జ్యేష్ఠ 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు సామాన్యముగా ఉంటుంది. అలా అని చింతించరాదు. అవమానములు శ్రమకు తగిన ఫలితము కనిపించదు. ఖర్చులు అదనంగా ఉన్నవి ఖర్చులను ముందు పొదుపు చేయండి. ఆర్భాటమునకు ఇది సమయం కాదు. వివాహ శుభములు ఒకదారికి రాగలవు. ఇష్టదేవత ఆరాధన చేయండి. అఖండ దీపారాధన చేయండి.

## ధనూరాశి

**మూల 1,2,3,4 పాదములు, పూర్వాషాఢ 1, 2, 3, 4 పాదములు, ఉత్తరాషాఢ 1వ పాదము.**

ఈ రాశి స్త్రీ పురుషులకు ప్రతి విషయంలో ఆటంకములు. అలా అని భయపడరాదు. తల్లిదండ్రుల అనారోగ్య సమస్యలు, అస్వస్థత, నిరాశ ఉంటుంది. భార్యాభర్తల మధ్య అగాదములు కొంత ఊరట కలిగి ఉండండి. నవగ్రహ బాధలు ఉన్నవి గోచార దోషాలు నవగ్రహ ప్రదక్షిణలు చేయండి.

## మకరరాశి

**ఉత్తరాషాఢ 2,3,4 పాదములు, శ్రవణం 1,2,3,4 పాదములు, ధనిష్ట 1,2 పాదములు**

ఈ రాశి స్త్రీ పురుషులకు సహకారము ఇతరులకు దగ్గర తీసుకొనగలిగినప్పుడు ముందుకు సాగుటలో అడ్డంకులు తొలగును. వృథా ప్రయాణములు చేయరాదు. బంధుమిత్రుల సహకారం ఉంటుంది. మీరు నిజము చెప్పి సలహాలు తీసుకొనండి. నవగ్రహ జపదానములు అవసరం ఉన్నది.

## కుంభరాశి

**ధనిష్ట 3,4 పాదములు, శతభిషం 1,2,3,4 పాదములు, పూర్వాభాద్ర 1,2,3 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు కొంతవరకు అనుకూలంగా కనిపిస్తుంది. విదేశి చదువులు ప్రయాణములు దైవారాధన వలన ఉద్యోగ అవకాశం. మానసిక ఒత్తిడి తగ్గుటకు అవకాశమున్నది. చేయువృత్తులలో అనేక సమస్యలు ఉండగలవు. నవగ్రహ ప్రదక్షిణలతో అనుకూలత.

## మీనరాశి

**పూర్వాభాద్ర 4వ పాదము, ఉత్తరాభాద్ర 1,2,3,4 పాదములు, రేవతి 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు మనోవేదన మానసిక ఒత్తిడి. ప్రతి విషయంలో తెలియని భయం కుటుంబ కలహములు. భార్యాభర్తలు తగాలు. అన్నదమ్ముల గొడవలు ఆస్తి సంబంధమైన వివాదములు ఉన్నవి. ఈ విపత్తు నివారణ నవగ్రహాలకు ప్రదక్షిణలు దానాలు అవసరం.

# మీ విజ్ఞానం

నిర్వహణ: **డా.పి. లలితవాణి**




## శ్రీ వేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక
ఇం.నెం. 1-1-53, వీధి నెం.1,
హబ్సీగూడ, హైదరాబాద్-500007,
ఫోన్: 040-27175050
Email: srivenkatesham@gmail.com

ఈ ప్రశ్నలన్నింటికీ ఇదే పేపరు మీద కొట్టివేతలు లేకుండా సమాధానాలు రాసి ఈనెల 20వ తేదీలోగా మాకు పంపగలరు. మీ చిరునామాను స్పష్టంగా రాయాలి. సరియైన సమాధానాలు వ్రాసిన వారిలో లక్కీడిప్ ద్వారా ఒకరిని ఎంపిక చేసి వారికి 'శ్రీవారి పాదాలు' బహుమతిగా ఇవ్వబడతాయి.

## ఈ క్రింది ప్రశ్నల జవాబుల కోసం గత నెల సంచికను పరిశీలించండి

1. లక్ష్మీదేవి ఏ మహర్షికి జన్మించింది?
2. గోవిందదాసు ఆదిశేషుని దర్శనం ఏ రూపంలో పొందారు?
3. యామునాచార్యుల గురువు ఎవరు?
4. దేవశర్మ కుమారుడు ఏ పురాణాన్ని విని శాపవిమోచనం పొందాడు?
5. వేదాలను అపహరించిందెవరు?
6. ఏనుగు ఎక్కినట్లు కల వస్తే ఫలితం ఏమిటి?
7. తనకు వచ్చిన కల గురించి సీతకు చెప్పినదెవరు?
8. సన్నింద – అంటే ఏమిటి?
9. రోహిదాసుకు సద్బోధ చేసిందెవరు?
10. ముచికుందుని కంటి చూపుతో భస్మమయిందెవరు?
11. శ్రీవారి పాన్పును ఎక్కడ ఉంచుతారు?
12. మాంధాత కొడుకు ఎవరు?
13. శ్రీవారి పాదాలపై అలంకరించే పుష్పమాలను ఏమంటారు?
14. నల దమయంతులు పూర్వజన్మలో ఎవరు?
15. రోహిదాసుకు స్పర్శవేదిని ఇచ్చిందెవరు?

1. ______
2. ______
3. ______
4. ______
5. ______
6. ______
7. ______
8. ______
9. ______
10. ______
11. ______
12. ______
13. ______
14. ______
15. ______

## గత నెల ప్రశ్నలకు కరెక్టు సమాధానాలు

1. అశ్వని, 2. గోవిందదాసుని తలపై పెట్టి, 3.శివుడు, 4. తరిగొండ వేంగమాంబ, 5. కౌస్తుభ మణి అంశతో, 6. తండ్రి అయిన శంతనుడు, 7. స్నానవ్రతం, 8. హయగ్రీవుడు, 9.సదానందస్వామి, 10. శ్రవణం, 11. మాధవునికి, 12.ఉగ్రసేనుని కొడుకు, 13. గర్గ మహాముని, 14. ఇల, 15.విశ్వజయం

## సరైన సమాధానాలు రాసినవారు

**ఎవ్వరూ సరైన జవాబులు వ్రాయలేదు**

పేరు: ______

చిరునామా: ______

______

______

______

పిన్‌కోడ్: ______

ఫోన్: ______




సూర్యప్రభ వాహనం



పెద్ద శేష వాహనం



గరుడ వాహనం



కల్పవృక్ష వాహనం



చంద్రప్రభ వాహనం

Postel Registration No: HSE/879/2025-2027

Published on 28th and Licenced to Post On 29th & 30th of Every Month

RNI No.: APTEL/2008/23122



**If Un Delivered Please Return to:**

**SRI VENKATESHAM,**
**(Sri Venkateshwara Maha Mantra Peetham)**
H.No: 1-1-53, Street No. 1, Habsiguda,
Hyderabad-500007.Ph: 040-27175050.

డిజిటల్ పాఠకుల కోసం పూర్తిగా కలర్ పేజీలు
https://www.srivenkatesham.org లో చదవండి.

Srivenkatesham Magazine in Google Drive
https://drive.google.com/drive/folders/
1jOWBeoUHjF4Qhn4wl-d9eUGlh6kVYyLq